

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 322

బుధవారం 12-2-2025



శనివారం డెడ్‌లైన్.

బందీలను వదలకుంటే పని పడతానంటూ హమాస్‌కు ట్రంప్ హెచ్చరిక

- 6లో



5 రోజుల్లో 17 లక్షల కోట్లు ఆవిరి

సెన్సెక్స్ నష్టం 1,018 పాయింట్లు..

నిఫ్టీ 310 పాయింట్ల పతనం

- 16లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఏఐతో ఉద్యోగాలు పోవు..



పారిస్ ఏఐ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

కృత్రిమ మేధ వాడకం వల్ల కేవలం ఉద్యోగాల స్వభావమే మారుతుంది

కొత్త రకాల ఉద్యోగాలు పుట్టుకొస్తాయి.. అందుకుతగ్గ నైపుణ్యాలు సాధించాలి

పారిస్ ఏఐ యాక్షన్ సమ్మిట్-2025లో యువతకు ప్రధాని మోదీ ఉద్బోధ

- ప్రపంచవ్యాప్తంగా కనీవినీ ఎరుగని విస్తృతి, వేగంతో ఏఐ అభివృద్ధి చెందుతోందని వెల్లడి
- ఓపెన్‌సోర్స్ ఏఐ వాడకంలో ప్రపంచ మార్గదర్శకాల రూపకల్పన కోసం ఉమ్మడి కసరత్తు తప్పనిసరని స్పష్టీకరణ
- ‘ఏఐ ఫౌండేషన్’, ‘సుస్థిర ఏఐ మండలి’ ఏర్పాటు నిర్ణయంపై హర్షం
- తదుపరి ఏఐ యాక్షన్ సమ్మిట్‌కు ఇండియా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటన

పారిస్: అన్ని రంగాల్లోకి దూసుకొస్తున్న కృత్రిమ మేధ (ఏఐ)తో ఉద్యోగాలు మాయమవుతాయన్న భయాలను ప్రధాని నరేంద్ర మోదీ అంతర్జాతీయ వేదికగా పటాపంచలు చేశారు. సాంకేతికత వాడకం వల్ల ఉద్యోగాలు కనుమరుగుకావని తేల్చిచెప్పారు. కేవలం ఉద్యోగాల స్వభావమే మారుతుందని స్పష్టం చేశారు. ఏఐ వాడకంతో కొత్త రకాల ఉద్యోగాలు పుట్టుకొస్తాయని వెల్లడించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో కలిసి మంగళవారం ఏఐ యాక్షన్ సమ్మిట్-2025కు సహాధ్యక్షత వహించిన ప్రధాని మోదీ ఈ అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. ఏఐ ఆధారిత భవిష్యత్తులో

మిగతా 3వ పేజీలో ▶

● ఏఐ సామర్థ్యానికి అటూఇటూ

→ కృత్రిమ మేధ సామర్థ్యం ఎంతో పెరిగింది. ఒక ఏఐ యాప్‌లోకి వైద్య నివేదికను అప్‌లోడ్ చేస్తే అది వైద్యపరిభాషలోని సాంకేతిక అంశాలను పక్కనపెట్టి మనకు అర్థమయ్యే సరళమైన భాషలో నివేదిక సారాంశాన్ని సులువుగా వివరించగలదు. అదే సమయంలో ఏఐ పరిమితులను కూడా అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు అదే యాప్‌ను ఎడమ చేత్తో రాస్తున్న వ్యక్తి చిత్రాన్ని గీయమంటే అది దాదాపుగా కుడి చేత్తో రాస్తున్న వ్యక్తి బొమ్మ గీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఏఐ రంగంలో నూతన ఆవిష్కరణలు, ఏఐ పాలన గురించి లోతుగా చర్చించాల్సిన అవసరం ఉంది.

- ప్రధాని మోదీ

ఏఐకి నాలుగు సూత్రాలు



- కృత్రిమ మేధ అభివృద్ధి, సమర్థ వినియోగానికి గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ రోడ్ మ్యాప్
- సమాజానికి ప్రయోజనకరంగా ఉండేలా ఏఐని వినియోగించుకోవాలి.. ఒక్కో దేశంలో ఒక్కోలా నిబంధనలు, నియంత్రణలు ఉంటే.. ఏఐ అభివృద్ధికి ఆటంకమే
- కృత్రిమ మేధతో నెలకొనే పరిణామాలకు వర్క్ ఫోర్స్‌ను సిద్ధం చేయాలి
- ఏఐ స్వర్ణయుగం ఇది.. డేటా ప్రాసెస్ ఖర్చు 97% దిగొచ్చిందని వెల్లడి

3 లో

శిఖరాగ్రం సాక్షిగా... ‘ఏఐ’ విభేదాలు

6 లో

- అమెరికా, చైనా, యూరప్ ఎవరికి వారే!
- సంయుక్త తీర్మానానికి దూరంగా అగ్ర రాజ్యం
- అనూహ్యంగా సంతకం చేసి షాకిచ్చిన చైనా
- ఏఐపై మితిమీరిన నియంత్రణ వద్దు: వాన్స్
- ప్రజల నమ్మకమే కీలకం: ఈసీ చీఫ్ ఉర్సులా
- ఏఐ శిఖరాగ్ర వేదికపై నేతల మాటల యుద్ధం

ఈసారి ఇద్దరే!



బని బ్రాత

- జేఈఈ మెయిన్‌లో తెలుగు విద్యార్థుల వెనుకంజ
- గత ఏడాది టాప్ 14లో ఏడుగురు తెలుగువారు
- ఈ సంవత్సరం మొదటి సెషన్‌లో ఇద్దరికే చోటు
- 12వ స్థానంలో సాయి మనోజ్ఞ.. బని బ్రాత మజీకి 14వ స్థానం
- తొలి సెషన్ ఫలితాలు వెల్లడించిన ఎన్‌టీఏ
- రాజస్తాన్ విద్యార్థి ఆయుష్‌కు నేషనల్ మొదటి ర్యాంకు

- వివరాలు 5లో

‘మహా’ విషాదం

మహా కుంభమేళా నుంచి తిరిగి వస్తుండగా మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- మ్యాక్సీక్యాబ్‌ను అతివేగంగా దూసుకొచ్చి ఢీకొట్టిన ట్రక్
- **ఏడుగురు హైదరాబాద్‌వాసుల మృతి**
- రోడ్డునపడ్డ ఏడు కుటుంబాలు
- మరణంలోనూ వీడని స్నేహబంధం
- ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దిగ్భ్రాంతి



ఉప్పల్/మల్లాపూర్: మహా కుంభమేళా ప్రయాణం హైదరాబాద్‌కు చెందిన ఏడు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి తిరుగుప్రయాణంలో ఉన్న ఆ ఇంటి పెద్దల్ని రోడ్డు ప్రమాదం కబళించింది. మరో ఇద్దరిని తీవ్రంగా గాయపర్చింది. మహా కుంభమేళా నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన 8 మంది స్నేహితులు ఈనెల 8న

మిగతా 12వ పేజీలో ▶

లక్షలాది జనం.. రవాణా ఘోరం

మహా కుంభమేళాకు రైళ్లు, బస్సులు ఏవీ?

ప్రమాదకర రీతిలో భక్తుల ఆధ్యాత్మిక యాత్ర

- రద్దీ మేరకు లేని రైళ్లు.. బస్సులు ఏర్పాటు చేయని ఆర్టీసీ
- సామర్థ్యం లేని ప్రైవేట్ వాహనాల్లో వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్న జనం

12 లో

అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి..

- కాంగ్రెస్ చేతిలో మోసపోయామని ప్రజలు భావిస్తున్నారు: కేటీఆర్
- ప్రజలు తిడుతున్నా సీఎం రేవంత్ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు

- 2లో





‘స్థానిక’ తేదీలపై నేడు స్పష్టత!

- బీసీ రిజర్వేషన్లు ఖరారయ్యే అవకాశం
- సీఎం అధ్యక్షతన జరగనున్న ఉన్నతస్థాయి సమావేశం
- డెడికేటెడ్ కమిషన్ నివేదికపై చర్చించనున్న సీఎం, మంత్రులు, అధికారులు
- ఈ నెల 17లోగానే ఎన్నికల షెడ్యూల్ విడుదలకు చాన్స్

2 లో



దేశాభివృద్ధికి జీడీపీ అద్దం పడుతోంది

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

“ప్రజల చేతుల్లో నగదు నిల్వలు ఉండేలా బడ్జెట్‌ను రూపొందించాం. ఇకపై భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మౌలిక వసతుల కల్పన కోసం చేసే మూలధన వ్యయం రూ.15.48 లక్షల కోట్లకు చేరుకోనుంది. ఇది జీడీపీలో 4.3 శాతానికి సమానం.”

6 లో

ఇలాంటివారు...



అబ్బే! ఈ రద్దీ సినిమా టికెట్ల కోసం కాద్సార్! పావుగంటలో రుణాలిస్తారని వచ్చారు!!

భయం.. అభయం..!

- ఇంటర్ విద్యార్థుల్లో మనోధైర్యం నింపుతున్న టెలి మానస్.. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురవుతున్నవారికి కౌన్సెలింగ్
- వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 24 x7 సేవలు

13 లో

SBI MUTUAL FUND
A PARTNER FOR LIFE

మల్టీ అసెట్ అలొకేషన్ ఫండ్‌కి

ఏ సమయమైనా మంచి సమయమే.

ఈక్విటీ, ఫిక్స్‌డ్ ఇన్‌కమ్, బంగారం, వెండి మొ. వాటితో అన్ని మార్కెట్ పరిస్థితులకూ తగిన ఫండ్.



వైవిధ్యత
వివిధ మార్కెట్ పరిస్థితులలో, రిస్క్‌ని మేనేజ్ చేసేందుకు మరియు ఎదుగుదలని పొందేందుకు, కనీసం 3 అసెట్ క్లాసెస్‌లో పెట్టుబడి పెడుతుంది.

సౌలభ్యత
ఒకే ఫండ్‌లో మల్టిపుల్ అసెట్ క్లాసెస్‌కి ఎక్స్‌పోజర్ పొందే ఒక సౌలభ్యమైన విధానాన్ని అందజేస్తుంది.

పన్ను సామర్థ్యత
అసెట్ కేటాయింపు ఆధారంగా, ఈక్విటీ/నాన్- ఈక్విటీ పన్ను ప్రయోజనాలను అందజేస్తుంది.

ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్ చేత పెట్టుబడిదారుల పరిజ్ఞానానికీ మరియు జాగరూకతకి ఒక ప్రారంభ యత్నం.

పెట్టుబడిదారులు కేవలం రిజిస్టర్డ్ మ్యూచువల్ ఫండ్స్‌తోనే లావాదేవీలు జరపాలి. వీటి వివరాలను సెబీ వారి వెబ్‌సైట్ (https://www.sebi.gov.in) పైన, 'ఇంటర్మీడియరీస్/ మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌స్టిట్యూషన్స్' క్రింద వెరిఫై చెయ్యవచ్చు. దయచేసి వన్-టైమ్ కెవైసి (నో యువర్ కస్టమర్)ని పూర్తి చేసే ప్రక్రియ కోసం, మ్యూచువల్ ఫండ్ల వెబ్‌సైట్‌ని సంప్రదించండి; చిరునామాలో, ఫోన్ నంబర్‌లో, బ్యాంకు వివరాలు మొదలైన వాటిలో మార్పుల ప్రక్రియతో సహా. పెట్టుబడిదారులు రిజిస్టర్డ్ ఇంటర్మీడియరీస్ యొక్క ప్రతిస్పందనతో సంతృప్తి చెందకపోతే, వారికి విరుద్ధంగా https://www.scores.gov.in పైన ఫిర్యాదులు చెయ్యవచ్చు. స్కోర్స్ మీరు సెబీతో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసేందుకు మరియు ఆ తర్వాత దాని స్టేటస్‌ని (స్థితిని) చూసేందుకు తోడ్పడుతుంది.


మరింత సమాచారానికై మీ ఎంఎఫ్‌డి/ఆర్‌ఎఐని సంప్రదించండి | సందర్శించండి: www.sbimf.com | మమ్మల్ని ఫాలో కండి:

మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడులు మార్కెట్‌లోని సంక్షోభాలకు లోను అవుతాయి, స్కీముకి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లనూ జాగ్రత్తగా చదవండి.

క్లుప్తంగా...

దుష్ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్ హరీశ్

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: అబద్ధాలు ఆడటంలో బీఆర్ఎస్ నేత హరీశ్‌రావును మించిన వారెవరూ లేరని, దుష్ప్రచారానికి ఆయన బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. బావా బామ్మర్దులిద్దరూ ఒకరిపై ఒకరు పైచేయి సాధించేందుకు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. సిరిసిల్ల జిల్లాకు చెందిన నకీర్తి కనకవ్వ అనే మహిళకు రైతు భరోసా విషయంలో హరీశ్‌రావు చేసిన ట్వీట్‌కు ఆది శ్రీనివాస్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కౌంటర్ ఇచ్చారు.

ఇంటర్, టెన్త్ పరీక్షల తర్వాతే స్థానిక ఎన్నికలు

రాష్ట్ర సర్పంచుల సంఘం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఇంటర్, పదో తరగతి పరీక్షలు ముగిసిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కి రాష్ట్ర సర్పంచుల సంఘం విజ్ఞప్తి చేసింది. గ్రామ పంచాయతీల కాలపరిమితి ముగిసి ఏడాది, మండల, జిల్లా పరిషత్‌ల పదవీ కాలం ముగిసి ఏడు నెలలు గడిచినా.. ఇప్పటిదాకా ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం కాలయాపన చేస్తూ వచ్చిందని పేర్కొంది. ఇప్పుడు హడావుడిగా విద్యార్థులకు క్లిష్టమైన పరీక్షల సమయంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టడం విడ్డూరమని విమర్శించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయంలో సంయుక్త కార్యదర్శి జయసింహారెడ్డికి.. సంఘ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మా రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ వినతిపత్రం సమర్పించారు.

హామీలు అమలు చేయకపోతే పోరాటాలు

ఎమ్మెల్సీ కవిత హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో పోరాటాలు చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మహిళా దినోత్సవంలోపు హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని అల్టిమేటం జారీ చేశారు. కవిత మంగళవారం తెలంగాణ జాగృతి మహిళా విభాగం కార్యకర్తలతో తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో మహిళలకు పెద్దపీట వేశామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. మాయమాటలు చెప్పి, అబద్ధపు హామీలు ఇచ్చి మహిళలను రేవంత్‌రెడ్డి మోసం చేశారన్నారు.

బడ్జెట్‌పై బీజేపీ ప్రచార కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్ 2025–26లో పొందుపరిచిన ప్రజానుకూల అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. బుధవారం నుంచి ఈనెల 23 దాకా నిర్వహించనున్న ప్రచారంలో భాగంగా అన్ని జిల్లా కేంద్రాల్లో బడ్జెట్‌పై చర్చా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమ బడ్జెట్ వివరాలను ప్రజలకు చేరవేసేందుకు ఈ ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. జాతీయ పార్టీ ఆదేశాలకు అనుగుణంగా...బడ్జెట్‌పై చేపట్టనున్న ప్రచార కార్యక్రమాల కోసం పార్టీ నేతలు జి.మనోహర్‌రెడ్డి, డా.బూరనర్సయ్య గౌడ్, డా.ఎస్.ప్రకాశ్‌రెడ్డి, ఎస్.కుమార్, సోలంకి శ్రీనివాస్‌లతో ఓ కమిటీని నియమించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రచార విధివిధానాలను ఖరారు చేశారు. జిల్లాల్లో నిర్వహించనున్న ప్రచార కార్యక్రమాల్లో కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, జ్యోతిరాదిత్య సింధియా, బండి సంజయ్, సీనియర్ నేతలు డా.కె.లక్ష్మణ్, డీకే అరుణ, పురందేశ్వరి, వనతి శ్రీనివాసన్ పాల్గొంటారు.

కులగణన వద్దనుకునే జనగణనకు మంగళం

బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ ఆరోపణ



సాక్షి, హైదరాబాద్: కులగణన చేయాలనే డిమాండ్ల నేపథ్యంలో.. దానినుంచి తప్పించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం జనగణన చేయడం లేదనే అనుమానాలు కలుగుతున్నాయని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ విమర్శించారు. ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయడంలో జనాభా లెక్కలు తప్పనిసరని స్పష్టం చేశారు. వినోద్‌కుమార్ తెలంగాణ భవన్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. శాసన మండలి పట్టభద్రుల కోటా ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కయిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ చేసిన ఆరోపణలను ఖండించారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు గెలిచే అవకాశాలు లేవని వినోద్ కుమార్ స్పష్టం చేశారు.



సిరిసిల్ల మధ్యమానేరు జలాశయం రకరకాల చేపలకు ప్రసిద్ధి. ఫిబ్రవరిలోనే దొరికే ఒక్క మూతి చేప ఉదయం వేళ ఎక్కువగా దొరుకుతుంది. దీంతో ఈ చేపల కోసం సూర్యోదయ వేళ ఒక మత్స్యకారుడు వేటాడుతూ కనిపించాడు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల జిల్లా


42% బీసీ రిజర్వేషన్లకు కట్టుబడ్డాం: మంత్రి పొన్నం



కరీంనగర్ కార్పొరేషన్: తాము ప్రకటించినట్లుగానే 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. దీనిపై ఏవైనా అవరోధాలు వస్తే అందరి సహకారంతో పరిష్కరించుకుంటామని తెలిపారు. ఇందులో తమ ప్రభుత్వానికి ఎలాంటి రహస్య ఎజెండా లేదన్నారు. ఆయన మంగళవారం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీలకు కులగణనపై మాట్లాడే నైతికత లేదన్నారు. కులగణనను వ్యతిరేకిస్తూ బీజేపీ అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. ఇటీవలి సర్వేలో పాల్గొనని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు కులగణన ఫారాలను పంపుతున్నట్లు చెప్పారు. సర్వేలో వివరాలిచ్చాకే మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు.

'స్థానిక' తేదీలపై నేడు స్పష్టత!

బీసీ రిజర్వేషన్లూ ఖరారయ్యే అవకాశం
- ముఖ్యమంత్రి అధ్యక్షతన జరగనున్న ఉన్నతస్థాయి సమావేశం
- డెడికేటెడ్ కమిషన్ నివేదికపై చర్చించనున్న సీఎం, మంత్రులు, అధికారులు
- ఈ నెల 17 లోగానే ఎన్నికల షెడ్యూల్ విడుదలకు చాన్స్
- ఎన్నికల సన్నాహాల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం నిమగ్నం



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల తేదీలతో పాటు బీసీ రిజర్వేషన్ల ఖరారుపైనా బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఉన్నతస్థాయి సమావేశంలో స్పష్టత వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి, ఆయా శాఖల అధికారులు ఈ భేటీలో పాల్గొననున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. బీసీ రిజర్వేషన్లపై ఏర్పాటైన డెడికేటెడ్ కమిషన్ ఇప్పటికే నివేదికను సమర్పించిన నేపథ్యంలో, నివేదికపై చర్చించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల కోటాను ఖరారు చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపైనా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని, అదే జరిగితే అయిదారు రోజుల్లోనే అంటే ఈ నెల 17 లోగానే స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) విడుదల చేయవచ్చని చెబుతున్నారు. అలాగే ముందుగా ఏ ఎన్నికలు జరపాలి?, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలా..?, లేక గ్రామపంచాయతీ ఎన్నికలా?.. ఏయే తేదీల్లో వీటిని నిర్వహించాలి? అనే దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

వారం తేడాతోనే రెండు ఎన్నికలు!

ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించినా లేదా ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించినా, వారం రోజుల తేడాతోనే రెండు ఎన్నికలూ నిర్వహించేందుకు ఎస్ఈసీ సిద్ధమైంది. షెడ్యూల్‌ను ప్రకటించాక 21 రోజుల్లోనే ఆ ఎన్నికకు సంబంధించిన ప్రక్రియ అంతా ముగించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎస్ఈసీ వర్గాలు వెల్లడించాయి. ఎన్నికలకు అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడానికి వీలుగా వారం రోజుల్లో సీఎస్, డీజీపీలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించవచ్చని తెలిసింది. తదనుగుణంగా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ లేదా ప్రత్యక్షంగా ఎస్ఈసీ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తారని తెలుస్తోంది. ఇప్పటికే ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితాలను మండలాలు, జిల్లా పరిషత్‌లలో ప్రదర్శించారు. అదేవిధంగా పోలింగ్ స్టేషన్ల గుర్తింపు ప్రక్రియ కూడా మొదలైంది. పోలింగ్ విధుల్లో పాల్గొనే వారికి శిక్షణా కార్యక్రమాలు కూడా మొదలయ్యాయి. ఇవన్నీ ఈ నెల 15 కల్లా పూర్తవుతాయని, షెడ్యూల్ వెలువడిన వెంటనే సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కార్యరంగంలోకి దిగుతారని పంచాయతీరాజ్, ఎస్ఈసీ అధికారులు చెబుతున్నారు.

తొలుత ఎంపీటీసీ ఎన్నికలే..?

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ పరంగా క్షేత్రస్థాయిలో చేస్తున్న ఏర్పాట్లు, అధికారులు, సిబ్బంది పరంగా నిర్వహిస్తున్న సమీక్షలను బట్టి చూస్తే మాత్రం ముందుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలే జరిగే సూచనలున్నాయి. బుధవారం ఉదయం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై జిల్లా కలెక్టర్లు (హైదరాబాద్ మినహా), అదనపు కలెక్టర్లు (స్థానికసంస్థలు), ఆర్డీవోలు, సీఈవోలకు పంచాయతీరాజ్ శాఖ శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులకు కమిషనరేట్ కార్యాలయం నుంచి లేఖ పంపించారు. మరోవైపు క్షేత్రస్థాయిలో ఎన్నికల సన్నద్ధతపై పంచాయతీరాజ్ శాఖ కసరత్తు ముమ్మరం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల కోటా ఖరారు చేయగానే.. వచ్చే 3,4 రోజుల్లోనే పంచాయతీలు, మండలాలు, జిల్లా పరిషత్‌ల స్థాయిల్లో (స్థానికంగా జీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు) జనాభాకు అనుగుణంగా ఎక్కడికక్కడ ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను పీఆర్ శాఖ నిర్ణయించనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధంగా కాకుండా...స్థానికంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభా ప్రకారం హెచ్చుతగ్గుల్లో ఉంటాయని అధికార వర్గాల సమాచారం.

పీఏసీ చైర్మన్ ఎంపిక అప్రజాస్వామికం

హరీశ్‌రావు నామినేషన్‌ను మాయం చేశారు
- బీఆర్ఎస్ నేత వేముల ప్రశాంత్‌రెడ్డి
- పీఏసీ సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్



బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎల్.రమణ, సత్యవతి రాథోడ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ (పీఏసీ)గా నియమించడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. పీఏసీ చైర్మన్ పదవికి నామినేషన్ వేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నామినేషన్ పత్రాలను మాయం చేశారని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడితో సంప్రదింపులు జరిపి పీఏసీ చైర్మన్‌ను ఎంపిక చేయాలనే సంప్రదాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని మండిపడ్డారు. శాసనసభలో కమిటీ హాల్‌లో మంగళవారం జరిగిన పీఏసీ మూడో సమావేశం నుంచి బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, ఎల్.రమణ వాకౌట్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్నందున, అరికెపూడి గాంధీ పీఏసీ చైర్మన్ హోదాలో సమావేశం నడపడం సమంజసం కాదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సంప్రదాయాలకు విరుద్ధంగా జరిగిన పీఏసీ చైర్మన్ నియామకాన్ని అంగీకరించేది లేదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. అసెంబ్లీతోపాటు పీఏసీ భేటీలోనూ మాట్లాడే అవకాశం ఇవ్వకుండా మైకులు కట్ చేస్తున్నారని ఆరోపించారు. పీఏసీ చైర్మన్ పదవి నుంచి అరికెపూడిని తొలగించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ స్పష్టం చేశారు. పీఏసీ చైర్మన్‌తోపాటు పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని రమణ డిమాండ్ చేశారు.

అధికారుల తీరుపై పీఏసీ అసంతృప్తి

వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులపై పీఏసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ అధ్యక్షతన అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో ఈ శాఖలపై సమీక్ష నిర్వహించారు. భేటీకి అధికారులు తగినంత సమాచారంతో రాకపోవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి సమావేశానికి పూర్తి సమాచారం ఇస్తామని అధికారులు తెలిపారు. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు మెరుగుపరిచేందుకు పీఏసీ సభ్యులు పలు సూచనలు చేశారు.

నిధుల పంపిణీలో అసమానతలొద్దు

బడ్జెట్‌పై సాధారణ చర్చలో కేఆర్ సురేశ్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: నిధుల పంపిణీలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అసమానతలు ఉండరాదని, అన్ని రాష్ట్రాలను సమదృష్టితో చూడాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీనేత కేఆర్ సురేశ్‌రెడ్డి కోరారు. 'ఉత్తర, దక్షిణ రాష్ట్రాలన్న అంతరం మాలో లేకున్నా, కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాలు అందిస్తున్న ఆర్థిక సాంత్వన..అవి తిరిగి పొందుతున్న నిధులకు సంబంధించి మాత్రం ఆందోళన ఉంది. దీనిపై ఆర్థికవేత్తల్లోనే కాదు, గ్రామస్థాయిలోనూ ప్రజల్లో విస్తృత చర్చ జరుగుతోంది. కర్ణాటక నుంచి రూపాయి కేంద్రానికి వెళితే కేవలం 15 పైసలు మాత్రం తిరిగివస్తోంది. తమిళనాడు నుంచి రూపాయి వెళితే 29 పైసలు, తెలంగాణ నుంచి రూపాయికి 43 పైసలు, ఏపీ నుంచి రూపాయికి 49పైసలే తిరిగొస్తున్నాయి. వికసిత్ భారత్ జరగాలన్న ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య నిధుల పంపిణీలో ఉన్న అసమానతలు తొలగించాలి' అని బడ్జెట్‌పై సాధారణ చర్చ సందర్భంగా సురేశ్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో పసుపుబోర్డు ఏర్పాటు చేసినా..ఒక్క రూపాయి నిధులను ఇవ్వలేదని సురేశ్‌రెడ్డి విమర్శించారు. బోర్డుకు చైర్మన్‌ను నియమించినా, ఆయనకు కనీసం కార్యాలయం కేటాయించలేదని, రైతులకు సాయపడేందుకు నిధులు లేవని సభ దృష్టికి తెచ్చారు.

మరిన్ని పార్లమెంట్ వార్తలు
సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో..

అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి..

- కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మోసపోయామని ప్రజలు భావిస్తున్నారు: కేటీఆర్
- ప్రజలు తిడుతున్నా సీఎం రేవంత్ రెడ్డి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు
- స్థానిక సంస్థల్లో ఏకగ్రీవాలకు ఖమ్మం జిల్లా మంత్రుల కుట్రలు
- మాజీ మంత్రి పువ్వాడ ఇంట్లో ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నేతల భేటీ



సంతోష్‌కుమార్‌తో కలిసి 'వృక్షార్చన' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మోసపోయామని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు భావిస్తున్నారు. కాంగ్రెస్ నాయకుల గల్లాలు పట్టి ప్రజలు కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. రుణమాఫీ విషయంలో మంత్రుల మధ్య సయోధ్య లేకపోవడంతో తెలంగాణ అధోగతి పాలైంది. ప్రజలు తిడుతున్నా సీఎం రేవంత్ రెడ్డి ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నివాసంలో జరిగిన ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. 'తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చింది. సీఎం నియోజకవర్గంతోపాటు తెలంగాణలోని ప్రతీ పనికి సంబంధించిన కాంట్రాక్టు ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రికే దక్కుతున్నాయి. కాంట్రాక్టుల మంత్రి ఇచ్చే కమీషన్ల కోసమే ముఖ్యమంత్రి పనిచేస్తున్నారు. డిప్యూటీ సీఎం 30శాతం కమీషన్లు తీసుకుని పనులు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారు' అని కేటీఆర్ మండిపడ్డారు.

ప్రత్యేక కారణాలతోనే బీఆర్ఎస్‌కు నష్టం

'పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఖమ్మంలో అసాధారణ అభివృద్ధి జరిగినా అక్కడి ప్రత్యేక రాజకీయ సమీకరణాల వల్ల బీఆర్ఎస్‌కు కొంత నష్టం జరిగింది. ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా వరదల సమయంలో ప్రజలకు పైసా ఉపయోగ పడలేదు. కానీ బీఆర్ఎస్ నాయకులు ఓడిపోయినా ఏడాది కాలంగా ప్రజలకు అండగా నిలుస్తున్నారు. అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. ఈ ఎన్నికల్లో పోలీసులను అడ్డం పెట్టుకొని ఏకగ్రీవాల కోసం ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు చేస్తున్న కుట్రలను బీఆర్ఎస్ అడ్డుకుంటుంది' అని కేటీఆర్ హెచ్చరించారు. త్వరలో తాను ఖమ్మం జిల్లాలో పర్యటిస్తానని ప్రకటించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పుట్టిన రోజున 'వృక్షార్చన'

బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 17న ప్రతీ ఒక్కరూ మూడు మొక్కల చొప్పున నాటాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. 'వృక్షార్చన' పేరిట మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కేటీఆర్ మంగళవారం విడుదల చేశారు.

రాజకీయాలకు అతీతంగా వర్గీకరణ

మంద కృష్ణ మాదిగతో సీఎం రేవంత్
- సమస్యలను మంత్రివర్గ ఉపసంఘం, కమిషన్‌కు వివరించాలని సూచన



మందకృష్ణ మాదిగతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొంగులేటి, కేశవరావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా మాదిగ, మాదిగ ఉపకులాలకు మేలు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో చర్చించి, మంత్రివర్గ ఉపసంఘం వేసి, న్యాయ కమిషన్ వేసి, నివేదికలను వేగంగా తీసుకుని, కేబినెట్‌లో చర్చించి అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నామన్నారు. దీంతో ఎలాంటి న్యాయపర చిక్కులు రావని సీఎం తెలిపారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మంగళవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో సమావేశమయ్యారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై సీఎం చిత్తశుద్ధిని ఈ సందర్భంగా మంద కృష్ణ అభినందించారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణలో పలు సమస్యలను సీఎంకు వివరించగా, వాటిని మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు కె.కేశవరావు, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్‌తో భేటీ

ఎస్సీ వర్గీకరణ ఉపసంఘం చైర్మన్, నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మందకృష్ణ మాదిగ సమావేశం అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన సూచన మేరకు ఉత్తమ్‌తో భేటీ అయ్యారు. మాదిగలకు 9 శాతం కాకుండా 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, అలాగే వర్గీకరణలో మాదిగల్లోని కొన్ని ఉపకులాలకు జరిగిన అన్యాయాన్ని వివరించారు.

ఉప ఎన్నికలు రావడం ఖాయం

పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజలే బుద్ధి చెప్తారు
- బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు



మంగళవారం ఎర్రవల్లిలో మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య, నాయకులు

సాక్షి, సిద్దిపేట: పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రాజయ్యతో పాటు పలువురు నాయకులు ఎర్రవల్లిలో కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ పార్టీ మారిన ఎమ్మెల్యేలకు తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈసారి కడియం శ్రీహరి ఓడిపోవడం ఖాయమన్నారు. ఈ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య మళ్లీ ఎమ్మెల్యేగా గెలుస్తారని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి చేసిన ద్రోహానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ముందుగా కేసీఆర్‌తో రాజయ్య భేటీ అయ్యారు. వారం రోజులుగా స్టేషన్ ఘన్‌పూర్‌లో చేపట్టిన రైతు నిరసన దీక్ష గురించి, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పాలనతో పాటు శ్రీహరిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నట్లు వివరించారు. ఈనెల 15న స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి వెయ్యి మంది కార్యకర్తలు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరనున్నారని తెలిపారు.

ప్రగల్భాలు మాని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయండి

కేటీఆర్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ కౌంటర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉత్తర కుమార ప్రగల్భాలు మాని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా చేశారు. చెల్లి, బావ ఇచ్చిన షాక్‌తో కేటీఆర్‌కు మతి భ్రమించిందని, అందుకే కొడంగల్‌కు వెళ్లి అడ్డగోలుగా మాట్లాడి వచ్చాడని మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. బీసీల కులగణన, ఎస్సీల వర్గీకరణ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలన.. దేనికైనా తాము చర్చకు సిద్ధమని సవాలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాడిద గుడ్డు వస్తుందని తెలిసే ఇప్పటి వరకు బీఆర్ఎస్ అభ్యర్థులను కూడా ప్రకటించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికే మూడు ముక్కలుగా చీలిన బీఆర్ఎస్.. వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో కనిపించదని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు.

బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఒక చిత్తు కాగితం

మార్చి 9న కులగణన రణభేరి నిర్వహిస్తాం: జాజుల



సాక్షి, హైదరాబాద్: బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఒక తప్పుల తడక అని, అదొక చిత్తు కాగితంతో సమానమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా రిటైర్డ్ జడ్జితో డెడికేషన్ కమిషన్ వేస్తే ప్రయోజనం ఉండేదని, కానీ ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్‌ను నియమించిందన్నారు. ప్రభుత్వానికి బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో బీసీ సంఘం నాయకులతో కలిసి జాజుల మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే బీసీ కులగణన విషయంలో తప్పుల మీద తప్పులు చేసిన ప్రభుత్వం..బీసీ డెడికేటెడ్ కమిషన్ విషయంలో మరోసారి తమకు చిత్తశుద్ధి లేదని నిరూపించుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్టు 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ, అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే, మార్చి 9న బీసీ కులగణన రణభేరి పేరిట 'చలో హైదరాబాద్'ను లక్షలాది మంది బీసీలతో నిర్వహిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులనే గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ కులగణనతో ఏర్పడిన గందరగోళ పరిస్థితులపై ఇప్పటికే ప్రభుత్వ పెద్దలతో చర్చించామని, దానిపై సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేశవరావు హామీ ఇచ్చారన్నారు.

క్లుప్తంగా...

క్రిస్ప్‌తో పీఆర్‌ఆర్‌డీ శాఖ ఎంవోయూ

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీల కార్యకలాపాల్లో మహిళా స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ) సహకారం తీసుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. పంచాయతీలు, ఎస్‌హెచ్‌జీల మధ్య సమన్వయం సాధనతో కేరళ మోడల్ విజయవంతమైందని అంచనా వేస్తోంది. మంగళవారం సచివాలయంలో సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్ (క్రిస్ప్) మెంబర్ సెక్రటరీ, మాజీ ఐఏఎస్ అధికారి ఆర్.సుబ్రహ్మణ్యం బృందంతో మంత్రి సీతక్క సమావేశమయ్యారు. పేదరిక నిర్మూలన, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు క్రిస్ప్ సభ్యులు సంసిద్ధత వ్యక్తంచేశారు. గ్రామసభల నిర్వహణ, గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధిగా మార్చే ప్రణాళికలు, స్థానిక ప్రభుత్వాల్లో సంస్కరణలు తెచ్చే దిశలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సుబ్రహ్మణ్యంను మంత్రి కోరారు. స్థానిక ఎన్నికలు పూర్తయి కొత్త పాలక మండళ్లు ఏర్పడే నాటికి యాక్షన్ ప్లాన్ ఖరారు చేయాలన్నారు. ఈ నివేదికపై కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీనిచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య వ్యవస్థలు, మహిళా సాధికారత, ఈ వ్యవస్థల బలోపేతంపై చర్చించారు. మంత్రి సీతక్క సమక్షంలో క్రిస్ప్ మెంబర్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, పీఆర్‌ఆర్‌డీ డైరెక్టర్ సృజన ఒప్పందపత్రాలు మార్చుకున్నారు.

ఓయూ దూరవిద్య రెండో విడత ప్రవేశాలు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్యలో 2024–25 విద్యా సంవత్సరానికి రెండో విడత ప్రవేశాలు ప్రారంభమైనట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి మంగళవారం తెలిపారు. డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులను మార్చి 31 వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఏబీసీ ఐడీ, యూజీసీ–డీఈబీ ఐడీ నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

సివిల్స్ అభ్యర్థులకు మాక్ ఇంటర్వ్యూలు

15 రోజులుగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న సింగరేణి అధికారులు

సాక్షి, హైదరాబాద్: సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలకు హాజరు కానున్న అభ్యర్థుల కోసం మంగళవారం సింగరేణి భవన్‌లో అధికారులు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్యానెల్‌గా ఏర్పడి మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులకు సలహాలు, సూచనలు చేశారు. సింగరేణి సహకారంతో ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ గాంధీ అభయహస్తం పథకం కింద.. సివిల్స్ ప్రిలిమ్స్‌లో విజయం సాధించిన అభ్యర్థులకు రూ.లక్ష, మెయిన్స్‌లో విజయం సాధించిన అభ్యర్థులకు మరో రూ.లక్ష సహాయాన్ని గతంలో అందజేశారు. ఇంటర్వ్యూలకు ఎంపికైన వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు.

ఏఐకి 4 సూత్రాలు

కృత్రిమ మేధ అభివృద్ధి, సమర్థ వినియోగం కోసం గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ రోడ్ మ్యాప్



పారిస్: ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ పరిజ్ఞానం అభివృద్ధి, సమర్థ వినియోగం కోసం నాలుగు సూత్రాలను అనుసరించాలని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ సూచించారు. ఆ నాలుగు అంశాలలో ముందడుగు పడేందుకు పబ్లిక్ పాలసీ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. ఈ మేరకు ఫ్రాన్స్‌లోని పారిస్‌లో జరుగుతున్న ఏఐ యాక్షన్ సదస్సులో ఏఐ అభివృద్ధి, విస్తరణకు సంబంధించి రోడ్‌మ్యాప్‌ను సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాలు దేశాల్లో భిన్నమైన నిబంధనలు, ఆంక్షలు ఉంటే.. ఏఐ అభివృద్ధికి ఆటంకమని స్పష్టం చేశారు. ప్రస్తుతం డేటాను ప్రాసెస్ చేసేందుకు అయ్యే ఖర్చు 97 శాతం దిగివచ్చిందని, ఇది కృత్రిమ మేధ అభివృద్ధికి అద్భుతమైన ఊతమిస్తుందని సుందర్ పిచాయ్ తెలిపారు. ఇది ఏఐ ఆవిష్కరణల స్వర్ణయుగమని, సమాజానికి ప్రయోజనకరంగా ఉండే ఏఐ ఆవిష్కరణల కోసం ప్రభుత్వాలు, సంస్థలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో సుందర్ పిచాయ్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే...

''కృత్రిమ మేధ, దాని అప్లికేషన్ల గురించి నేను ఆశాజనకంగా ఉన్నాను. ప్రతి ఒక్కరికీ, ప్రతిచోటా టెక్నాలజీతో ప్రయోజనం పొందేందుకు, జీవితాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుంది. నేను భారత్‌లోని చెన్నైలో పెరిగాను. అప్పట్లో ప్రతి కొత్త టెక్నాలజీ ఇంటి వద్దకు చేరుకోవడానికి కొంత సమయం పట్టేది. అందులో రోటరీ ఫోన్ కూడా ఒకటి. దానికోసం మేం ఐదేళ్లు నిరీక్షించాల్సి వచ్చింది. కానీ తర్వాత ఆ ఫోన్ మా జీవితాలను మార్చేసింది. అప్పట్లో మా అమ్మకు చేసిన రక్త పరీక్షల ఫలితాలు తెలుసుకోవడానికి నేను నాలుగు గంటల పాటు ప్రయాణం చేయాల్సి వచ్చేది. కొన్నిసార్లు అంత దూరం వెళ్లినా.. 'రిపోర్ట్ సిద్ధంగా లేదు. రేపు రండి' అని ఆస్పత్రివాళ్లు చెప్పేవారు. అదే ఫోన్ వచ్చాక.. కేవలం ఒక్క కాల్‌తో పని అయిపోయింది.

మన జీవితాల్లో గణనీయమైన మార్పు రాబోతోంది

సాంకేతికత చూపిన సానుకూల ప్రభావాన్ని గమనించాను. అదే నన్ను యూఎస్ వరకు నడిపించింది. గూగుల్ అనే స్టార్టప్ కంపెనీ వద్దకు చేర్చింది. ముగ్గురు గూగుల్ సహోద్యోగులు నోబెల్ అందుకోవడాన్ని, డ్రైవర్ లెస్ కారులో నా తల్లిదండ్రులను తీసుకువెళ్లడాన్ని ఆనాడు నేను ఊహించలేదు. వీటిని సాకారం చేసినది 'కృత్రిమ మేధ(ఏఐ)'సాంకేతికతే. దీనిలో మనం ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాం. అయినా ఏఐ మన జీవితంలో గణనీయమైన మార్పులు తెస్తోంది. పర్సనల్ కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు వచ్చినప్పటి కంటే ఈ మార్పు మరింత పెద్దదిగా, ప్రభావవంతంగా ఉండబోతోంది.

ఏడాదిన్నరలో 97 శాతం ఖర్చు తగ్గింది..

డేటాను ప్రాసెస్ చేసేందుకు అయ్యే ఖర్చు గత 18 నెలల్లో ఏకంగా 97 శాతం దిగి వచ్చింది. పది లక్షల టోకెన్ల (డేటా ప్రాసెసింగ్ యూనిట్) డేటాను ప్రాసెస్ చేయడానికి అయిన ఖర్చు నాలుగు డాలర్ల (సుమారు రూ.350) నుంచి 13 సెంట్ల (రూ.11)కు దిగి వచ్చింది. అంటే ఇంతకుముందెన్నడూ లేనంతగా మేధస్సు అందుబాటులోకి వచ్చింది. కృత్రిమ మేధ అభివృద్ధి చెందుతున్నకొద్దీ.. ప్రపంచవ్యాప్తంగా వినూత్న ఆవిష్కరణలను, అవకాశాలను, ఆర్థిక అభివృద్ధి అవకాశాలను మెరుగుపరుస్తూనే ఉంటుంది. విజ్ఞానాన్ని, సృజనాత్మకతను, ఉత్పాదకతను పెంచుతుంది.

ఏఐలో గూగుల్ పెట్టుబడి..

ప్రజల జీవితాలను మెరుగుపరచడానికి, మార్చడానికి గూగుల్ సంస్థ దశాబ్దకాలం నుంచి ఏఐలో పెట్టుబడులు పెడుతోంది. ప్రపంచంలోని సమాచారాన్ని నిర్వహించడంతోపాటు అందరికీ ప్రయోజనకరంగా అందుబాటులోకి తీసుకురావడానికి ఇది కీలకమని గుర్తించాం. ఇప్పుడు జనరేటివ్ ఏఐ విప్లవానికి మార్గం వేసిన ఆవిష్కరణలను రూపొందించాం. ఏఐ కోసం ప్రత్యేకమైన 'టెన్సర్ ప్రాసెసింగ్ యూనిట్'చిప్స్‌ను అభివృద్ధి చేశాం. టెక్స్ట్, ఇమేజ్, వీడియో, ఆడియో, కోడ్ ఇలా అన్నిరకాల సమాచారాన్ని ప్రాసెస్ చేయగల 'జెమిని'వంటి ఏఐ మోడళ్లను దీనితో వినియోగించుకోగలం. ఎన్నో అంశాల్లో ప్రజలకు పూర్తి సహాయకారిగా ఉండే అప్లికేషన్లను రూపొందిస్తున్నాం. 200 కోట్ల కంటే ఎక్కువ మంది వినియోగదారులు వినియోగిస్తున్న గూగుల్ మ్యాప్స్, సెర్చ్, ఆండ్రాయిడ్ వంటి ఏడు ఉత్పత్తులను మా కృత్రిమ మేధ ఆవిష్కరణల సాయంతో అభివృద్ధి చేశాం.

సైన్స్, ఆవిష్కరణలకు ఏఐ సాయం..

వైద్య రంగంలో కీలక ఆవిష్కరణగా ఆల్ఫాఫోల్డ్‌ను రూపొందించాం. 2021లో దానిని సైంటిఫిక్ కమ్యూనిటీకి ఉచితంగా అందుబాటులోకి తెచ్చాం. 190 దేశాలకు చెందిన 25 లక్షల మంది కంటే ఎక్కువ మంది పరిశోధకులు మలేరియా కొత్త వ్యాక్సిన్లు, కేన్సర్ చికిత్సలు, ప్లాస్టిక్‌ను అరగదీసే ఎంజైమ్‌లను రూపొందించడానికి దీనిని ఉపయోగిస్తున్నారు. ఆల్ఫాఫోల్డ్ ఆధారంగా ఏర్పాటైన ఐసోమోర్ఫిక్ ల్యాబ్స్.. ఔషధాల రూపకల్పన, చికిత్సలు విజయవంతం చేయడం కోసం మెషీన్ లెర్నింగ్‌ను ఉపయోగిస్తున్నారు. శాస్త్రవేత్తలు కొత్త ఔషధాలను కనుగొనడానికి, ఎలక్ట్రిక్ కార్ల కోసం మరింత సమర్థవంతమైన బ్యాటరీలను రూపొందించడానికి క్వాంటమ్ కంప్యూటింగ్ సాయపడుతోంది. ఏఐ తర్వాత రాబోతున్న అతిపెద్ద మార్పు క్వాంటమ్ కంప్యూటింగ్.

ఇది ఆవిష్కరణల స్వర్ణయుగం..

ఇదొక చరిత్రాత్మక క్షణం. ఇది ఆవిష్కరణల స్వర్ణయుగానికి నాంది. కానీ దీని ఫలితాలు కచ్చితమని చెప్పలేను. అయితే ప్రతి తరం కూడా కొత్త సాంకేతికత వల్ల తర్వాతి తరం పరిస్థితి అధ్వానంగా మారుతుందని ఆందోళన చెందుతుంది. కానీ ప్రతిసారీ అందుకు విరుద్ధంగా జరుగుతూ వస్తోంది. ఏఐతో జీవితాలను మెరుగుపరచుకోవడానికి మనకు ఒక తరంలో ఒకసారే అవకాశం ఉంటుంది. అది సాధ్యం కావడానికి మనం చేయగలిగినదంతా చేద్దాం.

సమాజానికి ఏఐతో సమకూరుతున్న ప్రయోజనాలెన్నో..

కృత్రిమ మేధతో సమాజానికి ఇప్పటికే ఎన్నో ప్రయోజనాలు సమకూరుతున్నాయి. గూగుల్ ట్రాన్స్‌లేట్‌ను ప్రవేశపెట్టిన కొత్తలో కొన్ని భాషలే ఉన్నాయి. ఏఐ వచ్చాక ఈ ప్రయోజనం మరింత పెరిగింది. ఏఐ సాంకేతికతలను ఉపయోగించి గత ఏడాది 50కోట్ల మందికి పైగా మాట్లాడే 110కి పైగా కొత్త భాషలను గూగుల్ ట్రాన్స్‌లేట్‌కు జోడించాం. 60 ఆఫ్రికన్ భాషలు సహా గూగుల్ ట్రాన్స్‌లేట్ ఇప్పుడు 249 భాషలకు చేరుకుంది. ఏఐతో ఆరోగ్య రంగంలో ప్రయోజనాలు ఎన్నో. ప్రమాదకరమైన కేన్సర్లకు సంబంధించిన బయోమార్కర్లను గుర్తించే అంశంలో ఏఐ సాయం తీసుకుంటున్నాం. భారత్, థాయ్‌లాండ్‌లో స్థానిక సంస్థలతో కలసి 60లక్షల మందికి ఉచితంగా డయాబెటిక్ రెటినోపతికి ఏఐ స్క్రీనింగ్ చేశాం. ఏఐ ఆధారిత ఫ్లడ్‌హబ్‌తో 100 కంటే ఎక్కువ దేశాల్లో 70 కోట్ల మందికి వరదల సమాచారాన్ని ముందే అందించగలుగుతున్నాం. ఇలా ఏఐతో ప్రయోజనకరమైన సాంకేతికతలు ఎన్నో వచ్చాయి.

ఏఐ శక్తిని వెలికితీయడానికి ఏం చేయాలి?

కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని వెలికితీసి, సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ఎన్నో చర్యలు చేపట్టాలి.

- **మొదటిది...** ఆవిష్కరణకర్తలు, వాటిని అనుసరించేవారితో ఎకోసిస్టమ్ రూపొందించాలి.
- **రెండోది..** ఏఐ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే ప్రధాన టెక్ కంపెనీలు సుమారు 300 బిలియన్ డాలర్లు (మన కరెన్సీలో సుమారు రూ. 26,025 కోట్లు) ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యాయి.
- **మూడోది..** వర్క్ ఫోర్స్‌ను సిద్ధం చేసేందుకు పెట్టుబడి పెట్టాలి, భవిష్యత్తు పరిణామాలకు వారిని సిద్ధం చేయాలి. ప్రపంచ ఆర్థిక సదస్సు నివేదిక ప్రకారం... యూరప్‌లోని ఉద్యోగాల్లో చాలా వరకు జనరేటివ్ ఏఐ ప్రభావాన్ని ఎదుర్కొంటాయి.
- **నాలుగోది..** సమాజంలో మార్పులు తీసుకురాగల కృత్రిమ మేధ అప్లికేషన్ల విషయంలో సానుకూలంగా వ్యవహరించాలి. అందరూ ప్రయోజనం పొందేలా చూడాలి. అదే సమయంలో సమాచార కచ్చితత్వం, వాస్తవాలు, టెక్నాలజీ దుర్వినియోగంపై అప్రమత్తంగా ఉండాలి.

... ఈ నాలుగు అంశాలలో ముందడుగు పడేందుకు పబ్లిక్ పాలసీ అత్యంత కీలకమైనది. ఇందులో భాగంగా.. సృజనాత్మకత, ఆవిష్కరణలకు ఆటంకం కలుగకుండా చూసుకుంటూ, ఏఐతో సమస్యలను గుర్తించాలి. కొత్త చట్టాలు తేవడం కంటే.. ఇప్పుడున్న చట్టాల్లో అవసరమైన మార్పులు చేయాలి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో వేర్వేరు నిబంధనలు, ఆంక్షలు ఉంటే ఏఐ అభివృద్ధికి ఆటంకమన్నది గుర్తుంచుకోవాలి. ఏఐ రంగంలో మౌలిక సదుపాయాలు, మానవ వనరులపై పెట్టుబడుల విషయంలో ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి.

ఏఐతో ఉద్యోగాలు పోవు..

▶ మొదటి పేజీ తరువాయి

రాణించాలంటే నైపుణ్యాలను పెంచుకోవడం, వాటికి మెరుగులు దిద్దుకోవడంపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. అదే సమయంలో ఓపెన్‌సోర్స్ ఆధారిత ఏఐ వినియోగంలో ప్రజావిశ్వాసం, పారదర్శకత పెంచేలా, ఈ రంగంలో వివక్షను రూపుమాపేలా ప్రపంచ మార్గదర్శకాల రూపకల్పనకు ఉమ్మడి చర్యలు చేపట్టాల్సిన అవసరం కచ్చితంగా ఉందన్నారు.

చరిత్ర చెప్పేది అదే..

'కృత్రిమ మేధ వల్ల ఉద్యోగాలు పోతాయనేది అత్యధికులను కలవరపరుస్తోన్న అంశం. కానీ టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు మాయం కావని చరిత్ర చాటిచెప్పింది. కేవలం పని స్వభావం మారి కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. అందుకు తగ్గట్లుగా మనల్ని మనం మలుచుకోవాలి. నైపుణ్యాలకు పదును పెట్టుకోవాలి. కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి'అని మోదీ సూచించారు. ఈ శతాబ్దిలో కృత్రిమ మేధ మానవాళికి కోడ్‌ను రాస్తోందని.. కానీ మానవ చరిత్రలోని ఇతర మైలురాళ్లకన్నా ఇది ఎంతో విభిన్నమైనదన్నారు. ''ఏఐ ఇప్పటికే మన రాజకీయ, ఆర్థిక, భద్రతా రంగాలతోపాటు సమాజాన్ని పునర్నిర్మిస్తోంది. విద్య, వైద్యం, వ్యవసాయరంగాలను మెరుగుపరచడం ద్వారా కోట్లాది మంది ప్రజల జీవితాలను ఏఐ మార్చగలదు. ఇంకెన్నింటినో చేయగలదు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను మరింత సులభంగా, వేగంగా చేరుకోవడంలో దోహదపడగలదు. ఇందుకోసం మనం మన వనరులు, ప్రతిభను ఏకం చేయాలి'అని మోదీ పేర్కొన్నారు.

ఏఐలో భారత్ సత్తా..

ఓపెన్ నెట్‌వర్క్, యాక్సెసబుల్ నెట్‌వర్క్ సాయంతో తక్కువ ఖర్చుతోనే భారత్ 140 కోట్ల మందికి పైగా ప్రజల డిజిటల్‌పరమైన మౌలిక వసతులను విజయవంతంగా అభివృద్ధి చేసిందని ప్రధాని మోదీ తెలిపారు. 'ప్రజాప్రయోజనాల కోసం మేం ఏఐ అప్లికేషన్లను అభివృద్ధి చేస్తున్నాం. భారత్‌లోని భిన్నత్వాన్ని దృష్టిలో పెట్టుకొని సొంతంగా లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్‌ఎల్‌ఎం)ను అభివృద్ధి చేస్తున్నాం'అని మోదీ తెలిపారు. స్టార్టప్‌లు, పరిశోధకులకు అందుబాటు ధరలో సాంకేతిక వనరులను అందించేందుకు ప్రత్యేకమైన ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిని భారత్ అభివృద్ధి చేసిందన్నారు. ఏఐ భవిత ఉన్నతంగా, అందరికీ అందుబాటులో ఉండే విషయంలో భారత్ తన అనుభవాన్ని, నైపుణ్యాన్ని ప్రపంచంతో పంచుకొనేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. డేటా సాధికారత, పరిరక్షక వ్యవస్థ ద్వారా డేటా శక్తిని అందిపుచ్చుకుందని వివరించారు. 'మేం డిజిటల్ కామర్స్‌ను ప్రజాస్వామ్యబద్ధంగా అందరికీ అందుబాటులోకి వచ్చేలా చేశాం. భారత్ తీసుకొచ్చిన నేషనల్ ఏఐ మిషన్‌కు ఈ దృక్పథమే పునాది. మా హయాంలో జీ20 దేశాలకు సారథ్యం వహించినప్పుడు కృత్రిమ మేధ వాడకం బాధ్యతాయుతంగా ఉండేలా, అందరి మంచికి ఉపయోగపడాలనే విషయంలో ఏకాభిప్రాయం సాధించాం. ప్రస్తుతం ఏఐ వినియోగం, డేటా గోప్యతకు సాంకేతిక పరిష్కారాలు కనుగొనడంలో భారత్ ముందుంది'అని మోదీ తెలిపారు.

ఏఐ మార్గదర్శకాలపై ఉమ్మడి కసరత్తు ఉండాల్సిందే

ఓపెన్ సోర్స్ ఆధారిత ఏఐ వినియోగానికి సంబంధించిన ప్రపంచ మార్గదర్శకాల రూపకల్పన కోసం ఉమ్మడి చర్యలు అవసరమని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. ప్రజావిశ్వాసాన్ని, పారదర్శకతను పెంపొందించడంలో, వివక్షను చెరిపేయడంలో ఈ చర్యలు దోహదపడతాయన్నారు. 'కనీవినీ ఎరుగని విస్తృతి, వేగంతో ఏఐ అభివృద్ధి చెందుతోంది. అంతకన్నా వేగంగా ఏఐ వినియోగం కొనసాగుతోంది. దీనికితోడు దేశాలకు అతీతంగా ఏఐ రంగంలో పరస్పర ఆధారం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి విలువలను కాపాడుకోవడంతోపాటు ఏఐపై భయాలను పారద్రోలేందుకు, ప్రజావిశ్వాసం చూరగొనేందుకు దోహదపడే ప్రమాణాలను నెలకొల్పాలి. అందుకు ప్రపంచ దేశాలు ఉమ్మడి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది'అని ప్రధాని మోదీ సూచించారు. మేధస్సుపరంగా మనిషికన్నా యంత్రాలు ఎంతో ముందుంటాయని కొందరు ఆందోళన చెందుతుంటారు. కానీ మన ఉమ్మడి భవిత, గమ్యం విషయంలో మనుషులమైన మనం తప్ప ఇంకెవరూ కీలకపాత్ర పోషించలేరు'అని మోదీ పేర్కొన్నారు.

తదుపరి ఏఐ యాక్షన్ సమ్మిట్ నిర్వహణకు సిద్ధం: మోదీ

తదుపరి ఏఐ యాక్షన్ సమ్మిట్‌ను భారత్‌లో నిర్వహించేందుకు ప్రధాని మోదీ ముందుకొచ్చారు. ఈ మేరకు పారిస్‌లో జరిగిన ఏఐ యాక్షన్ సమ్మిట్–2025లో ప్రతిపాదన చేశారు. సదస్సు ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఏఐ దృక్పథం, ఉద్దేశంలో భాగస్వామ్య పక్షాల మధ్య స్పష్టమైన ఐక్యతను చాటేలా చర్చలు జరిగాయి. ఈ ప్రక్రియకు మరింత ఉత్సాహం తెచ్చేందుకు తదుపరి యాక్షన్ సమ్మిట్‌ను భారత్‌లో నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం'అని పేర్కొన్నారు. మరోవైపు 'ఏఐ ఫౌండేషన్', 'సుస్థిర ఏఐ మండలి'ని ఏర్పాటు చేయాలన్న సదస్సు నిర్ణయాన్ని ప్రధాని మోదీ స్వాగతించారు. ఈ విషయంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ చొరవను అభినందించిన మోదీ.. భారత్ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించారు. అదే సమయంలో 'ఏఐ కోసం ప్రపంచ భాగస్వామ్యం'స్వభావరీత్యా సైతం నిజంగా ప్రపంచవ్యాప్తంగా ఉండాలని ఆకాంక్షించారు. దక్షిణాది దేశాలను ఇందులో సమ్మిళితం చేయాలని.. ఆయా దేశాల అవసరాలు, ఆందోళనలు, ప్రాధాన్యతలను గుర్తించాలని సూచించారు.

ఓపెన్ ఏఐని అమ్మబోం

మస్క్‌కు అస్సలు అమ్మను: ఆల్ట్‌మన్



పారిస్: ఎలాన్ మస్క్ సారథ్యంలోని పెట్టుబడిదారుల బృందం చేసిన 97.4 బిలియన్ డాలర్ల ఆఫర్‌ను ఏఐ దిగ్గజం ఓపెన్‌ఏఐ తిరస్కరించింది. అది విక్రయానికి లేదని కంపెనీ బాస్ సామ్ ఆల్ట్‌మాన్ స్పష్టం చేశారు. ముఖ్యంగా మస్క్‌కు అస్సలు విక్రయించేది లేదని కుండబద్దలు కొట్టారు. 'కావాలంటే మీ ఎక్స్ (ట్విటర్)నే 9.74 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేస్తాం' అంటూ ఎక్స్ వేదికగా ఆఫర్ చేశారు! పారిస్ ఏఐ యాక్షన్ సమ్మిట్‌లో ఆల్ట్‌మన్ మీడియాతో మాట్లాడారు. చిరకాల ప్రత్యర్థి మస్క్‌పై విరుచుకుపడ్డారు. తమను మార్కెట్లో ఓడించలేని పోటీదారు తమ కంపెనీని కొంటామనడం విడ్డూరమన్నారు. చైనా ఏఐ సంస్థ డీప్‌సీక్ చాట్‌బాట్‌ను రూపొందించి 'మంచి పని' చేసిందంటూ కితాబిచ్చారు. ప్రజలు కోరేది అందులో ఉందన్నారు. ఎప్పుడో ఓసారి తాము అత్యంత సమర్థులైన గట్టి పోటీదారులను ఎదుర్కొంటామని తెలుసన్నారు. ''మనం మరింత అధికారస్వామ్యం ఏఐ వైపు వెళ్తున్నామా, లేక ప్రజాస్వామిక ఏఐ వైపా? సులువుగా సమాధానం చెప్పలేని అంశమిది. నేను మాత్రం రెండోదానివైపే ఉన్నా'' అని ఆల్ట్‌మన్ చెప్పుకొచ్చారు.





మీ సొంత కారణం, ఇంగితజ్ఞానం అంగీకరిస్తే తప్ప, ఎవరు చెప్పినా, ఆఖరికి నేను చెప్పినా దేన్నీ నమ్మవద్దు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 12 ఫిబ్రవరి 2025

ఘర్షణాత్మక ఆలోచన

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకొచ్చినప్పటినుంచీ మీడియాకు కావలసినంత మేత దొరుకుతోంది. వలసదారులను తిప్పిపంపటంలో ఆ దేశం ఎంత అమానుషంగా, అమాన వీయంగా వ్యవహరిస్తున్నదో అందరూ చూశారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండటానికి సిద్ధపడాలంటూ కెనడాను కోరటం, గ్రీన్‌ల్యాండ్ ప్రాంతాన్ని తమకు అమ్మేయాలని డెన్మార్క్‌ను అడగటం, పనామా కాల్వను అప్పగించాలని తాఖీదు పంపటం వగైరాలన్నీ తెలిసీ తెలియక మాట్లాడే మాటలుగా అందరూ కొట్టిపారేశారు. గాజాను స్వాధీనం చేసుకుని దాన్ని ఒక గొప్ప రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో కలిసి గత బుధవారం మీడియాకు చెప్పడాన్ని సైతం అలాగే భావించారు. సాక్షాత్తూ వైట్ హౌస్ ప్రతినిధే ట్రంప్ వ్యాఖ్యల్ని మీడియా తప్పుగా అర్థం చేసుకున్నదంటూ తోసిపుచ్చారు. అదంతా తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనన్నారు. కానీ ట్రంప్ మరోసారి జూలు విదిల్చారు. గాజా స్ట్రిప్ అమెరికాకు కూడా చెందదట. తానే సొంతం చేసుకుంటారట. గాజా పౌరులు నివాసం ఉండటానికి చుట్టూ ఉన్న జోర్డాన్, ఈజిప్టు, సౌదీ, టర్కీ తదితర పశ్చిమాసియా దేశాల్లో ఆరుచోట్ల మెరుగైన కాలనీలు నిర్మిస్తారట. గాజా పౌరులకు ఇక తిరిగొచ్చే హక్కే లేదట. విధ్వంసం తప్ప నిర్మాణం సంగతి తెలియని దేశానికి ఇలాంటి ఆలోచన రావటం వెనకున్న వ్యూహం చిన్నదేం కాదు. తనకు 7,000 కిలోమీటర్ల ఆవల దాదాపు 25 లక్షలమంది నివసించే ఒక ప్రాంతాన్ని 'సొంతం' చేసుకోదల్చుకున్నట్టు ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతుడైన అధినేత ఒకరు ప్రకటించారంటే అదెంత వైపరీత్యమో, అంతకుమించి మరెంత దుస్సాహసమో అర్థం చేసుకోవచ్చు. 2023 అక్టోబర్ మొదలుకొని గత నెలలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరేవరకూ ఇజ్రాయెల్ సైన్యాలు అక్కడ టన్నులకొద్దీ బాంబులు జారవిడిచినా... దారుణ హింసను చవిచూపినా, పసిపిల్లలూ, స్త్రీలతో సహా 47,000 మంది పౌరులను హతమార్చినా, లక్షలమందిని గాయపరిచినా ఆ ప్రాంతం లొంగిరాలేదు. హమాస్ ఆనుపానులన్నీ తెలిశాయని ఇజ్రాయెల్ చెప్పుకున్నా, ఆ సంస్థ అపహరించిన పౌరులందరినీ విడిపించటంలో అది పూర్తిగా విఫలమైంది. చివరకు హమాస్‌తో కుదిరిన ఒడంబడికతోనే వారంతా దశలవారీగా విడుదలవుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రకటన ఎంత మతిమాలినదో అమెరికా పౌరులు గ్రహించాలి. యుద్ధాలన్నిటినీ అంతం చేస్తానని వాగ్దానాలిచ్చి పీఠం అధిష్ఠించిన అధినేత కొత్త కుంపట్లు రాజేయటంలోని మర్మమేమిటో నిలదీయాలి.

అమెరికాతో చెట్టాపట్టాలేసుకున్న పశ్చిమాసియా దేశాలు మాత్రమే కాదు... భద్రతామండలి దేశాలన్నీ ట్రంప్ ప్రతిపాదనను ఖండించాయి. సుతిమెత్తగానే అయినా 'ఇది యుద్ధాల యుగం కాద'ని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. 1948లో పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు ప్రాణప్రతిష్ఠ చేసి పాలస్తీనా పేరిట వదిలిన ఒక చిన్న ప్రాంతాన్ని సైతం ఇప్పుడు ట్రంప్ ఆక్రమిద్దామని చూస్తున్నారు. అంతరంగంలో ఏమనుకున్నా 'రెండు దేశాల' ఏర్పాటే సమస్యకు పరిష్కారమని పైకి చెబుతూ వచ్చిన అమెరికా... ట్రంప్ ఏలుబడి మొదలయ్యాక తన నైజాన్ని బయటపెట్టుకుంది. పాలకులెవరైనా, పైకి ఏం చెప్పినా అమెరికా విధానాలు యుద్ధాలకూ, ప్రత్యేకించి ఇజ్రాయెల్‌కు అనుకూలమైనవే. చరిత్ర వరకూ పోనవసరం లేదు. గత 15 నెలలుగా గాజాలో ఇజ్రాయెల్ సాగించిన నర మేధం అమెరికా ఆశీస్సులు లేకుండా జరిగే అవకాశం ఉందా? రష్యాను కవ్వించి కయ్యానికి కాలు దువ్వమని ఉక్రెయిన్‌ను ప్రోత్సహించి ఓడిపోక తప్పని యుద్ధంలోకి దాన్ని దించిన ఘనత గత పాలకుడు జో బైడెన్‌ది. ఒకప్పుడు సోవియెట్ బూచిని చూపి ప్రత్యక్ష పరోక్ష యుద్ధాలకు దిగిన అమె రికా ఇవాళ ప్రపంచ దేశాలన్నిటినీ శత్రువులుగా చూస్తోంది. వేరే దేశాల సరుకులపై భారీ సుంకాలు మోపుతూ, వాటిని దివాలా తీయించటం ఒకవైపు... 'నచ్చిన ప్రాంతం' సొంతం చేసుకుంటానంటూ మరోవైపు ప్రపంచాన్ని ట్రంప్ అస్థిరతలోకి నెడుతున్నారు. ఈ సంస్కృతినే రష్యా, చైనాలు కొనసాగిస్తే ఏం జరుగుతుందో ఆయనకు అర్థమవుతున్నట్టు లేదు. ప్రపంచ దేశాలన్నీ తన జాగీరుగా ఆయన భావిస్తున్నారు. పొట్టచేతబట్టుకు వచ్చిన వలసదారులను అమెరికాలో నేరస్తులుగా పరిగణించే ట్రంప్ తన విస్తరణవాద కాంక్షను ఏమనాలో, అందుకు శిక్షేమిటో చెప్పాలి.

అమెరికా దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన జోర్డాన్, ఈజిప్టులు రెండూ ట్రంప్ ప్రతిపాదనను తోసిపుచ్చాయి. కానీ ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్న జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 ట్రంప్ హుంకరింపులను తట్టుకుని నిలబడగలరా? అనుమానమే. ఎందుకంటే అమెరికానుంచి సైనిక, ఆర్థిక సాయం పొందుతున్న దేశాల్లో జోర్డాన్‌ది మూడో స్థానం. ఆ దేశానికి ఏటా 1,700 కోట్ల డాలర్ల ప్యాకేజీ అందుతుంది. 1,500 కోట్ల డాలర్లతో తర్వాతి స్థానం ఈజిప్టుది. అమెరికా నుంచి 17,200 కోట్ల డాలర్ల సాయం పొందుతూ ప్రస్తుతం ఉక్రెయిన్ ప్రథమస్థానంలో వున్నా అదెంతో కాలం సాగకపోవచ్చు. 3,300 కోట్ల డాలర్లతో ఇజ్రాయెల్ రెండో స్థానంలో ఉంది. ట్రంప్‌కు మోకరిల్లితే ఈజిప్టు, జోర్డాన్ ప్రజలు మౌనంగా ఉండరు. ఇప్పటికే గాజా శరణార్థులతో నిండివున్న ఆ దేశాల్లో మరింతమందిని తీసుకొస్తామంటే ఆగ్రహజ్వాలలు మిన్నంటుతాయి. అందుకే అక్కడి పాలకుల స్థితి ముందు నుయ్యి, వెనక గొయ్యిగా ఉంది. గాజాను పునర్నిర్మించాల్సిందే. సర్వం శిథిలమైన చోట మెరుగైన ఆవాసాలు ఏర్పాటు కావాల్సిందే. కానీ అదంతా అక్కడి పౌరుల చేతుల మీదుగా జరగాలి. అమెరికాతో సహా బయటి దేశాలకు అక్కడ కాలుమోపే హక్కులేదు.

దక్షిణాఫ్రికాతో కయ్యానికి కారణాలేంటి?

అభిప్రాయం



టంకశాల అశోక్

కొత్తగా దక్షిణాఫ్రికాతో తగవు ప్రారంభించారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్. అందుకు ఆరంభం ఫిబ్రవరి 3న జరిగింది. దానికి ఆయన చెప్తున్న కారణాలు మూడు: ఒకటి, అక్కడి శ్వేతజాతీయుల భూములను సిరిల్ రామఫోసా ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటున్నది. రెండు– తెల్లవారిపట్ల వివక్ష చూపుతున్నది. మూడు– అమెరికాపై, దాని మిత్ర దేశాలపై అంతర్జాతీయంగా వ్యతిరేక వైఖరి తీసుకుంటున్నది. ఇవిగాక, తెల్లవారి విషయంలో 'చాలా చెడ్డ పనులు చేస్తున్నది' అని కూడా అన్నారాయన. దక్షిణాఫ్రికాలోని తీవ్రవాద శ్వేతజాతీయుల సంస్థలు కొన్ని తమపై 'సామూహిక హత్యాకాండలు సాగుతున్నట్లు' 1994లో అక్కడ వర్ణ వివక్ష (అపార్థీడ్) ముగిసినప్పటి నుంచి ఆరోపిస్తూనే ఉన్నాయి. 'చెడ్డ పనులు' అనటంతో ట్రంప్ ఉద్దేశం అదేనేమో తెలియదు.

భూమి చట్టంతో మొదలు...

ఈ విధమైన ఆరోపణలు చేసిన అమెరికా అధ్యక్షుడు ఆ విషయమై విచారణలు చేస్తున్నామనీ, అవి నిజమైతే దక్షిణాఫ్రికాకు తమ సహాయాన్ని నిలిపి వేయగలమనీ హెచ్చరించారు. ఆరోపణలు నిజమని తేలితే చర్యలు తీసుకోవటం వేరు. అంతకన్నా ముందే సహాయం ఆపివేయటం వంటి చర్యలు మొదలై పోయాయి. జీ–20కి ప్రస్తుతం అధ్యక్షత వహిస్తున్న రామఫోసా త్వరలో జొహాన్నెస్‌బర్గ్‌లో నిర్వహించనున్న శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనబోవటం లేదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకటించేశారు. హెచ్ఐవీ చికిత్సల కోసం తాము చేసే ఆరోగ్య సహాయాన్ని ట్రంప్ ఆపివేశారు. దక్షిణాఫ్రికాలోనే పుట్టి పెరిగిన ట్రంప్ ముఖ్య సలహాదారు ఎలాన్ మస్క్, ట్రంప్ తరహా ఆరోపణలు, హెచ్చరికలు రెండు రోజులకొకసారి చేస్తున్నారు. దక్షిణాఫ్రికా శరణార్థుల కోసం శిబిరాలు సిద్ధం చేయాలంటూ ట్రంప్ తమ అధికారులను ఆదేశించారు కూడా!

మరొకవైపు, అమెరికా అధ్యక్షుని ఆరోపణలలో ఎంతమాత్రం నిజం లేదని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు తోసిపుచ్చారు. ఆఫ్రికాలోగల తీవ్రమైన భూమి సమస్యల దృష్ట్యా 'నిరుపయోగం'గా ఉన్న భూముల స్వాధీనానికి రామఫోసా ప్రభుత్వం గత నెల ఒక చట్టం చేసింది. నిజానికి ఇటువంటి చట్టాన్ని స్వయంగా అమెరికా కూడా 5వ రాజ్యాంగ సవరణ ద్వారా చేసిన విషయాన్ని రామఫోసా గుర్తు చేస్తున్నారు. ఇండియా మొదలైన అనేక దేశాలలోనూ ఈ చట్టాలున్నాయి. ఇక తెల్లవారి పట్ల వివక్షలు, హత్యాకాండలున్నట్లు వారి సంస్థలు ఆరోపణలు చేయటం మినహా ఎటువంటి ఆధారాలూ చూపటం లేదు. ఈ మాట రామఫోసా ప్రభుత్వమే కాదు, దక్షిణాఫ్రికాకు చెందిన ప్రజాస్వామిక శ్వేతజాతి వర్గాలు, పార్టీలు, పాశ్చాత్య దేశాలకు చెందిన ప్రముఖ మీడియా సంస్థలు అంటున్నదే! అట్లాంటిదేమీ లేదని నేను స్వయంగా అక్కడికి వెళ్లినపుడు గమనించాను.

అటువంటి స్థితిలో ట్రంప్ విపరీత వైఖరికి కారణమేమిటి? ప్రధానంగా ఆయన శ్వేతజాతి దురహంకారి కావటమనిపిస్తున్నది. తను మొదటిసారి అధికారంలో ఉన్నప్పుడు (2017–21) కూడా రకరకాల ఆరోపణలు చేశారు. అప్పటికి దక్షిణాఫ్రికాలో ఈ చట్టం లేదు. దక్షిణాఫ్రికాకు చెందిన శ్వేతజాతి తీవ్రవాద సంస్థలు తరచుగా అమెరికా సహా పాశ్చాత్య దేశాలకు వెళ్లి లాబీయింగ్‌లు చేస్తుండేవారు. వారి వాదనలను డెమోక్రాట్లు, రిపబ్లికన్ల ప్రభుత్వాలు పట్టించుకోలేదు. తమ వంటి లక్షణాలు గల ట్రంప్ అధికారానికి వచ్చిన తర్వాతనే అందుకు విలువ ఇస్తున్నారు. ఇందుకు ఈసారి మరొక మూడు కారణాలు చేరాయి. ఒకటి– గాజాలో ఇజ్రాయెల్ మారణ కాండపై ప్రపంచంలో మొదట దక్షిణాఫ్రికాయే చొరవ తీసుకుని అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే)లో కేసు వేయటం. రెండు– అమెరికా ఆధిపత్యాన్ని తగ్గించి బహుళ ధ్రువ ప్రపంచం కోసం ప్రయత్నిస్తున్న బ్రిక్స్ కూటమిలో దక్షిణాఫ్రికా భాగస్వామి కావటం. మూడు– ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ కంపెనీలో 30 శాతం భాగస్వామ్యాన్ని స్థానిక నల్లవారికి ఇవ్వాలన్న షరతు. వాస్తవానికి ఇటువంటి భాగస్వామ్య నిబంధన అక్కడి టెలికాం లైసెన్సింగ్ చట్టంలో గతం నుంచి ఉంది. తనను మినహాయించాలన్నది మస్క్ వాదన. దానిని ట్రంప్ బలపరుస్తున్నారు. దక్షిణాఫ్రికా ప్రభుత్వంనిరాకరిస్తున్నది.



డోనాల్డ్ ట్రంప్



సిరిల్ రామఫోసా

◆ దక్షిణాఫ్రికాలోగల తీవ్రమైన భూమి సమస్యల దృష్ట్యా 'నిరుపయోగం'గా ఉన్న భూముల స్వాధీనానికి రామఫోసా ప్రభుత్వం గత నెల ఒక చట్టం చేసింది. అది అక్కడి శ్వేతజాతీయులకు కంటగింపుగా మారింది.

◆ ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ కంపెనీలో 30 శాతం భాగస్వామ్యాన్ని స్థానిక నల్లవారికి ఇవ్వాలని దక్షిణాఫ్రికా షరతు పెట్టింది. టెలికాం లైసెన్సింగ్ చట్టంలోని భాగస్వామ్య నిబంధన నుంచి తనను మినహాయించాలన్నది మస్క్ వాదన. దానిని ట్రంప్ బలపరుస్తున్నారు. దక్షిణాఫ్రికా నిరాకరిస్తున్నది.

అన్నీ ఉన్నా వివక్షేనా?

పోతే, 1994లో అపార్థీడ్, శ్వేతజాతి పాలన ముగిసిన 30 సుదీర్ఘ సంవత్సరాల తర్వాత ఇటువంటి భూమి చట్టం ఎందుకు చేయవలసి వచ్చిందన్నది అర్థం చేసుకోవలసిన విషయం. యూరోపియన్లు దక్షిణాఫ్రికాకు రావటం 1600వ సంవత్సరంలో మొదలు కాగా, వారు భూములను అత్యధిక భాగం ఆక్రమించుకున్నారు. వేర్వేరు యూరోపియన్ల మధ్య కూడా కొంతకాలం ఆధిపత్య యుద్ధాలు జరగగా చివరకు అందరూ కలిసి 1948లో శ్వేతజాతి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అంతకుముందే 1913, 1936లో భూమి చట్టాలు చేసి, మొత్తం భూములలో 87 శాతం తెల్లవారికి రిజర్వ్ చేశారు. ఆ పరిస్థితి 1994లో నల్లవారి ప్రభుత్వం ఏర్పడినా కొనసాగుతూనే వచ్చింది.

ఇంకా చెప్పాలంటే, వివిధ కారణాల వల్ల ఆఫ్రికన్ రైతుల కొద్దిపాటి భూములు కూడా క్రమంగా శ్వేతజాతీయుల పరం కాసాగాయి. ఇది నేను అక్కడి ప్రభుత్వ రికార్డులను బట్టి స్వయంగా గమనించిన విషయం. ట్రంప్ తన ప్రకటనలో, తెల్లవారిలోని ఆఫ్రికానర్ల ప్రస్తావన ప్రత్యేకంగా చేశారు. హాలండ్, ఫ్రాన్స్ నుంచి వలస వచ్చిన జాతీయులను 'ఆఫ్రికానర్లు' అంటారు. అక్కడి జనాభాలో వారి శాతం కేవలం నాలుగు. భూములలో అధిక భాగం, ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన భాగం వారి అధీనంలోనే ఉన్నాయి. అయినా వివక్ష అని మాట్లాడతారు. ఉదాహరణకు అక్కడ నేను మౌంటేన్ ఫాక్స్ అనే పేరిట గల డచ్ వారి వ్యవసాయ క్షేత్రాన్ని చూశాను. ఆ కుటుంబానికి 740 ఎకరాలకు పైగా ఉంది. సొంత వైన్ యార్డ్, అందులో పండించే ద్రాక్షతో సొంత బ్రాండ్ సారాయి ఉన్నాయి. కొన్ని వాహనాలతో రవాణా కంపెనీ ఉంది. ఒక మధ్య తరహా హోటల్, ఒక బొటిక్ ఉన్నాయి. అయినా తమ ఆఫ్రికానర్ల పట్ల వివక్ష ఉందని వాపోతూ హాలండ్‌కు తిరిగి వెళ్లిపోవాలనుకుంటున్నట్లు చెప్పారు. అందుకు కారణం? తమ పిల్లవాడు ఇంజనీరింగ్ చేసి ప్రభుత్వ ఉద్యోగం కోసం వెళితే, అక్కడి కోటాల ప్రకారం ఆ ఉద్యోగం ఒక నల్లవాడికి ఇచ్చారట! అదీ వారనే వివక్ష. ఒక్కొక్కరి వద్ద వేలాది ఎకరాలుండటాన్ని, రహదారుల వెంట ఎంతదూరం వెళ్లినా కంచెలు వేసి పడావు పడటాన్ని చూశాను. పేదరికం వల్ల కొద్దిపాటి భూములు కూడా అమ్ముకుని నగరాలకు వలస వస్తూ చిల్లర పనులతో జీవిస్తున్న నల్లవారినీ కలిసి మాట్లాడాను.

ఈ పరిస్థితులలో నల్లవారికి భూమి అన్నది తీవ్రమైన సమస్యగా ఉండిపోయింది. దానితో ముడిబడిన పేదరికం వల్ల అసంతృప్తి పెరుగుతున్నది. 30 ఏళ్ల తర్వాత ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) మొదటిసారిగా సొంత మెజారిటీ కోల్పోవటానికి ఇది ఒక ప్రధాన కారణం. అందువల్ల రామఫోసా ప్రభుత్వం ఈ చట్టాన్ని చేయటం అనివార్యమైంది. అయినప్పటికీ అమెరికా అధ్యక్షుడు దక్షిణాఫ్రికా 'మానవ హక్కులను హరిస్తున్న'దనే గొప్ప మాట అన్నారు. అపార్థీడ్‌ను అమెరికా ఎప్పుడూ వ్యతిరేకించలేదు. గాజా, కెనడా, గ్రీన్‌లాండ్, పనామా వంటి ఇతర దేశాలను ఆక్రమించుకోగలమని బాహాటంగా ప్రకటించే ట్రంప్, తెల్లవారి భూమి హక్కులంటూ ఇంతగా మాట్లాడటాన్ని బట్టి ఆయన తత్త్వం అర్థం చేసుకోవచ్చు.

అయితే, తాము బెదిరి లొంగబోమనీ, తమ ప్రజలకు అవసరమైంది చేస్తామనీ రామఫోసా తమ పార్లమెంటులో స్పష్టం చేశారు. ఆ దేశం ఆఫ్రికా ఖండంలో పారిశ్రామికంగా అన్నింటికన్నా పెద్దది. బ్రిక్స్ కూటమిలో ప్రముఖ దేశం. ఇప్పటికే ఉత్తర అమెరికా, యూరప్, లాటిన్ అమెరికా, ఆసియా ఖండాల దేశాలతో తగవుకు దిగిన ట్రంప్, ఆఫ్రికాలోనూ అదే ధోరణి చూపటం వల్ల అంతిమంగా అమెరికాకు కలగగల నష్టాల గురించి ఆలోచిస్తున్నట్లు లేదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

మేమే కొంటాం!



నో! థ్యాంక్ యూ. నువ్వు కావాలంటే మేమే ట్విట్టర్‌ను 9.74 బిలియన్ డాలర్లకు కొంటాం.
(ఓపెన్–ఏఐ సంస్థను కొంటానని ట్విట్టర్/ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ 97.4 బిలియన్ డాలర్ల ఆఫర్ ఇచ్చిన నేపథ్యంలో వ్యంగ్యంగా.)
– సామ్ ఆల్ట్‌మాన్, ఓపెన్ ఏఐ సీఈవో

కావాల్సింది పోరే!



ఇరాన్–ఇరాక్ యుద్ధ కాలంలో ఇరాక్‌కు యూఎస్ నిధులు సమకూర్చేదని నాకు గుర్తుంది. కానీ ఆశ్చర్యం ఏమిటంటే, ఇరాన్‌కు కూడా యూఎస్ నిధులు ఇచ్చేదని సంవ త్సరాల తర్వాత చదివాను... ఇరు దేశాలూ పోరాటం ఆపకుండా ఉండటానికి!
– మోహన్ సిన్హా, కాలమిస్ట్

అర్థమయ్యేలా...



ప్రిస్క్రిప్షన్ (మందుచీటీ)కి వైద్యులు స్థానిక భాషల్లో చేతితో వ్యాఖ్యానం రాస్తే అది పేషెంట్లకు సహాయకారిగా ఉంటుంది. అదే సమయంలో ఒక పర్సనల్ టచ్ ఇచ్చినట్టు అవుతుంది.
– కార్తీక్ బాలచంద్రన్, ఎండోక్రైనాలజిస్ట్

ఈజీ ప్రక్షాళన



సామాన్యుల కంటే వీఐపీలు, అత్యంత ధనికులకు తమ పాపాలను ప్రక్షాళన చేసుకోవడం మరింత సులభతరమని మహాకుంభ మేళా కళ్లకు కడుతోంది.
– ప్రసేన్‌జిత్ దత్తా, మార్కెట్ విశ్లేషకుడు

చెప్పదంతే!



ఒక ఎన్జీవో అనేది ప్రభుత్వేతర సంస్థ కాదు. అది ఏ ప్రభుత్వం కోసం పనిచేస్తున్నదో కేవలం దాన్ని దాచే సంస్థ!
– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

ఇన్ బాక్స్

ఈ పతనం ఓ గుణపాఠం

రాజకీయాల్లో అవినీతిని ఊడ్చేస్తానంటూ ప్రగల్భాలు పలికి... అందలం ఎక్కి, అవినీతిని కేరాఫ్ అడ్రస్‌గా మార్చుకున్న ఆమ్ ఆద్మీ పార్టీని ఢిల్లీ ప్రజలే తాజా ఎన్నికల్లో ఊడ్చి పడేశారు. అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన కేజ్రీవాల్ కేవలం ప్రధాని పీఠంపై కన్నేసి ఎప్పుడైతే రాజకీయాలు మొదలుపెట్టారో... అప్పుడే ఆయన పతనం ప్రారంభం అయ్యిందని చెప్పాలి. అవినీతి వ్యతిరేక రాజకీయాలు కొనసాగించివుంటే ఆయన రాజకీయాల్లో వజ్రంలా నిలిచేవారు. దేశ ప్రధాని పదవి కోరుకోకుండానే వచ్చేది. రాజకీయాలకు చుక్కానిగా ఉండేవారు. కానీ ఆయన ఢిల్లీ ముఖ్యమంత్రి కాగానే ఇక తనకు ఎదురులేదన్న రీతిలో అవినీతి పంకిలంలో కూరుకుపోయారు. ఆయన మంత్రులు, అనుచరులు, ఎమ్మెల్యేలు అంతా అందులో దిగబడ్డారు.

తనతో పాటు అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న కేజ్రీ ఇప్పుడు ఓటమి చెందడాన్ని అన్నా హజారే కూడా స్వాగతిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఢిల్లీ వీధుల్లో ఒకప్పుడు సంచలనంగా మారిన ఆప్ అడ్రస్ ఇప్పుడు గల్లంతయ్యిందనే చెప్పాలి. ఈ ఎన్నికల్లో బీజేపీ బాగా కష్టపడి పనిచేసినందువల్లనే గెలిచింది అనే కన్నా, ఆప్ తన సైద్ధాంతికత నుంచి తప్పుకోవడం వల్ల ఆప్ ఓడిందని చెప్పుకోవాలి. ప్రజలకు ఉచిత బస్సు, ఉచిత కరెంట్, ఉచిత వైద్యం అంటూ ఊదరగొట్టిన కేజ్రీ... అసలు సమస్యలు పక్కన పెట్టారు. ఢిల్లీ వాతావరణ కాలుష్యంపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. మంచినీటి సరఫరాకు అంతరాయంగా ఉన్న యమునా నది కాలుష్యం గురించి మాట్లాడలేదు. మోదీనీ, బీజేపీనీ విమర్శించడమే రాజకీయంగా ముందుకు సాగారు. అందుకే పదేళ్లుగా అధికారంలో ఉన్నా... లాభం లేకుండా పోయిందని ప్రజలు ఆలోచించారు. చివరకు కేజ్రీవాల్‌నే కాకుండా డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను కూడా ఓడించారు. కేజ్రీవాల్ ఉత్థాన పతనాల కథ రాజనీతి శాస్త్ర విద్యార్థులకే కాదు... మొత్తం రాజకీయ నేతలకు ఒక కేస్ స్టడీలా భావించవచ్చు. భారత రాజకీయ పార్టీలు ఈ చరిత్ర నుంచి గుణపాఠం నేర్చుకోవాలి.

– సభావట్ కళ్యాణ్, ఢిల్లీ యూనివర్సిటీ న్యాయ శాస్త్ర విద్యార్థి

ఉగ్రవాదాన్ని అంతమొందించాలంటే...

విశ్లేషణ



బి.టి. గోవిందరెడ్డి

ఆధునిక మానవుడు సాధించిన ఎన్నో ఘన విజయాలకు, సాధించుకున్న సామాజిక ప్రశాంతతకు భంగం కలిగించడంలో ఉగ్రవాదం పెనుసవాలుగా మారింది. గడచిన రెండువందల ఏళ్ల కాలంలో వివిధ దేశాల్లో పుట్టుకొచ్చిన 400కు పైగా టెర్రర్ గ్రూపుల పైన, అవి రూపాంతరం చెందడం, అంతమవడం పైన సమగ్ర అధ్యయనం చేశారు ప్రొ॥ ఆడ్రీ కుర్త్ క్రోనిన్. ప్రస్తుతం అమెరికాలోని 'కార్నెగీ మెలన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్ట్రాటెజీ అండ్ టెక్నాలజీ' డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. గత చరిత్రను తవ్వి తీసి ఆమె చేసిన పరిశోధనలో ఉగ్ర భూతాన్ని అంతమొందించడంపై విలువైన సమాచారం ఉంది. ఆమె రాసిన 'హౌ టెర్రరిజమ్ ఎండ్స్: అండర్‌స్టాండింగ్ ద డిక్లయిన్ అండ్ డిమైస్ ఆఫ్ టెర్రరిస్ట్ క్యాంపెయిన్స్' పరిశోధన గ్రంథాన్ని ప్రిన్స్‌టన్ యూనివర్శిటీ ప్రెస్ 2011లో ప్రచురించింది. ఉగ్రవాద సంస్థలు అంతమయ్యే ఆరు మార్గాలను తన అధ్యయనంలో గుర్తించారామె. అవి:

1) ఉగ్ర సంస్థల అగ్రనేతలను భౌతికంగా అంతమొందించడం. 2) సంప్రతింపుల ద్వారా టెర్రరిస్టు గ్రూపు డిమాండ్ల పరిష్కారం. 3) రాజ్యంపై ఉగ్రవాద సంస్థ పైచేయి సాధించడం ద్వారా తానే రాజ్యం కావడం (ఉదా: తాలిబన్ ప్రభుత్వం). 4) అంతర్గత కలహాలతో పతనమవడం. 5) మిలిటరీ దాడులతో చెల్లాచెదురవడం. 6) ఉగ్ర సంస్థ తనకు తానుగా పంథా మార్చుకుని రాజకీయ పార్టీగా అవతరించడం.

ఉగ్రవాద నేతల అంతం విషయంలో ఒక పద్ధతి పైస్థాయి నేతలను అడ్డు తొలగించుకోవడం. ఉదా: ఒసామా బిన్ లాడెన్‌ను చంపడం. బిన్ లాడెన్ తర్వాత అల్‌ఖైదాకు నేతృత్వం వహించిన అల్ జవహిరిని కూడా అమెరికా 2022లో కాబూల్‌లో డ్రోన్ దాడితో అంతమొందించింది. ఇదంతా ఉగ్రవాద భూతం తల నరికేయడమన్న మాట!

ఇరాన్ ఎజెండాను అమలు చేసే ప్రాక్సీ గ్రూపులు హమాస్, హెజ్బొల్లాలకు చెందిన పలువురు కీలక నేతలను మట్టుబెట్టడం ద్వారా ఇజ్రాయెల్ ఇదే పని చేస్తోంది. ఇంకో ఉదాహరణ మన పొరుగున ఉన్న శ్రీలంకకు చెందిన 'లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలమ్' (ఎల్‌టీటీఈ)! 2009లో వేలుపిళ్లై ప్రభాకరన్ మరణంతో ఒకప్పుడు ఆ దేశం మొత్తాన్ని గడగడ వణికించిన ఉగ్రవాద సంస్థ కాస్తా నిర్వీర్యమైపోయింది.

ప్రత్యేక దేశం కోసం పంజాబ్‌లో మొదలైన 'ఖలిస్తాన్' ఉగ్రవాదం 1980లో పతాక స్థాయికి చేరిన విషయం అందరికీ తెలిసిందే. 1984లో స్వర్ణ దేవాలయం నుంచి ఉగ్రవాదులను ఏరివేసే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ బ్లూస్టార్', ఆ తరువాత 1988లో చేపట్టిన మరో మిలిటరీ చర్య 'ఆపరేషన్ బ్లాక్ థండర్' ఖలిస్తానీ ఉగ్రవాద సంస్థను నిర్మూలించాయి.



ఈ మధ్యే సిరియాలో అధికార మార్పిడి జరిగింది. అధ్యక్షుడు బషర్ అల్ అసద్ దేశం విడిచి రష్యాకు పారిపోయాడు. బషర్ వైరి పక్షాలకు అమెరికా, ఇజ్రాయెల్‌లు పరోక్ష మద్దతునివ్వడం వల్లనే ఇది సాధ్యమైంది. ఈ రెండు దేశాలూ కొన్ని గ్రూపులకు ప్రత్యక్షంగా మరి కొన్నింటికి పరోక్షంగా సాయం చేశాయి. అయితే బషర్ అల్–అసద్ పాలన అంతమై పోవడం కాస్తా ఆ ప్రాంతంలో ఇరాన్ ప్రాభవం తగ్గేందుకు కారణమైంది. ఉగ్రవాద భూతాన్ని ఎదుర్కొనేందుకు బహుముఖ వ్యూహం అవసరం అనేందుకు ఇజ్రాయెల్ కోవర్టు ఆపరేషన్లు ఒక నిదర్శనం. ఉగ్రవాదాన్ని అణచివేసే మార్గాల్లో కీలకమైంది చర్చలు. ఉత్తర ఐర్లాండ్‌లో 'గుడ్‌ఫ్రైడే అగ్రిమెంట్' కావచ్చు, అఫ్గానిస్తాన్‌లోని ఇటీవలి పరిణామాలు కావచ్చు... ఉగ్రవాద సంస్థలను ప్రభుత్వ పాత్రల్లోకి మార్చే క్రమంలో వచ్చే సంక్లిష్టతలు, సమస్యలకు దర్పణం పడతాయి. అయితే సందర్భాన్ని బట్టి చేపట్టే చర్చల వ్యూహాలు, ప్రణాళికలు వాటి అమలు వంటివి జయాపజయాలను నిర్ణయిస్తూ ఉంటాయి.

ఉగ్రవాద సంస్థల లోపల ఉన్న వైరుధ్యాలను గుర్తించడం, ప్రజల మద్దతు లేకుండా చేయడం వంటివి సంస్థలను విడదీసేందుకు బాగా ఉపయోగపడతాయి. ఉగ్రవాద సమస్యను ఎదుర్కొనేవారు... ఈ అంతర్గత వైరుధ్యాలకు ఆజ్యం పోయగలవారై ఉండాలి. మత విశ్వాసాలే ఇంధనంగా మనుగడ సాగించే ఉగ్ర సంస్థలను కేవలం మిలిటరీ, కౌంటర్ టెర్రరిస్ట్ చర్యలతో సమూలంగా నాశనం చేయలేం. చర్చలు జరపడం, వాటి డిమాండ్లు న్యాయబద్ధమైనవైతే అంగీకరించడం, అది వీలుకాని సందర్భంలో వాటిలో చీలికలు తీసుకువచ్చి బలహీన పర్చడం చేయొచ్చు.

డా॥ క్రోనిన్ పరిశోధన ప్రకారం... ఉగ్రవాద సంస్థల జీవిత కాలం ఐదు నుంచి పదేళ్లు మాత్రమే. కొన్ని ఇంతకంటే ఎక్కువ కాలం ఉనికిలో ఉండవచ్చు. విధాన రూపకర్తలు ఉగ్రవాద సంస్థల విషయంలో దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించుకోవడం మేలని ఆమె సూచిస్తున్నారు. సైబర్ టెర్రరిజమ్, దేశాలు ప్రేరేపించే ఉగ్రవాదాల వంటి సంక్లిష్ట అంశాల విషయంలో దీని ప్రాధాన్యం మరింత ఎక్కువ.

ఉగ్రవాద సమస్యను ఎదుర్కొంటున్న దేశాలకు డా॥ క్రోనిన్ పరిశోధన ఒక దిక్సూచిలా పనిచేస్తుంది. స్థూలంగా చెప్పాలంటే... ఓపిక, పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవాల్సిన అవసరం, సమస్యను సమగ్రంగా అర్థం చేసుకోవడం కౌంటర్ టెర్రరిజమ్ వ్యూహాల రూపకల్పనలో చాలా కీలకమని ఈ పరిశోధన చెబుతుంది. విధాన రూపకర్తలు ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఆధునిక రూపం సంతరించుకున్న ఉగ్రవాద భూతానికి పగ్గాలు వేసేందుకు సమర్థమైన చర్యలు చేపట్టాలి. భారీ నెట్‌వర్క్‌లు ఉన్న వాటితోపాటు... వ్యక్తులు కూడా ఉగ్రవాదానికి పాల్పడుతున్న ఈ కాలంలో క్రోనిన్ పరిశోధన ఉగ్రవాదాన్ని పునాదులతోపాటు పెకిలించే వ్యూహానికి విలువైన సూచనలు ఇస్తోంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

వివేకం ముఖ్యం!

'యద్య దాచరతి శ్రేష్ఠః తత్త దేవేతరో జనః' అనేది భగవద్గీతలోని కర్మయోగంలో 21వ శ్లోకం. శ్రేష్ఠుడైన పురుషుని ఆచరణాన్నే ఇతరులు అనుసరిస్తారు. అతడు ప్రతిష్ఠించిన ప్రమాణాలనే లోకులందరూ పాటిస్తారనేది ఆ శ్లోకానికున్న అర్థం. మనం ఎవరినైతే గొప్పవారిగా భావిస్తామో వారు చేసినట్లే చేయాలనుకొని జీవిస్తాం. అయితే కొన్ని సమయాల్లో వివేకాన్ని, విచక్షణను వినియోగించాల్సి ఉంటుంది.

పరశురాముడు అవతారపురుషుడు. తన తండ్రి ఆజ్ఞను శిరసా వహించి తన తల్లి తలను ఖండించాడు.



జ్యోతిర్మయం

మరి అలాంటి సందర్భంలో మనమూ ఆయనలాగే చేయవచ్చా? తల్లిని మళ్ళీ బతికించగల శక్తి తన తండ్రికుందని తెలిసి పరశురాముడలా చేశాడని మనం మరచిపోరాదు. మేధాతిథి అని ఒక ముని ఉండేవాడు. ఆయనకు ఒకసారి తన భార్యపై కోపం వచ్చి ఆమెను చంపెయ్యమని తన కొడుకు చిరకారికి చెప్పి వెళ్ళిపోయాడు. కానీ చిరకారి ప్రతి పని, ఆలోచించి చేసేవాడు. కన్నతల్లికి మించిన దైవం లేదు కదా, మరి తండ్రి ఆజ్ఞను పాటించటం ఎలా అని యోచన చేస్తూ కొంత కాలం గడిపాడు. అంతలోనే కోపావేశం తగ్గిన మేధాతిథి 'అయ్యో! ఎంతపని జరిగింది! తల్లిని చంపమని తనయునికే ఆజ్ఞ ఇచ్చాను కదా! అలా జరుగరాదు' అని వెంటనే వేగంగా వెను తిరిగివచ్చి సజీవంగా ఉన్న భార్యను చూసి ఆనందపడ్డాడు. వివేకాన్ని వినియోగించి పాపకృత్యాన్ని చేయటాన్ని కొంత కాలం పాటు వాయిదా వేసిన తన పుత్రుడినీ అభినందించాడు. (పుట 33 – 'శ్రీరామకృష్ణ ప్రభ – మే 2012).

ఈనాడు జీవిస్తున్న సర్వ సాధారణ మనుషులమైన మనకు ఒకరిని చంపటం సాధ్యమే కానీ తిరిగి వానిని బతికించటం అసాధ్యం. కాబట్టి మెదడుని వినియోగించిన చిరకారిని ఆదర్శంగా తీసుకోవాలి. అలాంటి వివేకం, విచక్షణ మనల్ని క్రమంగా అసత్యం నుంచి సత్యానికి, అనిత్యం నుంచి నిత్యానికి నడిపిస్తాయి. ఆధ్యాత్మిక అభివృద్ధికి దోహదపడతాయి. మన శాస్త్రాల, ఇతిహాస పురాణాల లక్ష్యం ఇదే!

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం: శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: పౌర్ణమి రా.7.07 వరకు, తదుపరి బహుళ పాడ్యమి , నక్షత్రం: ఆశ్లేష రా.7.37 వరకు, తదుపరి మఖ, వర్జ్యం: ఉ.8.06 నుండి 9.42 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.54 నుండి 12.42 వరకు, అమృతఘడియలు: సా.6.01 నుండి 7.38 వరకు, మాఘపూర్ణిమ; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.33, సూర్యాస్తమయం: 5.56.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

జేఈఈ మెయిన్‌లో నారాయణ ఆల్‌టైమ్ రికార్డ్

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్–2025 తొలి విడత ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థ సత్తాచాటింది. 300 మార్కులకు గాను 300 మార్కులతో 100 పర్సంటైల్ సాధించి తమ విద్యార్థి బని బ్రాత మజీ రికార్డు సృష్టించాడని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 14 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించగా వారిలో ఐదుగురు నారాయణ విద్యార్థులున్నారని వెల్లడించారు. ఆన్‌లైన్ ఎగ్జామ్స్ కోసం ప్రత్యేకంగా రూపుదిద్దిన ఎన్–లెర్న్ యాప్ ద్వారానే ఈ విజయం సాధ్యమైందన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

శ్రీచైతన్య సంచలనం

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్ తొలి విడత ఫలితాల్లో శ్రీచైతన్య సంచలన ఫలితాలు సాధించింది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో అత్యధికంగా తమ విద్యాసంస్థకు చెందిన 42 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 8 మంది విద్యార్థులు మల్టిపుల్ సబ్జెక్టుల్లో 100 పర్సంటైల్‌తో సత్తాచాటారన్నారు. మైక్రో షెడ్యూల్స్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ర్యాంకింగ్ సిస్టమ్, ఇన్ఫినిటీ లెర్న్ ఆన్‌లైన్ యాప్ ద్వారా ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని వెల్లడించారు.

ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. వల్లాల నాగసిద్ధార్థ ఫిజిక్స్‌లో 100 పర్సంటైల్‌తో 99.97 శాతం సాధించి ఎస్ఆర్ కీర్తిని జాతీయస్థాయిలో నిలబెట్టారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిపత్రి తేజస్ ఉద్భవ్‌రెడ్డి 99.83 శాతం పర్సంటైల్, ఎం.రాజవర్షిత్‌రెడ్డి 99.81 శాతం పర్సంటైల్, దిడ్డి ప్రజ్వల్‌కుమార్ 99.77 శాతం పర్సంటైల్ సాధించారని వెల్లడించారు. అలాగే యాద భరణి శంకర్ 99.77 శాతం, చల్లా అన్సికా 99.66 శాతం, మేడ కార్తీక్ 99.66 శాతం, జోగు అభిరామ్ 99.60 శాతం, కడారి సంజయ్ 99.58 శాతం, చిన్ని కమలావర్దన్ 99.58 శాతం సాధించినట్లు వెల్లడించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను వారు అభినందించారు.

ఐపీఏ రాష్ట్ర అధ్యక్షునిగా డాక్టర్ శివకుమార్ తేజావత్



సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): నగరానికి చెందిన డాక్టర్ శివకుమార్ తేజావత్ నాలుగోసారి ఇండియన్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ (ఐపీఏ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఢిల్లీ నుండి జాతీయ జనరల్ సెక్రటరీ భూపేంద్ర కుమార్, జాతీయ అధ్యక్షుడు అభయ్ కుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్ తేజావత్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో డాక్టర్ ఆఫ్ ఫార్మసీ, ఫార్మసీ విద్యార్థులు, ఫార్మసిస్ట్‌ల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

ఈసారి ఇద్దరే!

జేఈఈలో తెలుగు విద్యార్థుల వెనుకంజ

- గత ఏడాది టాప్ 14లో ఏడుగురు తెలుగువారు
- ఈ సంవత్సరం మొదటి సెషన్‌లో ఇద్దరికే చోటు
- 12వ స్థానంలో సాయి మనోజ్ఞ, బని బ్రాత మజీకి 14వ స్థానం
- తొలి సెషన్ ఫలితాలు వెల్లడించిన ఎన్‌టీఏ
- రాజస్తాన్ విద్యార్థి ఆయూష్‌కు నేషనల్ మొదటి ర్యాంకు



సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్)–2025 తొలి సెషన్ పరీక్షలో రాజస్తాన్‌కు చెందిన ఆయూస్ సింఘాల్ జాతీయ స్థాయిలో తొలి స్థానంలో నిలిచాడు. ఈ పరీక్షలో ఈసారి తెలుగు విద్యార్థులు పూర్తిగా వెనుకబడ్డారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో జాతీయ స్థాయిలో తొలి 14 స్థానాల్లో ఇద్దరు తెలుగు విద్యార్థులు మాత్రమే స్థానం సంపాదించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సాయి మనోజ్ఞ గుత్తికొండ 12వ స్థానంలో నిలవగా, తెలంగాణకు చెందిన బని బ్రాత మజీకి 14వ స్థానం దక్కింది. గత ఏడాది జేఈఈ మెయిన్‌లో తొలి 14 స్థానాల్లో 5, 6, 7, 8, 12, 13, 14 ర్యాంకులు తెలుగు విద్యార్థులు కైవసం చేసుకున్నారు. జేఈఈ మెయిన్–2025 తొలి సెషన్ పరీక్షలో కర్ణాటకకు చెందిన కుషాగ్రా గుప్తా ద్వితీయ స్థానం, ఢిల్లీకి చెందిన దక్ష, హరీస్ ఝా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచారు. మొదటి 14 ర్యాంకుల్లో ఎక్కువగా రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్ విద్యార్థులే ఉన్నారు.

ఇద్దరు తెలుగువారికే వంద పర్సంటైల్

ఈసారి జేఈఈ మెయిన్‌లో ఇద్దరు తెలుగు విద్యార్థులు మాత్రమే వంద పర్సంటైల్ సాధించారు. 99 స్కోర్ జాబితాలో తెలుగు పేర్లే లేవు. జనవరి 22 నుంచి 28 వరకు జేఈఈ మెయిన్ -2025 తొలి సెషన్ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షకు 13,11,544 మంది రిజిస్టర్ చేసుకోగా, 12,58,136 (95.93 శాతం) మంది పరీక్ష రాశారు. జనరల్ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ 99 స్కోర్‌తో టాపర్‌గా నిలిచారు. మహిళా విభాగంలో సాయి మనోజ్ఞ గుత్తికొండ టాపర్‌గా నిలిచారు. ఏప్రిల్‌లో జేఈఈ మెయిన్స్ రెండో సెషన్ జరుగుతాయి. రెండు విభాగాలను ప్రామాణికంగా తీసుకుని తుది ర్యాంకులు ప్రకటిస్తారు.

కేటగిరీలవారీగా పరీక్ష రాసిన వారు

కేటగిరీ	జనరల్	ఈడబ్ల్యూఎస్	ఎస్సీ	ఎస్టీ	ఓబీసీ	మొత్తం
మహిళలు	1,59,378	44,762	40,282	12,965	1,67,42	4,24,810
పురుషులు	3,06,980	93,937	82,563	26,994	3,22,85	8,33,325
ట్రాన్స్‌జెండర్					1	1
మొత్తం	4,66,358	1,38,699	1,22,845	39,959	4,90,275	12,58,136

వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థులు

విద్యార్థి	రాష్ట్రం	కేటగిరీ
ఆయూష్ సింఘాల్	రాజస్తాన్	జనరల్+ ఓవరాల్
సాయి మనోజ్ఞ గుత్తికొండ	ఏపీ	మహిళ
కోటిపల్లి యశ్వంత్ సాత్విక్	ఏపీ	జనరల్– ఈడబ్ల్యూఎస్
దక్ష	ఢిల్లీ	ఓబీసీ
శ్రేయాస్ లోహ్యా	ఉత్తరప్రదేశ్	ఎస్సీ
పరత్ షెప్రో	రాజస్తాన్	ఎస్టీ

పురపాలక సంఘం నార్సింగి, రంగారెడ్డి జిల్లా

నోటీసు నెం.ఇ1/15/2025 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు** తేది:11-02-2025

కమిషనర్ పురపాలక సంఘం నార్సింగి, రంగారెడ్డి జిల్లా ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా రూ.215.00 లక్షల (07) పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతుంది. టెండరుదారులు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in నుండి టెండర్ షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు తదుపరి వివరాలను పొందవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 20-02-2025 ఉ.11:00 గం. వరకు.

సం/- కమిషనర్, నార్సింగి మున్సిపాలిటీ

DIPR RO No.10163-PP/CL/Advt/1/2024-25, Dt:11-02-2025

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, O&M సర్కిల్ నం. V, సైనిక్‌పురి, సికింద్రాబాద్ -94, తెలంగాణ.

ఇ-టెండరు ప్రకటన
ఇ-టెండరు ప్రకటన నం. & తేది

265-272/CGM(E)/O&MC-V/O&M Divn-X/2024-25, తేది: 11.02.2025

పని పేరు: O&M సర్కిల్-V పరిధిలోని O&M Divn-Xలో ఒక సంవత్సర కాలానికి రెగ్యులర్ నిర్వహణలో భాగంగా రోజువారీ ఫిర్యాదులకు తగువిధంగా హాజరగుతూ త్రాగునీటి సరఫరా వ్యవస్థ యొక్క ఆపరేషన్ మరియు నిర్వహణ కొరకు వార్షిక నిర్వహణ పనులు అనగా CI/DI/RCC W/s పైప్‌లైన్లలో లీకేజీలు / చోకేజీలు అరికట్టుట, కాలుష్య పనులు, స్వల్ప పునస్థాపన, పాడైన స్లూయిస్ వాల్వ్‌లు మరియు స్పేర్స్ మొ॥ వాటి పునః స్థాపన.

అంచనా కాంట్రాక్టు విలువ: రూ.21.87 లక్షలు నుండి రూ.42.45 లక్షలు

(1) టెండరు డాక్యుమెంట్ ఆన్‌లైన్‌లో తేది 11.02.2025న సా.5.00 గం. నుండి లభిస్తుంది మరియు టెండర్ల స్వీకరణకు చివరి తేది 18.02.2025. (2) సంబంధిత చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) పేరు మరియు చిరునామా - చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్-V, HMWSSB, సైనిక్‌పురి, సికింద్రాబాద్ - 500094. (3) కాంట్రాక్టర్లు/ సంస్థలు సమాచారమును ముఖ్యంగా "ZIP" ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయవలసిందిగా కోరబడుచున్నారు. (4) తదుపరి వివరాలను https://tender.telangana.gov.in లో చూడవచ్చును.

సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్ నం. V, సైనిక్‌పురి, సికింద్రాబాద్, తెలంగాణ.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, O&M సర్కిల్-II, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్-38, తెలంగాణ.

ఇ-టెండరు ప్రకటన

ఇ-టెండరు ప్రకటన నం. మరియు తేదీ	పనిపేరు	అంచనా కాంట్రాక్ట్ విలువ (మొత్తం (రేట్)
285 to 293/ CGM(E)/ O&MC.II/ D4-AMS Works/2024-25 Date: 07.02.2025.	O&M డివిజన్-IVలోని వివిధ సెక్షన్ల క్రింద (1) సంవత్సర కాలానికి త్రాగునీటి సరఫరా వ్యవస్థ యొక్క వార్షిక నిర్వహణ పని అనగా 150/200/250/300mm dia పైపులలో తగువిధంగా త్రాగునీటి లీకేజీలను అరికట్టుట, త్రాగునీటి సరఫరా లైన్లలో కాలుష్యాన్ని నివారించడం, చోకేజీలు / బ్లాకేజీలు తొలగించడం, పాడైన పైపుల పునస్థాపన మరియు స్లూయిస్ వాల్వ్‌ల యొక్క మరమ్మతు & పునస్థాపన మరియు సులభతర వ్యవస్థ పనితీరుకు వివిధ త్రాగునీటి సరఫరా ఇబ్బందుల వినతులను పరిష్కరించడం.	రూ.12.42 నుండి రూ.22.62 లక్షలు

(1) టెండరు డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో తేది 11.02.2025న రా.7.00 గం. నుండి లభిస్తాయి మరియు టెండర్ల స్వీకరణకు చివరి తేది 19.02.2025న మ.3.30 గం. వరకు. (2) సంబంధిత చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) పేరు మరియు చిరునామా-చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్-II, HMWSSB, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్-38. (3) కాంట్రాక్టర్లు/సంస్థలు సమాచారమును ముఖ్యంగా "ZIP" ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయవలసిందిగా కోరబడుచున్నారు. (4) తదుపరి వివరాలను http://www.eprocurement.gov.inలో చూడవచ్చును.

సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్- II, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్-500038, తెలంగాణ.

తెలంగాణ ప్రభుత్వం
ఆర్థిక (డి.సి.యం) శాఖ

పత్రికా అధికార వార్త తేది: 11.02.2025

తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ నోటిఫికేషన్ నెం.08(ఎల్)/ఎ2/డి.సి.యం/2015, తేది: 05.03.2015 ప్రకారం జారీ అయిన **8.12% శాతం తెలంగాణ యస్.డి.ఎల్ 2025 ను తేది: 10.03.2025** వరకు అయిన వడ్డీతో 11.03.2025న తిరిగి చెల్లించడమవుతుందని సమాచారం ప్రకటించడమయింది **(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ తర్వాత తెలంగాణకు వర్తిస్తుంది).** ఒకవేళ, ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం, పైన పేర్కొన్న సదరు తేదీని నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం 1881, క్రింద సెలవు దినంగా ప్రకటించిన పక్షంలో, రుణాన్ని ఆ రోజుకు ముందు పనిరోజున, రాష్ట్రంలోని చెల్లింపు కార్యాలయాలు చెల్లిస్తాయి. **11.03.2025 తేది నుండి, ఆపైన రుణంపై ఎటువంటి వడ్డీ ఉండదు.**

2. 2007, ప్రభుత్వ అన్యాక్రాంత హామీ పత్రచట్టం రక్షణ నిబంధనలలోని 24(2), 24(3) ఉప నిబంధన ప్రకారం, సబ్సిడరీ జనరల్ లెడ్జర్ లేదా కానిస్టిట్యూట్ సబ్సిడరీ జనరల్ లెడ్జర్ అకౌంట్ లేదా స్టాక్ సర్టిఫికేట్ రూపంలో ప్రభుత్వ సెక్యూరిటీని కలిగివున్న రిజిస్టర్డు హోల్డరుకు పరిపక్వ మొత్తాల చెల్లింపును అతని బ్యాంకు సంబంధ వివరాలను చేర్చుతూ పే ఆర్డరు ద్వారా లేదా ఎలక్ట్రానిక్ విధానం ద్వారా నిధులను అందుకొనే సదుపాయం కలిగివున్న ఏదేని బ్యాంక్‌లో అకౌంటు హోల్డరు ఖాతాకు జమచేయడం ద్వారా గాని చేయాలి. సెక్యూరిటీలకు సంబంధించి చెల్లింపు చేసే కార్యం కోసం అర్హ ప్రభుత్వ సెక్యూరిటీల ఒరిజినల్ సబ్‌స్క్రైబరు లేదా తరువాతి హోల్డర్లు ఆయా సందర్భాన్నిబట్టి వడ్డీ చెల్లింపు కోసం వారి బ్యాంకు ఖాతా వివరాల కోసం సంబంధించిన వారు వ్రాయించుకున్న/నమోదు చేసుకున్న బ్యాంకు లేదా ట్రెజరీ/సబ్-ట్రెజరీ లేదా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి లేదా దాని అనుబంధ బ్యాంకులకు ఆయా సందర్భాన్ని బట్టి సమర్పించాలి.

3. ఏమైనప్పటికీ బ్యాంకు ఖాతా సంబంధ వివరాలు లేనప్పుడు ఎలక్ట్రానిక్ విధానం ద్వారా నిధులను తీసుకోవడం తప్పనిసరి కానప్పుడు **8.12% శాతం తెలంగాణ యస్.డి.ఎల్ 2025** హోల్డర్లకు గడువు తేదీన తిరిగి చెల్లింపును చేయడానికి గాను, వారి సెక్యూరిటీలను పబ్లిక్ ఋణ కార్యాలయంలో 20 రోజుల ముందుగా అందజేయాలి. సెక్యూరిటీల వెనుక వైపున ఈ క్రింది విధంగా వ్రాసి తిరిగి చెల్లింపు కోసం సెక్యూరిటీలను సమర్పించాలి.


"ప్రామిసరీ పత్రాలపై రావలసిన అసలు మొత్తం అందింది."

4. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి లేదా దానికి చెందిన ఏవైనా అనుబంధ బ్యాంకులు ట్రెజరీ పనిని నిర్వహించే చోట్ల, సెక్యూరిటీలు స్టాకు సర్టిఫికేట్ల రూపంలో ఉన్నట్లయితే, వాటిని సంబంధిత బ్యాంకు బ్రాంచిలో సమర్పించాలి. ట్రెజరీలో లేదా సబ్-ట్రెజరీలో కాదని ముఖ్యంగా గమనించాలి.

5. చెల్లింపు కోసం సెక్యూరిటీలను వ్రాయించుకున్న చోట కాకుండా ఇతర చోట్ల చెల్లింపు తీసుకోవాలని కోరుకొనేవారు వాటి వెనుక వైపు వ్రాసి, రిజిస్టరు చేసిన, బీమా చేసిన పోస్టు ద్వారా సంబంధిత ప్రజారుణం కార్యాలయానికి వాటిని పంపించాలి. ప్రజారుణ కార్యాలయం ఏదైనా ట్రెజరీ/సబ్-ట్రెజరీ లేదా **తెలంగాణ రాష్ట్రంలో** ప్రభుత్వ ట్రెజరీ పనిని నిర్వహించే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి లేదా దాని అనుబంధ బ్యాంకులలో చెల్లించదగే డ్రాఫ్టును జారీ చేయడం ద్వారా చెల్లింపులు చేస్తుంది.

కె. రామకృష్ణారావు
ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ

DIPR RO No.507-DP/CL/Advt/1/2024-25, Dt:11-02-2025



శనివారం డెడ్‌లైన్

బందీలను వదలకుంటే మీ పనిపడతా

హమాస్‌కు ట్రంప్ అల్టిమేటం



వాషింగ్టన్: గాజా స్ట్రిప్‌లో బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలు, ఇతర దేశస్తులను శనివారం మధ్యాహ్నం 12 గంటలకల్లా విడుదల చేయకపోతే హమాస్ అంతుచూస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా షెడ్యూల్ ప్రకారం సమయానికి బందీలను విడుదల చేసి తీరాల్సిందేనని ట్రంప్ స్పష్టం చేశారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోందని, అందుకు ప్రతిగా బందీల విడుదల ప్రక్రియ ఆలస్యం కావొచ్చని హమాస్ ప్రకటించిన నేపథ్యంలో ట్రంప్ తీవ్రస్థాయిలో స్పందించారు. వైట్‌హౌస్‌లోని ఓవల్ కార్యాలయంలో మీడియాతో ట్రంప్ మాట్లాడారు. ''ఒకటి, మూడు, నాలుగు, రెండు ఇలా కాదు.. మొత్తం బందీలందరినీ విడుదల చేయాలి. శనివారం మధ్యాహ్నం 12 గంటలకల్లా బందీలు అందరూ విడుదలై మా చెంతకు చేరాలి. లేదంటే హమాస్‌కు నరకం అంటే ఏంటో చూపిస్తాం. కాల్పుల విరమణ ఒప్పందం రద్దుచేయాలని ఇజ్రాయెల్‌ను ఆదేశిస్తా'' అని అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం రద్దుకు ఇజ్రాయెల్ ఒప్పుకుంటుందా? అని మీడియా ప్రశ్నించగా.. '' అది వాళ్ల ఇష్టం. నా వరకైతే బందీలను విడుదల చేయకుంటే వాళ్ల పనిపడతా. ఇక కాల్పుల విరమణ అంశంలో వాళ్ల కోణంలో తుది నిర్ణయం ఇజ్రాయెల్‌దే. బందీలను విడుదలచేయకపోతే నా మాటల్లోని తీవ్రత ఎంత అనేది హమాస్‌కు తెలిసేలా చేస్తా'' అని అన్నారు.

ఆలస్యంపై ఇజ్రాయెల్ ఆగ్రహం

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నందుకే బందీలను ఆలస్యంగా వదిలేస్తామన్న హమాస్ ప్రకటనను ఇజ్రాయెల్ తీవ్రంగా తప్పుబట్టింది. ఒప్పందాన్ని ఉల్లంఘించింది హమాసేనని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ అన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భద్రతా కేబినెట్‌తో సమావేశమయ్యారు. శనివారం మధ్యాహ్నానికల్లా బందీలను వదిలేయకుంటే కాల్పుల విరమణ ఒప్పందాన్ని రద్దు చేస్తామంటూ హమాస్‌కు అల్టిమేటమిచ్చారు. మరోవైపు బందీల విడుదల నిలిపివేత ప్రకటన నేపథ్యంలో వారి కుటుంబాలు, మద్దతుదారులు టెల్ అవీవ్ లో ఆందోళనకు దిగారు. ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించిన ఈజిప్సు ఈ పరిణామంపై ఆందోళన వ్యక్తం చేసింది. 42 రోజుల ఒప్పందంలో మొదటి దశలో విడుదల కానున్న 33 మంది బందీల్లో 16 మంది స్వదేశానికి తిరిగి వచ్చారు. ఐదుగురు థాయ్ బందీలను కూడా అనధికారికంగా విడుదల చేశారు.

సరిహద్దులో పేలుడు

ఆర్మీ కెప్టెన్, నాయక్ వీరమరణం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో సరిహద్దులో వాస్తవాధీన రేఖ వెంబడి అఖ్నూర్ సెక్టార్‌లో మంగళవారం మధ్యాహ్నం శక్తివంతమైన బాంబు పేలిన ఘటనలో ఇద్దరు ఆర్మీ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. జమ్మూ ప్రాంతంలో గత నాలుగురోజుల్లో సరిహద్దు ప్రాంతాల్లో ఉగ్రవాదులు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడటం ఇది మూడోసారి. భట్టాల్ ప్రాంతంలోని లలియాలీ వద్ద సైనిక సిబ్బంది కంచె వద్ద గస్తీ కాస్తున్న సమయంలో ఐఈడీ పేలింది. ఈ ఘటనలో గాయపడిన వారిని దగ్గర్లోని ఆస్పత్రికి చేర్పించగా ఆర్మీ కెప్టెన్ కరమ్‌జీత్ సింగ్ భక్షి, నాయక్ ముకేశ్ అప్పటికే ప్రాణాలు కోల్పోయారని సైన్యంలోని నార్తర్న్ కమాండ్ తర్వాత ఒక ప్రకటనలో తెలిపింది. వీరమరణం పొందిన సిబ్బందికి ఘన నివాళులర్పించింది. గాయపడిన మరో జవానుకు ప్రాణాపాయం తప్పింది. ఐఈడీ పేలుడుతో ఘటనాస్థలి వెంబడి సరిహద్దు వెంట గాలింపు ముమ్మరం చేశారు. సోమవారం సైతం సరిహద్దు వద్ద ఇలాంటి ఘటన జరిగింది. రాజౌరీ జిల్లాలోని నౌషెరా సెక్టార్‌లో కలాల్ ప్రాంతంలో పహారా కాస్తున్న జవానును సరిహద్దు ఆవలి వైపు ఎవరో బుల్లెట్‌తో కాల్చారు. ఫిబ్రవరి 8వ తేదీన రాజౌరీలోని కేరీ సెక్టార్‌లో ఆర్మీ గస్తీ బృందంపై ఉగ్రవాదులు దట్టమైన అటవీప్రాంతం నుంచి కాల్పులు జరిపారు. సైన్యం కాల్పులు జరపడంతో వాళ్లంతా పరారయ్యారు.

శిఖరాగ్రం సాక్షిగా ఏఐ విభేదాలు

అమెరికా, చైనా, యూరప్ ఎవరికి వారే!

- తీర్మానానికి దూరంగా అగ్రరాజ్యం
- సంతకం చేసి షాకిచ్చిన చైనా
- మితిమీరిన నియంత్రణ వద్దు: వాన్స్
- ప్రజల నమ్మకమే కీలకం: ఈసీ చీఫ్
- నేతల మాటల యుద్ధం



మంగళవారం పారిస్‌లో ఏఐ కార్యాచరణ శిఖరాగ్ర సదస్సు వేదికపై ప్రధాని మోదీతో పాటు పలు దేశాల అధినేతలు, అగ్ర నేతలు

పారిస్: పెద్దన్నల పోట్లాటకు ఏఐ అంతర్జాతీయ శిఖరాగ్రం వేదికైంది. అతి కీలకమైన కృత్రిమ మేధ రంగానికి సంబంధించి వాటి మధ్య నెలకొన్న ప్రచ్ఛన్న యుద్ధతీవ్రతకు అద్దం పట్టింది. ఏఐలో తిరుగులేని శక్తిగా మారిన అమెరికా, దాన్ని ఢీకొట్టే దిశగా శరవేగంగా అడుగులు వేస్తున్న చైనా, ఆ రెండింటికీ దీటుగా ఎదగాలని ఉవ్విళ్లూరుతున్న యూరప్ మధ్య విభేదాలు సదస్సు సాక్షిగా బయట పడ్డాయి. నిబంధనల పరిమితుల్లేకుండా సరికొత్త ఇన్నోవేషన్లు తదితరాలతో ఏఐ విషయంలో దూకుడుగా వెళ్లనున్నట్టు అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుండబద్దలు కొట్టడం తెలిసిందే. చైనా కూడా ప్రభుత్వ దన్నుతో కూడిన టెక్ దిగ్గజాల చురుకైన భాగస్వామ్యంతో ఏఐ రంగంలో అంతర్జాతీయంగా పైచేయి సాధించే ప్రయత్నంలో పడింది. యూరప్ మాత్రం ఓవైపు ఏఐ వాడకం విషయంలో వ్యక్తుల భద్రతకు, జవాబుదారీతనానికే పెద్దపీట వేస్తూనే మరోవైపు అమెరికా, చైనాలకు దీటుగా మూడో శక్తిగా ఎదిగేందుకు పథక రచన చేస్తోంది. అందులో భాగంగా ఏఐ నిబంధనలను పలు యూరప్ దేశాలు నానాటికీ మరింత కఠినతరం చేస్తూ వస్తున్నాయి. దీనిపై తమ తీవ్ర అసంతృప్తిని పారిస్‌లో జరుగుతున్న ఏఐ కార్యాచరణ శిఖరాగ్ర సదస్సులో సోమవారం రెండో రోజు అమెరికా బాహాటంగానే వెళ్లగక్కింది. కృత్రిమ మేధపై మితిమీరిన నియంత్రణ మంచిది కాదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుండబద్దలు కొట్టారు. శరవేగంగా సాగుతున్న ఏఐ ప్రగతి ప్రస్థానానికి అది తీరని అడ్డంకిగా మారవచ్చని హెచ్చరించారు. ఏఐ తాలూకు దుష్పరిణామాలు, రిస్కులకు అడ్డుకట్ట వేసేందుకు యూరప్ దేశాలు చేస్తున్న ప్రయత్నాలను ఆయన పరోక్షంగా ఆక్షేపించారు. ట్రంప్ రాకతో ఏఐ విషయంలో సమూలంగా మారిన అమెరికా వైఖరిని ప్రతిఫలించేలా వాన్స్ ప్రసంగం సాగింది. అనంతరం యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాండెర్ లెయన్ మాట్లాడుతూ వాన్స్ ఆరోపణలను తోసిపుచ్చారు. ఏఐ వాడకం అన్ని విధాలా సురక్షితమేనని ప్రజల్లో నమ్మకం కలగడం అన్నింటికంటే కీలకమని స్పష్టం చేశారు. దాన్ని సాధించడమే ఏఐపై ఈయూ నిబంధనల ఏకైక లక్ష్యమని ఆమె వివరించారు. ఏఐ రంగానికి అంతర్జాతీయ స్థాయిలో నిర్దిష్ట నియమ నిబంధనలు తప్పనిసరి అని శిఖరాగ్రం ఏర్పాటుకు చొరవ తీసుకున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కూడా స్పష్టం చేశారు. ఏఐ రేసులో మూడో శక్తిగా యూరప్ శరవేగంగా ఎదుగుతోందని ఆయన ప్రకటించారు. ఏఐ ఇన్నోవేషన్ల ఫలాలు అంతిమంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరికీ సమానంగా అందాలని తన ముగింపు ప్రసంగంలో ఆకాంక్షించారు. ఏఐ రంగంపై యూరప్ నియంత్రణలను చైనా కూడా వ్యతిరేకించింది. అంతర్జాతీయ ఏఐ ప్రమాణాలనే సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లడం తమ లక్ష్యమని చైనా ఉప ప్రధాని జాంగ్ గువోకింగ్ పేర్కొన్నారు.

మా కంపెనీలపై మతిలేని నియంత్రణలు: వాన్స్

ఏఐని ఆవిరి యంత్రం ఆవిష్కరణకు దీటైన సరికొత్త పారిశ్రామిక విప్లవంగా అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ అభివర్ణించారు. ప్రపంచ ఆర్థిక ప్రస్థానానికే ఏఐ మేలిమలుపు కాగలదన్నారు. దాన్ని నిబంధనల ఛట్రంలో బిగించి ప్రగతి నిరోధకులుగా మారొద్దని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. అమెరికాలో రూపొందే ఏఐ వ్యవస్థలన్నీ సైద్ధాంతిక, ఇతరత్రా వివక్షలకు తావులేని రీతిలో ఉంటాయని స్పష్టం చేశారు. అమెరికా పౌరుల వాక్ స్వాతంత్ర్యం తదితరాలకు తమ ప్రభుత్వం ఎప్పటికీ పరిమితులు విధించబోదన్నారు. అమెరికా టెక్నాలజీ సంస్థలపై పలు దేశాలు మతిలేని నియంత్రణలకు దిగుతున్నాయంటూ యూరోపియన్ యూనియన్ తీరును తప్పుబట్టారు. ఉపాధ్యక్ష హోదాలో అంతర్జాతీయ వేదికపై ఆయనకిది తొలి ప్రసంగం కావడం విశేషం

ఇదీ తీర్మానం

- ➔ డిజిటల్ అంతరాలను వీలైనంతగా తగ్గించడమే లక్ష్యం. ఆ ప్రయత్నాల్లో భాగంగా ఏఐని అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మరింతగా కృషి.
- ➔ ఏఐ టెక్నాలజీ పారదర్శకంగా, నైతిక సూత్రాలకు అనుగుణంగా, సురక్షితంగా, విశ్వసనీయంగా, అదే సమయంలో ఎలాంటి వివక్షకూ తావు లేకుండా అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం.
- ➔ ఏఐని ప్రజలకు, మొత్తంగా ప్రపంచానికి విశ్వసనీయ సుస్థిరాభివృద్ధి చోదక శక్తిగా తీర్చిదిద్దడం.
- ➔ మానవ హక్కులను, లింగ సమానత్వాన్ని, భాషాపరమైన వైవిధ్యాన్ని, మేధో సంపత్తి హక్కులను అన్ని విధాలా పరిరక్షించడం.

ముప్పుపై ఆందోళనలు

నానాటికీ పెరిగిపోతున్న ఏఐ వాడకంతో పలు కీలక రంగాల్లో తలెత్తగల ముప్పుపై శిఖరాగ్రంలో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా రక్షణ, యుద్ధతంత్రం తదితరాల్లో ఏఐ అంతిమంగా మానవ నియంత్రణ పరిధినే దాటిపోకుండా చూడాలని నాటో కమాండర్ అడ్మిరల్ పియరీ వాండి యర్ అన్నారు. లేదంటే చూస్తుండగానే వ్యవహారం చేయి దాటిపోవచ్చని హెచ్చరించారు. వక్తల్లో అత్యధికులు ఆయన వాదనతో ఏకీభవించారు.

'ఇన్వెస్ట్‌ఏఐ'కి 200 బిలియన్ డాలర్లు: ఈయూ

కృత్రిమ మేధ రంగంపై అత్యంత భారీగా పెట్టుబడుల దిశగా యూరప్ శరవేగంగా సాగుతోంది. ఇందుకు ఉద్దేశించిన 'ఇన్వెస్ట్‌ఏఐ' కార్యక్రమానికి యూరప్‌వ్యాప్తంగా ఇప్పటికే ఏకంగా 200 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సమకూరినట్టు కమిషన్ చీఫ్ ఉర్సులా వాండెర్ లెయన్ ప్రకటించారు.

మోదీ చెప్పింది అక్షరసత్యం

ప్రధానికి వాన్స్ అభినందనలు

కృత్రిమ మేధ మనిషికి ఏనాటికీ ప్రత్యామ్నాయం కాబోదన్న ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తున్నట్టు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు. పారిస్ ఏఐ శిఖరాగ్రంలో మోదీ మాట్లాడుతూ మానవ ఉత్పాదనను మరింతగా పెంచేందుకు, వారికి మరింత స్వేచ్ఛ అందించేందుకు సమర్థమైన పరికరంగా ఏఐ తోడ్పడుతుందని అభిప్రా యపడ్డారు. అనంతరం మాట్లాడిన వాన్స్ ప్రధా ని వ్యాఖ్యలను పూర్తిగా సమర్థించారు. ''మోదీ కీలకమైన అంశాలు లేవనెత్తారు. వాటిపై వాస్తవి క వైఖరిని చక్కగా, సమర్థంగా వెల్లడించారు. అందుకు ఆయనకు అభినందనలు'' అంటూ ప్రశంసించారు.



ఏఐ శిఖరాగ్రం సందర్భంగా మంగళవారం పారిస్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్, తెలుగు మూలాలున్న ఆయన సతీమణి ఉషతో ప్రధాని మోదీ

గోడ దూకడం కాంగ్రెస్ సంస్కృతి

అసంతృప్తి ఏమీలేదన్న భగవంత్ మాన్



న్యూఢిల్లీ: పంజాబ్ ఆమ్ ఆద్మీ పార్టీలో ఎలాంటి విభేదాలు, అసంతృప్తి లేదని ముఖ్యమంత్రి భగవంత్ మాన్ అన్నారు. పార్టీలు మారడం కాంగ్రెస్ సంస్కృతి అని విమర్శించారు. 30 మంది ఆప్ ఎమ్మెల్యేలు తమతో సంప్రదింపులు జరుపుతున్నారని పంజాబ్ కాంగ్రెస్ నాయకుడు ప్రతాప్‌సింగ్ బజ్వా చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కపుర్తలా హౌస్‌లో మంగళవారం ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పంజాబ్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, పరిస్థితిని సమీక్షించారు. ఈ భేటీ అనంతరం మాన్ విలేకరులతో మాట్లాడారు. 'కాంగ్రెస్ ఇతర పార్టీల గురించి మాట్లాడుతోంది. అయితే తమ పరిస్థితి ఏమిటనేది అసలు గమనంలోకి తీసుకోదు. నేను ప్రతాప్‌సింగ్ బజ్వాను అడుగుతున్నాను.. ఢిల్లీలో మీకెంత మంది ఎమ్మెల్యేలు ఉన్నారు?' అని ఎద్దేవా చేశారు. ఈనెలలో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వరుసగా మూడోసారి ఖాతా తెరవని విషయం తెలిసిందే. బజ్వా ఏళ్లుగా ఇలాంటి మాటలే చెబుతున్నారని, గతంలో 20 నుంచి 40 మంది ఆప్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని అన్నారని మాన్ గుర్తుచేశారు. మా ఎమ్మెల్యేలు ఎంతమంది మాతో ఉన్నారనేది లెక్కించే బదులు సొంతపార్టీ పరిస్థితి ఏమిటనేది ఆయన బేరీజు వేసుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలోని గ్రామగ్రామానికి వెళ్లి.. చెమటోడ్చి పంజాబ్‌లో ఆప్‌ను బలోపేతం చేశామని.. తమ పార్టీలో ఎలాంటి అసంతృప్తి లేదని మాన్ అన్నారు.

ఈవీఎంలలో డేటాను చెరిపేయొద్దు

- ఎన్నికల గుర్తుల లోడింగ్ యూనిట్‌ను తనిఖీ చేయాల్సి ఉంది
- ఈ విషయంలో 15 రోజుల్లోపు మీ స్పందన తెలపండి
- ఈసీకి సూచించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)లలో పోలింగ్‌కు సంబంధించిన సమాచారం (డేటా), ఎన్నికల గుర్తుల లోడింగ్ యూనిట్లలో సమాచారంపై కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. ఎన్నికలు పూర్తయ్యాక ఓడిన అభ్యర్థి అభ్యర్థన మేరకు ఈవీఎంల వెరిఫికేషన్‌లో భాగంగా ఆయా ఈవీఎంలలోని డేటాను చెరిపేయడం, రీలోడ్ చేసే సంస్కృతిని మానుకోవాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం ఈసీకి సూచించింది. సింబల్ లోడింగ్ యూనిట్(ఎస్ఎల్‌యూ)ను తనిఖీ చేయాల్సి ఉందని పేర్కొంది. ఈవీఎంలలో మెమొరీని, ఎస్ఎల్‌యూలను తనిఖీచేసేందుకు అవకాశం ఇవ్వాలని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) అనే ఎన్జీవో సంస్థ, ఓడిన అభ్యర్థి సర్వ్ మిట్టర్ వేసిన పిటిషన్‌ను మంగళవారం విచారించిన సందర్భంగా సుప్రీంకోర్టు పై విధంగా ఆదేశాలిచ్చింది.

డేటాను ఎందుకు తొలగిస్తున్నారు?

ఈసీ జారీచేసిన ఈవీఎం వెరిఫికేషన్ ప్రామాణిక నిర్వహణ విధానం(ఎస్ఓపీ) అనేది ఈవీఎం–వీవీప్యాట్ కేసులో 2024 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా లేదంటూ ఏడీఆర్ ఈ పిటిషన్‌ను దాఖలుచేసింది. ఈ కేసును విచారిస్తూ ధర్మాసనం '' ఎన్నికలయ్యాక అభ్యర్థి వచ్చి ఈవీఎంలోని మెమొరీని, మైక్రో కంట్రోలర్లను, ఎస్ఎల్‌యూలను ఇంజనీర్‌ను పిలిపించి తనిఖీచేయించాలని కోరితే ఈసీ ఆ ఈవీఎంలలో డేటాను వెరిఫికేషన్‌లో భాగంగా తొలగించకూడదు. అసలు మీరెందుకు డేటాను తొలగిస్తున్నారు?. పాత డేటాను అలాగే ఉంచండి. వెరిఫికేషన్ పేరిట డేటాను చెరిపేసి మళ్లీ అదే డేటాను రీలోడ్ చేయకూడదు. రీలోడింగ్ విధానాన్ని మానేయండి. ఎన్నికలయ్యాక ఇన్నాళ్లూ డేటాను తొలగించేందుకు మీరు అవలంభించిన విధానంపై వివరణ ఇవ్వండి. ఈ విషయంలో స్పందన తెలిపేందుకు మీకు 15 రోజుల గడువు ఇస్తున్నాం. కేసు విచారణను వచ్చే నెల మూడో తేదీతో మొదలయ్యే వారంలో విచారిస్తాం'' అని కేంద్ర ఎన్నికల సంఘానికి ధర్మాసనం సూచించింది. ఈవీఎంల వెరిఫికేషన్ కోసం ఒక విధానాన్ని తీసుకురావాలంటూ గతంలో మాజీ హరియాణా మంత్రి, ఐదుసార్లు ఎమ్మెల్యే కరణ్ సింగ్ దలాల్, హరియాణా అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థి లఖాన్ కుమార్ సింగ్లాలు వేసిన మరో పిటిషన్‌ను ధర్మాసనం కొట్టేసింది. గతంలో కరణ్ ఇలాంటి పిటిషన్ వేశారని గుర్తుచేసింది. బ్యాలెట్ పేపర్ విధానంలోకి మళ్లుదామంటూ వేసిన పిటిషన్‌నూ గత ఏడాది ఏప్రిల్‌లో కోర్టు కొట్టేసింది.

రూ.40 వేల ఫీజును తగ్గించండి

ఓడిన అభ్యర్థి ఒకవేళ ఈవీఎంలను తనిఖీ కోసం అభ్యర్థిస్తే అందుకోసం ఆయనపై వేసే ఫీజు భారాన్ని తగ్గించాలని కోర్టు సూచించింది. ఎన్నికల ఫలితాలొచ్చాక 45 రోజులపాటు సింబల్ లోడింగ్ యూనిట్లను, ఈవీఎంలతోపాటే స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలి. ''అభ్యర్థి వచ్చి అడిగితే ఇంజనీర్‌తో ఈవీఎంలను వెరిఫై చేయించాలి. ఇందుకు ఏకంగా రూ.40,000 ఖర్చు అవుతుందా?. అంత ఫీజును అభ్యర్థిపై వేస్తారా?. ఇది చాలా ఎక్కువ మొత్తం. దీనిని తగ్గించండి'' అని ఈసీ తరఫున హాజరైన న్యాయవాది మణీందర్ సింగ్‌ను ధర్మాసనం కోరింది. '' ఈవీఎంల వెరిఫికేషన్ పద్ధతి అనేది కోర్టు ఆదేశాలకు అనుగుణంగా లేదు. ఈవీఎం సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లో ఏదైనా మతలబు ఉందో లేదో తెల్సుకునే స్వేచ్ఛ ఉండాలి'' అని ఏడీఆర్ తరఫు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు.

ఇద్దరు పౌరుల మృతిపై సమగ్ర దర్యాప్తు జరపండి

లోక్‌సభలో ఇంజనీర్ రషీద్



న్యూఢిల్లీ: ఇటీవల జమ్మూకశ్మీర్‌లో సాయుధ బలగాల చేతిలో ఇద్దరు సాధారణ పౌరులు మృతి చెందిన సంఘటనపై సమగ్ర దర్యాపు జరపాలని ఎంపీ ఇంజనీర్ రషీద్ డిమాండ్ చేశారు. పార్లమెంటు సమావేశాలకు హాజరు కావడానికి ఢిల్లీ హైకోర్టు రషీద్‌కు రెండు రోజుల కస్టడీ పెరోల్‌ను మంజూరు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం వైద్య పరీక్షల నిర్వహణ అనంతరం బారాముల్లా స్వతంత్ర ఎంపీ రషీద్‌ను పోలీసులు పార్లమెంటుకు తీసుకువచ్చారు. లోక్‌సభ జీరో అవర్‌లో రషీద్ మాట్లాడుతూ.. వాసిం అహ్మద్ మీర్, మఖన్ దీన్‌లు సాయుధ బలగాల చేతుల్లో హతమయ్యారని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. 'మా రక్తం చవక కాదు' అని వ్యాఖ్యానించారు. ఆరునెలలు మిగతా భూభాగానికి సంబంధాలు ఉండని కుప్వారాలోని కొన్ని ప్రాంతాలను కలపడానికి టన్నెల్‌ను నిర్మించాలని కోరారు. ఉగ్రవాదులకు నిధులు సమకూర్చిన కేసులో రషీద్ 2019 నుంచి తీహార్ జైలులో ఉన్నారు. గత ఏడాది పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో బారాముల్లాలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు.

దేశాభివృద్ధికి జీడీపీ అద్దంపడుతోంది

మనది వేగంగా పురోగమిస్తున్న ఆర్థిక వ్యవస్థ • లోక్‌సభలో మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 5.4 శాతం వృద్ధిరేటుతో దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి పథంలో పయనిస్తోందని లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. సాధారణ బడ్జెట్‌పై చర్చలో భాగంగా మంగళవారం లోక్‌సభలో విత్తమంత్రి హోదాలో నిర్మల ప్రసంగించారు. '' ప్రజల చేతుల్లో నగదు నిల్వలు ఉండేలా బడ్జెట్‌ను రూపొందించాం. కేంద్రప్రభుత్వం తెచ్చే రుణాల్లో 99 శాతం నిధులను మౌలిక వసతుల కల్పనలో భాగంగా మూల ధన వ్యయాల కోసమే ఖర్చుచేస్తున్నాం. తద్వారా భవిష్యత్ సంపదను సృష్టిస్తున్నాం. ద్రవ్యోల్బణం కట్టడికి మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. అందుకే ఇప్పటికీ రిటైల్ ద్రవ్యోల్బణం రెండు నుంచి ఆరు శాతం మధ్యే తచ్చాడుతోంది. ఆహార వస్తువులకు సంబంధించి ద్రవ్యోల్బణం సైతం మధ్యస్థాయిలోనే కట్టడిలో ఉంది. 2024–24 ఆర్థిక సంవత్సరానికి మూడేళ్ల ముందువరకు భారత జీడీపీ వృద్ధి రేటు సగటున 8 శాతంగా నమోదైంది'' అని మంత్రి అన్నారు. అయితే గత నాలుగేళ్లలో ఎన్నడూలేని విధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థికాభివృద్ధి 6.4 శాతంగా నమోదుకావచ్చన్న విశ్లేషణలు వెలువడటం తెల్సిందే. ఇటీవల పార్లమెంట్‌లో ఆర్థికశాఖ ప్రవేశపెట్టిన ఆర్థికసర్వే సైతం తదుపరి ఆర్థికసంవత్సరంలో వృద్ధిరేటు 6.3 శాతం నుంచి 6.8శాతం మధ్యలో కదలాడవచ్చని పేర్కొనడం విదితమే. '' గత 12 త్రైమాసికాల్లో కేవలం రెండు త్రైమాసికాల్లోనే భారత వృద్ధిరేటు 5.4 శాతం లేదా అంతకంటే తక్కువకు పడిపోయింది. సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో వృద్ధిరేటు గత యేడు త్రైమాసికాల కనిష్టమైన 5.4 శాతానికి పడిపోయింది. అయితే ఆ తర్వాత ఆర్థిక పునాదులు బలపడటంతో వృద్ధిరేటు మళ్లీ పుంజుకుంది. ఇకపై భారత్ వేగంగా అభివృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుంది. జీడీపీలో మొత్తం సేవలు, వస్తూత్పత్తుల విలువ ఏకంగా 61.8 శాతానికి పెరిగింది. 2002–03 సంవత్సరం నుంచి చూస్తే ఇది ఈస్థాయికి పెరగడం ఇదే తొలిసారి. వచ్చే ఆర్థికసంవత్సరంలో మౌలికవసతుల కల్పన కోసం చేసే మూల ధన వ్యయం రూ.15.48 లక్షల కోట్లకు చేరుకోనుంది. ఇది జీడీపీలో 4.3 శాతానికి సమానం. కొత్త ఆర్థికసంవత్సరంలో ఆర్థిక లోటును రూ.15.68 లక్షల కోట్లకు పరిమితంచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఇది జీడీపీలో 4.4 శాతానికి సమానం.అంతర్జాతీయంగా ఎన్నో అంతర్యుద్ధాలు, యుద్ధ భయాలు, ఆర్థిక అస్థిర పరిస్థితుల మధ్య నూతన బడ్జెట్‌ను తీసుకొచ్చాం. గత పదేళ్లలో యావత్ ప్రపంచంలో ఎన్నో మార్పులు వచ్చాయి. భారత్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. వీటన్నింటినీ సరిచూసుకుంటూ జాతీయ ప్రయోజనాలకు పట్టంకడుతూ బడ్జెట్ కేటాయింపులు చేశాం'' అని మంత్రి అన్నారు.

ఏఐలో భారత్ హవా

- 65 శాతం మంది ఏఐ వినియోగం
- ప్రపంచ సగటు కంటే రెట్టింపు
- మైక్రోసాఫ్ట్ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ వాడకంలో భారత్ హవా కొనసాగుతోందని మైక్రోసాఫ్ట్ గ్లోబల్ ఆన్‌లైన్ సేఫ్టీ అధ్యయనం తేల్చింది. సర్వేలో పాల్గొన్న భారతీయుల్లో 65 శాతం మంది ఏఐని వాడుతున్నట్టు చెప్పారు. 2023తో పోలిస్తే ఇది 26 శాతం ఎక్కువ. ప్రపంచ సగటు (31 శాతం) కంటే రెండింతల కంటే ఎక్కువ కావడం విశేషం! 13–17 ఏళ్ల వారితో పాటు మొత్తం 15,000 మంది సర్వేలో పాల్గొన్నారు. 2024 జూలై 19 నుంచి ఆగస్ట్ 9 మధ్య సర్వే నిర్వహించారు. అనువాదాలు, ప్రశ్నలకు బదులివ్వడం, పనిలో సామర్థ్యాన్ని పెంచడం, పాఠశాల పనిలో విద్యార్థులకు సాయపడేందుకు ఏఐ వాడకంలో భారత్ చాలా ముందున్నట్టు సర్వే తేల్చింది. 25–44 ఏళ్ల వయసు వారిలో 84 శాతం మంది ఏఐని వాడుతున్నట్టు చెప్పారు. భారతీయ తల్లిదండ్రులకు తమ పిల్లల డిజిటల్ సవాళ్లపై మెరుగైన అవగాహన ఉంది. గతేడాదితో పోలిస్తే ఇది మరింత పెరిగింది. ఇతర దేశాల్లో మాదిరిగానే భారత్‌లో కూడా ఏఐ విషయంలో ఆన్‌లైన్ దుర్వినియోగం, డీప్‌ఫేక్స్, స్కామ్స్ తదితర ఆందోళనలున్నాయి. 18 ఏళ్ల లోపు పిల్లల ఏఐ వాడకంపై ఆందోళన చెందుతున్నట్టు 80 శాతం కంటే ఎక్కువ మంది చెప్పారు. ఎప్పుడో ఓసారి ఆన్‌లైన్ రిస్క్ బారిన పడ్డట్టు యుక్త వయస్కుల్లో 80% మంది చెప్పారు.

ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఐఐటీ హైదరాబాద్

న్యూఢిల్లీ: ఐఐటీ హైదరాబాద్‌ను ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేయనున్నట్టు కేంద్రం ప్రకటించింది. కృత్రిమ మేధ రంగాన్ని మరింత బలోపేతం చేసే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర వ్యవసాయ మంత్రి శివ్‌రాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ జాబితాలో ఢిల్లీ ఎయిమ్స్, ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ రోపార్ కూడా ఉన్నాయి. ''ఏఐ రంగంలో బోధన, పరిశోధన సంస్థలను ఒక్కతాటిపైకి తెచ్చే వేదికలుగా ఇవి పని చేస్తాయి. ఐఐటీ మద్రాస్, బాంబే, తిరుపతి, గువాహటి, గాంధీనగర్ తదితర ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు ఇందులో పాలుపంచుకుంటాయి''అని తెలిపారు. మంగళవారం పార్లమెంటులో ఒక ప్రశ్నకు మంత్రి ఈ మేరకు లిఖితపూర్వకంగా బదులిచ్చారు.



చెన్నైలో ఎస్పీబీ రోడ్డు

గాన గంధర్వుడి పేరుతో బోర్డు ఆవిష్కరణ

సాక్షి, చెన్నై: చెన్నైలోని నుంగంబాక్కం కమ్దార్ నగర్ మెయిన్ రోడ్డుకు గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రోడ్డుగా నామకరణం చేస్తూ మంగళవారం సాయంత్రం బోర్డును ఆవిష్కరించారు. డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, పలువురు మంత్రులు ఈ బోర్డును ఆవిష్కరించారు. గానగంధర్వుడు ఎస్పీ బాలసు బ్రహ్మణ్యం సంగీత ప్రపంచానికి, సినీ రంగానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.



తొలి దశలో పది చెరువులకు..

హైడ్రా మరో కీలక బాధ్యతల్నీ చేపట్టబోతోంది. ఇప్పటి వరకు జలవనరుల్లో ఉన్న ఆక్రమణల తొలగింపు చేపడుతున్న ఈ విభాగం... వాటి పరిరక్షణ బాధ్యతల్నీ చేపడుతోంది. -8లో



ఓవర్ కవర్.. మై ఫేవరెట్ షాట్..

దేశానికి మహిళా ప్రపంచ క్రికెట్ కప్ సాధించడమే తన లక్ష్యమని మహిళా క్రికెట్ గొంగడి త్రిష పేర్కొన్నారు. మంగళవారం సన్మాన సభలో ఆమె మాట్లాడారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34.0/21.0

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్ఠంగా 34, కనిష్ఠంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి..

దిక్కులేని వారై..

మహాకుంభ మేళాకు వెళ్లి వస్తుండగా..

మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ఏడుగురు నగర వాసుల దుర్మరణం
- నాచారం, మూసారంబాగ్‌ల్లో విషాద ఛాయలు



మల్లారెడ్డి ఇంటి వద్ద విషాద ఛాయలు

ఉప్పల్/మలక్‌పేట:

మహాకుంభ మేళాకు వెళ్లి తమవాళ్లు క్షేమంగా ఇంటికి తిరిగి వస్తారనుకున్న ఆ కుటుంబ సభ్యులకు రోడ్డు ప్రమాదం వార్త తీరని శోకాన్ని మిగిల్చింది. ఆనందంతో బయలుదేరి విగత జీవులుగా మారి తిరిగి రావడం తీరని దుఃఖాన్నే మిగిల్చింది. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన బాధితులు భోరుమంటూ విలపిస్తున్నారు. తాము కుశలమేనంటూ ఫోన్‌లో మాట్లాడిన కొన్ని గంటల్లోనే పిడుగులాంటి వార్త వారి గుండెలను పిండేసింది. మహా కుంభ మేళా నుంచి మినీ బస్సులో తిరిగి వస్తుండగా మధ్యప్రదేశ్ జబల్‌పూర్ వద్ద ట్రక్కు ఢీకొట్టిన ప్రమాదంలో ఏడుగురు నగర వాసులు మృత్యువాత పడ్డారు. నాచారం ప్రాంతానికి చెందిన ఆరుగురు, మూసారంబాగ్‌కు చెందిన ఒకరు దుర్మరణం చెందారు. మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రయాగ్ రాజ్ కుంభ మేళాకు వెళ్లిన వారంతా స్నేహితులే కావడం గమనార్హం. కాగా.. మృత దేహాలు బుధవారం మధ్యాహ్నం వరకు నగరానికి చేరుకోవచ్చని భావిస్తున్నారు.



డ్రైవర్ రాజు ఇంటి వద్ద రోదనలు

స్నేహితులతో కలిసి శనివారం ఉదయం నాచారం నుంచి మినీ బస్సులో కుంభమేళాకు బయలుదేరారు. త్రివేణి సంగమంలో స్నానం చేశామని, ట్రాఫిక్ జామ్ ఉందని, వస్తే ఇక్కడ ఇబ్బంది పడతారని, ట్రాఫిక్ క్లియర్ కావడానికి 24 గంటలు పడుతుందని, ఎవరూ రావొద్దని సోమవారం రాత్రి ఫోన్ చేసి చెప్పాడని బంధువులు తెలిపారు.

పెళ్లి రోజుకు ఒక్క రోజు ముందే..

భోరంపేట సంతోష్ భార్య గత ఏడాది క్రితం కన్నుమూశారు. బుధవారం ఆయన పెళ్లి రోజు. వచ్చే నెల్లో భార్య సంవత్సరీకం నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం ఆయన ఇద్దరు కుమారులు హాస్టల్‌లో ఉంటున్నారు. తన పెళ్లి రోజుకు ఒక్క రోజు ముందే భార్య వద్దకే వెళ్లిపోయాడంటూ కుటుంబీకులు విలపిస్తున్నారు.

బతుకు బండికి డ్రైవర్..

వృత్తిరీత్యా డ్రైవర్ అయిన కల్యాకరి రాజు కుటుంబ పరిస్థితి దయనీయం. ఆయన డ్రైవింగ్ చేస్తేనే వారి ఇల్లు గడిచేది. సంపాదించే పెద్ద దిక్కును కోల్పోయామని, అంతా రోడ్డునపడ్డామంటూ కుటుంబం విలపిస్తోంది. రాజు మరణ వార్త తెలియడంతోనే శ్రీరామ్ కాలనీ బస్తీ శోకసంద్రంలో మునిగిపోయింది. భర్త లేడన్న వార్త తెలిసి రాజు భార్య మహేశ్వరి గుండెలు పగిలేలా రోదిస్తోంది.

బై బై అంటూ బయలుదేరి..

మూసారంబాగ్‌కు చెందిన గోల్కొండ ఆనంద్‌కుమార్ (47) ఇంటి నుంచి బయలుదేరే ముందు భార్యా పిల్లలకు బై బై అని చెప్పి కుంభ మేళాకు వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఆనంద్ కుమార్ సలీం నగర్‌లో గోల్డ్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నాడు.



విషాదంలో మునిగిన మల్లారెడ్డి కుటుంబ సభ్యులు



అంబులెన్స్‌లో నగరానికి మృత దేహాలు

కాలనీ సమస్యలపైనే దృష్టి



మా నాన్న అందరికి రోల్ మోడల్‌గా ఉండేవారు. అందరికీ సాయపడే వ్యక్తి ఆయన. అందరితో కలిసి మెలిసి ఉండే వారు. నిత్యం స్థానికులతోనే గడిపే వారు. కాలనీయే ఆయనకు సర్వస్వం. సోమవారం గంగ స్నానం అయిందంటూ మాట్లాడారు. తిరిగి వచ్చేస్తున్నా అని కూడా చెప్పాడు. కాని నాన్న ఇంక రాలేరు.

– మల్లారెడ్డి కుమారుడు శ్రావణ్ రెడ్డి

పిల్లలకేం చెప్పాలి.. దేవుడా..



'నా కొడుకు పిల్లలు హాస్టల్‌లో ఉన్నారు. తండ్రి మరణ వార్త వారికి ఇంకా తెలియదు. గత ఏడాది వారి తల్లి మృతి చెందింది. ఇప్పుడు తండ్రి కూడా చనిపోయాడు. పిల్లలు హాస్టల్ నుంచి వస్తే నేనేం సమాధానం చెప్పాలి దేవుడా' అంటూ సంతోష్ తల్లి భోరున విలపిస్తోంది.

– విలపిస్తున్న సంతోష్ తల్లి

చెరువులనే ఏ'మార్చారు'

రెసిడెన్షియల్ జోన్‌లోకి కన్వర్ట్ చేసేందుకు హెచ్ఎండీఏ నోటిఫికేషన్

- శేరిలింగంపల్లి గోపిచెరువు, మేడ్చల్ గొల్లోని కుంట రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్పు
- హెచ్ఎండీఏ నోటిఫికేషన్‌పై తీవ్ర అభ్యంతరాలు
- ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలంటున్న పర్యావరణ నిపుణులు

సాక్షి, సిటీబ్యూరో: చెరువులు, సహజ వనరులను సంరక్షించాల్సిన సంస్థలే భక్షకులుగా మారుతున్నాయా? గ్రేటర్‌లోని చెరువులకు రక్షణ కరువైందా? అనే ప్రశ్నలకు తాజా పరిణామాలు అవుననే సమాధానమిస్తున్నాయి. ఇప్పటికే నగరంలోని వివిధ ప్రాంతాల్లో వందలాది చెరువులు అదృశ్యమయ్యాయి. ఇంకా కొన్ని కబ్జారాయుళ్ల చెరలో మగ్గిపోతున్నాయి. మరోవైపు ఎక్కడికక్కడ చెరువులను చెరబట్టేందుకు ఆక్రమణదారులు అడుగడుగునా మోహరించి ఉన్నారు. ఈక్రమంలో హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పలు చెరువులు, బఫర్ జోన్‌లను రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చేందుకు నోటిఫికేషన్‌లు ఇవ్వడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పర్యావరణ నిపుణులు, స్థానికుల నుంచి వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. చెరువులను, నీటి వనరులను కాపాడాల్సిన సంస్థే ఇలా రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్పు చేసేందుకు ప్రతిపాదించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇదేం వెసులుబాటు..

◆ హెచ్ఎండీఏ చట్టంలోని సెక్షన్ 15 (1) (2008) ప్రకారం చెరువులు, బఫర్ జోన్‌లను రెసిడెన్షియల్ జోన్‌లలోకి మార్చేందుకు (కన్వర్ట్) అవకాశం కల్పిస్తుంది. ఈ చట్టం ఆధారంగానే ప్రస్తుతం శేరిలింగంపల్లి, రామచంద్రాపురం ప్రాంతంలోని సర్వే నంబర్ (84 /పి) లో ఉన్న సుమారు 8.15 ఎకరాలలో (33,892.47 చదరపు మీటర్లు) కొంతభాగం చెరువు విస్తరించి ఉండగా.. మరికొంత బఫర్‌జోన్‌లో ఉంది. కొంత ప్రాంతం కన్వర్షన్ జోన్‌లో ఉంది. ఈ చెరువు, బఫర్ జోన్‌లను రెసిడెన్షియల్‌జోన్‌లోకి మార్చనున్నట్లు గత నెల 10న హెచ్ఎండీఏ ప్రకటించింది. దీనిని గోపి చెరువుగా (3714 గుర్తింపు సంఖ్య) గతంలోనే నిర్ధారించారు. అలాగే మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి పరిధిలోని మైసమ్మగూడలో ఉన్న గొల్లోనికుంట చెరువును (గుర్తింపు సంఖ్య 1700/30) సైతం నివాస ప్రాంతంగా మార్చేందుకు హెచ్ఎండీఏ ప్రకటన వెలువరించింది.

◆ గుండ్లపోచంపల్లిలోని సర్వే నంబర్లు 517/పి, 518/పిలలో విస్తరించి ఉన్న సుమారు 8980.08 చదరపు మీటర్ల చెరువు, బఫర్ జోన్‌లను రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చేందుకు ప్రతిపాదిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్ఎండీఏ చట్టంలోని ఒక సెక్షన్‌ను అవకాశంగా తీసుకొని ఇలా చెరువులనే మార్చడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను విరమించుకోవాలని, చెరువుల రక్షణకు పటిష్టమైన చర్యలను చేపట్టాలని కోరుతున్నారు. 'ఇది చాలా మూర్ఖమైన చర్య. ఇలాంటి వాటిని ఏమాత్రం సహించబోం. గత ప్రభుత్వ హయాంలోనే చెరువులకు రక్షణ లేకుండా పోయిందనుకున్నాం. కానీ ఈ ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తుంది' అని ప్రముఖ సామాజిక కార్యకర్త లుబ్నా సార్వత్ ఆందోళన వ్యక్తం చేశారు.

రక్షణ ఏమైనట్లు..

చెరువులు, సహజ వనరుల పరిరక్షణ కోసమే ప్రభుత్వం హైడ్రా వంటి బలమైన సంస్థను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం హెచ్ఎండీఏ పరిధిలోని చెరువుల సంరక్షణను హైడ్రా పర్యవేక్షిస్తోంది. మరోవైపు చెరువుల రక్షణ కోసం అప్పటి ఉమ్మడి ప్రభుత్వం 2013లోనే ప్రత్యేక జీఓ (33)ను వెలువరించింది. ఈ జీఓ ప్రకారం చెరువులు, బఫర్‌జోన్‌లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదు. కేవలం చెరువులే కాకుండా నాలాలు, కుంటలు, నదులకు సైతం నిర్మాణాల నుంచి రక్షణ కల్పిస్తూ ఈ జీఓను విడుదల చేశారు. ఈ మేరకు సర్వే ఆఫ్ ఇండియా, నీటిపారుదల శాఖ అందజేసే ట్రోపోగ్రాఫికల్ షీట్స్ ఆధారంగా రెవెన్యూ గ్రామాల్లోని చెరువులు, నీటివనరులను నిర్ధారిస్తారు. అలా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లు, వరద విస్తృత ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదు. మరోవైపు ఉన్నత న్యాయస్థానం సైతం అనేక సందర్భాల్లో ఇదే అంశాన్ని స్పష్టం చేసినట్లు లుబ్నా సార్వత్ పేర్కొన్నారు.

కొరవడిన స్పందన

ఆయా ప్రతిపాదనలపై వివరాలు తెలుసుకొనేందుకు ప్రయత్నించగా హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ నుంచి స్పందన లభించలేదు.



గోపి చెరువు







శిలలపై చిత్రాలు

చెక్కినారూ!





కదలలేని.. మెదలలేని.. పెదవి విప్పి పలకలేని ఆ శిలలు జీవన రాగాలాపనలో నిమగ్నమయ్యాయా? చిత్రకారుడి కుంచె బండరాళ్లకు ప్రాణాలు పోసిందా? అన్నచందంగా ఉన్నాయి ఆ శిలా చిత్రాలు. గచ్చిబౌలిలోని ఓల్డ్ ముంబై రోడ్డు నుంచి ఖాజాగూడ వెళ్లే లింక్ రోడ్డు మధ్య వివిధ ఉన్న బండరాళ్లపై జంతువులు, పక్షులు.. ఇతర చిత్రాలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. శిలలపై చిత్రాలకు జీవం పోశారు. ఒక్కో చిత్రం ఒక్కో దృశ్య కావ్యంగా మలిచారు. ఈ దారిలో వెళ్లేవారిని ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్





హజ్ హౌస్ మీదుగా ఎయిర్‌పోర్టుకు పుష్పక్ బస్సులు



సాక్షి, సిటీబ్యూరో: హజ్‌హౌస్ మీదుగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి పుష్పక్ బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 12వ తేదీ నుంచి ఈ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. జేబీఎస్ నుంచి ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే ఈ బస్సులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, రాణిగంజ్, సెక్రటేరియట్, రవీంద్రభారతి, హజ్‌హౌస్, నాంపల్లి, గాంధీభవన్, ఎంజేమార్కెట్, అఫ్జల్‌గంజ్, బహదూర్‌పురా, ఆరాంఘర్, శంషాబాద్ రూట్‌లో ఎయిర్‌పోర్టుకు నడుస్తాయి. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి మొదటి బస్సు అర్ధరాత్రి దాటిన తర్వాత 12.55 గంటలకు, చివరి బస్సు రాత్రి 11.55 గంటలకు బయలుదేరుతాయి. ఎయిర్‌పోర్టు నుంచి మొదటి బస్సు అర్ధరాత్రి దాటిన తర్వాత 12.50 గంటలకు, చివరి బస్సు రాత్రి 11.50 గంటలకు బయలుదేరుతాయి. ప్రతి గంటకొకటి చొప్పున ఈ రూట్‌లో బస్సులు అందుబాటులో ఉంటాయి.

స్ఫూర్తి, ఐక్యతకు క్రీడలు దోహదం

రెవెన్యూ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గచ్చిబౌలి: క్రీడలు ఐక్యతతో పాటు స్ఫూర్తిని నింపుతాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో 54వ సౌత్‌జోన్ సెంట్రల్ రెవెన్యూ స్పోర్ట్స్ మీట్–2025ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కేంద్రం ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా, ఒలింపిక్ పోడియం స్కీంల ద్వారా క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీస్తోందన్నారు. రాళ్లు విసిరితే వాటిని మైల్ స్టోన్‌గా మలుచుకోవాలని ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ మాటలను గుర్తు చేశారు. గెలుపు ఓటముల కంటె క్రీడల్లో పాల్గొనడమే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. మీరు శ్రమిస్తూనే పక్కవారి ప్రతిభను ప్రోత్సహించాలని సూచించారు. తెలంగాణ ఇన్‌కం ట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత మాట్లాడుతూ.. నగరంలో ఆరు చోట్ల 18 అంశాలలో క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండు రోజుల పాటు సాగే స్పోర్ట్స్ మీట్‌లో కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన ఇన్‌కం ట్యాక్స్, జీఎస్‌టీ, కస్టమ్స్ విభాగాలకు చెందిన వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. గవర్నర్ బెలూన్లు ఎగురవేసి క్రీడలు ప్రారంభించగా, పద్మశ్రీ అవార్డు గ్రహీత, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ క్రీడా జ్యోతిని వెలిగించారు. కార్యక్రమంలో మాజీ క్రికెటర్ ఎంఎస్‌కే ప్రసాద్, సెంట్రల్ ట్యాక్స్ కస్టమ్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాష్ పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేస్తున్న గవర్నర్

'ఫ్యూచర్'కు బాట!

ఫోర్త్ సిటీకి ప్రత్యేక అథారిటీ

- 71 పంచాయతీలతో ప్రతిపాదనలు
- గ్రీన్‌ఫీల్డ్ రహదారికిరువైపులా ఉన్న గ్రామాల విలీనం
- ప్రణాళికాబద్ధ నగరంగా అభివృద్ధిపర్చడమే లక్ష్యం

సాక్షి, సిటీబ్యూరో: ఫ్యూచర్ సిటీకి బాటలు పడుతున్నాయి. గ్రీన్‌ఫీల్డ్ రహదారికి శరవేగంగా భూసేకరణ ప్రక్రియ నిర్వహిస్తున్న సర్కారు.. తాజాగా ఫ్యూచర్ సిటీ (ఫోర్త్‌సిటీ)కి ప్రత్యేక ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడం ద్వారా ప్రపంచస్థాయి నగరాల సరసన ఫోర్త్‌సిటీని నిలబెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్సీఆర్), గ్రేటర్ నోయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ తరహాలో అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రాధికార సంస్థ కార్యాచరణ, విధివిధానాలు ఉండేలా కసరత్తు చేస్తోంది.

ప్రాథమిక నివేదికకు రూపకల్పన..

కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట కేంద్రంగా ఏర్పాట్లు చేస్తున్న ఈ పట్టణాభివృద్ధి సంస్థ (యూడీఏ) పరిధిలో కందుకూరు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, యాచారం, కడ్తాల్ మండలాలను తీసుకురావాలని యోచిస్తోంది. ఔటర్ రింగ్‌రోడ్డు రావిరాల జంక్షన్ నుంచి ఆకుతోటపల్లి వరకు ప్రతిపాదించిన 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రామాలను దీని పరిధిలో చేర్చనుంది. ఈ మేరకు కసరత్తు మొదలుపెట్టిన రంగారెడ్డి జిల్లా యంత్రాంగం మంగళవారం ప్రాథమిక నివేదికను రూపొందించింది.

యూడీఏలో ఉండేలా..

నాగార్జునసాగర్, బెంగళూరు హైవేలు, ఇటు ఔటర్‌రింగ్‌రోడ్డు, మరోవైపు ప్రతిపాదిత రీజినల్ రింగ్‌రోడ్డు లోపలిగ్రామాలను ఈ ఆథారిటీ పరిధిలోకి తెచ్చేలా ప్రతిపాదనలు తయారు చేసింది. 71 గ్రామ పంచాయతీల (54 రెవెన్యూ గ్రామాల)తో మీర్‌ఖాన్‌పేట పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. మహేశ్వరం, కందుకూరు మండలాలను పూర్తిస్థాయిలో యాచారం, ఇబ్రహీంపట్నం మండలాల్లో సాగర్ రహదారి లోపలి పంచాయతీలు.. అలాగే కడ్తాల్ మండలంలో గ్రీన్‌ఫీల్డ్ రహదారి చేరువలోని గ్రామాలను ఈ యూడీఏలో ఉండేలా ప్రతిపాదనలు రూపొందించింది. ఈ మేరకు నివేదికకు తుది రూపునిచ్చి ప్రభుత్వ పరిశీలనకు జిల్లా యంత్రాంగం పంపనుంది.



ఇబ్బందులు రాకుండా...

30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్‌సిటీని నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ఫార్మాసిటీ ఏర్పాటు కోసం సేకరించిన 13,973 ఎకరాలకుతోడు మరో 16 వేల ఎకరాలను ల్యాండ్‌పూలింగ్ ద్వారా సమీకరించాలని యోచిస్తోంది. ఫోర్త్‌సిటీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సర్కారు.. ఐటీ, పారిశ్రామిక, ఆతిథ్య, పర్యాటక, క్రీడారంగాలకు పెద్దపీట వేయాలని నిర్ణయించింది. కృతిమ మేధ (ఏఐ) సిటీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు అత్యాధునిక వాణిజ్య భవనం సహా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, క్రికెట్ స్టేడియం తదితర ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు ఇందులో చోటు కల్పించాలని యోచిస్తోంది. ఈ క్రమంలోనే ఈ నగరి నిర్మాణానికి ప్రతిబంధకాలు రాకుండా, అభివృద్ధి పనులు ప్రణాళికబద్ధంగా చకచకా సాగేలా ప్రత్యేకంగా అథారిటీ ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చింది. అలాగే ప్రత్యేక మాస్టర్‌ప్లాన్‌ను కూడా రూపొందించనుంది. దీనికి అనుగుణంగా ల్యాండ్ యూజ్ జోన్లను నిర్దేశించనుంది.

ఇక ఈవెంట్ మేనేజ్‌మెంట్స్..

ప్రైవేట్ ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలకు సిద్ధమైన బల్దియా

- ఎగ్జిబిషన్లు, థీమ్ బేస్ట్ కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలకు సైతం
- ఆర్ఎఫ్ఈలకు జీహెచ్ఎంసీ ఆహ్వానం



సాక్షి, సిటీబ్యూరో: 'హైదరాబాద్ రైజింగ్'లో భాగంగా ఇప్పటికే జంక్షన్ల సుందరీకరణ, ఫ్లైఓవర్లకు థీమ్ బేస్డ్ పెయింటింగులు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ.. మున్ముందు ఎగ్జిబిషన్లు, థీమ్ బేస్డ్‌గా కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు వంటివి సైతం నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు వంటివి సైతం నిర్వహించనుంది. ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆయా కార్యక్రమాల నిర్వహణలో తగిన అనుభవం ఉన్న కార్పొరేట్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు బాధ్యతలప్పగించాలనుకుంటోంది. అందుకుగాను ఎంపానెల్‌మెంట్ కోసం సదరు సంస్థలను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. అవసరమైనప్పుడు సదరు సంస్థల సేవల్ని వినియోగించుకుంటామని పేర్కొంది.

నిబంధనలు ఇలా..

ఏడాది కాలపరిమితితో జాబితాలో పేరు నమోదు (ఎంపానెల్) చేస్తారు. అవసరాల్ని బట్టి మూడేళ్ల వరకు వాటి సేవల్ని వినియోగించుకుంటారు. ఆయా కార్యక్రమాల ఆలోచనల నుంచి వాటిని పూర్తి చేసేంత వరకు సదరు సంస్థలు తమ సేవలందించాల్సి ఉంటుంది. కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇతర ప్రభుత్వ సంస్థల నుంచి అనుమతులవసరమయ్యే పక్షంలో సదరు సంస్థలే బాధ్యత తీసుకోవాలి. ఎగ్జిబిషన్ల వంటివి నిర్వహించేటప్పుడు థీమ్‌కనుగుణంగా తగిన డిజైన్, లేఅౌట్, స్టాల్స్ ఏర్పాటు, బ్రాండింగ్ తదితర పనులు నిర్వహించాల్సి ఉంది. అవసరమయ్యే సామగ్రి అద్దెకు తీసుకోవడం, సాంస్కృతిక ప్రదర్శనలకు వేదిక ఏర్పాట్లతో పాటు ఆడియో, వీడియో రికార్డింగులకు కూడా తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. అంతేకాదు. వీఐపీ లాంజ్‌ల ఏర్పాటు, గేట్లు, జీహెచ్ఎంసీ సూచించిన వారికి ఆహ్వానాలు పంపడం కూడా సదరు సంస్థల బాధ్యతే. పబ్లిక్ రిలేషన్స్‌బాధ్యతలు నిర్వహిస్తూ సదరు కార్యక్రమాలకు తగిన ప్రచారం కూడా కల్పించాలి.

– కార్యక్రమాల ప్రమోషన్ల కోసం ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్, సోషల్ మీడియాను వినియోగించుకొని 360 డిగ్రీస్‌లో మాస్‌మీడియా ప్రచారం నిర్వహించాలి. ఇందుకుగాను సంస్థలు తగిన క్రియేటివ్ టీమ్‌ను కలిగి ఉండాలి. మెగా ఎగ్జిబిషన్ల నిర్వహణ సామర్థ్యం కలిగి ఉండాలి. సదరు సంస్థలు రిజిస్ట్రేషన్ కలిగి ఉండటంతో పాటు గత మూడేళ్లలో ఏటా కనీసం రూ.25 కోట్ల టర్నోవర్ కలిగి ఉండాలి. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఏదైనా ప్రభుత్వసంస్థకు కానీ, ప్రభుత్వరంగ సంస్థకు కానీ మూడు ఈవెంట్స్ నిర్వహించి ఉండాలి. దేశంలోని ఏవైనా రెండు మెట్రో నగరాల్లో కార్యాలయాలు కలిగి ఉండాలి. డీపీఐఐటీ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్) గుర్తింపు పొందిన స్టార్టప్ ఏజెన్సీలకు కొన్ని మినహాయింపులు ఉంటాయి.

మూడు నెలల శిశువు అపహరణ

5 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

- తల్లి వద్దకు చేరిన చిన్నారి
- దుస్తులు కొనిపిస్తామని నమ్మించి ఎత్తుకెళ్లిన దుండగుడు
- రూ. లక్షన్నరకు చిన్నారిని విక్రయించేందుకు యత్నం



వివరాలను వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి

కాచిగూడ: దుస్తులు ఇప్పిస్తానని నమ్మించి ఓ తల్లి నుండి మూడు నెలల చిన్నారిని ఎత్తుకెళ్లిన దుండగుడిని సీసీ కెమెరాల సాయంతో కాచిగూడ పోలీసులు గంటల వ్యవధిలో పట్టుకున్నారు. ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ రఘు, ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్‌లు మంగళవారం ఇక్కడ వివరాలు వెల్లడించారు. వనపర్తి జిల్లా మదనాపూర్ మండలం, అగ్రహారం గ్రామానికి చెందిన రవి, వరలక్ష్మి దంపతులు 3 నెలల బాబుతో ఉపాధి కోసం నగరానికి వచ్చి ఉప్పుగూడలో నివాసం ఉంటూ కూలీ పనిచేస్తున్నారు. గౌలిగూడా ప్రాంతానికి చెందిన బోగ నర్సింగ్ రాజ్ పంజగుట్టలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతనికి కార్వాన్ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి రాఘువేందర్ (48), అదే ప్రాంతానికి చెందిన ఎస్.ఉమావతి (55)తో పరిచయం ఉంది. ఉమావతి పనిచేస్తున్న బట్టల షాపులో లాల్‌దర్వాజా ప్రాంతానికి చెందిన సంధ్యారాణి పనిచేస్తుంటుంది. శివ, సంధ్యారాణి దంపతులకు పిల్లలు లేకపోవడంతో తాను పెంచుకోవడానికి దత్తతకు పిల్లలు కావాలని ఉమావతిని కోరింది. ఉమావతి ఈ విషయాన్ని నర్సింగ్ రాజ్, రాఘువేంద్రలకు తెలిపింది. వారు తమకు తెలిసిన వాళ్ల పిల్లలను దత్తతకు ఇస్తారని, వారికి లక్షన్నర డబ్బులు ఇవ్వాలని సంధ్యారాణికి తెలిపారు. దానికి అంగీకరించిన సంధ్యారాణి తొలివిడతగా లక్ష రూపాయలు చెల్లించింది. డబ్బులు చెల్లించి ఆరు నెలలు గడుస్తున్నా వారు ఇచ్చిన మాట నిలబెట్టుకోక పోవడంతో సంధ్యారాణి వారిపై ఒత్తిడి చేసింది. దీనితో కిడ్నాప్ చేసి, ఆమెకు చిన్నారిని అందించాలని ప్లాన్ వేశారు. ఈ క్రమంలో సోమవారం చాదర్‌ఘాట్ చౌరస్తాలో వరలక్ష్మి తన మూడేళ్ల కుమారుడితో భిక్షాటన చేస్తుండగా నర్సింగ్‌రాజ్ ఆమెతో మాటలు కలిపి పరిచయం చేసుకున్నాడు. కొత్త దుస్తులు ఇప్పిస్తానని వరలక్ష్మిని మాటల్లో పెట్టాడు. తన వెంట కాచిగూడ డిమార్ట్‌కు తీసుకెళ్లాడు. వరలక్ష్మి దుస్తులు చూస్తుండగా నర్సింగ్‌రాజ్ అక్కడి నుండి బాబును తీసుకొని ఆటోలో ఉడాయించాడు. లాల్ దర్వాజాలో ఉండే సంధ్యారాణికి అప్పజెప్పాడు. బాలుడు కన్పించకపోవడంతో వరలక్ష్మి కొద్దిసేపు వెదికింది. ఫలితం లేకపోవడంతో సోమవారం సాయంత్రం కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐలు సుభాష్, రవికుమార్‌లు రెండు టీంలుగా ఏర్పడి సీసీ కెమెరాల సహాయంతో లాల్‌దర్వాజలో బాలుడు ఉన్నట్లు కనుగొన్నారు. సోమవారం రాత్రి 7 గంటలకు చాకచక్యంగా కిడ్నాపర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నర్సింగ్‌రాజ్, రాఘువేందర్‌లను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాబును తల్లిదండ్రులకు అప్పగించారు. ఉమావతి పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. ఆరు గంటల్లో కేసును ఛేదించిన కాచిగూడ పోలీస్ సిబ్బందిని డీసీపీ అభినందించారు.

అనుమానమే పెనుభూతమై..

భార్యను బండరాయితో కొట్టి హత్య చేసిన భర్త



నస్రీం బేగం (ఫైల్)



నిందితుడు అబ్దుల్ రహీం

మూసాపేట: అనుమానంతో ఓ భర్త బండరాయితో తలపై మోదీ భార్యను హత్య చేసిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూసాపేటలోని హబీబ్‌నగర్‌లో నివాసముంటున్న అబ్దుల్ రహీం, ఎండీ నస్రీం బేగంలు భార్యాభర్తలు. వీరికి ఓ పాప, బాబు ఉన్నారు. భార్య గృహిణి కాగా అబ్దుల్ రహీం నాంపల్లిలోని కేర్ ఆసుపత్రిలో వార్డు బాయ్‌గా పనిచేస్తున్నాడు.

కొన్ని నెలలుగా అబ్దుల్ రహీం భార్యను అనుమానిస్తూ ఘర్షణలకు దిగుతున్నాడు. ఈ క్రమంలో హబీబ్‌నగర్ నుంచి ఇల్లు ఖాళీ చేసి కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ నగర్‌లో ఉండేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం ఈమేరకు భార్యాభర్తలు ఇద్దరూ రాజీవ్‌గాంధీ నగర్‌లోని కొత్త ఇంటికి శుభ్రం చేసేందుకు వెళ్లారు. నస్రీం బేగం ఇంటిని శుభ్రం చేసి విశ్రాంతి తీసుకుంటుండగా..అబ్దుల్ రహీం సడన్‌గా ఓ బండరాయి తీసుకువచ్చి ఆమె తలపై బలంగా మోదాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నస్రీం బేగం అక్కడికక్కడే మృతి చెందింది. హత్యకు ముందు కూడా గొడవ జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. హత్య చేసిన వెంటనే అబ్దుల్ రహీం బాలానగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కూకట్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తొలి దశలో పది చెరువులకు మోక్షం

- హెచ్‌ఎండీఏ నిధులతో పునర్నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు
- ఆ బాధ్యతలు హైడ్రాకే అప్పగించిన సర్కారు
- డీపీఆర్‌లు తయారు చేసిన బెంగళూరు సంస్థ
- త్వరలో టెండర్లు ఆహ్వానించడానికి సన్నాహాలు
- పీసీబీ తరహాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు నిర్వహణ



ఉప్పల్ నల్ల చెరువు(ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) మరో కీలక బాధ్యతల్నీ చేపట్టబోతోంది. ఇప్పటి వరకు జలవనరుల్లో ఉన్న ఆక్రమణల తొలగింపు చేపడుతున్న ఈ విభాగం... వాటి పరిరక్షణ బాధ్యతల్నీ చేపడుతోంది. ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం అందుకు అవసరమైన మొత్తాన్ని హెచ్‌ఎండీఏ నిధుల నుంచి కేటాయించడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తొలి దశలో పది చెరువుల్ని ఎంపిక చేసుకున్న హైడ్రా.. వాటి పునర్ నిర్మాణం, అభివృద్ధికి సంబంధించి డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్స్ (డీపీఆర్) సిద్ధం చేయించింది. త్వరలో చెరువుల పునర్ నిర్మాణానికి సంబంధించి టెండర్లు పిలవడానికి కమిషనర్ ఏవీ రంగనాథ్ సన్నాహాలు చేస్తున్నారు. ఫుల్ ట్యాంక్ లెవల్స్ (ఎఫ్‌టీఎల్) నిర్ధారించి, ఆక్రమణలు తొలగింపు పూర్తయిన వాటినే తొలి దశలో ఎంపిక చేసుకున్నారు.

మురుగు నీరు మళ్లించి ఎస్టీపీలతో శుద్ధి చేస్తూ...

చెరువుల పునర్ నిర్మాణం, అభివృద్ధిలో భాగంగా హైడ్రా ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి పెట్టనుంది. తొలి దశలో ఎంపిక చేసుకున్న వాటిలో దాదాపు అన్నీ కాలుష్యం కోరల్లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం ఆ చెరువులో ఉన్న నీటిని పూర్తి స్థాయిలో బయటకు తీసేయనున్నారు. వేసవి కాలం కావడంతో ఈ పని తేలికవుతుందని అధికారులు చెప్తున్నారు. ఆపై వీలున్నంత వరకు అక్కడి నేల తదితరాలను శుద్ధి చేయిస్తారు. చెరువులోకి మురుగు నీరు రాకుండా ప్రత్యేకంగా సీవరేజ్ పైప్ లైన్ ఏర్పాటు చేస్తారు. ఈ లైన్‌ను మరో చెరువులో కలుపుతూ.. అక్కడ మైక్రో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ (ఎస్టీపీ) నిర్మిస్తారు. వీటి ద్వారా మళ్లించిన నీరు వేరే చెరువులోకి వెళ్లే ముందే శుద్ధి అయ్యేలా చర్యలు తీసుకుంటారు. నీటిని శుద్ధి చేయకుండా మరో చెరువులోకి పంపకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఇన్‌లెట్స్ దగ్గర సెడిమెంటేషన్ పాయింట్లు...

అభివృద్ధి చేయనున్న చెరువులోని చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వర్షపు నీరు వచ్చి చేరేలా ప్రత్యేక వ్యవస్థను నిర్మించనున్నారు. భారీ వర్షాలు, వరదల సమయంలో వర్షపు నీటితో పాటు మురుగు నీరు కూడా ఆయా చెరువుల్లోకి వచ్చి చేరుతుంది. ఇలాంటి సందర్భాల్లో మురుగు నీరు చెరువులోకి రాకుండా ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. దీనికోసం ఇన్‌లెట్స్ దగ్గర ప్రత్యేకంగా సెడిమెంటేషన్ పాయింట్ల పేరుతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తారు. ప్రతి చెరువునూ కాలుష్య రహితంగా మార్చి, జల చరాలు, మొక్కలు ఉండేలా చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు.

కారకాలపై చర్యలకు అవకాశం...

జల వనరుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న హైడ్రా ప్రస్తుతం ఆక్రమణల తొలగింపు, వ్యర్థాల డంపింగ్ వంటివి అడ్డుకోవడం తదితర బాధ్యతల్ని మాత్రమే చేపడుతోంది. గడిచిన కొన్ని నెలలుగా క్షేత్ర స్థాయి అధ్యయనాలు చేపట్టిన హైడ్రా బృందాలు వివిధ పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థాలు సైతం చెరువుల్లోకి వస్తున్నాయని, దీనివల్ల చెరువుల్లో కాలుష్యం పెరుగుతోందని గుర్తించింది. దీంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) తరహాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల్నీ నిర్వర్తించనుంది. ప్రతి చెరువు పైనా కన్నేసి ఉంచే హైడ్రా బృందాలు... ఏదైనా చెరువును పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థాలు కలుషితం చేస్తున్నాయా అనేది గుర్తిస్తాయి. దీనిపై సాక్ష్యాధారాలు సేకరించి ఆయా పరిశ్రమలపై చర్యలు తీసుకోనున్నారు.

చెరువుల్లో మట్టి పోస్తుంటే.. 9000113667కు సమాచారమివ్వండి

చెరువుల్లో మట్టి పోస్తున్న వారిపై పటిష్ట నిఘా ఉంచి, కఠిన చర్యలు తీసుకోవాని హైడ్రా నిర్ణయించింది. ఇందులో ప్రజల్నీ భాగస్వాముల్ని చేస్తోంది. ఆయా ప్రాంతాల్లోని చెరువుల్లో ఎవరైనా మట్టి, నిర్మాణ వ్యర్థాలు పోస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలని హైడ్రా కోరింది. చెరువుల ఆక్రమణ అనేది ఇలానే మొదలవుతుండటంతో..ఇలాంటి సమాచారం ఇవ్వడం కోసం ప్రత్యేకంగా 9000113667 మొబైల్ నెంబర్ కేటాయించింది. వాట్సాప్ ద్వారా ఆయా లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, జేసీబీల వీడియోలను కూడా పంపించాలని కోరింది. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో పాటు కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు ఇలా అందరూ ఈ క్రతువులో భాగస్వాములు కావాలని ఆకాంక్షించింది. ఇప్పటికే తమ బృందాలు రాత్రీపగలూ నిఘా ఉంచుతున్నాయని, గడిచిన నెల రోజుల్లో 31 లారీలను పట్టుకుని సంబంధిత వ్యక్తులపై కేసులు పెట్టామని హైడ్రా పేర్కొంది. వీరిలో లారీ ఓనర్లతో పాటు నిర్మాణ సంస్థలకు చెందిన వారూ నిందితులుగా ఉన్నారని స్పష్టం చేసింది.

తొలి దశలో ఎంపిక చేసిన చెరువులు ఇవే..

చెరువు	ఎఫ్‌టీఎల్ సహా విస్తీర్ణం (ఎకరాలు)	ప్రాంతం
సున్నం చెరువు	32.2	అల్లాపూర్
తమ్మిడికుంట	29.26	మాదాపూర్
నల్ల చెరువు (ఉప్పల్)	67.13	ఉప్పల్ భగాయత్
బతుకమ్మకుంట	14.06	బాగ్ అంబర్‌పేట
అప్పా చెరువు	39.29	గగన్ పహాడ్
బుమ్రుఖ్ దౌలా చెరువు	18.23	రాజేంద్రనగర్
నల్ల చెరువు (కూకట్‌పల్లి)	30.18	కూకట్‌పల్లి
తౌతానికుంట	5.18	ఖాజాగూడ
ఈర్ల చెరువు	31.38	మదీనాగూడ
ఎర్రకుంట	3.00	బాచుపల్లి

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ సాగర్ హైవే ఫార్మ్ ల్యాండ్స్ కలవు. కడ్తల్, యాచారం, మాల్‌లో DTCP అప్రూవ్ ప్లాట్స్ కలవు. మార్కెటింగ్ అసోసియేట్స్ కావలెను. వ:25-45. సుధారాణి రెడ్డి - 6281387190 [SCA25001642]

HOUSE FOR SALE

■ హయత్‌నగర్ మునగనూరు బ్యాంక్ కాలనీలో 200 చ॥గ॥ S/F 1600 Sft కొత్త ఇల్లు అమ్మకానికి కలదు. త్రాగునీరు. డ్రైనేజీ కూడా కలదు. కేవలం 95L. Ph: 9849688626. [HA-2978]

■ Nagole House for Sale G+1 = 2BHK + 3BHK Car Parking 167yards West Face 30 Feet Road Ph: 9885202404 [SCA25001592]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మార్వడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును 9160077916 స్పాట్ క్యాష్. [SCA25001608]

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్ మార్వాడి షాప్ ఏ ఫైనాన్సిలో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001519]

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6200]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, A.Srujana Reddy W/o Rajendra Reddy, R/o:Flat No. 301, Block-A, Paras Heights, Sri Venkateshwara Enclave, Upperpally, Hyderguda, R.R dist T.S, Changed my Name from ATMAKUR SRUJANA to A.SRUJANA REDDY W/O RAJENDRA REDDY For All Purposes [SCA25001646]

■ I, Shaik Sumaiya D/o. Sahik Ahmed, 21 years, R/o. H.No.1-106/1, Kammaguda, Hayathnagar, K.V.Ranga reddy, Telangana-501510, asper affidavit I have changed My name from Sumayya Shaik Ahmed (old name) to Shaik Sumaiya (new name) for all records purpose. [HA-99821]

LOST

■ I, Mavoori Sandeep S/o Mavoori Vidya Sagar. R/o H.No 13-6-434/C/64 Maruthi Nagar Ring Road mehidipatnam I Lost My Original Passport No. Z3211323 While Shifting House If Anyone Find Call:9989507607 [SCA25001651]

■ I, A.Srujana Reddy W/o Rajendra Reddy, R/o:Flat No. 301, Block-A, Paras Heights, Sri Venkateshwara enclave, Upperpally, Hyderguda. Lost My Original Passport No. F1359694 While Shifting House Attapur to Upperpally. If anyone find Call: 9542362888 [SCA25001645]

OLD AGE HOME

■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచానున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. 7981467036, 9391039990, 9949520296 [H-783367]

డ్రైవర్ కావలెను

డ్రైవర్ కావలెను హైదరాబాద్ లోని హైటెక్ సిటీలో హౌస్ డ్యూటీకి 15 సం॥ల అను భవము గల డ్రైవర్ కావలెను. డ్యూటీ 12 గంటలు. జీతం: 25,000/- నెలకు సంప్రదించండి. 8369999108

Wanted

■ హైదరాబాద్‌లోని డాక్టర్‌గారి ఇంట్లో వంట/ఇంటి పని చేయుటకు భార్యాభర్తలు కావలెను. మంచి జీతం+వసతి కల్పించబడును. ఫోన్: 9491877793 [SCA25001649]

■ త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. Ph:8520980099, 8520874499 [SCA25001603]

■ గుంటూరు లోని ప్రముఖ కంపెనీకి కారు డ్రైవర్ కావలెను. కనీసం 10సం.ల నుండి 15సం.ల అనుభవం కలిగి హైఎండు కారు నడుపగల డ్రైవర్ కావలెను. సంప్ర: 91333 99242 [G-329]

■ MG కార్ షోరూం శంషాబాద్‌లో పని చేయుటకు సేల్స్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ మేనేజర్, సర్వీస్ సూపర్ వైజర్, మెకానిక్స్ కావలెను. సెల్: 9492628629, 9491402020. [J-521]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-

గమనిక: జాపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

వివరాలకు: 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

హీరో రామ్‌చరణ్ ఇంటి నుంచి తప్పిపోయిన పక్షి దొరికింది..



రామ్‌చరణ్ భుజంపై వాలిన పెంపుడు పక్షి

బంజారాహిల్స్: ప్రముఖ సినీ హీరో రామ్‌చరణ్–ఉపాసన దంపతులు అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఆఫ్రికన్ బ్రీడ్ పక్షి నాలుగు రోజుల క్రితం తప్పిపోగా ఆదివారం దొరికింది. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–25లో నివసించే రాంచరణ్ ఆఫ్రికన్ గ్రే పక్షిని పెంచుకుంటున్నారు. మూడు రోజుల క్రితం ఈ పక్షి తప్పిపోయింది. ఇదే విషయాన్ని ఉపాసన తన ఇన్‌స్టాగ్రామ్‌లో తమ కుట్టీ తప్పిపోయిందంటూ పోస్ట్ చేశారు. గత శనివారం ఓ యువతి ఈ పక్షి కనబడిందంటూ ఓ ఫోటోను ఎనిమల్ కన్జర్వేషన్ వెల్ఫేర్ సొసైటీ దృష్టికి తీసుకువచ్చింది. దీంతో సదరు సంస్థ ఈ పక్షి వివరాలను తమ గ్రూపులో పోస్ట్ చేశారు. చివరకు ఇది రామ్‌చరణ్ ఇంటి నుంచి తప్పిపోయిన పక్షిగా తేల్చి ఆదివారం వారికి అప్పగించారు.

బైక్, నగదుతో ఉడాయించిన సెక్యూరిటీ గార్డు

బంజారాహిల్స్: రక్షణగా ఉండాల్సిన సెక్యూరిటీ గార్డు దొంగ అవతారమెత్తాడు. బైక్‌తో పాటు నగదుతో ఉడాయించిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అస్సాం రాష్ట్రం మోరిగోస్ జిల్లా ఉత్తర లుచోనాబోరి గ్రామానికి చెందిన అబ్దుల్ రషీద్ (25) బంజారాహిల్స్ రోడ్డునెంబర్–8లోని వైట్ హౌస్‌లో గత ఏడాది అక్టోబర్ నుంచి సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో వైట్ హౌస్ భవనం ఫెసిలిటీ మేనేజర్ ప్రణబ్‌కుమార్ స్వైన్ తన గదిలోని లాకర్‌లో రూ.2.08 లక్షల నగదును ఉంచి పైఅంతస్తుకు వెళ్లాడు. తిరిగి 12 గంటల సమయంలో రాగా గదిలోని లాకర్ విరిగిపోయి ఉంది. లాకర్‌లో ఉంచిన నగదు కనిపించకపోయేసరికి బయటకు వెళ్లి చూడగా హోండా షైన్ బైక్ కూడా కనిపించలేదు. తాను నగదు ఉంచే సమయంలో సెక్యూరిటీ గార్డ్ అబ్దుల్ రషీద్ మాత్రమే ఉన్నాడని, అతనే నగదు తీసుకుని బైక్‌తో ఉడాయించి ఉంటాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫోన్ చూడొద్దని అన్నందుకు..

మియాపూర్: ఫోన్ చూడవద్దని తల్లి మందలించడంతో టెన్త్ క్లాస్ చదువుతున్న ఓ బాలుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మియాపూర్‌లోని న్యూ హఫీజ్‌పేట్ మార్తాండ నగర్‌లో రత్నప్రభ అనే మహిళ కుమారుడు శౌర్యసింగ్(17), ఇద్దరు కూతుళ్లతో కలిసి స్థానికంగా బ్యూటీ పార్లర్ నడుపుతూ జీవనం కొనసాగిస్తుంది. సోమవారం సాయంత్రం శౌర్యసింగ్ ఫోన్ పట్టుకుని చూస్తూ కూర్చుని ఉండగా..ఎప్పుడూ ఫోన్ చూడొద్దు..పక్కన పెట్టు అంటూ రత్నప్రభ మందలించింది. దీంతో శౌర్య సింగ్ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. రాత్రి 8:30 గంటల సమయంలో కుటుంబ సభ్యులు తలుపు తట్టగా లోపలి నుండి గడియపెట్టి ఉంది. దీంతో స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా శౌర్యసింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందికి దించి కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. శౌర్య సింగ్ 10వ తరగతి ఓపెన్ విధానంలో చదువుతున్నాడు. తల్లి రత్నప్రభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టీజ్ చేశారంటూ.. విద్యార్థులను చితకబాదిన టీచర్

- అపస్మారక స్థితికి చేరిన ఓ విద్యార్థి
- పోలీసులకు ఫిర్యాదు

కుషాయిగూడ: పిల్లలు తనను టీజ్ చేశారన్న నెపంతో విద్యార్థులను ఎగ్జామ్ ప్యాడ్‌తో చితకబాదాడు ఓ ఉపాధ్యాయుడు. గాయపడ్డ నలుగురు విద్యార్థుల్లో ఓ విద్యార్థి అపస్మారకస్థితికి చేరగా..ముగ్గురికి గాయాలయ్యాయి. తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెచ్‌బీకాలనీలో సోమవారం చోటు చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీలోని మదర్ థెరిసా హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న కె.సాత్విక్, అక్షయ్, వశిష్టతో పాటు మరో విద్యార్థి స్కూల్ కంప్యూటర్ టీచర్ శ్రీనివాసరావును 'కట్టప్ప' అంటూ టీజ్ చేశారని ఆగ్రహం చెంది..వారిని ఇనుప ప్యాడ్‌తో చితకబాదాడు. దీంతో సాత్విక్ అనే విద్యార్థికి తలపై బలంగా తాకడంతో అపస్మారకస్థితికి వెళ్లాడు. వెంటనే అతన్ని వైద్యం కోసం ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సాయంత్రం 3:30 గంటల సమయంలో మీ బాబుకు ఫిట్స్ వచ్చి పడిపోయాడంటూ స్కూల్ యజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో సాత్విక్ తల్లిదండ్రులు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి నుంచి కాచిగూడలోని టీఎక్స్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. మంగళవారం మధ్యాహ్నం కొంచెం తేరుకున్న సాత్విక్ స్కూల్‌లో జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాడు. ఆగ్రహించిన తల్లిదండ్రులు స్కూల్ ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. గాయపడ్డ విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దాడికి పాల్పడ్డ శ్రీనివాసరావును అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. కాగా మధ్యాహ్నం కొంచెం తేరుకున్న సాత్విక్ తిరిగి అపస్మారకస్థితికి వెళ్లినట్లు తల్లి కవిత తెలిపింది.

'తండేల్' పైరసీపై కేసు

సాక్షి, సిటీబ్యూరో: నాగచైతన్య నటించిన తండేల్ సినిమా పైరసీకి గురైందంటూ నిర్మాణ సంస్థ అల్లు ఎంటర్‌టైన్మెంట్స్ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీని ఆధారంగా మంగళవారం కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. అల్లు ఎంటర్‌టైన్మెంట్ సంస్థ తన ఫిర్యాదులో పైరసీ వీడియోలు ఉన్న సోషల్ మీడియా లింకులతో పాటు పలు వెబ్‌సైట్ల యుఆర్ఎల్‌లను పొందుపరిచింది. వీటి ఆధారంగా పోలీసులు సాంకేతిక దర్యాప్తు చేపట్టారు.

స్టాండింగ్ కమిటీకి 4 నామినేషన్లు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీకి మంగళవారం నలుగురు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణరావు(కూకట్‌పల్లి), లింగాని ప్రసన్నలక్ష్మి (అడ్డగుట్ట), కాంగ్రెస్ నుంచి బూరుగడ్డ పుష్ప (రామచంద్రాపురం), మహాలక్ష్మి రామన్‌గౌడ్ (హిమాయత్‌నగర్) నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో మహాలక్ష్మి రామన్‌గౌడ్ తొలుత బీజేపీ నుంచి పోటీచేసి కార్పొరేటర్‌గా గెలిచారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బూరుగడ్డ పుష్ప బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. నామినేషన్ పత్రాల్లో కార్పొరేటర్లకు పార్టీల గుర్తింపు ఉండదు. 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యుల కోసం జరగనున్న ఈ ఎన్నికల్లో 146 మంది కార్పొరేటర్లు ఓటర్లుగా ఓట్లు వేయనున్నారు.

ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్ పైనుంచి పడి వ్యక్తి మృతి

నిజాంపేట్: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి అపార్ట్‌మెంట్ పైనుంచి పడి మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కాకినాడ జిల్లా పత్తిపాడు మండలం ఉత్తర కంచి గ్రామానికి చెందిన ఉంగరాల సూరిబాబు (65), భార్య లచ్చమ్మ ప్రగతి నగర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ప్రగతి నగర్ ఇన్‌కాయ్స్ సర్కిల్ నుంచి రాజీవ్ గృహకల్పకు వెళ్ళే దారిలో ఓ అపార్ట్‌మెంట్ టెర్రస్‌పై మరమ్మతు పనులకు కూలీగా వెళ్లిన సూరిబాబు ప్రమాద వశాత్తు పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జనార్ధనరావును హత్యచేసిన మనవడికి మానసిక వైద్య పరీక్షలు

శ్రీనగర్ కాలనీ: వెల్జన్ ఇండస్ట్రీస్ అధినేత వీసీ జనార్ధనరావును దారుణంగా హత్యచేసిన మనువడు కీర్తితేజను..అతని మానసిక పరిస్థితిని తెలుసుకోవడానికి చంచల్‌గూడ జైలు నుండి ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రికి తరలించారు. ఈ నెల 6న జనార్ధనరావును అతని మనువడు కీర్తితేజ దారుణంగా హత్య చేసిన సంగతి విదితమే. కాగా అతడు ఉద్దేశపూర్వకంగానే హత్యచేశాడా లేకపోతే మానసిక పరిస్థితి సరిగాలేకపోవడం వల్ల ఈ దారుణానికి పాల్పడ్డాడా అనే విషయాలను నిర్ధారించుకోవడానికి చంచల్‌గూడ అధికారులు ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో పలు పరీక్షలు వైద్యులు నిర్వహించారు. పలు ప్రశ్నలతో పాటు మానసిక స్థితిని తెలుసుకున్నారు. అతని మానసిక పరిస్థితి బాగానే ఉందని, మరింత లోతుగా తెలుసుకోవడానికి సైకోమెట్రీ టెస్ట్‌ను చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. మూడురోజుల తర్వాత అపాయింట్‌మెంట్ ఇచ్చామని, అప్పుడు సైకోమెట్రీ పరీక్షతో పూర్తిస్థాయిలో కీర్తితేజ మానసిక పరిస్థితి తెలుసుకోవచ్చని వైద్యులు తెలిపారు.

మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు

- జలమండలి హెచ్చరిక
- లక్డీకాపూల్‌లో సిల్ట్ తొలగింపు
- మ్యాన్‌హోళ్ల నుంచి ప్లాస్టిక్ సంచులు, వాటర్‌బాటిళ్లు, పరుపులు, దిండ్లు బయటపడిన వైనం..



లక్డీకాపూల్ వద్ద మ్యాన్‌హోళ్ల నుంచి బయట పడిన వ్యర్థాలు

సాక్షి, సిటీబ్యూరో: డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలో చెత్త, వ్యర్థాలు వేస్తే కఠినంగా వ్యవహరించాలని జలమండలి నిర్ణయించింది. రెడ్‌హిల్స్ పరిధిలోని లక్డీకాపూల్‌లో మరోమారు సీవరేజ్ ఓవర్ ఫ్లోను తీవ్రంగా పరిగణించింది. వాణిజ్య భవన సముదాయాల నిర్వాహకులు సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోకుండా నేరుగా జలమండలి సీవరేజ్ నెట్ వర్క్‌కు అనుసంధానం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. మంగళవారం లక్డీకాపూల్‌లో జెట్టింగ్ యంత్రాన్ని ఉపయోగించి సిల్ట్‌ను బయటికి తీసి మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేశారు. ఫలితంగా సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్య పరిష్కారం అయింది. స్పెషల్ డ్రైవ్ –1లో నాలుగు నెలల క్రితం డీసిల్టింగ్ పనులు నిర్వహించి సిల్ట్ అంతా తొలగించారు. కానీ మళ్లీ అందులో వ్యర్థాలు చేరడంతో పేరుకుపోయి మళ్లీ ఓవర్ ఫ్లో అయింది. మ్యాన్ హోళ్లలో ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, వాటర్ బాటిళ్లు, ఘన పదార్థాలు, దిండ్లు, పరుపులు కూడా పడటంతో సిబ్బంది విస్మయం చెందారు. హోటళ్లు, కార్యాలయాలు, బేకరీలు, ఫుడ్ కోర్టులు, వాణిజ్య భవనాల యజమానులు, బహుళ అంతస్తు భవన సముదాయాల నిర్వాహకులు..తమ సీవరేజ్ పైపు లైన్‌ను నేరుగా జలమండలి సీవరేజ్ నెట్‌వర్క్‌కు అనుసంధానం చేయడంతో వాటి నుంచి వచ్చే ఆహార, వ్యర్థ పదార్థాలు మ్యాన్ హోళ్లలో చేరుతున్నాని గుర్తించారు. సిల్ట్ చాంబర్లు నిర్మించుకోకపోవడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని జలమండలి గుర్తించింది. దీంతో ఇకపై వాణిజ్య భవన సముదాయాల నిర్వాహకులు తప్పనిసరిగా సిల్ట్ ఛాంబర్లను ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు జారీ చేసేందుకు జలమండలి సిద్ధమైంది. గడువులోగా నిర్మించుకోకుంటే సీవరేజ్ పైపులైన్ కనెక్షన్లను తొలగించాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

దరఖాస్తుదారులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

రహమత్‌నగర్: రేషన్ కార్డు దరఖాస్తుదారులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని నగర కాంగ్రెస్ నాయకురాలు, జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా సూచించారు. డివిజన్‌లోని పలు మీ సేవా కేంద్రాలను మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరవుతాయని అలాగే రేషన్ కార్డులో తప్పులు, కొత్తగా పేర్లు నమోదు చేసుకునే అవకాశం కూడా ఉందన్నారు. ఆమె వెట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

13న దైవ సన్నిధానానికి విద్యారణ్య భారతీస్వామి



ఫిలింనగర్: ఈనెల 13న ఫిలింనగర్ దైవ సన్నిధానంలో హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతీస్వామి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 9 నుంచి స్వామి వారితో విద్యారణ్య మహా సంస్థాన పీఠార్చన, హారతి అనంతరం కమిటీ సభ్యులకు, భక్తులకు అనుగ్రహ భాషణ, ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని ఆలయ వర్గాలు వెల్లడించాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని సూచించారు.

ఆది నారాయణకు సన్మానం



లిబర్టీ: సామాజిక సేవ చేస్తున్న ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణను ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు ఇచ్చి ధ్రువీకరణ పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవ శాంతి సామరస్యం పలు పర్వదినాలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

మొరాయిస్తున్న సిటీ బస్సులు!



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునంబర్-5లోని వెంకటగిరి చౌరస్తాలో ఆర్టీసీ సిటీ బస్సులు ఎత్తు ఎత్తులేక మొరాయిస్తున్నాయి. మంగళవారం ఉదయం రద్దీ వేళల్లో జూబ్లీహిల్స్ వైపు వెళ్లే క్రమంలో రోడ్డు ఎత్తుగా ఉండడంతో బస్సు ఆగిపోయింది. దీంతో ప్రయాణికులతో పాటు గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించగా వాహనదారులు సైతం తీవ్రఇబ్బందులు పడ్డారు.

వృద్ధుడి అదృశ్యం

వెంగళరావునగర్: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహమత్‌నగర్‌లో నివసించే బి.మమత పూల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమె తండ్రి కైక్వాడ్ సోపం ఈనెల 6న జీటీఎస్ టెంపుల్‌కు వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. వృద్ధుడికి కొద్దిగా మతిమరుపు కూడా ఉంది. తండ్రి కోసం అనేక ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లేకపోవడంతో మమత మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం అపహరణకు గురైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన పి.తిరుమలరావు వ్యాపారం చేస్తుంటాడు. ఈనెల 10న అర్ధరాత్రి తన ఇంటి ఎదుట ద్విచక్ర వాహనం పార్క్ చేశాడు. తెల్లారుజామున వచ్చి చూసేసరికి కనిపించలేదు. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైన్ షాపు వద్ద వ్యక్తి మృతి

రహమత్‌నగర్: వైన్ షాపు వద్ద వ్యక్తి చెందిన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీలక్ష్మి వైన్ షాపు వద్ద ఓ వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు మంగళవారం బోరబండ పోలీసులు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తిని పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు. సనత్‌నగర్ లోని కబీర్‌నగర్‌కు చెందిన వినోద్ (30) గా గుర్తించి కూలి పనులు చేస్తుండేవాడని తెలిపారు. అతిగా మద్యం తాగడం వల్లే మృతి చెంది ఉండవచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఈమేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

రేషన్ కార్డులకు క్యూ..

- కిటకిటలాడిన బంజారాహిల్స్, ఖైరతాబాద్ సెంటర్లు
- సరైనా పత్రాలతో రావాలని అధికారుల సూచన



మీ-సేవా కేంద్రాలకు పెద్ద ఎత్తున దరఖాస్తుదారులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న మీ-సేవా కేంద్రం నిర్వాహకులు

బంజారాహిల్స్: కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో దరఖాస్తుదారులు మీ-సేవా కేంద్రాలకు క్యూ కట్టారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-7లోని మీ-సేవా కేంద్రంతో పాటు ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయ ఆవరణలోని సెంటర్ల వద్ద ఉదయం నుంచే బారులుదీరారు. కొత్త కార్డుతో పాటు ప్రస్తుత కార్డులో కొత్తపేర్లు చేర్చాలని ఆధార్‌తో పాటు కరెంట్ బిల్లు, గ్యాస్ బిల్లును జతచేసి దరఖాస్తు చేసుకున్నారు. సిబ్బంది సైతం అప్పటికప్పుడే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. బంజారాహిల్స్‌లోని మీ-సేవా కేంద్రానికి ఒక్కరోజే దాదాపు 1000 మంది వరకు, అలాగే బస్తీలు, కాలనీల్లోని మీ-సేవా కేంద్రాలకు కూడా దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మరికొద్ది రోజుల పాటు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సిబ్బంది తెలిపారు. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్-7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వేంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ, సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలోని 81 రేషన్ షాపుల పరిధిలో కొత్తగా రేషన్ కార్డు కోసం మీ-సేవా కేంద్రాలకు వెళ్లి సదరు దరఖాస్తు ఫారానికి సంబంధిత డాక్యుమెంట్లు జత పరిచి ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

సర్కిల్-7 పరిధిలో 83,013 రేషన్‌కార్డులు..

ఖైరతాబాద్ సర్కిల్-7 పరిధిలో 81 రేషన్ షాపులు ఉండగా ప్రస్తుతం వీటి పరిధిలో ఆహార భద్రత కార్డులు 79,531, అంత్యోదయ అన్నయోజన కార్డులు 3481, ఒక అన్నపూర్ణ కార్డు కలిపి మొత్తం 83,013 కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల్లో 2,92,882 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. సర్కిల్ పరిధిలో మొత్తం ప్రతినెలా 18,19,011 కిలోల రేషన్ బియ్యం అందిస్తున్నారు.

కొత్తవారికి ఈ నెల రేషన్ లేనట్లే..!

ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల్లో గత నెల 6,093 మందిని అర్హులుగా గుర్తించి సర్వే చేయగా ఇందులో 2,938 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. అయితే జీహెచ్‌ఎంసీ పరిధిలో నూతన లబ్ధిదారులకు ఇప్పటి వరకు పంపిణీ చేయలేదు. ఈనెల కూడా వారికి రేషన్ లేనట్లేనని తెలుస్తోంది.

డిజిటల్ బోర్డు ద్వారానే పాఠ్యాంశాలు బోధించాలి



అవగాహన కల్పిస్తున్న డీఈఓ రోహిణి

వెంగళరావునగర్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇకనుంచి తప్పనిసరిగా డిజిటల్ ప్యానల్ బోర్డు ద్వారానే పాఠ్యాంశాలు బోధించాలని డీఈఓ రోహిణి సూచించారు. యూసుఫ్‌గూడలోని ప్రభుత్వోన్నత పాఠశాలలో మంగళవారం ఖైరతాబాద్ మండల పరిధిలోని ఇంగ్లిష్ టీచర్స్‌కు ఒకరోజు ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డు ట్రెనింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డిజిటల్ ప్యానల్ ద్వారా పిల్లలకు ఎలా పాఠాలు నేర్పించాలి.. వాటిని ఎలా వినియోగించాలో టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ప్రతి టీచర్ డిజిటల్ క్లాసులపై అవగాహన పెంచుకుని విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ ఉప విద్యాశాఖాధికారి శ్యామ్యూల్‌రాజ్, ప్రధానోపాధ్యాయురాలు పి.పరమేశ్వరమ్మ, టీచర్లు నరసింహ, ఖైరతాబాద్ మండల పరిధిలోని ఇంగ్లిష్ టీచర్లు పాల్గొన్నారు.

వేసవికి ముందే నీటి కష్టాలు!

తెలంగాణ బాలుర గురుకులంలో వాటర్ లేక విద్యార్థుల అవస్థలు



సైట్-3లోని బాలుర గురుకుల ఆశ్రమ పాఠశాల

రహమత్‌నగర్: వేసవికి ముందే నీటి కష్టాలు మొదలయ్యాయి. బోరబండ సైట్-3 లోని తెలంగాణ స్కూల్, జూనియర్ కాలేజీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సరిపడా వాటర్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందులో దాదాపు 600 మంది స్టూడెంట్స్ విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో ఉన్న 3 బోర్లు ఉండగా అందులో 2 పని చేయడం లేదు. ఉన్న ఒక్క బోర్ నుంచి లోప్రెషర్‌తో నీరు వస్తుండడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. వేసవి ఆరంభంలో ఇలా ఉంటే మున్ముందు ఎలా ఉంటుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

చీటింగ్ చేస్తున్నారంటూ వైద్యురాలి ఫిర్యాదు

వెంగళరావునగర్: తన అనుమతి లేకుండా రిజిస్ట్రేషన్ నంబర్, స్టాంప్‌ను వినియోగిస్తున్నారంటూ ఓ వైద్యురాలు ప్రైవేట్ క్లినిక్‌పై ఫిర్యాదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేటకు చెందిన ఓ క్లినిక్‌లో సంపూర్ణ అనే వైద్యురాలు కొన్నేళ్ల కిందట విధులు నిర్వహించారు. ఏడాది తర్వాత క్లినిక్ నుంచి బయటకు వచ్చారు. అయితే ఆమె బయటకు వచ్చిన తర్వాత కూడా ఆమెకు చెందిన రిజిస్ట్రేషన్ నంబర్, స్టాంప్‌ను ఉపయోగించుకుంటున్నారని వైద్యురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో యువతి మృతి

వెంగళరావునగర్: అనారోగ్యంతో యువతి మృతి చెందిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌లో కె.రాజకుమారి తన తల్లి, సోదరితో కలిసి కొంతకాలంగా నివాసం ఉంటోంది. ఆమె హౌస్‌కీపింగ్‌గా విధులు నిర్వహిస్తోంది. గత 10 రోజులుగా జ్వరంతో బాధపడుతుండడంతో ఆమెను స్థానికంగా ఉన్న చర్చిలో ఉంచి జ్వరం త్వరగా తగ్గాలని ప్రార్థనలు చేయిస్తున్నారు. ఈనెల 9న అర్ధరాత్రి ఆమె పరిస్థితి విషమించి మృతి చెందింది. ఆమె కజిన్ సోదరుడు బబ్లూ మృతిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేలిముద్రలతో మృతుడి వివరాల గుర్తింపు



రాగెపోగుల నవతేజ (ఫైల్)

బంజారాహిల్స్: వేలిముద్రల ఆధారంగా ఓ మృతుడి వివరాలను బంజారాహిల్స్ పోలీసులు గుర్తించి డెడ్ బాడీని కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి సమీపంలో గత నెల 25న అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఓ యువకుడు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ కేబీఆర్ పార్కు వాక్‌వే ఫెన్సింగ్‌ను ఢీకొట్టగా ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే మృతుడి వివరాల కోసం బంజారాహిల్స్ పోలీసులు ఫొటోలతో ఆరాతీసినా, లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో గుర్తుతెలియని మృతదేహంగా నమోదు చేసి ఉస్మానియా మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వేలిముద్రలను పోలీసులు ఫింగర్‌ప్రింట్స్ బ్యూరోకు పంపించారు. 2015లో కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ కేసులో నిందితుడిగా ఉన్న రాగెపోగుల నవతేజ (39) వేలిముద్రలతో మృతుడి వేలిముద్రలను పోల్చగా ట్యాలీ కావడంతో మిస్టరీ వీడింది. మృతుడి చిరునామా పరిశీలించగా కర్నూల్ జిల్లా సిరివేలు మండలం కోటపాడు గ్రామంగా గుర్తించారు. బంజారాహిల్స్ పోలీసులు మృతుడి ఫొటోలను అక్కడి సర్పంచ్‌కు పంపించి ఆరా తీయగా అదే గ్రామానికి చెందిన నవతేజగా నిర్ధారణ అయ్యింది. దమ్మాయిగూడ సమీపంలోని జవహర్‌నగర్‌లో నవతేజ కుటుంబం ఉంటుండగా ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సెంట్రింగ్ వర్క్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న నవతేజ కొంతకాలంగా కుటుంబానికి దూరంగా ఉంటూ బసవతారకం ఆస్పత్రి వద్ద ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్నాడు. పోలీసులు మృతుడి కుటుంబసభ్యుల చిరునామా తెలుసుకుని తమ్ముళ్లు నితిన్, నిఖిల్‌కు మృతదేహాన్ని అప్పగించారు. కంప్యూటర్‌లో ఫీడ్ అయిన ఫింగర్ ప్రింట్ డేటాతో మృతుడి పూర్తి సమాచారం తెలుసుకున్నామని పోలీసులు తెలిపారు.

ఘంటసాల వర్ధంతి

లిబర్టీ: ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని లిబర్టీ ప్లాజాలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ.. తెలుగు సినిమా తొలితరం నేపథ్య గాయకుడు అనేక చిత్రాల్లో పాటలు పాడి తెలుగు ప్రజల మనస్సు దోచుకున్నాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేణు, నాగిళ్ల నవీన్‌కుమార్, పుష్పాంజలి, నంది కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు గ్లోబల్ ఎడ్యుకేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అధ్యక్షుడు మురళీముకుంద్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ప్రతిష్ఠాత్మక గ్లోబల్ ఎడ్యుకేషన్ అవార్డు 2024ను అందుకుంది. ఈనెల 9న దుబాయ్ వేదికగా జరిగిన గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ కార్యక్రమంలో ఏకేఎస్ వరల్డ్ ఎడ్యుకేషన్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ సీఈఓ దినేష్ కామ్రా చేతుల మీదుగా జూబ్లీహిల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు మురళీముకుంద్ అవార్డును అందుకున్నారు.'ఎక్సెప్షనల్ స్కూల్ ఇన్ బెస్ట్ ప్రాక్టీసెస్'కి గాను ఈ అవార్డు దక్కింది. అవార్డు అందుకున్న వారిలో పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మి, ప్రిన్సిపాల్ కాంచనవల్లి కూడా ఉన్నారు.

బిరుదుతో సత్కారం



విశ్వగురు బిరుదు అందుకుంటున్న శ్రీల ప్రభుపాదుల

బంజారాహిల్స్: మహా కుంభమేళా సందర్భంగా ఇస్కాన్, ప్రపంచవ్యాప్త హరేకృష్ణ ఉద్యమ వ్యవస్థాపకుడు శ్రీల ప్రభుపాదులను అఖిల భారతీయ అఖార పరిషత్ విశ్వగురు బిరుదుతో సత్కరించింది. చరిత్రలో ఈ బిరుదును పొందిన ఏకైక వ్యక్తిగా శ్రీల ప్రభుపాదులే కావడం విశేషం. ఈ సందర్భంగా మధు పండిట్ దాస మాట్లాడుతూ.. శ్రీనిత్యానంద త్రయోదశి శుభ సందర్భంగా మహా కుంభమేళా దివ్య వాతావరణంలో శ్రీల ప్రభుపాదులకు విశ్వగురు బిరుదును అందించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

లిబర్టీ: పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సందానందు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకుంటున్న ఒక్కో నిర్ణయం పేద, బడుగు బలహీన, దళిత బహుజన జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. తాజాగా ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుకను సరఫరా చేస్తామని ప్రకటించడం అభినందనీయమని దీని వల్ల దళిత, మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న రామచందర్ రావు

పంజగుట్ట: భారతదేశాన్ని నిర్వీర్యం చేసేందుకు కొన్ని విదేశీ శక్తులు పథకం ప్రకారం మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు ఇక్కడికి పంపిస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు రామచందర్ రావు పిలుపునిచ్చారు. వికాస భారతి ఆధ్వర్యంలో అధ్యక్షుడు డాక్టర్ పాండురంగారావు అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'సే నో టు డ్రగ్స్' పేరుతో మాదకద్రవ్యాలు తీసుకుంటే కలిగే నష్టంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు, మాజీ ఐఏఎస్‌లు పద్మనాభరెడ్డి, ఎం.వి.రెడ్డి, లోక్‌సత్తా నాయకుడు దోసపాటి రాము, డాక్టర్ దేవేందర్ సింగ్, వికాస భారత్ ప్రతినిధులు తాటి శ్రీనివాస్, వి.నరోత్తమ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. స్కూల్ నుంచే పిల్లలకు చాక్లెట్ల రూపంలో మత్తు పదార్థాలు అమ్మి వారిని అలవాటు చేస్తున్నారన్నారు. డ్రగ్స్ విషయంలో ప్రభుత్వాల మీదే భారం వేయకుండా ప్రతిఒక్కరూ డ్రగ్స్, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు.

రోడ్డు వేయిస్తానని డబ్బుల వసూలు!

తర్వాత ముఖం చాటేసిన వర్క్ ఇన్‌స్పెక్టర్



జూబ్లీహిల్స్ రోడ్డునంబర్-10 రోడ్డు దుస్థితి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-10లోని గాయత్రీహిల్స్ రోడ్డు పూర్తిగా ధ్వంసమై అధ్వానంగా మారింది. అయితే ఇక్కడ రోడ్డు వేయిస్తానంటూ జూబ్లీహిల్స్ సర్కిల్-18 జూబ్లీహిల్స్ రోడ్డునంబర్-10 ఏరియా వర్క్ ఇన్‌స్పెక్టర్ స్థానిక వ్యాపారి నుంచి 6 నెలల క్రితం రూ.4 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే సదరు వ్యాపారి రోడ్డు పని విషయమై వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను అడగగా కొంతకాలంగా ముఖం చాటేస్తున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం రోడ్డు పనులు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం తమ బడ్జెట్ నుంచే నిధులు మంజూరు చేయించి టెండర్ పిలిచి కాంట్రాక్టర్‌కు ఆర్డర్ ఇచ్చి పని చేయిస్తుంది. అయితే ఈ వర్క్ ఇన్‌స్పెక్టర్ మాత్రం తానే రోడ్డు వేయిస్తానంటూ డబ్బులు వసూలు చేసి ముఖం చాటేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ విషయమై ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదులు అందాయి. ఇప్పటికైనా ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి స్పందించి ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశిస్తే వర్క్ ఇన్‌స్పెక్టర్ వసూళ్ల లీలలు వెలుగులోకి వస్తాయని జూబ్లీహిల్స్‌వాసులు కోరుతున్నారు.

ఈడబ్ల్యూఎంఎస్ రిజర్వేషన్లలోనూ వర్గీకరణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ గుప్తా

పంజగుట్ట: ఈడబ్ల్యూఎంఎస్ రిజర్వేషన్లలోనూ వర్గీకరణ చేపట్టాలని వైశ్య వికాస వేదిక అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా కోరారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం స్థానికసంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లలో వైశ్యుల వాటా తేల్చాలి అనే అంశంపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. కాంగ్రెస్ ప్రభుత్వం చట్టసభల్లో వైశ్యులకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని, రానున్న స్థానిక సంస్థల్లో తగిన వాటా కల్పిస్తే తాము నిరూపించుకుంటామని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో తమ జనాభా 4 శాతం ఉన్నట్లు తేలిందని కానీ ప్రస్తుతం నిర్వహించిన సర్వేలో తక్కువచేసి చూపుతున్నారని మళ్లీ కుల గణన సర్వే చేపట్టిన తమ జనాభాను తేల్చాలన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించారని, ఎన్నికలకు ముందే వైశ్యులకు ఎంత ఇస్తారో తెలపాలని డిమాండ్ చేశారు. త్వరలోనే హైదరాబాద్ వేదికగా వైశ్య రాజకీయ రణ భేరీ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎన్.రమేశ్, రాంనాథ్, దయాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూల్ విద్యార్థుల సత్తా

బంజారాహిల్స్: ఈ నెల 8, 9 తేదీల్లో బెంగుళూరులో జరిగిన ఎనేబిలింగ్ లీడర్‌షిప్ ఫుట్‌బాల్ ఎలవేట్ జాతీయస్థాయి పోటీల్లో బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల జట్టు ట్రోఫీని సొంతం చేసుకుంది. దేశవ్యాప్తంగా తొమ్మిది నగరాల నుంచి ఆరు జట్లు సీనియర్ కేటగిరిలో తలబడ్డాయి. మేనేజర్ బోస్లే, కోచ్ ఇబ్రహీం, స్కూల్ హెడ్‌మాస్టర్ రవీందర్‌రెడ్డి, టీచర్లు సుజాత, శారదల ప్రోత్సాహంతో తొమ్మిదో తరగతి విద్యార్థులు ప్రకాశ్, గోవింద్, నాని, మహేశ్, కార్తీక్, ఆనంద్, అంజన్, గణేశ్, కృష్ణ, లోవా ప్రసాద్ తదితరులు ప్రతిభ చాటారు. ఈ జట్టు విద్యార్థులందరికీ ఇంటర్ నుంచి ఒక్కొక్కరికీ రూ.20 వేల చొప్పున ప్రభుత్వం పారితోషికం అందించనున్నది. జట్టు సభ్యులను హెచ్‌ఎం, టీచర్లు ప్రత్యేకంగా అభినందించారు.



చెక్కు అందుకుంటున్న ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ఎస్సీ ఉపకులాలను ఒకే గ్రూపులో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజలింగం

పంజగుట్ట: ఎస్సీ 57 ఉపకులాలను ఏ గ్రూపులోనే చేర్చాలని ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వినతిపత్రం ఇచ్చామని, అయినా ఉపకులాలను మూడు ముక్కలుగా చేయడం బాధాకరమని తెలంగాణ ఎస్సీ 57 ఉపకులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ ఉపకులాల సంఘాల నాయకులతో కలిసి మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి ఎస్సీ 57 ఉపకులాలను ఒక్కచోటే చేర్చి జనాభా దామాషాప్రకారం 6 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అంతేగాకుండా ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లు కేటాయించాలన్నారు. అలాగే రాజకీయంగా కూడా ఇప్పటివరకు ఉపకులాలకు పెద్దగా న్యాయం జరగలేదని రాజకీయాల్లోనూ ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ రిజర్వేషన్‌ను 15 శాతం నుంచి 18 శాతానికి పెంచి మూడు గ్రూపులకు ఒక్కో శాతం చొప్పున కేటాయించాలని విన్నవించారు. సమావేశంలో కె.ఎల్లయ్య, కె.రమేశ్, శంకర్, సారమ్మ, రాములు, నర్సింహ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు స్థలం కబ్జాకు యత్నం..!

ఫిలింనగర్: ఫిలింనగర్ రోడ్డు నంబర్-1లోని విగ్రహాల వెనుకాల ఉన్న స్థలంలో 2 నెలల క్రితం ఆక్రమణలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. అయితే ఇక్కడ రోడ్డు నిర్మించాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు లేఖ రాయడంతో వారు స్పందించి రోడ్డు వేశారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు తాము కోటి రూపాయలు ఖర్చు పెట్టి రోడ్డు వేయించామని ఇక్కడ ఉదయం, రాత్రి వేళల్లో స్థలం చుట్టూ కర్రలు పెట్టి వారి వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు వినియోగిస్తున్నారు. కాలనీవాసులు, బస్తీవాసులు ప్రధాన రోడ్డును దాటేందుకు ఉపయోగపడాల్సిన ఈ రోడ్డు అక్రమ పార్కింగ్‌తో వినియోగంలో లేకుండా పోయింది. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తే రోడ్డు వినియోగంలోకి వస్తుందని స్థానికులు కోరుతున్నారు.



ఫిలింనగర్ విగ్రహాల వెనుక స్థలంలో నిలిపిన వాహనాలు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

భారత ఇంజినీర్లకు విదేశాల్లో ఆదరణ



మంగళవారం ఎస్కీలో జరిగిన సదస్సులో పాల్గొన్న ఇంజినీరింగ్ ప్రముఖులు

రాయదుర్గం: భారత ఇంజినీర్లకు విదేశాల్లో అత్యంత విలువ, గౌరవం ఉన్నాయని సింగరేణి మాజీ డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.బాలకోటిరెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో 'జాతీయ ఇంధన భద్రత- అరుదైన ఖనిజ సంపద అన్వేషణ' అనే అంశంపై 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. మన ఇంజినీర్లకు కష్టపడే తత్వం, లాభాలు తెచ్చిపెట్టాలనే తపనతోపాటు విషయ పరిజ్ఞానం బాగా ఉంటుందన్నారు. కేరళ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ చైర్మన్ బాలకృష్ణన్ నాయర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విషయాలపై తమ రాష్ట్రంలో ప్రతినెలా రెండు, మూడు జాతీయ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మైనింగ్ విభాగం అధిపతి కేజే అమర్‌నాథ్, పలు యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, ఫ్యాకల్టీ, అధికారులు, ఇంజినీరింగ్ ప్రముఖులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి 2,480 దరఖాస్తులు

– ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,130 అర్జీలు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 2,480 దరఖాస్తులు వచ్చాయి. అందులో ఇందిరమ్మ ఇళ్ల అర్జీలు 2,130 ఉన్నాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ 139, విద్యుత్ 110, రెవెన్యూ 36, ఇతర శాఖలకు సంబంధించి 64 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణిలో ఒక దరఖాస్తు అందినట్లు ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలకు తక్షణ పరిష్కారం చూపారు.

ఐజీ ఆఫీస్‌కు నార్సింగి డీఐ అటాచ్

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో డీఐగా పనిచేస్తున్న శ్రీనివాస్‌పై పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. ఆయనను ఉన్నతాధికారులు ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. సినీహీరో రాజ్‌తరుణ్, నగ్న వీడియోలు, డ్రగ్స్ వంటి పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న మస్తాన్‌సాయిపై లావణ్య అనే మహిళ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో లావణ్య సదరు పోలీసు అధికారితో మాట్లాడిన హనీట్రాప్ వీడియోలంటూ సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్లలో చక్కర్లు కొట్టాయి. లావణ్యతో డీఐ శ్రీనివాస్ సన్నిహితంగా ఉన్నారనే విషయం పోలీసు ఉన్నతాధికారుల విచారణలో తేలటంతో ఆయనపై మంగళవారం చర్యలు తీసుకున్నారు. లావణ్యకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాలని మస్తాన్‌సాయి, సినీహీరో రాజ్‌తరుణ్ తరపున వాదిస్తున్న ఆర్‌జే శేఖర్‌బాష పోలీసులను డిమాండ్ చేశారు.

తైక్వాండో అంతర్జాతీయ రెఫరీగా విజయ్‌కుమార్



విజయ్‌కుమార్‌ను సన్మానించిన తైక్వాండో అసోసియేషన్ నాయకులు

మణికొండ: తైక్వాండో అంతర్జాతీయ రెఫరీగా మాస్టర్ విజయ్‌కుమార్ సోమా అర్హత సాధించారు. క్యోరుగి, పూమ్సే విభాగాల్లో రెఫరీగా అర్హత సాధించి రాష్ట్రం నుంచి మొదటి మాస్టర్‌గా నిలిచారు. దాంతో మంగళవారం ఆయనను మణికొండలోని సోమా కరాటే ఇనిస్టిట్యూట్‌లో రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ మాజీ కోశాధికారి మహేశ్వర్, తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మీర్ వహాజ్ అలీఖాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం కృష్ణ, కోశాధికారి మారు తీవరప్రసాద్, టెక్నికల్ కమిటీ చైర్మన్ నరసింహ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.సురేష్ సన్మానించారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని ఉన్నత అవకాశాలను పొందాలని వారు ఆకాంక్షించారు.

నగరంలో నేడు

- మాదాపూర్ శిల్పారామంలో ఒడిశా ఫుడ్ అండ్ క్రాఫ్ట్ మేళా ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- దళిత స్త్రీలపై హింస, మానసిక ఆరోగ్యం: వివిధ కోణాలు'అనే అంశంపై లక్డీకాపూల్‌లోని అంబేడ్కర్ రిసోర్స్ సెంటర్‌లో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సదస్సు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

అదను చూసి అదనపు బాదుడు

- రుసుం రూ.45 కాగా, రూ.100 నుంచి 250 వరకు వసూలు
- ఎక్కువ వసూలు చేస్తే టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చు

రేషన్ దరఖాస్తులపై 'మీ సేవ' కేంద్రాల నిర్వాకం



సాక్షి, సిటీబ్యూరో: అదను చూసి అదనపు బాదుడుకు తెగబడ్డారు మీ సేవా కేంద్రాల నిర్వాహకులు. కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే పేదల జేబులను గుల్ల చేస్తున్నారు. మీ సేవా కేంద్రంలో ఆన్‌లైన్ సేవల రుసుం రూ.45 మాత్రమే చెల్లించాలి. మీ సేవా రశీదుపై ప్రింట్ అయిన రుసుం కంటే నయా పైసా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదు. అదనంగా వసూలు చేస్తే మీ సేవా కేంద్రం నిర్వాహకులపై టీఎస్ ఆన్‌లైన్ హెల్ప్‌లైన్ నెంబర్ 040-4567-6699కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. స్థానిక తహసీల్దార్‌కు గానీ, కలెక్టరేట్‌లో గానీ ఫిర్యాదు చేయవచ్చు. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానించడంతో మీ సేవా కేంద్రాల నిర్వాహకులు బాహాటంగా అదనపు వసూళ్లకు దిగారు. దరఖాస్తు దారుల నుంచి రూ.100 నుంచి రూ.250 వరకు దండుకుంటున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఆన్‌లైన్ సేవల రుసుంతోపాటు అదనంగా జిరాక్స్ ఒక్కంటికి రూ. 2 చొప్పున ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. గత రెండురోజులు నుంచి మీ సేవా కేంద్రాల ద్వారా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు లభించింది. ఈ అవకాశం నిర్వాహకులకు వరంగా మారింది. వారి తీరు ప్రజలకు భారంగా తయారైంది. నాలుగేళ్ల క్రితం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే పౌర సరఫరాల శాఖ వెబ్‌సైట్‌లో ఎఫ్ఎస్‌సీ లాగిన్ నిలిచి పోయింది. తాజాగా ఆ దానిని ఆ శాఖ పునరుద్ధరించడంతో దరఖాస్తుదారులతో మీ సేవ కేంద్రాలు కిక్కిరిసిపోతున్నాయి. తెల్లవారుజాము నుంచే జనం బారులు తీరుతున్నారు. ఇదే అదనుగా నిర్వాహకులు అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారు.

అదనపు వసూళ్లపై సీరియస్

మీ సేవ అదనపు వసూళ్లను స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్రంగా పరిగణించారు. పాత బస్తీలో పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లరు మీ సేవా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి సేవల తీరును పరిశీలించారు. అదనపు వసూళ్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదల నుంచి అదనంగా వసూలు చేయడమేమిటని ప్రశ్నించారు. మరోసారి అక్రమాలకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు.

గుట్టుగా గుప్పుమంటున్నాయి..!

- ఉత్తరాది నుంచి అక్రమంగా తరలిస్తున్న పలు సిగరెట్ బ్రాండ్లు
- ఆగాపురా కేంద్రంగా నగరవ్యాప్తంగా సరఫరా
- ఇద్దరిని పట్టుకున్న సౌత్ వెస్ట్ టాస్క్‌ఫోర్స్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో అక్రమ సిగరెట్లు గుట్టుగా గుప్పుమంటున్నాయి. ఆగాపురా కేంద్రంగా పాన్ మసాలా వ్యాపారం చేస్తున్న మహ్మద్ ఇమ్రాన్ ఈ దందా మొదలుపెట్టాడు. ఉత్తరాది నుంచి సిటీకి వస్తున్న ఈ సరుకును విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న సౌత్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఇమ్రాన్ సహా ఇద్దరిని అరెస్టు చేసి, వీరి నుంచి రూ.20.5 లక్షల విలువైన అక్రమ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నట్లు అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపారు. వివరాలు... నిజామాబాద్ నుంచి వలస వచ్చిన ఇమ్రాన్ ఆగాపురలో ఎస్ఎస్ ట్రేడర్స్ పాన్ మసాలా పేరుతో వ్యాపారం చేస్తున్నాడు. తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం అక్రమ సిగరెట్ల దందాకు తెరలేపాడు. గుజరాత్‌కు చెందిన రమేష్‌తోపాటు ఢిల్లీకి చెందిన పలువురి నుంచి గోల్డ్ స్టాగ్, బ్లాక్, మోండ్ తదితర బ్రాండ్ల సిగరెట్లను హోల్‌సేల్‌గా తక్కువ ధరకు ఖరీదు చేస్తున్నాడు. వీటిని ట్రాన్స్‌పోర్టు, కొరియర్ సహా వివిధ మార్గాల్లో హైదరాబాద్‌కు తీసుకువస్తున్నాడు. ఆపై తన దుకాణంలోనే భద్రపరిచి ప్యాసింజర్ ఆటోల్లో ఆయా దుకాణాలకు సరఫరా చేస్తున్నాడు. తక్కువ ధరకు వస్తున్నాయనే ఉద్దేశంతో అనేక మంది వీటిని కొని కాలుస్తూ వాటికి బానిసలుగా మారుతున్నారు. ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో రావాల్సిన భారీ ఆదాయానికి ఈ దందా ద్వారా గండి పడుతోంది. ఈ సిగరెట్ల దందాపై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.బాలస్వామి నేతృత్వంలో ఎస్సై ఎస్.సాయికిరణ్ తమ బృందంతో దాడి చేసి ఇమ్రాన్, ఆటోడ్రైవర్ ఆయూబ్‌ను పట్టుకున్నారు. వీరి నుంచి వివిధ బ్రాండ్లకు చెందిన 45 వేల సిగరెట్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సిగరెట్ల కారణంగా 'పన్ను పోటు'తోపాటు ప్రజల ఆరోగ్యానికీ చేటు ఉందని పోలీసులు చెప్తున్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్దేశించిన ప్రమాణాలు లేని ఈ సిగరెట్లు చాలా ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు.

ఉత్సాహంగా 'యునానీ డే' వాక్

యాకుత్‌పురా: ప్రాచీన యునానీ వైద్యానికి ఎంతో ప్రాముఖ్యం ఉందని చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ అన్నారు. 9వ అంతర్జాతీయ 'యునానీ డే'సందర్భంగా చార్మినార్ ప్రభుత్వ నిజామియా టిబ్బి కళాశాల, ప్రభుత్వ యునానీ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చార్మినార్ నుంచి మదీనా చౌరస్తా వరకు నిర్వహించిన 'యునానీ వాక్'ను జుల్ఫీకర్ అలీ ప్రారంభించారు. కార్యక్రమంలో పత్తర్‌గట్టి కార్పొరేటర్ సయ్యద్ సోహెల్ ఖాద్రీ, ప్రభుత్వ హోమియో అదనపు డైరెక్టర్ డాక్టర్ లింగం, యునానీ అదనపు డైరెక్టర్, చార్మినార్ యునానీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వసంతరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షెహజాదీ సుల్తానా, డాక్టర్ అంజుమ్ సుఫియా, ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ ఫారూఖీ, డాక్టర్ హైదర్ అలీ యమనీ, డాక్టర్ లుతఫ్ సిద్దిఖీ, యునానీ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.



యునానీ డే వాక్‌లో ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ, కార్పొరేటర్ సోహెల్ ఖాద్రీ, వైద్యాధికారులు

ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు ముప్పు ఉండదు

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాగన్న గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న నాగన్న గౌడ్

కాచిగూడ: విద్యుత్ బస్సులతో టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు ఎలాంటి ముప్పు ఉండదని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వై.నాగన్న గౌడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం ఫేమ్-2 ద్వారా సమకూర్చుకునే విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించకుండా ఆర్టీసీ సంస్థ చేపట్టాలని ప్రభుత్వంపై ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవ రెడ్డి ఒత్తిడి తీసుకువస్తున్నారని చెప్పారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. మంగళవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో టీజీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగన్న గౌడ్ మాట్లాడుతూ విద్యుత్ బస్సులను ఆర్టీసీ కాకుండా ప్రైవేట్ సంస్థలు నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉండటం దుర్మార్గమన్నారు. సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్, నాయకులు ఆర్.డి.చంద్రశేఖర్, కె.రాజిరెడ్డి, జి.అబ్రహం, డి.గోపాల్, జె.మల్లేష్, ఎస్.సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ కాంప్లెక్స్ ఖాళీ



కాంప్లెక్స్‌ను సీజ్ చేసిన అధికారులు

హుడా కాంప్లెక్స్: సరూర్‌నగర్ కమర్షియల్ కాంప్లెక్స్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ సెల్ డీఎస్పీ జానకిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఖాళీ చేయించారు. ఈ భవన సముదాయాన్ని హెచ్‌ఎండీఏ 1981లో నిర్మించింది. అప్పటి నుంచి 2008 వరకు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల నిమిత్తం అధికారులు లీజుకు ఇచ్చారు. 2008లో లీజు గడువు ముగిసింది. భవనంపునాదుల నుంచి బలహీనంగా మారిందని, నాసిరకం కాంక్రీట్ నిర్మాణం దృష్ట్యా అందులో వ్యాపారాలు కొనసాగించడం తగదని ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగం హెచ్‌ఎండీఏకు నివేదించింది. ఈ మేరకు ఖాళీ చేయాలంటూ అధికారులు షాపుల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. దీంతో కొందరు నిరాకరించి హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ వారికి చుక్కెదురైంది. దీంతో వ్యాపారులు, ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రత దృష్ట్యా కాంప్లెక్స్‌ను ఖాళీ చేయించాలని హెచ్‌ఎండీఏ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం భారీ పోలీసు బందోబస్తు మధ్య ఖాళీ చేయించారు.



తినిపిస్తూ.. మురిపిస్తూ..!

అనాథలతో కలిసి 'బార్బెక్యూ'లో సీతక్క డిన్నర్

సాక్షి, సిటీబ్యూరో: మంత్రి సీతక్క కాసేపు హోదాను పక్కన పెట్టారు. అక్కలా అనాథ చిన్నారులను అక్కున చేర్చుకున్నారు. అమ్మలా వారికి అన్నం తినిపించారు. వారితో ముచ్చటించి సంతోషం నింపారు. ఈ సన్నివేశం మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఏఎస్ఎఫ్ బార్బెక్యూ – గ్రిల్ రెస్టారెంట్‌లో చోటుచేసుకుంది. ఏఎస్ఎఫ్ బార్బెక్యూ – గ్రిల్ రెస్టారెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వన్ ఈవెనింగ్ ఆఫ్ టుగెదర్ అండ్ జాయ్'చారిటీ కార్యక్రమంలో రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనాథ చిన్నారులతో కాసేపు సరదాగా గడిపారు. పేదల ఆకలి తీర్చేలా ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించాలన్నారు. సామాజిక బాధ్యతగా నిరుపేద, అనాథ చిన్నారులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు ఆరిఫ్ అలీ తెలిపారు.

రంగరాజన్‌పై దాడి అనాగరికం

మానవ హక్కుల వేదిక

సాక్షి, సిటీబ్యూరో: చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మానవ హక్కుల వేదిక అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దాడి అన్యాయం, అనాగరికం అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడి అదుపు తప్పుతున్న మతోన్మాద సంస్కృతికి నిదర్శనమని పేర్కొన్నారు. హిందూ ధర్మ రక్షణ పేరిట రాజ్యాంగ స్ఫూర్తికి, లౌకికతత్వానికి, ప్రజాస్వామ్య, సౌభ్రాతృత్వ భావనలకు విరుద్ధంగా పనిచేసే సంస్థలను ఉపేక్షించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. మత సామరస్య వాతావరణాన్ని దెబ్బతీసే వారిపై చర్యలు తీసుకొనేందుకు ప్రత్యేక చట్టాలను రూపొందించాలని సూచించారు.

మరో రెండు రోజులు నుమాయిష్

అబిడ్స్: నుమాయిష్‌ను రెండు రోజులపాటు పొడిగించేందుకు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అనుమతించినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బి.సరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 15కు బదులు 17వ తేదీన నుమాయిష్ ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేయగా, ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. 17వ తేదీ వరకు ఎగ్జిబిషన్‌కు సందర్శకులు రావాలని విజ్ఞప్తి చేశారు. 84వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనశాల(నుమాయిష్) జనవరి 3వ తేదీన ప్రారంభమైన విషయం తెలిసిందే.

యూజీసీ మార్గదర్శకాలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నూతన మార్గదర్శకాలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని ఏఐఎస్ఎఫ్ జాతీయ నాయకులు అన్నారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్, ప్రధాన కార్యదర్శి దినేష్ సరంగరాజ్ మాట్లాడుతూ యూజీసీ గైడ్‌లైన్స్‌ను అన్ని వర్గాలు, విద్యాసంస్థలు వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. వీసీల నియామకాలు మొదలు అన్ని అంశాల్లో విద్యను బలహీనపరిచేలా, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేసేవిధంగా మార్గదర్శకాలు ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విద్యను కాషాయీకరిస్తూ పేద వర్గాలకు ఉన్నత విద్య అందకుండా చేస్తోందని ధ్వజమెత్తారు. సమావేశంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్ఏ స్టాలిన్, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, నాయకులు గ్యార నరేష్, లెనిన్, నెల్లి సత్య, భగత్, ఉప్పల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నిలోఫర్‌లో గర్భిణికి అరుదైన శస్త్రచికిత్స

నాంపల్లి: అరుదైన శస్త్ర చికిత్సతో నిలోఫర్ వైద్యులు ఓ నిండు గర్భిణీ ప్రాణాన్ని కాపాడారు. వికారాబాద్‌కు చెందిన గోవిందాచారి భార్య కవిత(35) 27 వారాల గర్భిణి. రక్తస్రావంతో బాధపడుతుండగా ఆమెను ఈ నెల ఒకటో తేదీన నగరంలోని ఓమ్నీ ఆసుపత్రిలో చేర్చారు. అయితే ఆమె పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో అక్కడి వైద్యులు నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు నిర్వహించి 'ప్లాసెంటా పర్‌క్రిటా విత్ బ్లాడర్ ఇన్‌ఫెక్షన్'తో ఆమె బాధపడుతోందని వైద్యులు గుర్తించారు. ఆపరేషన్ చేసి మూత్రాశయం మీద ఉన్న అద్దె చీలికల(హిస్టరీ విత్ బ్లాడర్ రిపేర్)ను యూరాలజిస్టులు సరిచేశారు. ఈ ఆపరేషన్ నిమిత్తం ఆమెకు 30 ప్యాకెట్ల రక్తాన్ని అందించారు. అనంతరం ఆమె పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, శిశువుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు నిలోఫర్ వైద్యులు పేర్కొన్నారు. అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్యులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్ అభినందించారు.

నకిలీ వైద్యులతో ఆరోగ్య సంక్షోభం

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకానాథరెడ్డి



మాట్లాడుతున్న ద్వారకానాథరెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: అర్హతలేని నకిలీ వైద్యులను రాజకీయ ప్రయోజనాల కోసం ప్రోత్సహిస్తే రాష్ట్రంలో ఆరోగ్య సంక్షోభం ఏర్పడుతుందని, ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకానాథరెడ్డి, కార్యదర్శి డాక్టర్ అశోక్, యాక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ అశోక్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం కోఠిలోని ఐఎంఏ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నకిలీ వైద్యులు కేవలం ఫస్ట్ ఎయిడ్ సేవలకు అర్హులని, వీరి ప్రాక్టీసును తక్షణమే రాష్ట్రంలో నిషేధించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు. రాజకీయ ప్రయోజనాలు, ఓట్ల రాజకీయాల కోసం వీరిని చట్టపరిధిలోకి తీసుకొచ్చే ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ వైద్యులు డాక్టర్లుగా పల్లెల్లో బోర్డులు పెట్టుకొని, తమ వద్దకు వచ్చిన రోగులకు మితిమీరిన స్టెరాయిడ్స్, మందుల మోతాదులను వయస్సుతో సంబంధం లేకుండా అందరికీ ఇస్తూ వారి ప్రాణాలను బలిగొంటున్నారని ఆరోపించారు. ఇది ఒక విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్య సంక్షోభానికి దారితీస్తుందన్నారు. ఈ నకిలీ వైద్యులు ఎక్కడైనా ఆర్ఎంపీలు, పీఎంపీలంటూ బోర్డులు పెట్టుకుంటే చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ 34వ సెక్షన్ ప్రకారం అర్హతలేని నకిలీ వైద్యుల ప్రాక్టీసును వెంటనే నిషేధించాలని, సెక్షన్ 54 ప్రకారం వారిని నేరస్తులుగా పరిగణించి కఠినమైన చర్యలను తీసుకోవాలని ప్రభుత్వాన్ని, నేషనల్ మెడికల్ కౌన్సిల్‌ను కోరారు.

బీసీ రిజర్వేషన్ల ఎగవేతకు ప్రభుత్వం కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమోహన్ రావు, గుజ్జ సత్యం తదితరులు

డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎగవేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రహస్య ఎజెండాను అమలు చేస్తోందని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు ఆరోపించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన మంగళవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసాని వెంకటేశ్వరరావు డెడికేటెడ్ కమిషన్ తన నివేదికను గోప్యంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేయడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రధాన కార్యదర్శి కార్యాలయం కూడా అధికారికంగా తెలియజేయకపోవడం విస్మయం కలిగిస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీసీలపట్ల నిబద్ధతను, నిజాయతీని నిరూపించుకోవడానికి సమగ్ర కుటుంబ సర్వేను మళ్లీ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. హామీలను నిలబెట్టుకోని పక్షంలో ప్రభుత్వం బీసీల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పలు బీసీ సంఘాల నేతలు కోల జనార్దన్, నీల వెంకటేష్, తంగెళ్లముడి నందగోపాల్, సుధాకర్, ఉదయ్, మట్ట జయంతి, ఆర్యా యాదవ్, సూర్యనారాయణ, హరి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అకాడమీలో ప్రి ప్రమోషన్ శిక్షణ ప్రారంభం



రామకృష్ణారావుకు జ్ఞాపిక అందజేస్తున్న పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిష్త్

బండ్లగూడ: రాజబహద్దూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో ప్రి ప్రమోషన్ శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. సివిల్ పోలీస్ హెడ్‌కానిస్టేబుళ్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ల నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ప్రమోషన్ పొందిన 17వ బ్యాచ్, ఆర్మ్‌డ్ రిజర్వ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు నుంచి రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన 10వ బ్యాచ్‌కి ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిక్షణ కార్యక్రమంలో మొత్తం 292 మంది పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బందికి ఆర్థిక ప్రణాళిక ప్రాముఖ్యత గురించి చెప్పారు. సైబర్ మోసాల బారిన పడొద్దని సూచించారు. పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిష్త్ మాట్లాడుతూ ఫిర్యాదుదారులు, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. శిక్షణ పొందుతున్న వారిలో ఎక్కువ మంది 56-60 సంవత్సరాల మధ్య వయస్సువారేనని, ఆరోగ్యంపట్ల అత్యంత శ్రద్ధ వహించాలని అన్నారు. శిక్షణలో ముగ్గురు మహిళా అధికారులు కూడా పాల్గొంటున్నారని తెలిపారు. ఇండోర్ శిక్షణలో భాగంగా స్టేషన్ హౌస్ నిర్వహణ, క్రిమినల్ మేజర్ చట్టాలు, ప్రత్యేక, స్థానిక చట్టాలు, ఫోరెన్సిక్, నాయకత్వం వంటి అంశాలపట్ల అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. బహిరంగ శిక్షణలో భాగంగా వారికి యోగా, శారీరక శిక్షణ, కసరత్తులు, ఆయుధ శిక్షణ వంటివి నేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో అకాడమీ జాయింట్ డైరెక్టర్ మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, డీఎస్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ 'నీట్'గా జరగలేదు...

పంజగుట్ట: మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎం.సి.సి.) నిర్లక్ష్యం కారణంగా నీట్ పీజీలో కోరుకున్న బ్రాంచ్‌లో చేరే అవకాశం కోల్పోయిన అభ్యర్థుల కోసం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని గాంధీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ వెంకటేష్ కుమార్ కోరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీట్ పీజీ-2024 నోటిఫికేషన్ ప్రకారం జరగాల్సిన కౌన్సెలింగ్ ప్రక్రియ గందరగోళంగా మారిందన్నారు. ఈ అంశంపై ఎన్నోసార్లు ఎం.సి.సి కి మొరపెట్టుకున్నా ఫలితంలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 12 ఫిబ్రవరి 2025

హైలైఫ్‌లో బ్రైడల్ ఎక్స్‌పో

18 నుంచి అందుబాటులో ప్రదర్శన

సన్నాహక కార్యక్రమంలో మోడల్స్





బంజారాహిల్స్: నగరవాసులు మెచ్చే బ్రైడల్ ఎగ్జిబిషన్‌ను ఈ నెల 18 నుంచి హెచ్ఐసీసీ నోవోటెల్ హోటల్‌లో హైలైఫ్ బ్రైడ్స్ పేరుతో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. బంజారాహిల్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సన్నాహక కార్యక్రమంలో నటీమణులు కుషితా కల్లపు, కామాక్షి భాస్కర్లతో పాటు పలువురు మోడల్స్ పాల్గొని ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్న విభిన్న రకాల దుస్తులు, ఆభరణాలు ధరించి ఆకట్టుకున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలను ఈ ఎగ్జిబిషన్‌లో మూడు రోజుల పాటు ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

- ప్రపంచ కప్ సాధించడమే లక్ష్యం
- ఈ జర్నీలో ఎత్తుపల్లాలు చూశాను
- రెండు మెడల్స్ అడిగారు.. తీసుకొచ్చా : క్రికెటర్ త్రిష



ఓవర్ కవర్..

మై ఫేవరెట్ షాట్..



సాక్షి, సిటీబ్యూరో: భారత దేశానికి మహిళా ప్రపంచ క్రికెట్ కప్ సాధించడమే తన లక్ష్యమని మహిళా క్రికెటర్ గొంగడి త్రిష పేర్కొన్నారు. నగరంలోని హయత్ ప్లేస్ హోటల్‌లో నిర్వహించిన సన్మాన సభలో ఆమె మాట్లాడారు. 'అండర్ –19 టీ–20 ప్రపంచ కప్ విజయంలో కీలకపాత్ర పోషించినందుకు సంతోషంగా ఉంది. క్రికెట్‌లో మిథాలిరాజ్ స్ఫూర్తి. ప్రతి మ్యాచ్ ఆడే ముందు ఒక్కటే ఆలోచన ఉంటుంది. బాగా ఆడాలి. టీం గెలవాలన్న లక్ష్యంతో గ్రౌండ్‌లోకి వెళతా. ఓవర్ కవర్ షాట్ నా ఫేవరెట్. నిద్రలో లేపి ఆడమన్నా ఆడతాను. ఆటలో ఏ ఒక్కరూ పర్ఫెక్ట్ కాదు. నిత్యం ప్రాక్టీస్ చేయాల్సిందే. ఆరు, ఏడేళ్ల నుంచి ఫిట్నెస్, బ్యాటింగ్, ఆహారపు అలవాట్లలో కోచ్ సూచలను పాటిస్తున్నా. ఈ జర్నీలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను' అన్నారు.

లక్ష్యంతో పనిచేస్తేనే..

కేవలం డబ్బు సాయంతో విజయం సాధ్యం కాదు, కష్టపడి, నిర్దేశిత లక్ష్యంతో పనిచేస్తేనే జీవితంలో రాణించగలమని ఏఆర్‌కే ఫౌండర్ ఛైర్మన్ రామ్‌రెడ్డి అన్నారు. 2028లో లోకేష్, వెన్నెల మెడల్స్ సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. త్రిష తండ్రి, హాకీ ప్లేయర్, ట్రైనర్ రామ్‌రెడ్డి మాట్లాడుతూ భద్రాచలం ఐటీసీలో ఉద్యోగం చేస్తూ త్రిషకు క్రికెట్‌లో శిక్షణ ఇప్పించాను. మెరుగైన కోచింగ్ కోసం 17 ఏళ్ల క్రితం హైదరాబాద్ వచ్చేశాం. చాలా కష్టనష్టాలను చూశానన్నారు. భారత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ చిన్నతనంలో కరణం మల్లీశ్వరిని ప్రభుత్వం ఘనంగా సత్కరించినపుడు పోడియం ముందున్న నేను అలా సత్కారం పొందాలని అనుకున్నానని తెలిపారు. ఇటువంటి ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టడంతో ఎంతో మంది ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. కష్టపడి పని చేయడం, నిబద్ధత, నమ్మకంతో పనిచేస్తే విజయం సాధించడం తథ్యమని గోపీచంద్ అన్నారు. బ్యాడ్మింటన్ ఆడని రోజు లేదని టీజీపీఎస్సీ మాజీ ఛైర్మన్ జనార్ధన్‌రెడ్డి అన్నారు. త్రిష నిత్యం తన ఆటను మెరుగుపరచుకుని, వృద్ధిచెందాలని మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రికెట్ కోచ్ జాన్ మనోజ్, మాజీ క్రికెటర్, కామెంటేటర్ ఎంఎస్‌కే ప్రసాద్, మాజీ ఐఏఎస్ రాజేశ్వర్ తివారీ పాల్గొన్నారు.

సేఫ్టీ కోసం.. టీన్ అకౌంట్స్..



సాక్షి, సిటీబ్యూరో: టీనేజ్ వినియోగదారుల ఆన్‌లైన్ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇన్‌స్టా టీన్ ఖాతాలను మెటా విస్తరిస్తోంది. సురక్షితమైన, వయసుకు తగిన పరిస్థితులను సృష్టించడానికి టీనేజర్ ఖాతాలు రూపొందించింది. నగరంలోని టీనేజర్లు వీటిని ఉపయోగించుకోవాలని కోరింది. ఈ టీన్ ఖాతాలు అవాంఛిత సంభాషణలను పరిమితం చేసి, గోప్యతా సెట్టింగ్‌లను మెరుగుపరుస్తాయని, తల్లిదండ్రులకు ఎక్కువ పర్యవేక్షణను అందించి, యువ వినియోగదారులకు సురక్షితమైన సోషల్ మీడియా అనుభవాన్నిస్తాయని ఇన్‌స్టా పబ్లిక్ పాలసీ ఇండియా డైరెక్టర్ నటాషా జోగ్ ఓ ప్రకటనలో తెలిపారు.



నేను..

సెల్ఫ్ లవ్..అంటున్న నగర యువత


నేను పుట్టాను లోకం మెచ్చింది.. నేను ఏడ్చాను లోకం నవ్వింది.. నేను నవ్వాను ఈ లోకం ఏడ్చింది.. నాకింకా లోకంతో పని ఏముంది.. అని ఆత్రేయ రచించిన పాటను స్ఫూర్తిగా తీసుకున్నారో ఏమో..! నగరంలో నేటి తరం యువతలో కొందరు సెల్ఫ్ లవ్ అంటూ కొత్త భాష్యానికి తెరతీశారు. ఇందు కోసం వినూత్నంగా లవ్ యువర్ సెల్ఫ్ అంటూ కొత్తరకం క్లబ్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. అదేమంటే రొటీన్‌కి భిన్నంగా ఇదే ట్రెండ్ అంటున్నారు.. సోలో రైడ్స్, ట్రిప్స్‌కు జై కొడుతున్నారు. వీరి కోసం వినోద, పర్యాటక రంగాలు సైతం ప్రత్యేక ప్యాకేజీలను ఏర్పాటు చేస్తున్నాయి.. మరి ఈ సెల్ఫ్ లవ్ అంటే ఏమిటి? ఈ ట్రెండ్ ఎలా నడుస్తోంది? తెలుసుకుందాం.. - సాక్షి, సిటీబ్యూరో

- వినూత్న మార్పులకు వేదికగా
- లవ్ యువర్ సెల్ఫ్ క్లబ్స్ ఏర్పాటు
- ట్రెండీగా సోలో రైడ్, ట్రీట్‌లు
- వినోద, పర్యాటక రంగాల్లో ప్రత్యేక సేవలు

సాధారణంగా యువతకు.. ప్రేమకు చాలా దగ్గర సంబంధం ఉంటుంది.. అందుకే ప్రేమ కథలకు, సినిమాలకు ఎక్కువ క్రేజ్ ఉంటుంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో సైతం ఈ తరహా ప్రేమ వ్యవహారాలు, ప్రేమ ముచ్చట్లు, ప్రేమ విఫల గీతాలకూ అంతే క్రేజ్. ఇక ఫిబ్రవరి వచ్చిందంటే చాలు.. ఎక్కడ చూసినా ప్రేమికుల సందడే.. అయితే నగరంలో కొందరు యువత ఇటీవల కొత్త రాగం తీస్తోంది.. అదే 'లవ్ యువర్ సెల్ఫ్'.. అంటే 'నిన్ను నువ్వు ప్రేమించుకో'.. దీనినే స్వీయ ప్రేమగానూ చెప్పుకోవచ్చు. అందేంటి? అంటే.. ముందు మన జీవితంలో మనం అనేది ఉంటేనేగా.. ఇతరులను ప్రేమించేది.. మనం అనేది లేనప్పుడు ప్రేమ ఎక్కడుంటుంది? అంటున్నారు పలువురు.. అంతే కాదు.. ప్రస్తుతం ఫిబ్రవరి కావడంతో హ్యాష్ ట్యాగ్ సెల్ఫ్ లవ్ వైరల్‌గా మారుతోంది.

తేడా ఇదే..!

ఒకరిపై ప్రేమంటే.. వారి కోసం త్యాగాలు చేయడం, మంచి చెడులు తెలుసుకుని, ఇష్టమైనవి కొనివ్వడం సర్వసాధారణం. అదే సెల్ఫ్ లవ్‌లో అయితే..మనకు ఏది ఇష్టమో, మనకు ఏం కావాలో.. గుర్తించి వాటిని సాధించుకోవడమే.. ఇందులో భాగంగానే.. సోలో డ్రైవ్‌కు వెళ్లడం, ఒటరిగా సినిమాకు వెళ్లడం, మంచి థీమ్ రెస్టారెంట్‌కు వెళ్లి ఫేవరెట్ ఆహారాన్ని తినడం, మనకు ఇష్టమైన వస్తువులను మనమే గిఫ్ట్‌గా ఇచ్చుకోవడం ..ఇదే ఇప్పుడు ట్రెండ్ అంటున్నారు పలువురు.



నోవోటెల్ వేదికగా..

సెల్ఫ్ లవ్ అనేది అరుదైన వ్యక్తిత్వ లక్షణం.. ఇలాంటి వారికి అనువైన వాతావరణాన్ని అందించడం అందరి బాధ్యత. ఇందులో భాగంగానే హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నోవోటెల్ 'ది లవ్ యువర్ సెల్ఫ్' క్యాంపెయిన్ ప్రారంభించింది. 'స్వీయ–ప్రేమికులను గౌరవించడమే ధ్యేయంగా వారికి ప్రత్యేక వసతులను కల్పిస్తున్నాం.. వాలంటైన్స్ డే సందర్భంగా స్వీయ ప్రేమికులకు సైతం ప్రత్యేక కార్యక్రమాన్ని ఆవిష్కరించాం.. ఏకాంతంగా గడపడానికి స్పా, వినోద సేవలు, వెల్నెస్, విశ్రాంతి, సోలో రిట్రీట్ వంటి వినూత్న సదుపాయాలు కల్పిస్తున్నాం'.
– సుఖ్‌బీర్ సింగ్, జనరల్ మేనేజర్ నోవోటెల్ ఎయిర్‌పోర్ట్

సెల్ఫ్ లవ్ నిస్వార్థమైనది..



నన్ను నేను ప్రేమించుకోవడం ఇష్టం. నాకన్నా విలువైనది మరేదీ లేదు. ఇది స్వార్థం కాదు.. నాకు నేను ఇచ్చుకునే గౌరవం. నా ఇష్టాలు, కోరికలు, నా డ్రీమ్స్‌ను నెరవేర్చుకోడంలో మంచి అనుభూతి ఉంటుంది. ఇటీవల నా బర్త్ డే సందర్భంగా ఒక్కడినే కొడైకెనాల్ లాంగ్ డ్రైవ్ వెళ్లాను. అలా అని ఫ్రెండ్స్, కుటుంబానికి దూరం కాను.. అందరితో కలిసుంటాను. అలా అని ఇతరుల ప్రేమకు మేము వ్యతిరేకం కాదు..
– నవీన్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, హైదరాబాద్



ఓ వైపు ఆహారం దొరక్క చిక్కులు.. మరోవైపు దారంలో చిక్కుకుపోతున్న ప్రాణాలు.. వెరసి నగరంలో విహంగాల విహారాన్ని విషాదంగా మారుస్తున్నాయి. మరోవైపు ఆ చిన్ని ప్రాణాలను రక్షించేందుకు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు కృషి చేస్తున్నాయి. పక్షుల పరిరక్షణపై అవగాహన పెంచుతూనే.. మరోవైపు ప్రమాదాల బారిన పడిన వాటిని కాపాడుతున్నాయి.
- సాక్షి, సిటీబ్యూరో

బర్డ్..బ్రదర్స్..

- విహంగాల ఉనికిని కాపాడేందుకు ఎన్జీవోల కృషి
- ఆహారం నుంచి దారం దాకా..
- పక్షుల విహారానికి అన్నీ అడ్డంకులే..
- నగరవ్యాప్తంగా పక్షికి ప్రాణాంతకాలెన్నో..

ఓ వైపు కాలుష్యం, మరోవైపు పర్యావరణ పరిస్థితుల వల్ల పక్షుల రాకపోకలే తగ్గిపోయాయి అనుకుంటే, ఉన్నవాటిలో కూడా సరిపడా ఆహారం, నీరు దొరకక కొన్ని, మనిషి సరదాలకు మరికొన్ని పక్షులు బలవుతున్నాయి.



వలస పక్షులపై పంజా..

సాధారణంగా శీతాకాలం వలస పక్షుల రాకకు ఆహ్వానం పలుకుతుంది. ఈ సమయంలో విభిన్న రకాల పక్షులు నగరంలో, చుట్టుపక్కల సందడి చేస్తాయి. పక్షి ప్రేమికులు బర్డ్ వాచర్స్‌గా మారి కెమెరాలతో ఉత్సాహంగా సంచరించే సమయం ఇది. అయితే ఇదే సమయంలో అంబరాన్ని తాకే పతంగుల సంబరాలు వలస పక్షుల పాలిట శాపంగా మారాయి. పతంగుల కోసం వినియోగించిన దారాలు వాటి ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి.

రెస్క్యూ టీం అన్వేషణలో..

'మా అన్వేషణలో కనీసం 30కిపైగా పక్షులు మృతి చెంది లభించాయి. ఇందులో వలస పక్షులు కూడా ఉండడం విషాదం. మేము దాదాపు 170 పక్షులను రెస్క్యూ చేయగలిగాం' అంటూ చెప్పారు నగరానికి చెందిన యానిమల్ వెల్ఫేర్ కన్జర్వేషన్ సొసైటీ నిర్వాహకులు ప్రదీప్. అనేక ప్రాంతాల నుంచి తమ టోల్ ఫ్రీ నెంబర్‌కు నగరవాసులు, పక్షి ప్రేమికుల నుంచి కాల్స్ పెద్ద సంఖ్యలో వస్తున్నాయని ప్రదీప్ వివరించారు. ఇటీవలే బాలానగర్‌లోని ఐడీపీఎల్ కంపెనీ ఆవరణలో ఒక గద్దను కాపాడామని వెల్లడించారు.

మనుషులనూ వదలడం లేదు..

పతంగుల హడావుడి పూర్తయ్యి దాదాపు నెలరోజులు అవుతున్నా పక్షులపై మాంజా ప్రభావం పోలేదు. జంతు ప్రేమికుల ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా సాగుతున్న మాంజా అన్వేషణ విహంగ విషాదాన్ని కళ్లకు కడుతోంది. ఒక్కోసారి సిటిజనుల కాల్స్‌కి అటెండ్ అవడం కష్టమవుతోంది. పక్షులను మాత్రమే కాకుండా పార్కులు, గేటెడ్ కమ్యూనిటీల్లో మనుషులనూ మాంజా ఇబ్బంది పెట్టింది.. పెడుతోంది. ఇటీవల ఒక ప్రభుత్వాధికారి జాగింగ్ సమయంలో మాంజా వల్ల గాయపడిన ఉదంతం తెలిసిందే.



వారాంతాల్లో..

పక్షుల రక్షణలో భాగంగా వారాంతాల్లో మాంజా తొలగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఒక్క ఇందిరాపార్క్ లోనూ, కోకాపేట్ ప్రాంతంలోని మూవీ టవర్స్ పక్కన ఉన్న 10 ఎకరాల ఖాళీ ప్రదేశంలో దాదాపు 60 కిలోల మాంజాను సేకరించామని ప్రదీప్ చెబుతున్నారు.

నగరవాసులకు అవగాహన..

సంస్థ ఆధ్వర్యంలో చెట్లలో, కరెంటు స్తంభాల్లో, ఇతర చోట్లా చిక్కుబడిన మాంజాను తొలగించి, దీంతో పాటు కొన్ని ప్రాంతాల్లో నగరవాసులకు అవగాహన కల్పిస్తున్నారు. 'పలు గేటెడ్ కమ్యూనిటీల నుంచి కాల్స్ వస్తున్నాయి. మేము అటెండ్ అవ్వలేని పరిస్థితి ఉంటే వారికి అవగాహన కల్పిస్తున్నాం' అని చెప్పారు ప్రదీప్.



ప్రేమే థీమ్.. వాలంటైన్ ఫ్రేమ్..

నిత్యం బిజీగా గడిపే ఆ మహిళలు.. వైవిధ్యభరితంగా తమ దిన చర్యను ఆస్వాదించారు. ప్రేమపూర్వకంగా సంభాషించుకున్నారు. ప్రేమల గురించి ముచ్చటించుకున్నారు. ప్రేమని ప్రతిబింబించే దుస్తుల్లో మురిసిపోయారు. బంజారాహిల్స్‌లోని లైవ్ లీ ఫ్యూజన్‌లో నగరానికి చెందిన పేజ్ త్రీ సోషలైట్స్, లేడీస్ క్లబ్స్ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వాలంటైన్స్ ఫ్యాషన్ థీమ్ పార్టీ ఆకట్టుకుంది. ఆటపాటలు, విందు, వినోదాలతో కర్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈవెంట్‌లో భాగంగా నిర్వహించిన బెస్ట్ డ్రెస్ పోటీల్లో సోషలైట్ సుశీలా బొకాడియా, కోయల్ చందక్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. పలు పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డా.శశికళారెడ్డి వ్యవహరించారు. పేజ్ త్రీ ప్రముఖులు తృప్తి అగర్వాల్, మనీషాకపూర్ పాల్గొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో



ప్రపంచ సేంద్రియ సాగు పైపైకి!



9.9 కోట్ల హెక్టార్లకు చేరిన సేంద్రియ సాగు విస్తీర్ణం

ప్రపంచవ్యాప్తంగా సేంద్రియ రైతులు 43 లక్షలు

అత్యధికంగా (24 లక్షల మంది) భారత్‌లోనే..

రసాయన అవశేషాల్లేని సేంద్రియ ఆహారోత్పత్తుల సాగు, వ్యాపారం ప్రపంచవ్యాప్తంగా ఏటేటా విస్తరిస్తోంది. 2023లో ప్రపంచవ్యాప్తంగా 188 దేశాల్లో 9.89 కోట్ల హెక్టార్లకు సేంద్రియ సాగు విస్తరించింది. 2022తో పోల్చితే 2023లో సేంద్రియ / ప్రకృతి సాగు విస్తీర్ణం 2.6 శాతం (25 లక్షల హెక్టార్లు) పెరిగింది. జర్మనీలోని నరెంబర్గ్‌లో జరుగుతున్న అంతర్జాతీయ సేంద్రియ ఆహారోత్పత్తుల వాణిజ్య ప్రదర్శనలో మంగళవారం విడుదలైన 'ద వరల్డ్ ఆఫ్ ఆర్గానిక్ అగ్రికల్చర్ 2025' వార్షిక సర్వే నివేదిక ఈ తాజా గణాంకాలను వెలువరించింది. స్విట్జర్లాండ్ సేంద్రియ పరిశోధనా సంస్థ (ఎఫ్ఐబీఎల్), ఐఫోమ్–ఆర్గానిక్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా ఈ సర్వే నివేదికను వెలువరించాయి.

- సాక్షి సాగుబడి, హైదరాబాద్

అత్యధిక రైతులు మన వాళ్లే..

ప్రపంచవ్యాప్తంగా 43 లక్షల మంది రైతులు సేంద్రియ సాగు చేస్తుండగా, 24 లక్షల మంది సర్టిఫైడ్ సేంద్రియ రైతులు మన దేశంలోనే ఉన్నారు. ఉగాండా (4.04 లక్షలు), ఇథియోపియా (1.21 లక్షలు) రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. కాగా, విస్తీర్ణం పరంగా చూస్తే 5.3 కోట్ల హెక్టార్లలో సర్టిఫైడ్ సేంద్రియ సేద్యంతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా.. 4.5 లక్షల హెక్టార్లతో భారత్ రెండో స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం సాగు భూమిలోని 2.1 శాతంలో సర్టిఫైడ్ సేంద్రియ సేద్యం జరుగుతోంది.

వినియోగంలో ఫస్ట్ అమెరికా

2023లో ప్రపంచ సేంద్రియ ఆహారోత్పత్తుల వ్యాపారం 136 బిలియన్ యూరోల (రూ.12,17,920 కోట్ల)కు పెరిగింది. 59 బిలియన్ యూరోల వాటాతో అమెరికా అతిపెద్ద సేంద్రియ మార్కెట్‌గా నిలిచింది. జర్మనీ, చైనా ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. సేంద్రియ ఆహారం కొనుగోలుపై స్విట్జర్లాండ్ వాసులు అత్యధికంగా డబ్బు వెచ్చిస్తున్నారని ఈ సర్వే తెలిపింది. అనేక ఏళ్లుగా ఆర్గానిక్ ఫుడ్ మార్కెట్ స్థిరంగా పెరుగుతుండటం విశేషం. మున్ముందు కూడా ఈ ట్రెండ్ కొనసాగుతుందని నిపుణులు భావిస్తున్నారు.



పీజీ మెడికల్ 'స్థానికత'పై విచారణకు అనుమతి

హైకోర్టు తీర్పును సుప్రీంలో సవాల్ చేసిన తెలంగాణ ప్రభుత్వం

- పిటిషన్‌ను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని విన్నపం
- అందుకు అర్హత ఉందో లేదో తేలుస్తామన్న జస్టిస్ గవాయ్ ధర్మాసనం.. తదుపరి విచారణ ఏప్రిల్ 4వ తేదీకి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటాపై తెలంగాణ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఎంబీబీఎస్ చదివినవాళ్లు కూడా పీజీ మెడికల్‌లో స్థానిక కోటా కింద తెలంగాణలో అర్హులేనని హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం సవాల్ చేసిన విషయం తెలిసిందే. మరోవైపు పీజీ మెడికల్ సీట్లలో స్థానిక కోటా చెల్లదంటూ ఇటీవల సుప్రీంకోర్టులోని జస్టిస్ సుధాంశు దులియా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును కూడా తెలంగాణ ప్రభుత్వం సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కే వినోద్‌చంద్రన్ ధర్మాసనం మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా తమ పిటిషన్‌ను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. అయితే, పిటిషన్‌ను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలా వద్దా? అనే అంశంపై ముందుగా తాము విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను ఏప్రిల్ 4వ తేదీకి వాయిదా వేసింది.

క్లుప్తంగా...

పీఏసీఎస్‌ల ఓటరు జాబితా సిద్ధంగా ఉంచాలి

సహకార, ఉద్యానశాఖ అధికారుల సమీక్షలో మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: గడువు ముగిసిన అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సరిచేసి సిద్ధంగా ఉంచాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో సహకార, ఉద్యానశాఖ అధికారులతో సమావేశమయ్యారు. పీఏసీఎస్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న విచారణలను త్వరగా పూర్తి చేసి, తేలిన మొత్తాలను వెంటనే రికవరీ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం, ఇప్పటి వరకు జరిగిన సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

గట్టు దంపతుల హత్య కేసు దర్యాప్తునకు సిద్ధమే

సుప్రీంకోర్టు తెలిపిన సీబీఐ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో సంచలనం సృష్టించిన న్యాయవాది గట్టు వామనరావు దంపతుల హత్య కేసును దర్యాప్తు చేసేందుకు సిద్ధమేనని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) సుప్రీంకోర్టుకు తెలిపింది. కోర్టు ఆదేశిస్తే దర్యాప్తు చేపట్టేందుకు అభ్యంతరం లేదని పేర్కొంది. 2021 ఫిబ్రవరి 17న పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కలవచర్ల వద్ద కారులో వెళ్తున్న న్యాయవాది వామనరావు, ఆయన భార్య నాగమణిలను కొందరు నడిరోడ్డుపై కిరాతంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. కోర్టు ఆదేశిస్తే దర్యాప్తు చేపట్టడానికి అభ్యంతరం లేదని సీబీఐ తరపు న్యాయవాది తెలిపారు. తదుపరి విచారణను కోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

'మెట్రో' విస్తరణ ఆపండి

హైకోర్టులో పిల్ దాఖలు

సాక్షి, హైదరాబాద్: మహాత్మాగాంధీ బస్ స్టేషన్ నుంచి శంషాబాద్ వరకు ప్రభుత్వం చేపట్టనున్న మెట్రో రైలు విస్తరణ పనుల నిలిపివేతకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మహమ్మద్ రహీంఖాన్ ఈ పిల్ దాఖలు చేశారు. మెట్రో విస్తరణ ప్రభావం పరిసర ప్రాంతాల్లోని చారిత్రక కట్టడాలపై పడుతుందని పేర్కొన్నారు. చార్మినార్, ఫలక్‌నుమా, దారుల్‌షిఫా లాంటి కట్టడాలకు ప్రమాదం వాటిల్లనుందన్నారు. చారిత్రక కట్టడాల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై పురావస్తు, పర్యావరణ శాఖల నిపుణుల కమిటీతో అధ్యయనానికి ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. పిటిషన్‌పై ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ న్యాయవాది విజ్ఞప్తిపై తదుపరి విచారణను మార్చి 18కి వాయిదా వేసింది.

4 వారాలు సమయమివ్వండి

భూదాన్ భూములపై నివేదిక అందజేస్తాం: ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: భూదాన్ భూములపై పూర్తి వివరాలతో నివేదిక అందజేయడానికి నాలుగు వారాలు సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైకోర్టుకు నివేదిస్తూ అఫిడవిట్ దాఖలు చేశారు. విచారణ ఇప్పటికే ప్రారంభమైందని.. తుది విచారణ ఈ నెల 15న ఉందని పేర్కొన్నారు. అనంతరం సమగ్ర వివరాలతో న్యాయస్థానం ముందు నివేదిక ఉంచేందుకు 4 వారాలు గడువు కావాలని కోరారు. దీనికి అనుమతించిన హైకోర్టు తదుపరి విచారణ మార్చి 10కి వాయిదా వేసింది. భూదాన్ భూములపై నివేదిక అందజేయాలని, లేనిపక్షంలో సీఎస్ వ్యక్తిగతంగా హాజరుకావాలని గత విచారణ సందర్భంగా న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు.

ఈడీ విచారణ జరిపించాల్సిందే

మార్గదర్శిపై లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద ఆర్థిక కుంభకోణమైన మార్గదర్శి కుంభకోణంపై ఈడీ విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి డిమాండ్ చేశారు. లోక్‌సభ వేదికగా మార్గదర్శి కుంభకోణాన్ని బయటపెట్టినందుకే బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ తమపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రమేశ్ సివిల్ కాంట్రాక్టులు కావాలంటే చంద్రబాబుతో మాట్లాడుకోవాలే తప్ప తమపై ఆరోపణలు చేయడం తగదని పేర్కొన్నారు. సీఎం రమేశ్ బీజేపీలో ఉన్న టీడీపీ కోవర్టు అని, ఆయన బీజేపీ కోసం పనిచేయడం లేదని చెప్పారు. మంగళవారం లోక్‌సభ జీరో అవర్‌లో బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయన ప్రసంగానికి ఎంపీ మిథున్‌రెడ్డి అడ్డుపడ్డారు. సీఎం రమేశ్ అస్పష్టమైన ఆరోపణలు చేస్తున్నారని ఆక్షేపించారు. అంతకుముందు సీఎం రమేశ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో మద్యం పాలసీని 2019–2024 మధ్య మార్చారన్నారు. మద్యం ప్రైవేట్ షాపుల నుంచి ప్రభుత్వ షాపుల వైపు మళ్లిందని, ఐదేళ్లలో మొత్తం రూ.లక్షకోట్ల అమ్మకాలు జరిగాయని చెప్పారు. ఈ లావాదేవీలన్నీ నగదు ద్వారానే జరిగాయని, ఒక్క డిజిటల్ చెల్లింపు లేదని ఆరోపించారు. అన్ని మద్యం షాపుల ఉద్యోగులు కాంట్రాక్ట్ ప్రాతిపదికనే ఉన్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం రూ.30 వేలకోట్ల మద్యం కుంభకోణం చేసిందని ఆరోపించారు. ఇది రూ.2,500 కోట్ల ఢిల్లీ మద్యం కుంభకోణం కంటే 10 రెట్లు పెద్ద కుంభకోణమన్నారు. ఈ ఆరోపణలను ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి సీఎం రమేశ్ వైఖరిపై మండిపడ్డారు. లోక్‌సభ వేదికగా మార్గదర్శి కుంభకోణాన్ని బయటపెట్టినందుకే ప్రతీకారంగా బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ తమపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని మిథున్‌రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు.

ఆర్గానిక్ వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సాహం

ఏపీలో 2021–22 నుంచి మూడేళ్లలో 21.56 లక్షల మెట్రిక్ టన్నుల ఆర్గానిక్ ఎరువుల ఉత్పత్తి జరిగిందని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. పరంపరాగత్ కృషి వికాస్ యోజన (పీకేవీవై) కింద కేంద్రం ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి మంగళవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

అందరికీ అందుబాటులో ఇసుక

కార్యాచరణ సిద్ధంచేయాలని సీఎస్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: గృహ నిర్మాణంతో పాటు వినియోగదారులకు అందుబాటు ధరల్లో ఇసుక లభించేలా కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. రాష్ట్రంలో ఇసుక లభ్యతపై మంగళవారం సచివాలయంలో గనులు, ఖనిజాభివృద్ధి సంస్థ అధికారులతో శాంతికుమారి సమావేశమయ్యారు. అనంతరం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సరిపడా ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి ఇసుక రీచ్‌లు, స్టాక్‌యార్డులను భౌతికంగా తనిఖీ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రధాన ఇసుక మార్కెట్లకు వెళ్లే రహదారులను గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. దీనికోసం పోలీసు, రవాణా శాఖ అధికారులతో రోడ్డు పెట్రోలింగ్‌లు నిర్వహించాలని, తనిఖీల కోసం సంబంధిత శాఖలతో జాయింట్ టీమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీజీపీ జితేందర్, ఇంటెలిజెన్స్ డీజీ బి.శివధర్‌రెడ్డి, అదనపు డీజీపీ (శాంతిభద్రతలు) మహేశ్ భగవత్, గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, డీఎంజీ శశాంక, టీజీఎండీసీ ఎండీ సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

'మహా' విషాదం

▶ మొదటి పేజీ తరువాయి



మృతుల బంధువుల రోదనలు

నాచారం కార్తికేయ నగర్ నుంచి మ్యాక్సీ క్యాబ్‌లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లారు. ఈ వాహనంలో డ్రైవర్ సహా తొమ్మిది మంది ఉన్నారు. వీరంతా వారివారి కుటుంబాలను పోషించే వారే కావడం గమనార్హం. సోమవారం ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానాలు ఆచరించి, చుట్టుపక్కల ఉన్న ఆలయాల్లో దర్శనాలను పూర్తి చేసుకుని మంగళవారం హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. ఈ విషయం తమ కుటుంబీకులకు ఫోన్ ద్వారా తెలిపారు. అయితే వీరి తిరుగు ప్రయాణం ప్రారంభమైన కొన్ని గంటల్లోనే ట్రక్కు రూపంలో మృత్యువు ముంచుకొచ్చింది. మధ్యప్రదేశ్‌లోని సిహోరా పోలీసుస్టేషన్ పరిధిలోని మోహ్లా–బార్గీ గ్రామాల మధ్య వీరి మ్యాక్సీ క్యాబ్ వాహనం ఘోర ప్రమాదానికి గురైంది. కట్నీ వైపు నుంచి జబల్‌పూర్ వైపు వస్తుండగా.. ఓ వంతెనపై ఎదురుగా అతివేగంతో దూసుకొచ్చిన ఓ ట్రక్ బలంగా వారి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు అక్కడిక్కడే చనిపోగా... తీవ్రగాయాలపాలైన శ్రీరాం బాలకిషన్ (62), నవీన్‌చారి జబల్‌పూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దుర్ఘటనతో నాచారంలోని కార్తికేయ నగర్, శ్రీరాం నగర్, చైతన్యపురిలో విషాదఛాయలు అలముకొన్నాయి. కుంభమేళాకు వెళ్లిన వీరంతా ప్రాణ స్నేహితులని, మంచిచెడులను పంచుకుంటూ కలివిడిగా ఉంటుండేవారని స్థానికులు చెబుతున్నారు. ఎక్కడకు వెళ్లినా కలిసే వెళ్తారని, మరణంలోనూ వీరి స్నేహబంధం వీడలేదని అంటున్నారు.



ఆనంద్ కుమార్



టీవీ ప్రసాద్



కల్యూరి రాజు



శశికాంత్

సీఎం రేవంత్ దిగ్భ్రాంతి



రాంపల్లి రవి



మల్లా రెడ్డి



సంతోష్

మధ్యప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని నాచారం ప్రాంతానికి చెందిన వారు చనిపోయినట్లు సమాచారం అందడంతో వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య అందేలా అందేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వ అధికారులతో మాట్లాడి మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ, సహకారాలను అందించాలని, గాయపడిన వారికి సరైన చికిత్స అందించాలని కోరారు. ఫోన్‌లో బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడి పరామర్శించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

వైఎస్ జగన్ దిగ్భ్రాంతి


ప్రయాగ్‌రాజ్ నుంచి తిరిగి వస్తూ మధ్యప్రదేశ్‌లోని సిహోరా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు తెలుగు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులను, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

అమ్మా... నాన్నకు ఏమైంది?



ప్రమాదమృతుల్లో ఒకరైన శశికాంత్ కుమార్తె శ్రీ మూడో జన్మదిన వేడుకల్ని సోమవారం ఇంట్లో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ దృశ్యాలను భార్య కళ్యాణి వీడియో కాల్ ద్వారా శశికాంత్‌కు చూపించారు. మంగళవారం పిడుగులాంటి వార్త రావడంతో కళ్యాణి సహా కుటుంబీకులంతా కన్నీరుమున్నీరయ్యారు. ఇది చూసిన శ్రీ అమాయకంగా అమ్మా... నాన్నకు ఏమైందంటూ ప్రశ్నిస్తుండగా... ఏం చెప్పాలో అర్థం కాక విలపించడంతో అందరూ కంటతడిపెట్టారు.

వస్తానని చెప్పాడు.. కానీ..



నా భర్త రాజు ఈ రోజు ఉదయాన్నే ఫోన్ చేసి మాట్లాడాడు. ఇంటికి వస్తున్నా అంటూ నాకు మాట ఇచ్చాడు. కానీ ఇప్పుడు తిరిగిరాని లోకాలకు వెళ్లాడని తెలిసింది. నేను ఇద్దరు చిన్న పిల్లలతో ఎలా బతికాలి. మమ్మల్ని విడిచి ఎలా వెళ్లిపోయాడో తెలియడం లేదు.

–రాజు భార్య మహేశ్వరి

భార్యకు ఉరి వేసి భర్త ఆత్మహత్య!

- ఖమ్మం బ్యాంక్ కాలనీలో వృద్ధ దంపతుల విషాదాంతం
- ఆర్థిక ఇబ్బందులే కారణమనే అనుమానాలు



నరసింహారావు – కోటమ్మ మృతదేహాలు

ఖమ్మం క్రైం: వృద్ధాప్యంలో ఉన్న దంపతులు ఇద్దరూ ఒకేసారి విగత జీవులై కన్పించడం ఖమ్మంలో కలకలం రేపింది. భార్యను హత్య చేసిన వృద్ధుడు ఆపై తానూ ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడని అనుమానిస్తున్నారు. జీవిత చరమాంకంలో ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులే ఇందుకు కారణమని తెలిసింది. ఖమ్మం బ్యాంక్ కాలనీలో మంగళవారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని నరసరావుపేట జిల్లా కేంద్రానికి చెందిన ఆర్.నరసింహారావు (65) అలియాస్ నరసరావు తన భార్య కోటమ్మ (60)తో కలిసి ఆరేళ్ల క్రితం ఖమ్మం వచ్చాడు. అద్దె ఇంట్లో ఉంటూ హోటళ్లలో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. కాగా గతంలో ఆయన పనిచేసిన హోటల్‌లో ఉండే పవన్ ప్రతిరోజు వారికి నీళ్ల క్యాన్ తెచ్చేవాడు. అలాగే మంగళవారం సాయంత్రం కూడా వచ్చి పిలిచినా, ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో ఇంటి యజమానుల దృష్టికి తీసుకెళ్లాడు. వారు తమకేమీ తెలియదనడంతో మళ్లీ వెళ్లి కిటికీలోంచి చూడగా మంచంపై కోటమ్మ, మెడలో తాడుతో నరసింహారావు కిందపడి ఉన్నారు. సమాచారం అందుకున్న ఖమ్మం టూ టౌన్ సీఐ బాలకృష్ణ, పోలీసులు తలుపులు పగులకొట్టి లోనికి వెళ్లి చూడగా ఇద్దరూ మృతి చెంది ఉన్నారు.

భార్యకు ఉరి వేసి, మణికట్టు కోసుకుని..!

మంగళవారం ఉదయం బయటకు వెళ్లి వచ్చిన నరసింహారావు పక్షవాతం నుంచి కోలుకుంటున్న భార్య మెడకు నైలాన్ తాడుతో ఉరి వేసి హతమార్చినట్లు అనుమానిస్తున్నారు. అలాగే ఆమెకు ఉరి వేశాక నరసింహారావు ఎడమచేయి మణికట్టు వద్ద బ్లేడ్‌తో కోసుకున్నాడని, రక్తాన్ని గిన్నెలో పట్టాడని, భార్య మెడకు ఉన్న నైలాన్ తాడు విప్పి ఆమె మృతదేహాన్ని మంచంలో పడుకోబెట్టి, ఆ తర్వాత అదే తాడును తన మెడకు బిగించుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడని అక్కడి పరిస్థితిని బట్టి అంచనా వేస్తున్నారు. వారికి పెళ్లైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, ఒకరు హైదరాబాద్‌లో, ఇంకొకరు నరసరావుపేటలో ఉంటున్నట్లు తెలిసింది. భార్య పక్షవాతానికి గురై చికిత్స పొందుతుండటం, తాను అప్పు ఇచ్చిన డబ్బులు తిరిగి వసూలు కాకపోవడంతో తాను అప్పుల పాలయ్యాడని, ఆర్థిక ఇబ్బందులు పెరిగాయని చెబుతున్నారు. ఈ ఘాతుకానికి పాల్పడేందుకు భార్యను కూడా ఒప్పించాడని తెలుస్తోంది. ఈ మేరకు మృతుల వద్ద లేఖ లభ్యమైందని తెలుస్తున్నా పోలీసులు మాత్రం ధ్రువీకరించడం లేదు.

వ్యవసాయ క్షేత్రంలో కోడి పందేలు

- పోలీసుల అదుపులో 64 మంది
- టీడీపీ నేత శివకుమార్ సహా ఎక్కువమంది ఏపీ వారే..!
- నిర్వాహకుడు మంత్రి లోకేశ్‌కు సన్నిహితుడు?
- రూ.30 లక్షల నగదు, 55 కార్లు, 84 పందెం కోళ్లు స్వాధీనం
- కేసు దర్యాప్తు చేస్తున్న మొయినాబాద్ పోలీసులు



ఏపీ మంత్రి నారా లోకేష్‌తో కోడి పందేల నిర్వాహకుడు శివకుమార్(ఫైల్)

మొయినాబాద్: వ్యవసాయ క్షేత్రంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న కోడి పందేలను ఎస్ఓటీ పోలీసులు భగ్నం చేశారు. ఒక్కసారిగా దాడి చేసి 64 మంది పందెం రాయుళ్లను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.30 లక్షల నగదు, 55 కార్లు, 84 కోళ్లు, 64 ఫోన్లు, మద్యం, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం తోలుకట్ట సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు మంగళవారం రాత్రి ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు స్థానిక పోలీసులతో కలిసి దాడి చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ నాయకుడు శివకుమార్‌తో పాటు మొత్తం 64 మందిని అదుపులోకి తీసుకున్నారు. శివకుమార్‌తో పాటు ఎక్కువ మంది ఏపీకి చెందినవారేనని తెలిసింది. ఇందులో కొందరు హైదరాబాద్‌లో సెటిలయ్యారు. అదుపులోకి తీసుకున్న వారిలో తెలంగాణకు చెందినవారు 10 మంది ఉన్నారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి స్పెషల్ బెటాలియన్స్‌తో అక్కడికి చేరుకుని పందెం రాయుళ్ల వివరాలను సేకరించారు. ఈ వ్యవసాయ క్షేత్రం ఓ ఎమ్మెల్సీ అనుచరుడిదని తెలిసింది. అలాగే పందేల నిర్వాహకుడు ఏపీ సీఎం చంద్రబాబు తనయుడు, మంత్రి లోకేశ్‌కు సన్నిహితుడని చెబుతున్నారు. అందరినీ మొయినాబాద్ పీఎస్‌కు తరలించిన పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



పందేల్లో ఉపయోగించిన కోళ్లు

లక్షలాది జనం.. రవాణా ఘోరం

మహా కుంభమేళాకు రైళ్లు, బస్సులు ఏవీ?

- ప్రమాదకర రీతిలో భక్తుల ఆధ్యాత్మిక యాత్ర
- రద్దీ మేరకు అందుబాటులో లేని రైళ్లు
- ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయని ఆర్టీసీ
- సామర్థ్యం లేని ప్రైవేట్ వాహనాల్లో వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్న జనం



సాక్షి, హైదరాబాద్: ఆధ్యాత్మిక యాత్ర విషాదభరితంగా మారుతోంది. తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు ఉత్తరప్రదేశ్ మహాకుంభమేళాకు తరలి వెళ్తున్నారు. కానీ డిమాండ్ మేరకు రైళ్లు అందుబాటులో లేవు. ఇటు తెలంగాణ ఆర్టీసీ కానీ, అటు ఏపీఎస్ఆర్టీసీ కానీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయలేదు. భక్తులు మధ్యతరగతి, సామాన్యప్రజలకు ఏ మాత్రం అందనంతగా విమానచార్జీలు భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలో త్రివేణి సంగమంలో పుణ్యస్నానం చేసి రావాలని కోరుకుంటున్న జనం తోచిన మార్గంలో వెళ్తున్నారు. సామర్థ్యం లేని ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం చేసి ప్రమాదాల బారిన పడుతున్నారు. నాచారం (హైదరాబాద్) నుంచి యూపీ ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాకు మినీబస్సులో వెళ్లిన ఏడుగురు భక్తులు తిరుగు ప్రయాణంలో లారీ ఢీకొని మరణించిన ఉదంతం ఆందోళన రేపుతోంది. ప్రయాణికుల రద్దీ కారణంగా ఒకవైపు రహదారులు వందలకొద్దీ కిలోమీటర్లతో కిక్కిరిసిపోతుండగా, మరోవైపు మినీబస్సులు, మ్యాక్సీక్యాబ్‌లు వంటి చిన్న వాహనాల్లో ఎక్కువమంది ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

అరకొర రైళ్లు..: ప్రయాణికుల రద్దీ మేరకు రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. కానీ అరకొర రైళ్లు అందుబాటులో ఉన్నాయి. పైగా సికింద్రాబాద్ నుంచి పట్నా, దానాపూర్, గోరఖ్‌పూర్, లక్నో, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే రెగ్యులర్ రైళ్లలో జనవరి నాటికే బుకింగ్ నిలిచిపోయింది. వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినప్పటికీ వెయిటింగ్ లిస్టు 200 దాటింది. మరిన్ని అదనపు రైళ్లు నడిపితే తప్ప తెలుగు రాష్ట్రాల నుంచి కుంభమేళాకు ప్రయాణం చేయడం సాధ్యం కాదు.

ప్రైవేట్ ట్రావెల్స్ నిలువుదోపిడీ

ప్రతిసారీ పండుగ ప్రయాణాన్ని సొమ్ము చేసుకొనే ప్రైవేట్ ట్రావెల్స్, టూరిస్ట్ సంస్థలు మహాకుంభమేళా భక్తులను కూడా వదలకుండా నిలువుదోపిడీకి పాల్పడుతున్నాయి. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఫిట్‌నెస్ ఉన్నా లేకున్నా పెద్దఎత్తున వాహనాలను నడుపుతున్నాయి. 30 నుంచి 40 మంది ప్రయాణం చేసే ప్రైవేట్ బస్సులతోపాటు, 14 నుంచి 20 మంది వరకు ప్రయాణం చేసే సామర్థ్యం ఉన్న మినీ బస్సులు, మ్యాక్సీ క్యాబ్‌లు, ఇతరత్రా వాహనాలను ఎడాపెడా రోడ్డెక్కిస్తున్నాయి. ప్యాకేజీల పేరుతో ఒక్కో ప్రయాణికుడి వద్ద రూ. 25,000 నుంచి 30,000 వరకు వసూలు చేస్తున్నాయి. సాధారణంగా సుదీర్ఘమైన ప్రయాణం చేసే వాహనాల్లో ఇద్దరు డ్రైవర్లు తప్పనిసరిగా ఉండాలి. ప్రతి 8 గంటలకు ఒకసారి విధులు మార్చుకోవాలి. కానీ ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న వాహనాలు చాలావరకు ఒక డ్రైవర్‌తోనే బయలుదేరుతున్నాయి. హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు సుమారు 1,136 కి.మీ. దూరం నిరాటంకంగా వాహనాలను నడపడం వల్ల డ్రైవర్లు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు.

సాధారణంగా సంక్రాంతి, దసరా వంటి పండుగలు, మేడారం వంటి జాతరలకు ఆర్టీసీ వేలకొద్దీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుంది. కానీ ఈ కుంభమేళాకు లక్షలాది మంది తరలి వెళ్తున్నట్లు తెలిసి కూడా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయకపోవడం శోచనీయం.

సీతారామకు 'మేడిగడ్డ' అడ్డంకి!

సాక్షి, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు సాంకేతిక అనుమతులకు 'మేడిగడ్డ బరాజ్' అడ్డంకిగా మారింది. మేడిగడ్డ కుంగడం, తదనంతర పరిణామాల నేపథ్యంలో.. సీతారామ ప్రాజెక్టు డిజైన్లను పునఃపరిశీలించాకే అనుమతుల విషయంలో ముందుకు వెళ్తామని కేంద్ర జలసంఘానికి (సీడబ్ల్యూసీ) చెందిన టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) స్పష్టం చేసింది. సీడబ్ల్యూసీ చైర్మన్ ముఖేష్ కుమార్ సిన్హా నేతృత్వంలో మంగళవారం ఢిల్లీలో జరిగిన 157వ టీఏసీ సమావేశంలో సీతారామ ప్రాజెక్టుతో పాటు దేశంలోని మరో రెండు ప్రాజెక్టులకు అనుమతులపై లోతుగా చర్చించారు. ప్రాజెక్టు డిజైన్లన్నింటినీ సీడబ్ల్యూసీతో మళ్లీ పునః పరిశీలన చేయించాలని ఈ సమావేశంలో టీఏసీ నిర్ణయం తీసుకుంది. నెల రోజుల తర్వాత మళ్లీ సమావేశం నిర్వహించి అనుమతుల విషయాన్ని పరిశీలిస్తామని తెలిపింది. టీఏసీ సమావేశానికి తెలంగాణ తరఫున నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్, ఇతర అధికారులు హాజరయ్యారు.



మంగళవారం కుటుంబ సభ్యులతో కలసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి

హౌసింగ్ బోర్డు భూములకు ప్రహరీ



సాక్షి, హైదరాబాద్: హౌసింగ్ బోర్డు తన అధీనంలో ఉన్న భూముల పరిరక్షణకు నడుం బిగించింది. ఇటీవల హౌసింగ్ బోర్డుకు సంబంధించిన అన్ని భూముల వివరాలను తెప్పించుకొని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఎలాంటి వివాదాలు లేని భూముల చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఆదేశించగా, ఆ పనులు ప్రారంభమయ్యాయి. ప్రహరీ నిర్మాణానికి రూ.25 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హౌసింగ్ బోర్డు భూములను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఇప్పటికే అన్యాక్రాంతమైన వాటిని స్వాధీనం చేసుకోవటంతోపాటు కొత్తగా గజం స్థలం కూడా కబ్జా కానివ్వబోమని చెప్పారు. హౌసింగ్ బోర్డు, 'దిల్' అధీనంలోని వేల కోట్ల విలువైన భూములను కాపాడుతామన్నారు.

అనంత ఘాట్‌లో చిరుత సంచారం




అనంతగిరి/ధారూరు: వికారాబాద్ జిల్లా అనంతగిరి గుట్ట అడవిలో మంగళవారం రాత్రి ఓ చిరుతపులి వాహనదారుల కంటపడింది. వికారాబాద్ రెండో ఘాట్ వద్ద దీని సంచారం కలకలం రేపింది. ధారూరు, వికారాబాద్ వైపు వెళ్తున్న వాహనదారులను గమనించి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. ఈ దృశ్యాలను సెల్‌ఫోన్లలో వీడియో తీసిన వాహనదారులు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది.

చదువు ఇష్టం లేక టెన్త్ విద్యార్థిని బలవన్మరణం

నర్సాపూర్ రూరల్: చదువు ఇష్టం లేని పదో తరగతి విద్యార్థిని ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలో జరిగిన ఈ సంఘటనపై నర్సాపూర్ ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. చిన్నచింతకుంట గ్రామానికి చెందిన మన్నె లావణ్య, నగేశ్ దంపతుల కూతురు శ్రీకన్య (16) వెల్దుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శనివారం ఇంటికి వచ్చిన శ్రీకన్యను.. తిరిగి సోమవారం నుంచి పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు సూచించారు. కానీ కుమార్తె పాఠశాలకు వెళ్లనని పట్టుబట్టింది. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు మరోసారి పాఠశాలకు వెళ్లాలని చెప్పడంతో.. మనస్తాపానికి గురైన శ్రీకన్య ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు వెంటనే ఆమెను సంగారెడ్డిలోని ఒక ఆస్పత్రికి తరలించగా సాయంత్రం మృతి చెందింది. శ్రీ కన్యకు చదువుకోవడం ఇష్టం లేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భయం.. అభయం..!



- ఇంటర్ విద్యార్థుల్లో మనోధైర్యం నింపుతున్న టెలి మానస్
- పరీక్షల సమయంలో ఒత్తిడికి గురవుతున్నవారికి కౌన్సెలింగ్
- వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 24 x7 సేవలు
- సూచనలు, చిట్కాలు, పాటించాల్సిన జాగ్రత్తలతో విద్యార్థులకు భరోసా
- 1382 టోల్ ఫ్రీ నంబర్‌కు పెద్ద సంఖ్యలో ఫోన్లు
- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలో కాల్స్

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ విద్యార్థులు పరీక్షల భయాన్ని, చదువుకు సంబంధించిన ఒత్తిడిని అధిగమించి, ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్షలకు సిద్ధమయ్యేలా తోడ్పడేందుకు ఏర్పాటైన 'టెలి మానస్'సత్ఫలితాలనిస్తోంది. వైద్య, ఆరోగ్య శాఖ నేతృత్వంలో నడుస్తున్న టెలి మానస్‌ను 1382 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా విద్యార్థులు పెద్ద సంఖ్యలో సంప్రదిస్తున్నారు. తల్లిదండ్రులు తమపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని చెబుతున్నారు. తమలోని ఆందోళన తెలియజేస్తున్నారు. వారి సమస్యలను, ఆందోళనను సావధానంగా వింటున్న టెలి మానస్ సైకాలజిస్టులు అవసరమైన కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఒత్తిడిని అధిగమించేలా సలహాలు, అనుసరించాల్సిన చిట్కాలు తెలియజేస్తున్నారు. అనేకమంది తల్లిదండ్రులు కూడా టెలీ మానస్‌ను ఆశ్రయిస్తుండటం గమనార్హం కాగా.. పిల్లల విషయంలో ఎలా ముందుకు వెళ్లాలో కౌన్సెలర్లు వారికి సూచనలిస్తున్నారు. తమ కౌన్సెలింగ్ విద్యార్థుల్లో మనో ధైర్యాన్ని నింపుతోందని సైకాలజిస్టులు, కౌన్సెలర్లు చెబుతున్నారు. డిసెంబర్ 24 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ మధ్యకాలంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ఫోన్లు వచ్చినట్లు వివరించారు.

మంచి ర్యాంకులు రావాలంటూ తల్లిదండ్రులు, కాలేజీల యాజమాన్యాలు విధిస్తున్న టార్గెట్లతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పరీక్షల తేదీలు సమీపిస్తున్న కొద్దీ వారిని భయం వెంటాడుతోంది. కాలేజీలో చెప్పలేక, ఇంట్లో మాట్లాడలేక దిగులు పడుతున్నారు.

అర్ధరాత్రి వేళల్లోనూ కౌన్సెలింగ్

ఈ నేపథ్యంలోనే అనేకమంది టెలి మానస్‌ను ఆశ్రయిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఈ తరహా ఫోన్లు రోజుకు సగటున 20 వరకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్‌ను 24 గంటలూ అందుబాటులో ఉంచడంతో కొంతమంది అర్ధరాత్రి కూడా ఆందోళన పడుతూ ఫోన్లు చేస్తున్నారని వివరించారు.

అన్నీ మర్చిపోయిన ఫీలింగ్ కలుగుతోంది..

టెలి మానస్‌కు వరంగల్ నుంచి ఓ విద్యార్థి ఫోన్ చేశాడు. 'నేను హైదరాబాద్‌లో ప్రైవేటు రెసిడెన్షియల్ కాలేజీలో చదువుతున్నా. కాలేజీ పరీక్షల్లో ప్రతిసారీ మంచి మార్కులే వచ్చేవి. కానీ రెండు రోజులుగా భయం వేస్తోంది. నాన్న ఫోన్ చేసి మంచి ర్యాంకు కొడతావ్‌గా అంటాడు. కాలేజీ వాళ్ళేమో అర్ధరాత్రి కూడా చదవాల్సిందే అంటున్నారు. పుస్తకం పట్టుకుంటే వణుకు వస్తోంది. అన్నీ మర్చి పోయానేమో అనే ఫీలింగ్ వస్తోంది..'అంటూ ఆందోళన వ్యక్తం చేశాడు. దీంతో అతనికి సైకాలజిస్టు ఒకరు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఒత్తిడిని అధిగమించేలా పలు సూచనలిచ్చారు.

నిద్ర పట్టడం లేదు..

హైదరాబాద్ నుంచి సుమారు 40 రోజుల వ్యవధిలోనే అత్యధిక సంఖ్యలో 68 ఫోన్ కాల్స్ వచ్చాయి. ఇందులో 28 మంది పరీక్షల తేదీ ప్రకటించిన తర్వాత నిద్ర పట్టడం లేదని తెలిపారు. 18 మంది పరీక్షలంటే గుబులేస్తోందని చెప్పారు. వీళ్లలో 12 మంది తల్లిదండ్రులు తమపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, మంచి మార్కులు ఎలా వస్తాయో అన్న భయం వెంటాడుతోందని చెప్పారు. ఆరుగురు మానసిక ఒత్తిడితో తలనొప్పి వస్తోందని చెప్పారు. మంచి ఆహారం తీసుకోవాలని, తగినంత సమయం నిద్ర పోవాలని సూచించడంతో పాటు, చదువు విషయంలో వారిని మానసికంగా ధైర్య పరిచేలా కౌన్సెలింగ్ ఇచ్చారు.

భయం భయంగా ఉంటున్నారు..

- ఖమ్మంలోని ఓ గురుకుల ఉపాధ్యాయుడు ఫోన్ చేసి.. 'బాగా చదివే నలుగురు విద్యార్థులు ఎందుకో మూడు రోజులుగా భయం భయంగా ఉంటున్నారు. గుచ్చి గుచ్చి అడిగితే పరీక్షలంటే కంగారుగా ఉందని చెప్పారు..'అని వివరించారు. దీంతో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పట్నుంచి వారు కాస్త ధైర్యంగా ఉన్నారని ఉపాధ్యాయుడు తెలిపారు.
- రంగారెడ్డి జిల్లా నుంచి పది మంది విద్యార్థులు పరీక్ష రాసేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హాల్ టికెట్ల గురించి అడిగారు. మరో ఆరుగురు ఫెయిల్ అవుతామనే భయం వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్ తర్వాత వారిలో ధైర్యం కన్పించిందని టెలి మానస్ సిబ్బంది చెప్పారు.
- ఖమ్మం, నల్లగొండ, వరంగల్, హైదరాబాద్ జిల్లాల నుంచి 12 ఫోన్ కాల్స్ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వచ్చాయి. పిల్లలు పరీక్షలంటే భయపడుతున్నారని, వాళ్ళను ఏ విధంగా సన్నద్ధం చేయాలో చెప్పమని అడిగారు. ఆహారం, నిద్ర, తాగునీరు విషయంలో జాగ్రత్తలపై ఆరా తీశారు.

చదవడం కన్నా రాయడం మంచిది

తల్లిదండ్రులు, కాలేజీలు విద్యార్థులపై మార్కులు, ర్యాంకుల కోసం ఒత్తిడి చేయొద్దు. వారిలో విశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలి.

రాత్రి నిద్ర సరిగా పోకుండా చదివితే ఉపయోగం లేదు. ఉదయాన్నే లేచి రివిజన్ చేసుకుంటే బెటర్. బాగా చదివిన సబ్జెక్టులు, చాప్టర్స్‌పై దృష్టి పెట్టాలి. టెన్షన్ తెప్పించే వాటిని సమయాన్ని బట్టి చూసుకోవడం మంచిది.

పరీక్ష భయం ఉన్న వారు చదవడం కన్నా.. సమాధానాలు ఒకటికి రెండుసార్లు రాయడం మంచిది. దీనివల్ల పరీక్ష తేలికగా రాసే వీలుంది. సబ్జెక్టులో ఇబ్బంది ఉంటే ఆందోళన చెందకుండా సంబంధిత లెక్చరర్‌ను కలిసి సందేహాలు నివృత్తి చేసుకోవాలి.

ఇళ్లలో టీవీలు, సెల్‌ఫోన్లకు విద్యార్థులే కాదు.. తల్లిదండ్రులూ దూరంగా ఉండాలి. దీనివల్ల మానసికంగా చదివే కమాండ్ వస్తుంది. తల్లిదండ్రులు విద్యార్థి ఆందోళన గుర్తించాలి. బంధువులు, పరిచయస్తులతో ప్రోత్సాహకరమైన మాటలు చెప్పించాలి.

పరీక్షల సమయంలో ఆహారం, మంచినీరు చాలా ముఖ్యం. మంచి పౌష్టికాహారంతో పాటు, సమయపాలన అనుసరించాలి. మెదడుకు 80 శాతం, ఇతర శరీర భాగాలకు 20 శాతం ఆక్సిజన్ అవసరం. ఇది నీళ్ల ద్వారానే ఎక్కువగా సమకూరుతుంది. ఉదయం వ్యాయామం చేయడం వల్ల మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చు.



పి.జవహర్‌లాల్ నెహ్రూ
సీనియర్ సైకాలజిస్టు, టెలి మానస్

మధ్యవర్తిత్వం ఓ కళ

- కమ్యూనిటీ వలంటీర్లు అందిపుచ్చుకోవాలి: ఏసీజే సుజోయ్‌పాల్
- కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్ల శిక్షణలో ఏసీజే

సాక్షి, హైదరాబాద్: మధ్యవర్తిత్వం ఓ కళ అని, కమ్యూనిటీ వలంటీర్లు దాన్ని అందిపుచ్చుకోవాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ సుజోయ్‌పాల్ పేర్కొన్నారు. మహాత్ముడు కూడా ఇదే మార్గంలో ఎన్నో వివాదాలను పరిష్కరించారని చెప్పారు. ప్రజలంతా కలిసిమెలిసి, ప్రశాంత జీవనం సాగించాలన్నదే మన రాజ్యాంగ లక్ష్యమన్నారు. హైదరాబాద్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో మూడు రోజుల 'కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్ల శిక్షణ' కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏసీజే మాట్లాడుతూ.. 'మీ మాతృభాష తెలుగులో చెప్పాలని ఉన్నా.. నేను మాట్లాడలేను. అందుకే ఆంగ్లంలో కాకుండా ఎక్కువ మందికి అర్థమయ్యేలా హిందీలో మాట్లాడతా. చిన్న చిన్న వివాదాలతోనే దాంపత్య కేసుల సంఖ్య పెరుగుతోంది. వివాహ బంధాలు విచ్ఛిన్నం కాకుండా మధ్యవర్తిత్వంతో పరిష్కరించాలి' అని వివరించారు. 'మధ్యవర్తిత్వాన్ని తెలంగాణలో మరో స్థాయికి తీసుకెళ్లడానికి మీరందరూ కృషి చేయాలి. విష జ్వరాలు వచ్చిన సమయంలో వద్దని కొందరు చెప్పినా.. కామారెడ్డి, నిజామాబాద్‌లో కమ్యూనిటీ కేంద్రాలకు వెళ్లాం. నా భార్య సైతం అక్కడ ఎవరికి తెలియకుండా శిక్షణ



కార్యక్రమంలో ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ లక్ష్మణ్, మహ్మద్ షమీమ్

తీసుకున్నారు. తీవ్ర వర్షంలో సైతం అక్కడికి ప్రజలు బైక్‌ల మీద, బస్సుల్లో వచ్చారు' అని జస్టిస్ సుజోయ్‌పాల్ పేర్కొన్నారు.

మధ్యవర్తిత్వంతో తగ్గించొచ్చు: జస్టిస్ కె.లక్ష్మణ్

న్యాయమూర్తి, తెలంగాణ మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్ సెంటర్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ప్రెసిడెంట్ జస్టిస్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. 'వీలైనంత త్వరలో కమ్యూనిటీ సెంటర్లను 33 జిల్లాలకు విస్తరిస్తాం. కార్మిక చట్టాల్లో తొలుత మధ్యవర్తిత్వం జరపాలని ఉంది. ఇది విఫలమైనందునే ఆర్టీసీ సమ్మె అంత ఉధృతంగా జరిగింది. 143 కోట్ల జనాభాకు కోర్టులు చాలడం లేదు. మధ్యవర్తిత్వంతోనే కేసులను సగానికిపైగా తగ్గించవచ్చు' అని వెల్లడించారు. అనంతరం వలంటీర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎల్ఎస్ఏ సభ్యకార్యదర్శి సీహెచ్ పంచాక్షరి, మహ్మద్ షమీమ్, ఏవో కళార్చన, డీఏవో ఇందిర పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన ఉత్తమ ఎస్సై



ఏసీబీకి పట్టుబడిన ఎస్సై వేణుగోపాల్‌గౌడ్, అతని డ్రైవర్ బీరప్ప

ధారూరు: ఉత్తమ ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ ఏసీబీకి చిక్కారు. ఎస్సై డ్రైవర్ బీరప్ప రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని నాగసమందర్ గ్రామానికి చెందిన ఉప్పరి హన్మంతు, ఉప్పరి గోపాల్‌లు అన్నదమ్ములు. హన్మంతు తన తమ్ముడి ఇంటి ముందు డబ్బా ఏర్పాటు చేశాడు. దీనిపై పంచాయితీకి వెళ్లగా, డబ్బాను తీసివేయాలని గ్రామపెద్దలు హన్మంతుకు చెప్పినా, వినకుండా తమ్ముడి కుటుంబంపై దాడి చేశారు. ఈ వ్యవహారంలో ఇద్దరూ పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో బాధితులు వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా హన్మంతు ఎస్సై వేణుగోపాల్‌ను ప్రలోభాలకు గురిచేశాడు. దీంతో గోపాల్, అతని కుటుంబ సభ్యులైన ఏడుగురిపై కేసు నమోదు చేశాడు. ఈ కేసులో గోపాల్ కుమారుడి పేరు తీసివేసేందుకు, ఆరుగురికి స్టేషన్ బెయిల్ ఇప్పించడానికి ఎస్సై రూ.70 వేలు డిమాండ్ చేయగా, రూ.50 వేలకు ఒప్పందం కుదిరింది. మంగళవారం సాయంత్రం ఎస్సైని కలిసి డబ్బులు ఇచ్చే ప్రయత్నం చేయగా, తన డ్రైవర్ బీరప్పకు ఇవ్వాలని సూచించారు. ముందుగానే గోపాల్, ఆయన బావ లక్ష్మణ్‌లు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలో రూ.30 వేలు డ్రైవర్‌కు ఇస్తుండగా పట్టుకున్నారు. డ్రైవర్, ఎస్సైని అదుపులోకి తీసుకొని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. జనవరి 26న జరిగిన గణతంత్ర వేడుకల్లో వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్పీల చేతుల మీదుగా ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ ఉత్తమ పోలీసు అధికారిగా అవార్డు అందుకున్నారు. ఇది అందుకున్న 15 రోజుల్లో ఏసీబీకి పట్టుబడటం గమనార్హం.

సరిహద్దుల్లో చెక్‌పోస్టులు

సాక్షి, హైదరాబాద్: ఏపీలో బర్డ్‌ఫ్లూ వ్యాధి నిర్ధారణ కావడంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. తెలంగాణలో ఈ వ్యాధి ఇంకా నిర్ధారణ కానప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కోళ్ల రాకపోకలపై తాత్కాలికంగా నిషేధం విధించింది. ఇతర రాష్ట్రాలతో మనకు ఉన్న సరిహద్దుల్లో మంగళవారం పోలీసులు, పశుసంవర్థక శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి కోళ్ల వాహనాలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మరో వైపు ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ నోటిఫై చేశారు. మన రాష్ట్రంలో ఇంకా వ్యాధి నిర్ధారణ కాలేదని పశుసంవర్థక శాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రం నుంచి భోపాల్‌లోని హైసెక్యూరిటీ ల్యాబ్‌కు పంపిన శాంపిల్స్ ఫలితాలు ఒకట్రెండు రోజుల్లో వస్తాయని అంటున్నారు. ఒకవేళ ఈ ఫలితాల్లో బర్డ్‌ఫ్లూ పాజిటివ్ వస్తే మాత్రం తీవ్రమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని

బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కాకపోయినా ప్రభుత్వం అప్రమత్తం

- భోపాల్‌కు పంపిన శాంపిల్స్ ఫలితాల కోసం ఎదురుచూపులు
- ఒకవేళ పాజిటివ్ వస్తే 5 కిలోమీటర్ల పరిధిలోని కోళ్లన్నింటినీ చంపేయాల్సిందే
- ఖమ్మం జిల్లా శాంపిల్స్‌పైనే అనుమానాలు.. ఇప్పటికే తూర్పుగోదావరిలో బర్డ్‌ఫ్లూ నోటిఫై



ఖమ్మం జిల్లా బోనకల్ - ఏపీలోని వత్సవాయి సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో పోలీసులు

చెబుతున్నారు. ఖమ్మం జిల్లా నుంచి పంపిన శాంపిల్స్‌పైనే అనుమానాలున్నాయనే చర్చ పశుసంవర్థక శాఖ వర్గాల్లో జరుగుతోంది.

బాగా ఉడికించి తినాలి...

మన రాష్ట్రంలోని కోళ్లలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయ్యే అవకాశాలు తక్కువ గానే ఉన్నాయని తెలుస్తోంది. ఒకవేళ ఫలితం పాజిటివ్ వస్తే ఏం చేయాలన్న దానిపై కూడా పశుసంవర్థక శాఖ కార్యాచరణ రూపొందిస్తోంది. ఏ ప్రాంతంలోని కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయ్యిందో ఆ ప్రదేశంలోని ఐదు కిలోమీటర్ల వ్యాసార్థంలో ఉన్న కోళ్లన్నింటినీ చంపక తప్పదని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. చంపిన కోళ్లను గుంతలు తీసి పూడ్చిపెట్టాలని, ఆ

నిజామాబాద్ జిల్లాకు మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న సాలూర, కందకుర్తి చెక్ పోస్టుల వద్ద పశుసంవర్థక, పోలీసు శాఖలు కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి నిజామాబాద్‌లోకి కోళ్లతో పాటు ఏ జీవాలను కూడా రవాణా చేయకుండా నిరోధిస్తున్నారు.



సాలూర చెక్‌పోస్టు వద్ద పశుసంవర్థక శాఖ సిబ్బంది

గుంతలపై మంట పెట్టడమే కాకుండా అవసరమైతే సున్నం వేయాల్సి వస్తుందని అంటున్నారు. వ్యాధి సోకిన ఫామ్‌లను పూర్తిస్థాయిలో శుభ్రం చేయడంతోపాటు ఆ ఫామ్‌లలో ఉపయోగించే వస్తువులనూ మార్చాలంటున్నారు. మొత్తం మీద శాంపిల్స్ ఫలితాలు పాజిటివ్ వస్తే పశుగణనలో బిజీగా ఉన్న తమకు కొత్త తలనొప్పి ప్రారంభమైనట్టేనని వారంటున్నారు. ఇప్పుడు కూడా కోళ్లను తినడంలో పూర్తి స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని, కోళ్లు, కోడిగుడ్లు తినేటప్పుడు బాగా ఉడికించి తినాలని వారు సూచిస్తున్నారు.

- ఏపీ నుంచి తెలంగాణలోకి కోళ్లు రాకుండా అడ్డుకునేందుకు రాష్ట్ర సరిహద్దు అయిన కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్ వద్ద విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారిపై చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి ఏపీ వైపు నుంచి కోళ్లతో వస్తున్న డీసీఎంను వెనక్కి పంపినట్టు కోదాడ మండల పశువైద్యాధికారి మధు తెలిపారు.
- ఖమ్మం జిల్లా సరిహద్దుగా ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఏపీ-ఖమ్మం జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేస్తూ కోళ్ల దిగుమతి కాకుండా అడ్డుకుంటున్నారు. ఏపీ సరిహద్దుల్లో ఉన్న కోళ్ల పరిశ్రమల నిర్వాహకులు, పోలీసు, రెవెన్యూ, ఫారెస్ట్ తదితర శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహిస్తున్నామని ఖమ్మం జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ వి.వెంకటనారాయణ, వెల్లడించారు.

కరెంటు సమస్యపై నాకైనా ఫోన్ చేయొచ్చు!

- వేసవిలో విద్యుత్ డిమాండ్‌పై అప్రమత్తంగా ఉండండి
- ఉత్తమంగా పనిచేసే సిబ్బందికి పురస్కారాలు
- 1912 నంబర్‌పై ప్రజలకు అవగాహన కల్పించండి
- టీజీఎస్పీడీసీఎల్ అధికారులతో సమీక్షలో భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: వచ్చే వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. లైన్‌మెన్ నుంచి విద్యుత్ శాఖ మంత్రి వరకు అందరూ ఒక కుటుంబంలా పనిచేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఏ సమస్య వచ్చినా తక్షణమే పై అధికారికి ఫోన్ చేయాలని, వారు స్పందించకుంటే ఆపై అధికారికి ఫోన్ చేయాలని.. అలా చివరకు తనకు సైతం ఫోన్ చేయవచ్చని తెలిపారు. విద్యుత్ సరఫరాపై మంగళవారం ఆయన సచివాలయంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) అధికారులతో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగరంలో ఎమర్జెన్సీ వాహనాల ద్వారా కొనసాగుతున్న విద్యుత్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించాలని ఆదేశించారు. మార్చి నాటికి సబ్ స్టేషన్ల నిర్మాణం, ఇతర పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. వచ్చే వేసవిలో పెరగనున్న డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్‌ను సమీకరించి సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని భట్టి తెలిపారు. అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవి ప్రణాళికపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

బాగా పనిచేస్తే పురస్కారాలు..

విద్యుత్ సరఫరా విషయంలో ఉత్తమంగా పనిచేసే సిబ్బందిని ప్రోత్సహించేందుకు పురస్కారాలు ఇచ్చే కార్యక్రమాన్ని విద్యుత్ శాఖలో ప్రారంభించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు ఏర్పాటు చేసిన 1912 నంబర్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. వినియోగదారుల మొబైల్ ఫోన్లకు 1912 గురించి సంక్షిప్త సందేశాలను పంపించడంతో పాటు వారికి జారీచేసే కరెంట్ బిల్లులపై దీనిని ప్రచురించాలని కోరారు. 1912 కాల్ సెంటర్‌కు సిబ్బందిని పెంచి బలోపేతం చేసేందుకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమీక్షలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ పాల్గొన్నారు.

ఈపీఎస్‌కు సవరణలు చేయాలి

పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్.. పెన్షన్ ఆఫీసు ఎదుట ధర్నా



బర్కత్‌పురలోని ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్స్

కాచిగూడ (హైదరాబాద్): ఈపీఎస్ (ఎంప్లాయి పెన్షన్ స్కీం)కు సవరణలు చేయాలని, పెన్షనర్లు గౌరవంగా బతికేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని ఆల్ ఇండియా కన్వీనింగ్ కమిటీ చైర్మన్ ఎంఎస్ రెడ్డి, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి అన్నారు. నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఈపీఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బర్కత్‌పురలోని ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు భత్యంతో కూడిన కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల కష్టార్జితాన్ని కార్పొరేట్ల పరం చేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హయ్యర్ పెన్షన్ మంజూరు చేయడంలో జాప్యాన్ని నివారించాలని, కొర్రీలు వేయడాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఈపీఎఫ్ఓ హైదరాబాద్ ప్రాంతీయ కమిషనర్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.నరహరి, కన్వీనర్ ఎస్.బ్రహ్మచారి, ఎస్.సోమయ్య, నరహరి, కమతస్ నర్సప్ప, జి.రాజారాం, ఎల్.అరుణ, చెన్నకేశవులు, ఎం.శంకర్‌రావు, కె.రాధాకృష్ణ, బి.రామారావు, టి.బాల గంగాధర్, బీజేఎం రెడ్డి, మస్తాన్ రావు, జి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డిపోలు దాటని బీర్లు

ధరపై నిర్ణయం ఆలస్యం కావడంతో బీర్ల అమ్మకాలు నిలిపివేసిన ఎక్సైజ్ శాఖ

సాయంత్రానికి ఆలస్యంగా చేరిన ధరల పట్టిక.. నేటి నుంచి కొత్త రేట్లతో అందుబాటులోకి..




సాక్షి, హైదరాబాద్: పెరిగిన ధరలు అందుబాటులోకి రాని కారణంగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మద్యం డిపోల నుంచి బీర్ల అమ్మకాలు నిలిచిపోయాయి. రాష్ట్రంలో లభ్యమయ్యే అన్ని బ్రాండ్ల బీర్ ధరలు పెంచుతున్నామని, మంగళవారం నుంచి పెరిగిన ధరలు వర్తిస్తాయని ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఉత్తర్వుల మేరకు ఏ బ్రాండ్ బీర్ ఎంతకు అమ్మాలనే ధరను నిర్ణయించి మద్యం డిపోలకు సకాలంలో ఎక్సైజ్ శాఖ పంపలేకపోయింది. దీంతో మంగళవారం పూర్తిగా డిపోల నుంచి సరుకు బయటకు వెళ్లలేదు. అయితే, మంగళవారం సాయంత్రానికి ఈ ధరల పట్టికను మద్యం డిపోలకు పంపినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచి మద్యం డిపోల నుంచి బీర్ల అమ్మకాలు యథాతథంగా ప్రారంభం కానున్నాయి. నేటి నుంచి కొత్త ధరలతో బీర్లు డిపోల నుంచి అమ్మనున్నారు. అదే విధంగా డిపోల నుంచి బుధవారం తీసుకెళ్లే సరుకును వైన్‌షాపుల్లో కొత్త ధరలకు విక్రయించవచ్చని ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఇక, కొత్త ధరల ప్రకారం మెజార్టీ బ్రాండ్ల లైట్ బీర్ ధర రూ.180కి, స్ట్రాంగ్ బీర్ రూ.190కి చేరింది. మరికొన్ని బ్రాండ్లను బట్టి రేట్లలో మార్పులు వచ్చాయి.

నేటి నుంచి మార్కెట్‌లో లభించే బీర్ (650 ఎంఎల్) ధరలివే. (రూ.లలో)

బీరు	లైట్	స్ట్రాంగ్	బీరు	లైట్	స్ట్రాంగ్
కింగ్‌ఫిషర్	180	190	హేవార్డ్స్ 5000	--	190
రాయల్ చాలెంజ్	180	--	కార్ల్స్‌బర్గ్	230	220
టుబర్గ్	180	190	కింగ్‌ఫిషర్ అల్ట్రా	250	260
ఖర్జూర	180	190	బడ్వైజర్	250	260
నాకౌట్	--	190	హెనికెన్	270	--

రైతు ఎర్రం మల్లారెడ్డికి జాతీయ అవార్డు



పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి జిల్లా కాసులపల్లి గ్రామానికి చెందిన రైతు ఎర్రం మల్లారెడ్డి వినూత్న వ్యవసాయ విధానాలను చేపట్టినందుకు ఇన్నోవేటివ్ ఫెలో ఫార్మర్ అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి జాతీయస్థాయి అవార్డుకు ఎంపికైన ఏకైక రైతు ఈయనే. ఇప్పటికే మల్లారెడ్డి అనేక పురస్కారాలు అందుకున్నారు. విత్తనోత్పత్తి, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే పద్ధతులపై వివిధ ప్రాంతాల రైతులకు సూచనలిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈనెల 24న ఢిల్లీలో జరిగే ఇన్నోవేటివ్ ఫెలో ఫార్మర్ అవార్డును అందుకునేందుకు ఈనెల 21న ఢిల్లీకి రావాల్సిందిగా ఆహ్వానం అందిందని మల్లారెడ్డి తెలిపారు.

● తల్లి బాధ్యత



మలేసియాలో పెనాంగ్ నుంచి కౌలాలంపూర్‌కు 350 కిలోమీటర్లు. ట్రైన్‌లో నాలుగ్గంటలు. విమానంలో గంట. వివిధ కారణాల రీత్యా పెనాంగ్‌లో నివాసం ఉంటున్న రేచల్ కౌర్ కౌలాలంపూర్‌లోని తన ఉద్యోగానికి రోజూ విమానంలో వెళ్లి వస్తోంది. ‘టీనేజ్ పిల్లలు ఉన్నారు... వారికి తల్లి అవసరం ఎక్కువ’ అంటోంది. కెరీర్‌లో ఎంత బిజీగా ఉన్నా తల్లులు తమ పిల్లలకు ఇవ్వాల్సిన సమయం గురించి ఈ భారతీయ తల్లి కథనం గుర్తు చేస్తోంది.



రేచల్ కౌర్

పిల్లల కోసం రెక్కలు తొడుక్కుంది

పిల్లల పెంపకం, కెరీర్... ఈ రెండు కత్తిమీద సామే వర్కింగ్ ఉమెన్‌కు. పిల్లలకు పూర్తిసమయం ఇస్తున్నామా లేదా అనేది ఒక ఆందోళనైతే వృత్తిలో ముందుకు పోగలమా లేదా అనేది మరో ఆందోళనగా ఉంటుంది. వీటిమధ్య నలగడం కంటే శక్తికి మించి ఎంతమేరకు చేయగలమో అంతమేరకు చేసి తృప్తిపడుతున్న తల్లులూ ఉన్నారు.

మలేసియాలో స్థిరపడ్డ మన పంజాబీ రేచల్ కౌర్ కథ అలాంటిదే. ఆమె తన పిల్లల కోసం బహుశా ఏ తల్లీ చేయని పని చేస్తోంది. అదేంటంటే రోజూ విమానంలో పనికి వెళ్లి విమానంలో రావడం! చాలామంది ఇది పిచ్చా... వెర్రా... అని ఆశ్చర్యపోతారుగాని నాకు ఇదే బాగుందని రేచల్ అంటోంది.





ఇల్లు ఒకచోట.. పని ఒకచోట!

రేచల్ కౌర్ తన భర్త జగ్‌జిత్ సింగ్ ఇద్దరు పిల్లలతో మలేసియాలోని పెనాంగ్‌లో ఉంటోంది. ఆమె ఉద్యోగం కౌలాలంపూర్ ఎయిర్‌పోర్ట్‌లో. ఎందుకంటే ఆమె ఎయిర్ ఏసియాలో బిజినెస్ మేనేజర్. ఈ రెండు చోట్ల మధ్య 350 కిలోమీటర్లు ఉంది. బస్సు మార్గం కష్టం. రైలు సులువు. కాని ఉద్యోగానికి పోయి వచ్చేంత వీలుగా రైళ్లు ఉండవు. ‘అందుకే నేను ఉద్యోగం కోసం కౌలాలంపూర్‌లో ఉంటూ వారానికి ఒకసారి వచ్చి వెళ్లేదాన్ని. కౌలాలంపూర్‌లో ఉండటానికి రూమ్‌కు, నా తిండికి బాగానే ఖర్చయ్యేది. దానిబదులు రోజూ వచ్చి వెళితే కేవలం లంచ్ ఖర్చు, చార్జీల ఖర్చు తప్ప మరే ఖర్చూ ఉండదనిపించింది. దాంతో విమానంలో వచ్చి వెళ్లాలని నిశ్చయించుకున్నాను’ అంటుంది రేచల్ కౌర్.

చార్జీల్లో రాయితీ

రేచల్ కౌర్ ఎయిర్ ఏసియాలో పని చేస్తుంది. ఆ సంస్థ వారు ఆమెకు రాయితీ ఇవ్వడం వల్ల రాకపోకల ఖర్చు బాగా తగ్గింది. ‘మా ఉద్యోగి ఉద్యోగాన్ని, ఇంటిని బేలెన్స్ చేసుకోవాలని ప్రయత్నిస్తే సహకరించడం మా బాధ్యత. ఇలా పని చేయాలని కోరుకునేవారికి మేము పూర్తి సహకారం అందిస్తాం’ అని ఎయిర్ ఏసియా ప్రతినిధులు రేచల్‌ను ప్రస్తావిస్తూ అన్నారు.

ఉదయం 4 గంటలకు లేచి

రేచల్ ఇల్లు పెనాంగ్‌లో ఎయిర్‌పోర్ట్‌కు బాగా దగ్గర. ‘నేను ఉదయాన్నే నాలుగు లేదా నాలుగుంపావుకు నిద్ర లేస్తాను. ఐదు గంటలకంతా రెడీ అయ్యి నా కారులో ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతాను. మా ఎయిర్ ఏసియా రోజువారీ విమానం బోర్డింగ్ టైమ్ 5.55 నిమిషాలు. నేను ఎయిర్‌పోర్ట్‌లో కారు పార్క్ చేసి సులభంగా బోర్డ్ చేయగలిగేంత సమయం ఉంటుంది. ఆరున్నరకు బయలుదేరిన విమానం ఏడున్నరకంతా కౌలాలంపూర్ చేరుతుంది. ఇంకో పదిహేను నిమిషాల్లో ఎయిర్‌పోర్ట్‌లోని మా ఆఫీస్‌లో ఉంటాను’ అని చెప్పింది రేచల్. ‘ప్రతి రోజూ విమానంలో ఉదయంపూట కాసేపు ప్రార్థన చేసుకుంటాను. అక్కడే బ్రేక్‌ఫాస్ట్ అయిపోతుంది. సాయంత్రం ఐదు గంటలకు డ్యూటీ ముగిశాక మళ్లీ విమానం ఎక్కుతాను. ఏడున్నరకంతా ఇంట్లో ఉంటాను’ అంది రేచల్. 2024 ప్రారంభం నుంచి ఇలా రోజూ తిరుగుతున్నాను. వీకెండ్ రెండు రోజులు తప్పించి ఇప్పటికి 200 రోజులకు పైగా విమానంలో రోజూ వచ్చి వెళ్లాను’ అందామె.

నా పిల్లల కోసం..

‘నా కొడుక్కు 12 సంవత్సరాలు. నా కూతురికి 11 సంవత్సరాలు. వారు ఎదిగే సమయం. నేను వారానికి ఒకసారి కనపడితే వాళ్ల తిండి, హోమ్ వర్కులు, ఎమోషన్స్ ఎలా తెలుస్తాయి. వారికి నేను కావాలి. అందుకే ఈ మార్గం కష్టమైనా సరే ఎంచుకున్నాను. నా ఆఫీస్‌లోని కలీగ్స్ నన్ను అర్థం చేసుకుని సహకరిస్తారు. ఇంట్లో నా భర్త. అందుకే రోజంతా ఎంత కష్టపడినా ఇంటికి చేరి నా పిల్లల ముఖాలు చూసేసరికి నా కష్టమంతా పోతుంది. ఇంతకుమించి ఏం కావాలి’ అంటుంది రేచల్.

టీనేజ్ వయసులో కూతురికైనా, కొడుక్కైనా తల్లి తోడ్పాటు ఉండాలి. తండ్రితో చెప్పుకోలేనివి వారు తల్లితో చెప్పుకుంటారు. ఏ కెరీర్‌లో ఉన్నా తల్లి ఈ సంగతిని మిస్ చేయకూడదని నిపుణులు అంటారు. రేచల్ ఉదంతం తల్లి బాధ్యతను గట్టిగా గుర్తు చేసేలా ఉంది.





రాజేశ్వరి ఛటర్జీ

● అడుగు జాడలు

జ్ఞాపకాల గని

ఆ తరం ఈ తరం అనే తేడా లేకుండా అన్ని తరాలకు స్ఫూర్తినిచ్చే పేరు... రాజేశ్వరి ఛటర్జీ. కర్నాటక తొలి తరం మహిళా ఇంజినీర్‌గా చరిత్రలో నిలిచిన రాజేశ్వరి ఆనాటి కుటుంబ పరిమితులు, కాలపరిమితులు అధిగమించి పెద్ద చదువులు చదువుకుంది. ఆమె చరిత్ర అంటే... మన దేశంలో కంప్యూటర్ సాంకేతికత తొలి తరం చరిత్ర. అనేకానేక పరిమితులు అధిగమించి విద్యాఉద్యోగాల్లో రాణిస్తూ తమను తాము నిరూపించుకున్న మహిళల చరిత్ర.

ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఐఐఎస్‌సీ, బెంగళూరు) చైర్‌పర్సన్‌గా పదవీ విరమణ చేసిన తరువాత రాజేశ్వరి ఎప్పుడూ ఖాళీగా కూర్చోలేదు. విశ్రాంత జీవితంలోనూ విలువైన పనులెన్నో చేసింది. ఆర్కైవ్‌లకు ఉపయోగపడే పనులెన్నో చేసింది.

‘ఆర్కైవ్ తొలినాళ్లలో ఆమె స్వచ్ఛందంగా సహాయం చేసింది. తన సహోద్యోగులు, విద్యార్థుల గురించి తెలుసుకోవడానికి మాకు సహాయపడింది. ఎన్నో వ్యక్తిగత ఫోటోలు సేకరించి ఆర్కైవ్‌కు బహుమతిగా ఇచ్చింది’ అని గుర్తు చేసుకున్నారు ఐఐఎస్‌సీ ఆర్కైవ్ అండ్ పబ్లికేషన్స్ సెల్ మాజీ సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ శరత్ అహుజా.

బెంగళూరులోని ‘ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్’లో మొదటి మహిళా ఇంజినీర్‌గా చరిత్రలో నిలిచిన రాజేశ్వరి ఛటర్జీ అత్యంత క్లిష్టమైన పనిని చేపట్టింది. ఐఐఎస్‌సీ శతాబ్దపు సుదీర్ఘ ప్రయాణానికి గుర్తుగా ఆర్కైవల్ కలెక్షన్‌తోపాటు పూర్వవిద్యార్థుల పుస్తకాన్ని సంకలనం చేసింది.

కంప్యూటర్‌ల హవా, ఇంటర్నెట్ ఊసులేని కాలంలోనే ఎప్పటికప్పుడు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని గురించి తెలుసుకోవడం ద్వారా తన కాలానికి సంబంధించిన పరిమితులు అధిగమించింది.

‘1949లో సెలవుల్లో ఎంఐటీకి వెళ్లినప్పుడు విశాలమైన గదుల్లో ఉంచిన తొలితరం కంప్యూటర్‌లలో ఒకదాన్ని చూశాను. మీ అరచేతిలో పట్టుకోగలిగే ఆధునిక లాప్‌టాప్‌లు ప్రారంభరోజుల్లోని ఆ భారీ కంప్యూటర్‌ల కంటే ఎక్కువ పని చేయగలవని ఊహించగలరా?’ అని ఐఐఎస్‌సీ పూర్వ విద్యార్థుల పుస్తకంలో రాసింది.

పీహెచ్‌డీ చేయాలనే రాజేశ్వరి కల రెండోప్రపంచ యుద్ధంతో భగ్నం అయింది. అయినప్పటికీ ఆమె తన ఆకాంక్షను వదులుకోలేదు. పరిశోధనను కొనసాగించడానికి ప్రత్యామ్నాయాలను అన్వేషించింది.

భౌతిక, వాతావరణ శాస్త్రవేత్త అన్నామణి, రసాయన శాస్త్రవేత్త రోషన్ ఇరానీల తర్వాత ఐఐఎస్‌సీ నుంచి స్కాలర్‌షిప్ పొందిన మూడో మహిళగా ఛటర్జీ గుర్తింపు పొందింది.

● కిచెన్ టిప్స్

పన్నీరు... పనీర్



- రెండు కప్పుల గులాబీ రెక్కలను ఒక లీటరు నీటిలో వేసి మరిగించి చల్లార్చితే పన్నీరు రెడీ. పన్నీటి తయారీకి వర్షపు నీరయితే మంచిది. ఇంట్లో సాస్ తయారు చేసుకున్నప్పుడు తయారీకి కావలసిన వాటితోపాటు కొంచెం పనీర్‌ను కలిపినట్లయితే సాస్ మెత్తగా ఉంటుంది.
- కూరల రుచి ఇనుమడించాలంటే చివరగా అందులో ఒక టేబుల్ స్పూన్ కొబ్బరి తురుము, ఒక టీ స్పూను జీలకర్ర పొడి కలపాలి.
- కొన్ని వంటల్లో కోడిగుడ్డు తెల్లసొన మాత్రమే వాడుతుంటాం. అలాంటప్పుడు పచ్చసొనను వృథా చేయకుండా తర్వాత ఉపయోగించాలంటే... దానిని ఒక గిన్నెలో వేసి సొన మునిగేటట్లు నీటిని పోసి ఫ్రిజ్‌లో పెట్టాలి. పచ్చసొనను ఉపయోగించేటప్పుడు నీటిని ఒంపేసి వాడాలి.

లీగల్

తను కేసు పెడితే... మీరే జైలుకు వెళ్లాల్సి వస్తుంది!

నాకు ఇటీవలే పెళ్లయింది. నా భార్యకి నాకు పెళ్ళికి ముందు 7 నెలల పరిచయం ఉంది. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నాం. కట్నంగా 5 లక్షల రూపాయలు ఫోన్ పే ద్వారా తీసుకున్నాను. పెళ్ళి వరకు అంతా బాగానే ఉంది కానీ, తర్వాత తన ప్రతి చిన్న దానికి గొడవ చేస్తుంది. తనకి అందం మీద ఉన్న శ్రద్ధ నా మీద, నా కుటుంబం మీద లేదు. ఊరికే ఫోటోలు దిగుతూ ఉంటుంది. స్కార్ఫ్ కట్టుకోమంటే కట్టుకోను అంటుంది. గొడవ పడిన ప్రతిసారి తలబాదుకుని నేను ఫిజికల్ అబ్యూస్ చేశాను అని వాళ్ళ కుటుంబ సభ్యులతో చెబుతుంది. అందంగా ఉంది, బాగానే సంపాదిస్తుంది అని పెళ్లి చేసుకున్నాను. అందం డబ్బు ఉంటే సరిపోదు, మాట వినే భార్య కూడా అయి ఉండాలి అని అర్థమైంది. మేమిద్దరం ఉద్యోగస్తులమే. నా జీతం 40,000. ఎం.బీ.ఏ చదివాను. తన జీతం 60,000. తను ఎం.సీ.ఏ యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్ కూడా. ఇంట్లో ఖర్చులకు తన జీతం పైసా కూడా ఇవ్వను అంటుంది. తన పెత్తనమే నడవాలి అంటుంది. ఎప్పుడూ తనని పొగుడుతూ ఉండాలి. తనకి నేను కౌన్సిలింగ్ కూడా ఇవ్వలేకపోతున్నాను. విడాకులు తీసుకోవాలి అంటే కనీసం సంవత్సరం ఆగాలి అని ఎక్కడో చదివాను. దయచేసి నా సమస్యకు పరిష్కారం సూచించగలరు.

– ఆదినారాయణ, గుంటూరు

ఏమిటి? ఐదు లక్షలు వరకట్నం తీసుకున్న మీరు, మీ భార్య మంచిది కాదు, సద్గుణాలు లేవు, నన్ను హరాస్ చేస్తోంది అంటున్నారా? హాస్యాస్పదంగా లేదూ? పైగా కట్నం డబ్బులు ఫోన్‌పే ద్వారా తీసుకున్నారు కదా... తను కేసు పెడితే జైలుకు వెళ్తారేమో చూసుకోండి!

ఇకపోతే... విడాకుల గురించి మీరు చదివింది నిజమే. హిందూ వివాహ చట్టం ప్రకారం కనీసం ఒక సంవత్సరం గడవకుండా విడాకుల కోరడం కుదరదు. పరస్పర ఒప్పందంతో విడిపోవాలి అనుకున్నా గాని కనీసం ఒక సంవత్సరం విడివిడిగా ఉంటున్నట్లు చూపించాలి.

మీ భార్య ఫోటోలు ఎక్కువ దిగుతుంది, ముఖానికి స్కార్ఫ్ కట్టుకోమంటే వినడం లేదు, తన పెత్తనం నడవాలి అంటుంది, జీతం కూడా నాకు ఇవ్వడం లేదు అని మీరు రాసిన ఈ-మెయిల్ చదివిన తర్వాత, కౌన్సెలింగ్ మీ భార్యకి కాదు మీకు అవసరం అనిపించింది. భార్య మీతో సమానం, మీరు చెప్పినట్లు వినడానికి తను మీ బానిస కాదు. ఇది మీకు తెలిసినట్లుగా లేదు. ఏ విధంగా చూసుకున్నా మీకన్నా తనకే మెరిట్ ఎక్కువ కదా... మీరెందుకు మీ జీతం ఆవిడకి ఇచ్చి ఇంటిని నడపమని చెప్పరు? ఇంటికి యజమాని పురుషుడు మాత్రమే అని అనుకుంటున్నారా? కనీసం మీ మాట తను వినట్లేదు, జీతం ఇవ్వడం లేదు అనకుండా ‘‘కుటుంబ బాధ్యతలు, ఆర్థిక బాధ్యతలు పంచుకోవడం లేదు’’ అనివుంటే నేను బహుశా ఆవిడ వైపు నుంచి కూడా చాలానే తప్పు ఉంది అని అనుకునేవాడిని. చాలామంది పురుషులలో – పురుషుల తల్లిదండ్రులలో కూడా ఈ పురుషాధిక్య భావాలు ఇంకా వుండటం బాధాకరం.

మీరు పంపిన ఈ-మెయిల్‌ని బట్టి చూస్తే అందులోని విషయాలు గృహహింస చట్టం – వరకట్న నిషేధ చట్టం కింద నేరాలే! తనది కూడా ఎంతో కొంత తప్పు ఉంది అనే బెనిఫిట్ ఆఫ్ డౌట్‌తో మీకు నేను ఇచ్చే సలహా ఏమిటి అంటే: ఇద్దరూ కలిసి మంచి ఫ్యామిలీ కౌన్సెలర్ దగ్గర కౌన్సెలింగ్ తీసుకోండి. తప్పు ఎవరిదైనా సరిచేసుకొని హాయిగా వైవాహిక జీవనాన్ని సాగించండి. అప్పటికీ కుదరకపోతే సామరస్యంగా విడిపోండి. ఆన్‌లైన్‌లో కట్నం తీసుకున్నారు కాబట్టి కేసులు మీ మీద వేస్తే మీకే నష్టం!



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.



అనురాగ్ కశ్యప్ : భావోద్వేగం

● ఎమోషన్

కూతురి పెళ్లి తరువాత... నాన్న నాన్ స్టాప్‌గా పది రోజులు ఏడ్చాడు!

ఎంత గంభీరంగా ఉండే తండ్రి అయినా సరే, పెళ్లి తరువాత కూతురు అత్తారింటికి వెళుతుంటే భావోద్వేగానికి గురై ఏడుస్తాడు. ‘నేను చాలా ప్రాక్టికల్‌గా ఉంటాను. నాకు ఎలాంటి భావోద్వేగాలు లేవు’ అని చెప్పేవాళ్లు కూడా ఇందుకు మినహాయింపు కాదు. దీనికి తాజా ఉదాహరణ అనురాగ్ కశ్యప్.

ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ మాటలు విన్నవారికి...

‘ఇతడు చాలా ప్రాక్టికల్ సుమీ. భావోద్వేగాలు మచ్చుకైనా కనిపించవు’ అనిపిస్తుంది.

అయితే అనురాగ్ తన కూతురు పెళ్లి తరువాత నాన్‌స్టాప్‌గా ఏడ్చాడు. ఒకటి కాదు రెండు కాదు నిర్విరామంగా పదిరోజులు ఏడ్చాడు.

అనురాగ్ కూతురు ఆలియా కశ్యప్ పెళ్లి జరిగింది. ఆ తరువాత అనురాగ్ ఏడుపు పర్వం మొదలైంది. పరిచయం లేని వ్యక్తుల ముందు కూడా ఏడ్చేవాడు.

‘నా కూతురు పుట్టుక, పెళ్లికి సంబంధించి ఒకేరకమైన భావోద్వేగానికి గురయ్యాను. ఎందుకు ఏడుస్తున్నానో నాకే తెలియదు. కాని ఏడ్చేవాడిని. ఒకసారి ఎవరితోనో మాట్లాడుతున్నప్పుడు మా అమ్మాయి ప్రస్తావన రాగానే ఏడ్చేశాను’ అన్నాడు అనురాగ్ కశ్యప్.

ఈ పదిరోజుల ఏడుపు ఎపిసోడ్ పుణ్యమా అని తనకు తాను ‘బిగ్గర్ క్రయర్’ అని పేరు పెట్టేసుకున్నాడు!



జింకలే బిడ్డలు : అనురాధరావు

● మానవత్వం

జింకల అమ్మ

కొన్ని బిరుదులు కోరుకోకపోయినా వస్తాయి. అనురాధరావుకు ‘డీర్ ఉమన్’ బిరుదు అలా వచ్చిందే. ‘జింక కనిపిస్తే కచ్చితంగా వేటాడాల్సిందే’ అన్నట్లుగా ఉండే ఆ దీవుల ప్రజలలో మార్పు తెచ్చింది అనురాధ. ఆమెకు జింకలు జంతువులు కాదు. కుటుంబ సభ్యులు. వాటితో ఆడుతుంది, పాడుతుంది. కబుర్లు చెబుతుంది. మేత నుంచి సంరక్షణ వరకు అన్నింటినీ దగ్గరుండి చూసుకుంటుంది. అందుకే ఆమె డీర్ ఉమెన్.

అండమాన్ నికోబార్ దీవులలో ఉంటున్న అనురాధరావుకు జింకలతో ఉన్న అనుబంధం అంతా ఇంతా కాదు. ఆ విశిష్ట అనుబంధమే ఆమెను ‘డీర్ ఉమెన్’ అని పిలుచుకునేలా చేసింది. మన దేశానికి స్వాతంత్ర్యం రాకముందు అనురాధ పూర్వీకుల్ని అండమాన్‌కు బందీలుగా తీసుకెళ్లారు. ఈ ద్వీపంలో ఆమె నాల్గవ తరం నివాసి.

‘చిన్నప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నాను. బాల్యం నుంచి జింకలు అంటే ఇష్టం. అవి మా కుటుంబ సభ్యులలాగే భావించేదాన్ని. ఈ ద్వీపంలోని జింకలతో నాకు మంచి అనుబంధం ఉంది’ అంటుంది అనురాధ.

ఆహారం ఇవ్వడం నుంచి సంరక్షణ వరకు జింకల పట్ల ఆమె ఎంతో చొరవ చూపుతుంది. జింకల గురించి ఆమె చూపుతున్న ప్రేమ మనుషులు, జంతువుల మధ్య పరస్పర నమ్మకాన్ని నెలకొల్పేలా ఉంది.

‘ఒకప్పుడు మనుషులను చూడగానే జింకలు భయపడి పారిపోయేవి. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. వాటి నమ్మకాన్ని చూరగొనడానికి చాలా ఓపికగా పనిచేశాను. వాటితో ఎంతో సమయం గడిపాను. వాటికి దగ్గరై వాటి మనస్తత్వాన్ని లోతుగా అర్థం చేసుకున్నాను’ అంటుంది అనురాధరావు.

జింకల సంక్షేమం పట్ల ఆమె అంకితభావం ద్వీపంపై బలమైన ప్రభావాన్ని చూపించింది. జంతువుల పట్ల దయగల ద్వీపంగా అండమాన్‌ను మార్చివేసింది.

● బ్యూటిప్స్

పాలు పండ్లు



- పది ద్రాక్షపండ్లు, ఒక నిమ్మకాయ, ఒక కోడిగుడ్డు తీసుకోవాలి. ద్రాక్ష పండ్లను, నిమ్మ రసాన్ని, కోడిగుడ్డు తెల్లసొనను బ్లెండ్ చేసి ఆ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించి ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ఇది జిడ్డు చర్మానికి వేయాల్సిన ప్యాక్. నిమ్మరసం నేచురల్ క్లెన్సర్. ఇది చర్మాన్ని శుభ్రం చేస్తుంది. ద్రాక్ష రసం మృదుత్వాన్నిస్తుంది, కోడిగుడ్డు తెల్లసొన చర్మాన్ని వదులు కానీయకుండా రక్షిస్తుంది. దీనిని పొడి చర్మానికి కాని నార్మల్ స్కిన్‌కు కాని వాడితే మరింత పొడిబారే అవకాశం ఉంది.
- రకరకాల పండ్లను, సౌందర్య సాధనాలను కలిపి ప్యాక్ తయారు చేసుకోవడానికి సమయం, సహనం లేనప్పుడు నిమ్మకాయను సగానికి కోసి ఒక చెక్కతో ముఖాన్నంతటినీ రుద్ది పదిహేను నిమిషాల సేపు అలాగే ఉంచి తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. ఇది జిడ్డును తొలగించి ముఖాన్ని తాజాగా ఉంచుతుంది. ఇది కూడా పొడి చర్మానికి పనికిరాదు.
- ఒక టీ స్పూన్ తేనెలో అంతే మోతాదులో పాలు కలిపి ముఖానికి అప్లయ్ చేసి పది నిమిషాల సేపటికి కడగాలి. రెండు రోజులకొకసారి ఇలా చేస్తుంటే చర్మం కాంతివంతంగా ఉంటుంది.
- డ్రైస్కిన్ అయితే... ఒక టీ స్పూన్ తేనె, అంతే మోతాదులో నిమ్మరసం, వెజిటబుల్ ఆయిల్‌లను బాగా కలిపి ప్యాక్ వేసి పది నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. కొబ్బరి, వేరుశనగ, నువ్వులు, సన్‌ఫ్లవర్, సోయా... ఇలా ఏదైనా సరే... అందుబాటులో ఉన్న ఆయిల్ వాడవచ్చు.



చాంపియన్స్ ట్రోఫీకి బుమ్రా దూరం... జట్టులోకి హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి

ప్రతిష్టాత్మక చాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత జట్టుకు గట్టి దెబ్బ తగిలింది. టాప్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా గాయం కారణంగా ఈ ఐసీసీ ఈవెంట్‌కు దూరమయ్యాడు. వెన్ను గాయంతో బాధపడుతున్న అతను పూర్తిగా కోలుకోలేదు. జాతీయ క్రికెట్ అకాడమీలో రీహాబిలిటేషన్ అనంతరం అతని ఫిట్‌నెస్‌పై వైద్యులు బీసీసీఐకి నివేదిక అందించారు. ఇందులో గాయం తీవ్రతపై వివరాలు లేకున్నా... ఇప్పుడు బౌలింగ్ చేసే స్థితిలో లేడని మాత్రం స్పష్టమైంది. బుమ్రా ఆడటంపై చాలా రోజులుగా సందేహాలు ఉన్నా... ఇప్పుడు మాత్రమే బోర్డు దీనిని అధికారికంగా ధ్రువీకరించింది. బుమ్రా స్థానంలో హర్షిత్ రాణాను సెలక్టర్లు ఎంపిక చేశారు. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని కూడా 15 మంది సభ్యుల చాంపియన్స్ ట్రోఫీ టీమ్‌లోకి తీసుకున్నారు. వరుణ్ కోసం యశస్వి జైస్వాల్‌ను టీమ్ నుంచి తప్పించారు. స్థిరమైన ఓపెనర్లుగా రోహిత్, గిల్ ఉండటంతో జైస్వాల్‌పై వేటు వేయాల్సి వచ్చింది. అయితే నాన్ ట్రావెలింగ్ సబ్‌స్టిట్యూట్‌లుగా జైస్వాల్, సిరాజ్, శివమ్ దూబేలను ఎంపిక చేశారు. వీరు అవసరమైతేనే దుబాయ్‌కు ప్రయాణిస్తారు.



జ్యోతి



షేక్ యాసీన్



నందిని

జ్యోతి 'డబుల్' ధమాకా

జాతీయ క్రీడల్లో రెండో స్వర్ణ పతకం సాధించిన ఆంధ్రప్రదేశ్ అథ్లెట్

- 200 మీటర్ల విభాగంలో విజేతగా నిలిచిన వైజాగ్ అమ్మాయి
- ట్రాంపోలిన్‌లో షేక్ యాసీన్‌కు పసిడి
- హెప్టాథ్లాన్‌లో నందినికి స్వర్ణం

డెహ్రాడూన్: భారత స్టార్ అథ్లెట్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ జాతీయ క్రీడల్లో మరోసారి 'పసిడి' ప్రదర్శనతో అదరగొట్టింది. మంగళవారం జరిగిన మహిళల అథ్లెటిక్స్ 200 మీటర్ల విభాగంలో విశాఖపట్నం జిల్లాకు చెందిన 25 ఏళ్ల జ్యోతి యర్రాజీ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. 200 మీటర్ల ఫైనల్ రేసును జ్యోతి అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 23.35 సెకన్లలో పూర్తి చేసి విజేతగా అవతరించింది. తెలంగాణ అమ్మాయి నిత్య (23.76 సెకన్లు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. గత ఆదివారం జ్యోతి 100 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌లో వరుసగా మూడోసారి జాతీయ క్రీడల్లో బంగారు పతకం సాధించి 'హ్యాట్రిక్' నమోదు చేసిన సంగతి తెలిసిందే. జిమ్నాస్టిక్స్‌లో భాగమైన మహిళల ట్రాంపోలిన్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షేక్ యాసీన్ స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. ఎనిమిది మంది పోటీపడిన ఫైనల్లో కాకినాడ జిల్లాకు చెందిన షేక్ యాసీన్ తన విన్యాసాలతో మెరిపించి 39.790 పాయింట్లతో విజేతగా నిలిచింది. 2022 గుజరాత్ జాతీయ క్రీడల్లో యాసీన్ రజతం నెగ్గింది.

నందిని నిలకడగా...

ఏడు క్రీడాంశాల సమాహారమైన మహిళల హెప్టాథ్లాన్ (100 మీటర్ల హర్డిల్స్, హైజంప్, షాట్‌పుట్, 200 మీటర్లు, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, 800 మీటర్లు) ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన అంతర్జాతీయ క్రీడాకారిణి అగసార నందిని స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. రెండు రోజులపాటు జరిగిన ఈ ఈవెంట్‌లో నందిని మొత్తం 5601 పాయింట్లు స్కోరు చేసి విజేతగా నిలిచింది. అంతే కాకుండా ఈ ఏడాది మే 27 నుంచి 31 వరకు దక్షిణ కొరియాలో జరిగే ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించింది. మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ ఆల్ అరౌండ్ విభాగంలో తెలంగాణ అమ్మాయి నిష్కా అగర్వాల్ (44.767 పాయింట్లు) కాంస్య పతకాన్ని సాధించింది. మరోవైపు మహిళల నెట్‌బాల్ ఫాస్ట్-5 ఈవెంట్‌లో తెలంగాణ జట్టుకు రజత పతకం లభించింది. ఫైనల్లో తెలంగాణ జట్టు 20-23తో హరియాణా చేతిలో ఓడిపోయింది. తెలంగాణ నెట్‌బాల్ జట్టు తరఫున నట్టి అఖిల, సయ్యదా మస్రతున్నీసా, జంగా సుప్లవి రాజ్, యరువా యషశ్రీ, సాయిప్రియ, కొమర రిషిక, అలోనా, తరుణ, అంజలి, యదన వేణి దీప్తి ప్రాతినిధ్యం వహించారు.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ 14 పతకాలతో (7 స్వర్ణాలు, 1 రజతం, 6 కాంస్యాలు) 17వ స్థానంలో... తెలంగాణ 14పతకాలతో (2 స్వర్ణాలు, 3 రజతాలు, 9 కాంస్యాలు) 27వ స్థానంలో ఉన్నాయి.



రజతాలతో తెలంగాణ మహిళల నెట్‌బాల్ జట్టు

క్లీన్‌స్వీప్‌పై భారత్ గురి

సొంతగడ్డపై ఇంగ్లండ్‌ను టి20ల్లో చిత్తు చేసిన తర్వాత వన్డే సిరీస్ కూడా గెలుచుకొని భారత జట్టు ఒక లాంఛనం ముగించింది. ఇప్పుడు ప్రతిష్టాత్మక చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఒకే ఒక వన్డే అందుబాటులో ఉంది. ఇప్పటికే సిరీస్ గెలుచుకుంది కాబట్టి బెంచీపై ఉన్న ఆటగాళ్లకు మేనేజ్‌మెంట్ ఒక అవకాశం ఇస్తుందా లేక విజయాల బాటలో ఉన్న జట్టును కొనసాగించి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేస్తుందా అనేది చూడాలి. మరోవైపు ఇంగ్లండ్ కోణంలో ఇది కాస్త పరువు దక్కించుకునే ప్రయత్నం. ఇక్కడ ఆడిన 7 మ్యాచ్‌లలో 6 ఓడి నిరాశలో మునిగిన టీమ్ కనీసం చివరి పోరులోనైనా గెలిచి పర్యటనను ముగించాలని కోరుకుంటోంది. ఈ నేపథ్యంలో ప్రపంచంలో అతి పెద్ద స్టేడియం ఆఖరి పోరుకు వేదిక కానుంది.

నేడు ఇంగ్లండ్‌తో చివరి వన్డే

- అమితోత్సాహంతో టీమిండియా
- విజయంతో ముగించాలని ఇంగ్లండ్
- మధ్యాహ్నం గం.1:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్18లలో ప్రత్యక్ష ప్రసారం



అహ్మదాబాద్: భారత గడ్డపై ఇంగ్లండ్ జట్టు పరిమిత ఓవర్ల పర్యటన చివరి అంకానికి చేరింది. సిరీస్ ఫలితం తేలిపోయిన తర్వాత నేడు మొతేరాలోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగే నామమాత్రపు చివరి వన్డేలో భారత్, ఇంగ్లండ్ తలపడనున్నాయి. తాజా ప్రదర్శనను బట్టి చూస్తే అన్ని రంగాల్లో పటిష్టంగా ఉన్న టీమిండియాకు మరో విజయం కూడా కష్టం కాకపోవచ్చు. ఇక్కడా గెలిచి సిరీస్‌ను 3-0తో సాధించాలని రోహిత్ శర్మ బృందం భావిస్తోంది. మరోవైపు కొంత కాలం క్రితం వరకు అభేద్యమైన టీమ్‌గా కనిపించిన ఇంగ్లండ్ అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో పూర్తిగా విఫలమై చేతులెత్తేసింది. ఈ పోరు తర్వాత ఇరు జట్లు చాంపియన్స్ ట్రోఫీ బాట పడతాయి.

కోహ్లి కొడతాడా!

చాంపియన్స్ ట్రోఫీకి ముందు రోహిత్ భారత్ బెంగ తీర్చాడు. చక్కటి సెంచరీతో సత్తా చాటుతూ అతను ఫామ్‌లోకి వచ్చాడు. శుబ్‌మన్ గిల్ వరుసగా రెండు అర్ధసెంచరీలతో ఆకట్టుకోగా, శ్రేయస్ అయ్యర్ కూడా నిలకడగా రాణిస్తున్నాడు. ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా తమ విలువను చూపించారు. పదే పదే బ్యాటింగ్ ఆర్డర్ స్థానం మారడం వల్ల ఇబ్బంది పడుతున్న కేఎల్ రాహుల్ కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. పంత్‌కు కాకుండా రాహుల్‌కే మరో అవకాశం దక్కవచ్చు. అయితే అన్నింటికి మించి ప్రధాన బ్యాటర్లలో విరాట్ కోహ్లి ప్రదర్శన కోసమే అంతా ఎదురు చూస్తున్నారు. ఆసీస్ గడ్డపై తొలి టెస్టు తర్వాత మొదలైన వైఫల్యం రంజీ మ్యాచ్ మీదుగా ఇక్కడ రెండో వన్డే వరకు సాగింది. అతని స్థాయిని బట్టి చూస్తే ఎప్పుడైనా చెలరేగిపోగలడు. కానీ అలాంటి ఇన్నింగ్సే ఇంకా రావడం లేదు. 14 వేల మైలురాయికి మరో 89 పరుగుల దూరంలో ఉన్న కోహ్లి ఈ మ్యాచ్‌లోనే దానిని పూర్తి చేసుకుంటాడా చూడాలి. బౌలింగ్ విభాగంలో షమీ ఇంకా పూర్తిగా తన లయను అందుకోలేదని గత మ్యాచ్‌లో అర్థమైంది. యువ బౌలర్ హర్షిత్ రాణా కూడా తడబడుతున్నాడు. అతని స్థానంలో అర్ష్‌దీప్‌ను ఆడించే విషయంపై మేనేజ్‌మెంట్ చర్చిస్తోంది. స్పిన్నర్లలో వరుణ్ చక్రవర్తి చక్కటి బౌలింగ్ ప్రదర్శన కనబర్చడం మరో సానుకూలాంశం. ఓవరాల్‌గా అన్ని రంగాల్లో జట్టు పటిష్టంగా ఉంది.



బట్లర్

బాంటన్‌కు చాన్స్...

ప్రత్యర్థితో పోలిస్తే ఇంగ్లండ్ పరిస్థితి ఏమాత్రం బాగాలేదు. ఒక్క ఆటగాడు కూడా తనదైన స్థాయి ప్రదర్శనను కనబర్చి జట్టును గెలిపించేలా కనిపించడం లేదు. రెండు వన్డేల్లో ప్రధాన బ్యాటర్లంతా తలా ఓ చేయి వేసినా విజయానికి అది సరిపోలేదు. గతంలో చూపించి విధ్వంసకర బ్యాటింగ్ ఇంగ్లండ్ నుంచి రావడం లేదు. ఓపెనర్లు సాల్ట్, డకెట్ శుభారంభాలు ఇస్తున్నారు కానీ ఆ తర్వాత దానిని ఇతర బ్యాటర్లు కొనసాగించలేకపోతున్నారు. కెప్టెన్ బట్లర్, జో రూట్ మాత్రమే నమ్మకమైన ఆటగాళ్లుగా కనిపిస్తుండగా, రెండో వన్డేలో హ్యారీ బ్రూక్ మరీ నెమ్మదిగా ఆడాడు. ఒవర్టన్ స్థానంలో బాంటన్‌ను తుది జట్టులోకి తీసుకోవచ్చు. మరోవైపు బౌలింగ్ పూర్తిగా బలహీనంగా కనిపిస్తోంది. భారత బ్యాటర్ల ముందు ఈ బౌలర్లంతా అనామకుల్లా కనిపిస్తున్నారు. ఏ ఒక్కరిలో కూడా ప్రత్యర్థిని నిలువరించే సత్తా కనిపించడం లేదు. సాఖిబ్ స్థానంలో ఆర్చర్ బరిలోకి దిగవచ్చు. అట్కిన్సన్, వుడ్, రషీద్ ఏమాత్రం రాణిస్తారో చూడాలి.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), గిల్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, పాండ్యా, అక్షర్, జడేజా, రాణా, షమీ, వరుణ్. **ఇంగ్లండ్:** బట్లర్ (కెప్టెన్), సాల్ట్, డకెట్, బాంటన్, రూట్, బ్రూక్, లివింగ్‌స్టోన్, కార్స్, ఆర్చర్, రషీద్, వుడ్.

పిచ్, వాతావరణం

సాధారణ బ్యాటింగ్ పిచ్. చక్కగా పరుగులు సాధించవచ్చు. వర్షసూచన ఏమాత్రం లేదు. వేడి వాతావరణం. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

13 మరో 13 పరుగులు చేస్తే రోహిత్ వన్డేల్లో 11 వేల మైలురాయిని అందుకుంటాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

రాజకీయాలకు దూరంగా... సినిమాలకు దగ్గరగా ఉంటా - చిరంజీవి



● నిఖిల్, నాగ్ అశ్విన్, రాజా గౌతమ్, చిరంజీవి, బ్రహ్మానందం, అనిల్ రావిపూడి, రాహుల్ యాదవ్

''బ్రహ్మానందంలో స్పార్క్‌ని గమనించి నేను తనని మద్రాసు తీసుకువెళ్లాను. మా ఇద్దరి మధ్య మంచి బంధం, ప్రేమానురాగాలు, గురు-శిష్యుల అనుబంధం ఉన్నాయి. ఓ రోజు బ్రహ్మానందం ఇంటికి వెళితే ఎన్నో అవార్డులు ఉన్నాయి. తన చరిత్ర అంతా ఓ గదిలో కనిపించింది. అలాంటి బ్రహ్మానందం కొడుకు చేసిన రెండు మూడు సినిమాలు అంతంతగా అలరించినా సరే... మరో ప్రయత్నం చేస్తున్నాడు. ఈ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్'' అని హీరో చిరంజీవి అన్నారు. బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో, 'వెన్నెల' కిశోర్, ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ కీలక పాత్రల్లో నటించిన సినిమా 'బ్రహ్మ ఆనందం'. ఉమేష్ కుమార్, సావిత్ర సమర్పణలో ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన 'బ్రహ్మ ఆనందం' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన **చిరంజీవి మాట్లాడుతూ-** ''ఈ సినిమా ఫిబ్రవరి 14న విడుదలై, అత్యద్భుతంగా ఆడుతుంది. నీకు (బ్రహ్మానందం) పుత్రోత్సాహం కలుగుతుంది. నువ్వు చక్కగా గర్విస్తావు. నేను ఏ విధంగా పుత్రోత్సాహాన్ని అనుభవిస్తున్నానో, అలానే నువ్వూ అనుభవించాలని కోరుకుంటున్నాను'' అన్నారు.

అప్పుడు ఒత్తిడిగా ఉండేది

సినిమాల్లో ఉండగా నేను ఎంతో ఉత్సాహంగా ఉండేవాడిని. పొలిటికల్ సైడ్ వెళ్లినప్పుడు కాస్త ఒత్తిడిగా ఉండేది. అన్నవాడిని, అననివాడిని కూడా ఏదో అనాలని తిట్లు రాసుకోవాల్సి వచ్చేది. ఒత్తిడిగా ఫీలయ్యేవాడిని. ఎందుకు స్పందించడం లేదని మా ఆవిడ నన్ను అడిగింది. నాలో హాస్య గ్రంథులు పోయాయేమో అనుకున్నాను. 'ఖైదీ నెంబరు 150' తర్వాత మళ్లీ నవ్వడం ప్రారంభించాను. ఇక ఈ జన్మంతా రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాలకు అతి దగ్గరగా ఉంటాను. చాలామందికి చాలా డౌట్స్ వస్తున్నాయి. పెద్ద పెద్ద వాళ్లందరికీ దగ్గరవుతున్నాడు, వాళ్లందరూ దగ్గరకు చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఏమైనా అటు (రాజకీయాలు) వెళ్తాడా అని. కాదు... మరో రకంగా సేవలు అందివ్వడం కోసమే తప్ప పొలిటికల్‌గా వెళ్లడం అనేది లేదు.

– చిరంజీవి

బ్రహ్మానందం మాట్లాడుతూ- ''అత్తిలిలో నేను లెక్చరర్‌గా చేస్తున్నప్పుడు భీమవరం వెళ్లి 'ఖైదీ' సినిమా చూశాను. చిరంజీవి ట్రెండ్ సెట్టర్. ఆయన చూడని చరిత్రా... చెప్పని చరిత్రా. చిరంజీవి కింగ్ ఆఫ్ వరల్డ్ సినిమా. ఈ వేడుకకు చిరంజీవిగారిని చీఫ్ గెస్ట్‌గా పిలవాలనుకుని కాస్త తటపటాయించాను. 9వ తారీఖు ఒక ఫంక్షన్. మళ్లీ 11న మరొక ఫంక్షన్ కదా అనుకున్నాను. 'గౌతమ్ నీకు బిడ్డ. నాకూ బిడ్డలాంటి వాడే..' అన్నారు. నన్ను తొలిసారి చెయ్యి పట్టుకుని విమానం ఎక్కించింది చిరంజీవిగారే. ఇప్పుడు నా బిడ్డ చేయిపట్టుకుని ఈ విమానం ఎక్కిస్తున్నారు. మంచి సినిమాలు తీయాలనే అభిరుచి ఉన్న కుర్ర నిర్మాతల్లో రాహుల్ ఒకడు. ఇది తాత-మనవడు గురించి చెప్పే కథ. ఈ సినిమా చాలా బాగుంటుంది'' అన్నారు.

''హీరో అనే పదానికి నాకు మీనింగ్ చిరంజీవిగారే. బ్యూటిఫుల్ ఎమోషనల్ మూవీ ఇది. ఫ్యామిలీతో కలిసి థియేటర్స్‌లో అందరూ హాయిగా చూడండి'' అన్నారు **రాజా గౌతమ్.**

''బ్రహ్మ ఆనందం' సినిమా అంటే బ్రహ్మానందంగారే. ఆయనతో సినిమా చేయడం హ్యాపీగా ఉంది. రాజా గౌతమ్‌గారు అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇచ్చారు'' అన్నారు **ఆర్‌వీఎస్ నిఖిల్.**

చిరంజీవికి పద్మవిభూషణ్ వచ్చినందుకు ఈ వేదికపై ఆయన్ను బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ సన్మానించారు.



● మోహన్‌బాబు, రవిశంకర్, విష్ణు

మనసు నిన్ను తెలుసుకుందయ్యా...

''తెలివి కన్ను తెరుసుకుందయ్యా... శివలింగామయ్యా... మనసు నిన్ను తెలుసుకుందయ్యా...'' అంటూ మొదలవుతుంది 'కన్నప్ప' సినిమాలోని 'శివ శివ శంకరా...' పాట. మంచు విష్ణు హీరోగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఈ చిత్రంలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్. మోహన్ బాబు, శరత్‌కుమార్, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఏప్రిల్ 25న విడుదల కానుంది. కాగా బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ ఈ చిత్రంలోని 'శివ శివ శంకరా...' పాటను రిలీజ్ చేశారు. మోహన్ బాబు, విష్ణు మంచు, ముఖేష్ కుమార్ సింగ్, కన్నడ డిస్ట్రిబ్యూటర్ రాక్‌లైన్ వెంకటేశ్, నటి సుమలత, భారతీ విష్ణువర్ధన్, సంగీత దర్శకుడు స్టీఫెన్ దేవస్సీ, రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. ''రవిశంకర్ గురూజీ ఈ పవిత్ర గీతాన్ని ఆవిష్కరించడం గౌరవంగా భావిస్తున్నాను. 'కన్నప్ప' అనేది శివునితో మమేకం చేయబడిన చిత్రం. ఇదే మా ప్రయాణానికి అపారమైన ఆధ్యాత్మిక విలువను జోడిస్తుంది'' అని తెలిపారు మోహన్‌బాబు. సంగీత దర్శకుడు స్టీఫెన్ దేవస్సీ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, విజయ్ ప్రకాశ్ ఆలపించారు. న్యూజిల్యాండ్‌లో చిత్రీకరించిన ఈ పాటకు ప్రభుదేవా కొరియోగ్రఫీ చేశారు. ఇక ఈ పాటను హిందీలో జావేద్ అలీ పాడగా, శేఖర్ అస్తిత్వ సాహిత్యాన్ని అందించారు.

ఆత్మలను కలుసుకోబోతున్నారు!



● జీవా, రాశి

జీవా, అర్జున్ సర్జా లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'అగత్యా'. రాశీ ఖన్నా హీరోయిన్‌గా నటించారు. ఈ ఫ్యాంటసీ హారర్ థ్రిల్లర్ మూవీని రచయిత పా. విజయ్ దర్శకత్వంలో ఇషారి కే గణేశ్, అనీష్ అర్జున్ దేవ్ నిర్మించారు. ఈ నెల 28న తమిళ, తెలుగు, హిందీ భాషలలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. 'సుమారు 120 సంవత్సరాల క్రితం ఉన్న ఆత్మలని మీరు ఇప్పుడు కలుసుకోబోతున్నారు' అనే వాయిస్‌తో ట్రైలర్ ఆరంభమవుతుంది. ''గ్రామీణ నేపథ్యంలో మంచి థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో పా. విజయ్ ప్రేక్షకులను థ్రిల్‌కి గురి చేసేలా ఈ సినిమాను తెరకెక్కించారు'' అని యూనిట్ పేర్కొంది.



● దేవిశ్రీ ప్రసాద్, బన్నీ వాసు, అశ్వనీదత్, నాగచైతన్య, అల్లు అరవింద్, నాగార్జున, చందు మొండేటి

చైతన్య నటన చూశాక నాన్నగారు గుర్తొచ్చారు

- అక్కినేని నాగార్జున

''**తం**డేల్' కోసం చైతన్య రెండేళ్లు కష్టపడ్డాడు. ఓ రోజు 'సముద్రంలో ఈ సినిమా షూటింగ్ చేస్తుంటే మత్స్యకారుల కష్టాలు అర్థం అవుతున్నాయి' అన్నాడు చైతన్య. నెలల తరబడి సముద్రంలో చిన్న పడవపై ఉండే మత్స్యకారులందరికీ చేతులెత్తి దండం పెడుతున్నాను. ఈ మూవీలో నాగచైతన్య నటన చూస్తుంటే మా నాన్నగారు (అక్కినేని నాగేశ్వరరావు) గుర్తొచ్చారు. 2025లో 'తండేల్' మంచి ముహూర్తం. వస్తున్నాం... కొడుతున్నాం'' అన్నారు అక్కినేని నాగార్జున. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన 'తండేల్' ఈ నెల 7న విడుదలైంది. మంగళవారం నిర్వహించిన 'తండేల్ లవ్ సునామీ సెలబ్రేషన్స్'కి ముఖ్య అతిథిగా హాజరైన నాగార్జున మాట్లాడుతూ- ''అరవింద్‌గారు 'తండేల్' కథ విన్న, చందు మొండేటితో తీద్దామన్న, దేవిశ్రీతో మ్యూజిక్ చేయిద్దామన్న వేళా విశేషం... టీమ్ అందర్నీ సెట్ చేయడానికి బన్నీ వాసు, అందరూ ప్రయత్నించిన వేళా విశేషం... వీళ్లందరూ నాగచైతన్యని అడిగిన వేళా విశేషం.. శోభితని చైతన్య పెళ్లి చేసుకున్న వేళా విశేషం... ఇవన్నీ బాగున్నాయి. 'తండేల్' విడుదలైన రోజు ఉదయం ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీగారిని కలిసేందుకు వెళ్లాం. అప్పుడు ఫోన్ సెక్యూరిటీలో ఇచ్చి వెళ్లాం. వచ్చాక ఫోన్ ఆన్ చేయగానే... ఫ్యాన్స్ వద్ద నుంచి కంగ్రాట్స్ అంటూ మెసేజులు. నాకన్నా, చైతన్య కన్నా మా శ్రేయోభిలాషులు, అక్కినేని ఫ్యాన్స్ ఎంత ఆనందపడుతున్నారో అప్పుడు అర్థమైంది. 'తండేల్' కథని నాక్కూడా వినిపించారు అరవింద్‌గారు. '100 పర్సెంట్ లవ్, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, తండేల్'... ఇలా మా ఫ్యామిలీకి ఒకదాన్ని మించి మరొక సక్సెస్ ఇచ్చిన మీకు థ్యాంక్స్. అల్లు... అక్కినేని కుటుంబాలకు బాగా సెట్టయింది. అరవింద్‌గారిని బన్నీ వాసు చక్కగా కన్విన్స్ చేసి, ఇలాంటి మంచి సినిమాలు తీసేలా చేస్తాడు. చైతన్యలోని ఒక నటుణ్ణి బయటకు తీసుకొచ్చాడు చందు'' అన్నారు.

''తండేల్'కి సంబంధించి బిగ్గెస్ట్ తండేల్ (నాయకుడు) చందు మొండేటి. మా గీతా ఆర్ట్స్‌లో కలకాలం నిలిచిపోయే చిత్రాల్లో 'తండేల్'ని ది బెస్ట్ సినిమాగా తీసుకుంటాం. తన నటనతో చింపేశాడు చైతు'' అని పేర్కొన్నారు **అల్లు అరవింద్.**

''నాపై నమ్మకంతో చైతన్యగారిని నాకు అప్పగించిన నాగార్జున సార్‌కి రిటర్న్ గిఫ్ట్‌గా 'తండేల్'తో నాగచైతన్యగారిని వంద కోట్ల క్లబ్‌లో కూర్చోబెడతాం. నాలుగైదు రోజుల్లో 100 కోట్ల పోస్టర్‌ని వేసి, పెద్ద వేడుక చేస్తాం. చైతన్యతో '100 పర్సెంట్ లవ్, తండేల్', అఖిల్‌తో 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' వంటి హిట్ సినిమాలు తీశాం. ఇక మీరు (నాగార్జున) కూడా గీతా ఆర్ట్స్‌కి డేట్స్ ఇస్తే వీటన్నిటికంటే పెద్ద సినిమా తీసి సూపర్ డూపర్ హిట్ కొడతాం'' అని చెప్పారు **బన్నీ వాసు.**

''మా నాన్నగారిని చూసి నాకు క్రమశిక్షణ, భక్తి వచ్చాయి. నాన్నగారి కన్నా ఇంకా గొప్ప అర్హతలు ఎవరిలో అయినా ఉన్నాయా? అంటే అది అరవింద్‌గారే. చైతన్యగారితో భవిష్యత్తులో ఓ గొప్ప హిస్టారికల్ మూవీ చేయబోతున్నాం. అక్కినేని నాగేశ్వరరావుగారు చేసిన 'తెనాలి రామకృష్ణ' కథని మళ్లీ అత్యద్భుతంగా రాసి, ఈ తరానికి ఎలా కావాలి?

ఏం చెప్పాలి? అని తీసుకొస్తాం. ఆ మూవీలో ఏఎన్‌ఆర్ గారు చేసినటువంటి అభినయం మళ్లీ చైతన్యగారు చేస్తారు. అది మనం చూడబోతున్నాం'' అని తెలిపారు **చందు మొండేటి.**

నాగచైతన్య మాట్లాడుతూ- ''తండేల్ రాజులాంటి పాత్రలు అరుదుగా దొరుకుతాయి. ఈ మూవీతో వంద కోట్ల క్లబ్‌లో చేరతావని వాసు ఎప్పుడో చెప్పాడు. ఈ మూవీ నీ కెరీర్‌లో బెస్ట్ అవుతుందని అరవింద్‌గారు చెప్పారు. నేనూ నమ్మా. చందు, నా కాంబోలో వచ్చిన ఈ సినిమా ఇంత పెద్ద హిట్ అవడం హ్యాపీగా ఉంది. ఎన్నో పాత్రలతో ఆడియన్స్‌ని అలరించాలి, ఎంతో కష్టపడాలనే ప్రోత్సాహం, ధైర్యాన్ని ఈ సినిమా ద్వారా అరవింద్‌గారు, వాసు ఇచ్చారు. సినిమా లవర్స్ అంటే మన తెలుగు ప్రేక్షకుల తర్వాతే. మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇస్తే ఎలా ఆదరిస్తారో మీరు మాకు చూపించారు'' అన్నారు.

నిర్మాత అశ్వినీదత్, సహ నిర్మాత భాను, నటి, నాగచైతన్య వైఫ్ శోభితా ధూళిపాళ్ల, పాటల రచయిత శ్రీమణి, కథా రచయిత కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



హీరోని వెతకడం సవాల్‌గా అనిపించింది

- రామ్ నారాయణ్

''లైలా' చిత్రకథని ఇద్దరు ముగ్గురు యువ హీరోలకి చెప్పా. కథ వారికి నచ్చినప్పటికీ లైలా అనే లేడీ గెటప్ వేసేందుకు ఆసక్తి చూపలేదు. ఈ పాత్ర చేయడానికి చాలా ధైర్యం కావాలి. అందుకే హీరోని వెతకడం సవాల్‌గా అనిపించింది. నిర్మాత సాహుగారికి ఈ కథ బాగా నచ్చి, విశ్వక్ సేన్‌గారికి చెప్పమని సలహా ఇచ్చారు. విశ్వక్‌గారు కథ వినగానే.. ఇలాంటి లేడీ గెటప్ వేయాలని చాలా రోజులుగా అనుకుంటున్నాను. మనం ఈ సినిమా చేస్తున్నాం అన్నారు'' అని డైరెక్టర్ రామ్ నారాయణ్ చెప్పారు. విశ్వక్ సేన్, ఆకాంక్షా శర్మ జంటగా నటించిన చిత్రం 'లైలా'. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా రామ్ నారాయణ్ మాట్లాడుతూ- '''బట్టల రామస్వామి బయోపిక్, దిల్ దివాన, ఉందిలే మంచి కాలం' సినిమాలకు మ్యూజిక్ చేశాను. దర్శకుడిగా నా తొలి చిత్రం 'బట్టల రామస్వామి బయోపిక్' (2021) మంచి హిట్ అయ్యింది. ఆ తర్వాత ఓ యునిక్ స్టోరీగా 'లైలా' రాశా. హీరో లేడీ గెటప్ వేయడం వంటి చిత్రాలు ఈ మధ్య రాలేదు. ఆ నేపథ్యంలో వస్తున్న వినోదాత్మక చిత్రమిది. ఇందులో సోను మోడల్, లైలాగా విశ్వక్ నటించారు. ఈ చిత్రంలో ఎమోషన్, యాక్షన్, రొమాన్స్... ఇలా అన్నీ ఉన్నాయి'' అని చెప్పారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
1,018	310
76,294	23,072

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,621	▽	93
డోజోన్స్	44,485	△	14
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,777	△	10
డాక్స్	22,038	△	126
షాంఘై	3,304	▽	86
నికాయ్	38,787	▽	280

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	85,481	△	184
బంగారం (99.5 స్వచ్ఛత)	85,139	▽	183
వెండి (కిలో)	94,170	▽	1,363

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.99	88.67
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.04	110.01
€	యూరో	ఎస్‌బీఐ	87.41	91.20
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	45.00	67.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.14	57.00
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.73	66.42
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.25	23.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.75	24.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.10	12.83

ఐఆర్‌సీటీసీ లాభం అప్

క్యూ3లో రూ. 341 కోట్లు



న్యూఢిల్లీ: ఐఆర్‌సీటీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 13 శాతం ఎగసి రూ. 341 కోట్లను అధిగమించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 300 కోట్లు మాత్రమే ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 3 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు ఈ నెల 20 రికార్డ్ డేట్‌గా ప్రకటించింది.

వీఐ నష్టాలు తగ్గాయ్

క్యూ3లో రూ. 6,609 కోట్లు



న్యూఢిల్లీ:వొడాఫోన్ ఐడియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర నష్టం తగ్గి రూ. 6,609 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 6,986 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం 4 శాతం పుంజుకుని రూ. 11,117 కోట్లను తాకింది. ఒక్కో వినియోగదారుడిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 19 శాతం మెరుగుపడి రూ. 173కు చేరింది.

ప్రకటనల రంగం 7% వృద్ధి



ముంబై: దేశీయంగా ప్రకటనల రంగం ఈ ఏడాది 7 శాతం వృద్ధి చెందుతుందని డబ్ల్యూపీపీలో భాగమైన మీడియా ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ గ్రూప్‌ఎం వెల్లడించింది. 2025లో సుమారుగా మరో రూ. 10,730 కోట్లు పెరిగి రూ. 1,64,137 కోట్లకు చేరుతుందని దిస్ ఇయర్ నెక్స్ట్ ఇయర్ (టీవైఎన్‌వై) నివేదికలో పేర్కొంది. కృత్రిమ మేధ (ఏఐ), డేటా ప్రైవసీ ఆధారిత మార్కెటింగ్ విప్లవంలో భారత్ ముందు వరుసలో ఉందని గ్రూప్‌ఎం సౌత్ ఏషియా సీఈవో ప్రశాంత్ కుమార్ తెలిపారు. అంతర్జాతీయంగా ప్రకటనల వ్యయాలు 1 లక్ష కోట్ల డాలర్ల స్థాయి అధిగమించే తరుణంలో అత్యధికంగా వృద్ధి చెందుతున్న టాప్ 4 దేశాల్లో భారత్ కూడా ఒకటిగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రకటనల వ్యయాల్లో డిజిటల్ విభాగం వాటా 60 శాతం భాగాన్ని ఆక్రమించనున్నట్లు చెప్పారు.



5 రోజుల్లో రూ.17,00,000 కోట్లు ఆవిరి

- కొనసాగుతున్న అమ్మకాలు
- సెన్సెక్స్ నష్టం 1,018 పాయింట్లు
- నిఫ్టీ 310 పాయింట్ల పతనం

ముంబై: అమెరికా వాణిజ్య యుద్ధ భయాలు వెంటాడటంతో దేశీ స్టాక్ సూచీలు అయిదో రోజూ నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు, నిరుత్సాహపరుస్తున్న కార్పొరేట్ ఫలితాలు మార్కెట్లపై మరింత ఒత్తిడి పెంచాయి. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 1,018 పాయింట్లు పతనమై 76,294 వద్ద ముగిసింది. నిఫ్టీ 310 పాయింట్లు నష్టపోయి 23,072 వద్ద నిలిచింది. స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు రోజంతా అదే బాటలో నడిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,281 పాయింట్లు కోల్పోయి 76,031 వద్ద, నిఫ్టీ 395 పాయింట్లు నష్టపోయి 22,986 వద్ద కనిష్టాలు తాకాయి.

- మార్కెట్ వరుస పతనంతో 5 రోజుల్లో రూ.17 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. మంగళవారం రూ.9.29 లక్షల కోట్లు హరించుకుపోయింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.408.52 లక్షల కోట్ల(4.70 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది.
- సెన్సెక్స్ మొత్తం 30 షేర్లలో ఒక్క ఎయిర్‌టెల్ (0.19%) మాత్రమే స్వల్ప లాభంతో గట్టెక్కింది. అత్యధికంగా జొమాటో 5%, టాటా స్టీల్ 3%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.70%, పవర్ గ్రిడ్ 2.65%, ఎల్‌అండ్‌టీ 2.60% నష్టపోయాయి. ఈ సూచీ గత రోజుల్లో 2,290 పాయింట్లు(3%) కోల్పోయింది. నిఫ్టీ ఇండెక్స్ 668 పాయింట్లు(2.81%) నష్టపోయింది.
- రంగాల వారీగా రియల్టీ ఇండెక్స్ 3.14% క్షీణించింది. ఇండస్ట్రియల్ 3%, కన్జూమర్ డిస్క్రెషనరీ 2.73%, క్యాపిటల్ గూడ్స్ 2.60%, ఆటో 2.50%, మెటల్ 2.23 శాతం చొప్పున పతనమయ్యాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 3.40%, 2.88 శాతం క్షీణించాయి.

నష్టాలకు కారణాలు

- అమెరికా ఇండస్ట్రియల్ రంగాన్ని గాడిన పెట్టేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్టీల్, అల్యూమినియం దిగుమతులపై 25% టారిఫ్‌లు విధించారు. ఎలాంటి మినహాయింపులు, కోటాలు లేకుండా అన్ని దేశాలపై టారిఫ్‌లు ఫ్లాట్‌గా 25% ఉంటాయన్నారు. దీంతో గతంలో టారిఫ్‌లు అధికంగా లేని కెనడా, బ్రెజిల్, మెక్సికో, దక్షిణ కొరియా సహా ఇతర దేశాలపై తీవ్ర ప్రభావం పడనుంది. ట్రంప్ నిర్ణయం దేశాల మధ్య వాణిజ్య యుద్ధాన్ని తీవ్రతరం చేసేలా ఉందని ఇన్వెస్టర్లు ఆందోళన చెందారు.
- ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ అమెరికా వాణిజ్య సుంకాల విధింపు, ద్రవ్యోల్బణం అంశాలపై సెనేట్ బ్యాంకింగ్, హౌసింగ్ అర్బన్ అఫైర్స్ కమిటీ ముందు మాట్లాడనున్నారు. దీంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలకు పాల్పడ్డారు.
- విదేశీ ఇన్వెస్టర్లు 2025లోనే 9.94 బిలియన్ డాలర్లు విలువ చేసే ఈక్విటీలను విక్రయించారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఆఫీస్ మార్కెట్ రారాజు.. హైదరాబాద్	ఇంధన రంగంలో ఇన్వెస్ట్ చేయండి: ప్రధాని

చిన్న షేర్లు విలవిల — సిప్ పెట్టుబడులు డిప్

జనవరిలో పలు ఖాతాలు క్లోజ్

- మార్కెట్ల పతన ప్రభావం
- సెన్సెక్స్, నిఫ్టీ 12 శాతం డౌన్
- మిడ్, స్మాల్ క్యాప్స్ 17 % క్షీణత

నాలుగేళ్లుగా దేశీ స్టాక్ మార్కెట్లలో బుల్ ట్రెండ్ కొనసాగడంతో ఇండెక్సులు సరికొత్త గరిష్టాలను చేరాయి. అయితే ఉన్నట్టుండి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) అమ్మకాల బాట పట్టడం, రాజకీయ భౌగోళిక అనిశ్చితులు వంటి అంశాలు సెంటిమెంటును దెబ్బకొట్టాయి. దీంతో గతేడాది అక్టోబర్ మొదలు స్టాక్ మార్కెట్లు తీవ్ర ఆటుపోట్లను ఎదుర్కొంటున్నాయి. ప్రధానంగా మిడ్, స్మాల్ క్యాప్స్‌లో కొద్ది రోజులుగా అమ్మకాలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా ఇప్పటికే బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు సెప్టెంబర్‌లో నమోదైన గరిష్టాల నుంచి 17 శాతానికిపైగా పతనమయ్యాయి. వెరసి గత ఆరు నెలల్లో పలు స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో చేసిన పెట్టుబడులకు నష్టాలు వాటిల్లుతున్నాయి. మరోపక్క మార్కెట్ ప్రధాన ఇండెక్సులు సెన్సెక్స్, నిఫ్టీ సైతం 12 శాతం క్షీణించాయి.

సిప్ బేజారు...

నిజానికి గత కేలండర్ ఏడాది(2024)లో క్రమానుగత పెట్టుబడి పథకాలు(సిప్) భారీస్థాయిలో పెట్టుబడులను ఆకట్టుకున్నాయి. సిప్ మార్గంలో మ్యూచువల్ ఫండ్స్‌లోకి రూ. 2.89 లక్షల కోట్ల పెట్టుబడులు ప్రవహించాయి. యాక్టివ్ స్మాల్ క్యాప్ ఫండ్స్‌కు గతేడాది రూ. 35,000 కోట్ల పెట్టుబడులు లభించాయి. ఇదే కాలంలో లార్జ్ క్యాప్ ఫండ్స్ పెట్టుబడులతో పోలిస్తే ఇవి రెట్టింపు..! అయితే గత 6 నెలలుగా పలు స్మాల్ క్యాప్ ఫండ్స్‌కు చెందిన సిప్ పథకాలపై రిటర్నులు ప్రతికూలంగా నమోదవుతున్నాయి. 2024 డిసెంబర్‌లో ఇన్వెస్టర్లు 4.5 మిలియన్ సిప్ ఖాతాలను మూసివేశారు. ఇంతక్రితం 2024 మే నెలలో మాత్రమే 4.4 మిలియన్ సిప్ ఖాతాలు నిలిచిపోయాయి.

నేలచూపులో

వివిధ మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో సిప్ పెట్టుబడుల తీరును గమనిస్తే.. మూడేళ్ల కాలంలో మంచి పనితీరునే చూపినప్పటికీ ఏడాది కాలాన్ని పరిగణిస్తే ప్రతికూల ప్రతిఫలాలు నమోదవుతున్నాయి. వివిధ మిడ్‌క్యాప్ ఫండ్స్ జాబితాలో క్వాంట్‌ను తీసుకుంటే గత మూడేళ్లలో 19 శాతం రిటర్నులు అందించగా.. గత 12 నెలల్లో 15.6 శాతం క్షీణతను చవిచూసింది. ఈ బాటలో టారస్ మూడేళ్లలో 15 శాతం లాభపడగా.. ఏడాది కాలంలో 12 శాతం పైగా నీరసించింది. మిరే అసెట్ మూడేళ్లలో 18 శాతం పుంజుకోగా.. ఏడాదిలో 6 శాతంపైగా నష్టపోయింది. ఇదేవిధంగా టాటా గ్రోత్, యూటీఐ, ఏబీఎస్‌ఎల్, మహీంద్రా మాన్యులైఫ్ మూడేళ్లలో 20–24 శాతం రిటర్నులు అందించినప్పటికీ ఏడాది కాలాన్ని పరిగణిస్తే 5–4 శాతం మధ్య తగ్గాయి.

ఏడాది కనిష్టాలకు..

బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లో 131 షేర్లు తాజాగా 52 వారాల కనిష్టాలను తాకాయి. ఈ జాబితాలో డెల్టా కార్ప్ హోనసా కన్జూమర్, జేకే టైర్, మిశ్ర ధాతు నిగమ్, టాటా కెమికల్స్, ఎన్‌సీసీ, రైట్స్, మదర్‌సన్ సుమీ, ఎస్‌కేఎఫ్ ఇండియా చేరాయి. గత రెండు నెలల్లో 433 చిన్న షేర్ల మార్కెట్ విలువలో 20%ఆవిరైంది. వీటిలో 100 షేర్ల విలువ 30–40% మధ్య పతనమైంది. గత నెల రోజుల్లో రెండేళ్లుగా ఇన్వెస్టర్లను ఆకట్టుకున్న పలు కౌంటర్లు 40–30 శాతం మధ్య పతనమయ్యాయి. జాబితాలో న్యూజెన్ సాఫ్ట్‌వేర్, కేన్స్ టెక్నాలజీ ఇండియా, అపార్ ఇండస్ట్రీస్, నెటివెబ్ టెక్నాలజీస్, జూపిటర్ వేగన్స్, స్టెర్లింగ్ అండ్ విల్సన్, అనంత్‌రాజ్, రామకృష్ణ ఫోర్జింగ్స్ చేరాయి.

ఎఫ్‌పీఐల అమ్మకాలు


2024 అక్టోబర్ నుంచి ఎఫ్‌పీఐలు దేశీ స్టాక్స్‌లో విక్రయాలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా అక్టోబర్ మొదలు ఇప్పటి(ఫిబ్రవరి7)వరకూ ఎఫ్‌పీఐలు రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. కొత్త ఏడాది(2025) జనవరి నుంచి చూస్తే రూ. లక్ష కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్



రూపాయి రెండేళ్లలో అతిపెద్ద ర్యాలీ

66 పైసలు బలపడి 86.79కు చేరిక



ముంబై: బ్యాంకులు డాలర్లను విక్రయించడంతో రూపాయి విలువ మంగళవారం రెండేళ్లలో అతిపెద్ద ర్యాలీ చేసింది. డాలర్ మారకంలో ఏకంగా 66 పైసలు బలపడి 86.79 వద్ద స్థిరపడింది. 2023 మార్చి 3 తర్వాత ఒకరోజులో రూపాయి భారీగా బలపడింది. ఫారెక్స్ మార్కెట్లో 87.45 వద్ద మొదలై ఇంట్రాడేలో 84 పైసలు ఎగసి 86.61 వద్ద గరిష్టాన్ని తాకింది. ఆర్‌బీఐ జోక్యంతో దేశీ కరెన్సీ కనిష్ట స్థాయిల నుంచి బౌన్స్‌బ్యాక్ అయినట్లు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ జతీన్ త్రివేది తెలిపారు.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య



ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో 83 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ).. జూనియర్ ఎగ్జిక్యూటివ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 83.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఫైర్ సర్వీస్)–13, జూనియర్ ఎగ్జిక్యూటివ్(హ్యూమన్ రిసోర్స్)–66, జూనియర్ ఎగ్జిక్యూటివ్(అఫిషియల్ లాంగ్వేజ్)–04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్(ఫైర్, మెకానికల్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్), ఎంబీఏ, పీజీ (ఇంగ్లిష్, హిందీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18.03.2025 నాటికి 27 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 17.02.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.03.2025.
» **వెబ్‌సైట్:** https://www.aai.aero/

సుప్రీంకోర్టులో 241 జూనియర్ కోర్టు అసిస్టెంట్ పోస్టులు

న్యూఢిల్లీలోని సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా.. జూనియర్ కోర్టు అసిస్టెంట్(గ్రూప్–బి నాన్ గెజిటెడ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 241.
» **అర్హత:** పోస్టును అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ పరిజ్ఞానం, టైపింగ్‌తో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.35,400.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, టైపింగ్ స్పీడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.02.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.03.2025.
» **వెబ్‌సైట్:** https://www.sci.gov.in/

నార్త్ ఈస్టర్న్ రైల్వేలో 1,104 అప్రెంటిస్‌లు

గోరఖ్‌పూర్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్‌ఆర్‌సీ)–నార్త్ ఈస్టర్న్ రైల్వే ఎన్‌ఈఆర్ పరిధిలోని వర్క్‌షాప్/యూనిట్లలో అప్రెంటిస్‌ల శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 1,104.
» **ఆర్‌ఆర్‌సీ వర్క్‌షాప్‌లు:** మెకానికల్ వర్క్‌షాప్ గోరఖ్‌పూర్, సిగ్నల్ వర్క్‌షాప్ గోరఖ్‌పూర్, మెకానికల్ వర్క్‌షాప్ ఇజ్జత్ నగర్, డీజిల్ షెడ్ ఇజ్జత్‌నగర్, క్యారేజ్ అండ్ వర్గన్ లక్నో, డీజిల్ షెడ్ గోండా, క్యారేజ్ అండ్ వర్గన్ వారణాసి.
» **ట్రేడులు:** మెకానికల్ డీజిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కార్పెంటర్, వెల్డర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, ట్రిమ్మర్ తదితరాలు.
» **అర్హత:** పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 24.05.2025 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.02.2025.
» **వెబ్‌సైట్:** https://ner.indianrailways.gov.in/

ఐఐటీలు, ఐఐఎంల్లో ఫీజులు ఇలా!

ఐఐటీలు, ఐఐఎంలు.. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యకు పేరున్న ఇన్‌స్టిట్యూట్‌లు! వీటిలో ప్రవేశం పొందితే కోర్సు పూర్తవుతూనే రూ.లక్షల వార్షిక వేతనంతో ఆఫర్‌లు అందుకోవచ్చనే నమ్మకం. కార్పొరేట్ ప్రపంచంలో ఉన్నత కెరీర్స్‌కు చక్కటి సోపానం ఈ విద్యాసంస్థలు!! అందుకే వీటిల్లో చేరాలని లక్షల మంది కలలు కంటుంటారు. కఠినమైన ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చూపినా.. భారీ స్థాయి ఫీజులను చూసి వెనకంజవేస్తుంటారు. ఈ నేపథ్యంలో.. ఐఐటీలు, ఐఐఎంల్లో ఫీజులు, అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఇతర ఆర్థిక ప్రోత్సాహకాల వివరాలు..

» ఐఐటీల్లో బీటెక్ పూర్తి చేయాలంటే రూ.10 లక్షలు.
» ఐఐఎంలలో ఎంబీఏకు రూ.20 లక్షల వరకు ఫీజు.
» ఎగ్జిక్యూటివ్ ఎంబీఏకు రూ.30 లక్షలకుపైగా ఫీజు.
» నీడ్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్స్ సదుపాయం
» అలూమ్నీ ఫౌండేషన్స్ సహకారంతో ఆర్థికతోడ్పాటు


హయ్యర్ ఎడ్యుకేషన్

బీటెక్‌కు ఏటా రూ.రెండు లక్షలు

ఐఐటీల్లో బీటెక్ ట్యూషన్ ఫీజు ఏడాదికి రూ.2 లక్షల వరకు ఉంటోంది. ఈ మొత్తాన్ని సెమిస్టర్ వారీగా చెల్లించాలి. ఒక్కో సెమిస్టర్‌కు సగటున రూ.లక్ష చొప్పున మొత్తం నాలుగేళ్ల బీటెక్ కోర్సుకు ఎనిమిది సెమిస్టర్లకు కలిపి రూ.8 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది. వీటికి అదనంగా లైబ్రరీ ఫీజు, హాస్టల్ ఫీజు, మెడికల్ ఇన్సూరెన్స్ వంటి వాటికోసం రూ.25 వేల వరకు చెల్లించాలి. అంటే కోర్సు పూర్తి చేసుకునే సమయానికి దాదాపు రూ.పది లక్షల వరకు వ్యయం అవుతుంది.

ఐఐఎంలలో రూ.20 లక్షల వరకు

మేనేజ్‌మెంట్ విద్యకు పేరుగాంచిన ఐఐఎంల్లో ఎంబీఏ లేదా ఇతర పోస్ట్ గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్‌కు దాదాపు రూ.20 లక్షల వరకు ఫీజు ఉంటోంది. ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సులకైతే రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు చెల్లించాలి. ఫస్ట్ జనరేషన్ ఐఐఎంలుగా పేర్కొనే అహ్మదాబాద్, బెంగళూరు, కోల్‌కత వంటి క్యాంపస్‌లలో కోర్సు పూర్తి చేసుకోవాలంటే గరిష్టంగా రూ.22 లక్షలు ట్యూషన్ ఫీజుకే చెల్లించాల్సి ఉంటుంది. వీటికి అదనంగా ఇతర ఖర్చులు(నివాస వ్యయం, వ్యక్తిగత ఖర్చులు) కలుపుకుంటే.. కనీసం రూ.25 లక్షలు వెచ్చిస్తే కానీ ఎంబీఏ/పీజీపీఎం పూర్తి కాదు.

అధిక ఫీజులు..కారణాలు

ప్రస్తుతం ఐఐటీల్లో ఒక్కో విద్యార్థిపై ప్రతి ఏటా రూ.4.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ వ్యయం అవుతున్నట్లు చెబుతున్నారు. అదేవిధంగా ఐఐఎంలలో నిపుణులైన ఫ్యాకల్టీని నియమించుకునేందుకు భారీగా వేతనాలు ఆఫర్ చేస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు అధిక మొత్తాలు వెచ్చిస్తున్నారు. వీటితోపాటు ఇండస్ట్రియల్ టూర్స్, ఇతర స్టడీ బేస్డ్ ప్రాజెక్ట్‌ల కోసం వ్యయం చేస్తున్నారు. నాణ్యమైన విద్యను అందించే క్రమంలో మౌలిక వసతులు, ల్యాబ్‌లు, ఫ్యాకల్టీ తదితరాల కోసం అధిక మొత్తంలో చేస్తున్న నేపథ్యంలో.. ఐఐటీలు, ఐఐఎంల్లో ఫీజులు కొంత ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు.

ఆయా వర్గాలకు రాయితీలు

ఐఐటీల్లో బీటెక్ విద్యార్థులకు ఫీజుల విషయంలో పలు రాయితీలు లభిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ వర్గాలు, దివ్యాంగ వర్గాల విద్యార్థులకు ట్యూషన్ ఫీజు నుంచి పూర్తి రాయితీ ఉంటుంది. కుటుంబ వార్షికాదాయం రూ.లక్షలోపు ఉన్న విద్యార్థులకు వారి సామాజిక వర్గంతో నిమిత్తం లేకుండా పూర్తి ఫీజు రాయితీ సౌకర్యం కల్పిస్తారు. కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉంటే ఫీజులో మూడింట రెండొంతుల మొత్తం మేరకు (66 శాతం) మినహాయింపు లభిస్తుంది. ఇలా పలు విధానాలను పరిశీలిస్తే దాదాపు 70 శాతం మందికి ఫీజు నుంచి పూర్తి మినహాయింపు లేదో రాయితీ అందే అవకాశం ఉంది.

ఐఐఎంలలో ఆర్థిక తోడ్పాటు

ప్రస్తుతం పలు ఐఐఎంలలో విద్యార్థులకు నీడ్ బేస్డ్, మెరిట్ బేస్డ్ అసిస్టెన్స్ లభిస్తోంది. కుటుంబ వార్షికాదాయం నిర్దేశిత మొత్తంలో ఉన్న వారికి ఆయా క్యాంపస్‌లు ట్యూషన్ ఫీజు నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వడం లేదా నెలవారీ స్టయిఫండ్ పథకాలు అందించడం చేస్తున్నాయి. ఐఐఎం అహ్మదాబాద్‌లో.. కుటుంబ వార్షికాదాయ ఆధారిత ట్యూషన్ ఫీజు మినహాయింపు పథకం అమలవుతోంది. కుటుంబ వార్షికాదాయం రూ.8లక్షలలోపు ఉన్న విద్యార్థులకు పూర్తి స్థాయిలో ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు లభిస్తోంది.

స్కాలర్‌షిప్ పథకాలు

» ఐఐఎంల్లో పలు స్కాలర్‌షిప్ పథకాలు అందుబాటులో ఉంటున్నాయి. ఐఐఎం–బెంగళూరులో ఆదిత్య బిర్లా స్కాలర్‌షిప్, ఉదయ్‌నాయక్ స్కాలర్‌షిప్, టి.థామస్ స్కాలర్‌షిప్, ఓపీ జెమ్స్ స్కాలర్‌షిప్, రాజేశ్ కౌశిక్ మెమోరియల్ స్కాలర్‌షిప్, ఆక్వెన్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్ స్కాలర్‌షిప్స్, కాగ్నిజెంట్ సంస్థ అందించే స్కాలర్‌షిప్స్ అందుబాటులో ఉన్నాయి.
» ఐఐఎం–లక్నో.. కుటుంబ వార్షికాదాయం రూ.15 లక్షలలోపు ఉన్న విద్యార్థులకు ట్యూషన్ ఫీజు నుంచి పూర్తి మినహాయింపు ఇస్తోంది. ఈ మినహాయింపును అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా 15 శాతం మందికి అందిస్తోంది. అదే విధంగా హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్, సిటి బ్యాంక్, రతన్ టాటా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తదితర సంస్థలు కూడా స్కాలర్‌షిప్స్ అందిస్తున్నాయి. ఈ స్కాలర్‌షిప్ మొత్తాలు రూ.ఆరు వేల నుంచి రూ. పది లక్షల వరకు ఉంటున్నాయి. అదేవిధంగా అన్ని ఐఐఎం క్యాంపస్‌లలో అలూమ్నీ ఫౌండేషన్స్ సహకారంతో మెరిట్ బేస్డ్ స్కాలర్‌షిప్స్‌ను అందిస్తున్నారు.

రీసెర్చ్, టీచింగ్ అసిస్టెన్స్‌షిప్

ఐఐటీల్లో బీటెక్ కోర్సులు చదివే విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో అవకాశం.. రీసెర్చ్ అసిస్టెన్స్‌షిప్, టీచింగ్ అసిస్టెన్స్‌షిప్ పథకాలు. ఈ రెండింటి ద్వారా విద్యార్థులు అప్పటికే సదరు ఇన్‌స్టిట్యూట్‌లో రీసెర్చ్ చేస్తున్న వారికి సహాయకులుగా వ్యవహరిస్తూ అటు అకడమిక్ నైపుణ్యాలు పెంచుకోవడంతోపాటు నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు రీసెర్చ్, టీచింగ్ అసిస్టెన్స్‌షిప్ పొందొచ్చు.

ఇండస్ట్రీ స్పాన్సర్డ్ స్కాలర్‌షిప్స్

ఐఐఎంలో సీటు పొందిన విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో ఆర్థిక ప్రోత్సాహకం.. ఇండస్ట్రీ స్పాన్సర్డ్ అసిస్టెన్స్. ముఖ్యంగా పని అనుభవం ఆధారంగా నిర్వహించే ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందిన అభ్యర్థులకు ఇవి లభిస్తున్నాయి. సదరు అభ్యర్థులు అప్పటికే పని చేస్తున్న సంస్థ ఆర్థిక సహకారం అందిస్తుంది. కోర్సు పూర్తి చేసుకున్నాక తమ సంస్థలోనే పని చేసే విధంగా ముందుగానే ఒప్పందం చేసుకుంటుంది. ఇప్పుడు పలు కార్పొరేట్ సంస్థలు, ఎంఎన్‌సీలలో ఈ విధానం అమలవుతోంది.

అలూమ్నీ సహకారం

ఐఐటీలు, ఐఐఎంల క్యాంపస్‌లలో ప్రస్తుత విద్యార్థులకు.. పూర్వ విద్యార్థుల నుంచి కూడా ఆర్థిక సహకారం లభిస్తోంది. పలు క్యాంపస్‌లలో అలూమ్నీ స్కాలర్‌షిప్స్ అందుబాటులో ఉన్నాయి. వీటి కోసం విద్యార్థులు ఆయా క్యాంపస్‌లలో అడుగు పెట్టాక దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీంతోపాటు ఉన్నత విద్య విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్ పథకాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

విద్యాలక్ష్మి పథకం

ఫీజుల భారం నేరుగా భరించాల్సి ఉన్న విద్యార్థుల కోసం ప్రభుత్వం విద్యాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఐఐటీల్లో ప్రవేశం ఖరారై ఇన్‌స్టిట్యూట్‌లో చేరిన వారు వడ్డీ రహిత రుణ సదుపాయం పొందే అవకాశం ఉంది. అదే విధంగా తక్కువ వడ్డీకి రుణాలు అందుకునే వీలుంది.

నిర్దిష్ట జీపీఏ తప్పనిసరి

స్కాలర్‌షిప్స్, ఇతర ఆర్థిక ప్రోత్సాహకాలను పొందేందుకు విద్యార్థులు ప్రతి సెమిస్టర్‌లో నిర్దిష్ట జీపీఏ సొంతం చేసుకోవాల్సి ఉంటుంది. కనీసం 6.5, గరిష్టంగా 8.5 జీపీఏను పొందాల్సి ఉంటుంది. మొత్తంగా చూస్తే.. ఐఐటీలు, ఐఐఎంల్లో ఫీజులు భారీగానే ఉన్నా.. అకడమిక్ ప్రతిభ, సామాజిక వర్గాల నేపథ్యం ఆధారంగా మినహాయింపులు, రాయితీలు, స్కాలర్‌షిప్‌లు, రుణాలు పొందే అవకాశం ఉంది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–ఫిజికల్ సైన్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- డిజాస్టర్ మేనేజ్‌మెంట్ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- జనరల్ ఇంగ్లిష్

R.V. TOURS AND TRAVELS PVT. LTD.

Hyderabad | Bengaluru | Varanasi | Visakhapatnam | Vijayawada | Tirupati

మన కరీంనగర్ లో

నూతన కార్యాలయం ప్రారంభోత్సవం

ప్రముఖ గాయని **మధు ప్రియా** గారి చే

అడ్రస్ : H.NO-7-1-36, 1st ఫ్లోర్, కోటక్ బ్యాంకు పైన, మంకమ్మ తోట, కరీంనగర్

తేదీ : 12.02.2025 సమయం : 10 AM



"Travel Expo Special Offers"

డొమెస్టిక్ & ఇంటర్నేషనల్ టూర్స్ పై

భారీ డిస్కౌంట్స్ ఆఫర్స్

RV Travel Expo 2024 - 2025

చివరి అవకాశం

12th-15th ఫిబ్రవరి 2025

3 N / 4 D
మలేషియా
Rs.49,999/-

5 N / 6 D
శ్రీలంక
Rs.57,000/-

13 N / 14 D
యూరోప్
Rs.3,25,000/-

Duration	Destination	Package	Price
3 N / 4 D	మలేషియా	(ఎక్స్‌పో స్పెషల్ ప్యాకేజ్)	Rs.49,999/-
4 N / 5 D	దుబాయ్	(స్పెషల్ ప్యాకేజ్)	Rs.97,500/-
5 N / 6 D	సింగపూర్ - మలేషియా	(స్పెషల్ ప్యాకేజ్)	Rs.1,06,000/-
10 N / 11 D	కంబోడియా - వియత్నాం	(స్పెషల్ ప్యాకేజ్)	Rs.1,75,000/-
5 N / 6 D	శ్రీలంక	(స్పెషల్ ప్యాకేజ్)	Rs.57,000/-
15 N / 16 D	ఆస్ట్రేలియా - న్యూజిలాండ్	(స్పెషల్ ప్యాకేజ్)	Rs.5,30,000/-

*T&C Apply

11 N / 12 D
చార్ధామ్
Rs.59,800/-

13 N / 14 D
అమర్నాథ్
Rs.67,500/-

13 N / 14 D
కైలాస్ మానసరోవర్
Rs.2,75,000/-

Contact:7032666921

Duration	Destination	Package	Price
3 N / 4 D	కేరళ	(స్పెషల్ ప్యాకేజ్)	Rs.24,800/-
4 N / 5 D	ఒడిస్సా	(స్పెషల్ ప్యాకేజ్)	Rs.24,800/-
4 N / 5 D	మహారాష్ట్ర	(స్పెషల్ ప్యాకేజ్)	Rs.31,500/-
7 N / 8 D	గుజరాత్	(స్పెషల్ ప్యాకేజ్)	Rs.38,900/-
6 N / 7 D	కాశ్మీర్	(స్పెషల్ ప్యాకేజ్)	Rs.39,000/-
6 N / 7 D	గ్యాంగ్టాక్ - డార్జిలింగ్	(స్పెషల్ ప్యాకేజ్)	Rs.39,000/-
6 N / 7 D	గౌహతి	(స్పెషల్ ప్యాకేజ్)	Rs.39,000/-
8 N / 9 D	సిమ్లా - మనాలి	(స్పెషల్ ప్యాకేజ్)	Rs.52,000/-
7 N / 8 D	తమిళనాడు	(ఫ్లైట్ ప్యాకేజ్)	Rs.48,900/-
10 N / 11 D	రాజస్థాన్	(స్పెషల్ ప్యాకేజ్)	Rs.51,500/-
8 N / 9 D	శ్రీనగర్ - కాశ్మీర్	(ఫ్లైట్ ప్యాకేజ్)	Rs.62,000/-
12 N / 13 D	ముక్తినాథ్	(ఫ్లైట్ ప్యాకేజ్)	Rs.75,900/-

సంప్రదించండి :

9154149938 , 9177333673 ,9154225669 , 9121144001

/rvtoursandtravelspvtltd www.rvtoursandtravels.com



RV Ramana
Chairman & Founder

పెళ్లి వద్దు.. సంపాదన ముద్దు



- మారిన యూత్ మైండ్ సెట్
- లేటు వయసులో పెళ్లితో ఆరోగ్య సమస్యలు
- ఐవీఎఫ్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్న జంటలు

ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలి అంటుంటారు. అయితే ఇప్పుడు పెళ్లి వయసు దాటిపోతున్నా.. యువత మాత్రం అప్పుడే పెళ్లి వద్దు.. జీవితంలో సెటిల్ అయ్యాక చేసుకుంటాం అంటున్నారు. ఇంతలో మూడు పదుల వయసు దాటిపోతోంది. ఉద్యోగాల వేట, డాలర్ల భ్రమతో లేటు వయసు పెళ్లిళ్లకు మొగ్గు చూపుతున్నారు. జీవితంలో ఎంజాయ్ చేశాకే పెళ్లి అన్న ధోరణితో అసలుకే మోసం వస్తోంది. సరైన సమయంలో పెళ్లి చేసుకోకపోవడంతో సంతానం కోసం ఐవీఎఫ్ కేంద్రాలకు పరుగు పెడుతున్నారు. పలు రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇక అబ్బాయిలకైతే అమ్మాయిలు దొరక్క అవివాహితులుగా మిగిలిపోతున్నారు.

–తాడేపల్లిగూడెం

అమ్మాయిల ట్రెండ్ మారింది

తరం మారింది. అబ్బాయిలే కాదు.. అమ్మాయిలు కూడా మూడు పదులు దాటినా పెళ్లి చేసుకోవడం లేదు. 35 ఏళ్ల దాటే వరకు యువతకు పెళ్లి ఆలోచనలు లేకపోవడం చాలా అనర్థాలకు దారితీస్తోంది. పెళ్లి చేసుకుంటాను.. ఇపుడే కాదు .. ఉద్యోగంలో స్థిరపడ్డాక చేసుకుంటాం.. ఇలా అనుకొనేసరికి వయస్సు 35 సంవత్సరాలు దాటుతోంది. అప్పుడు మేరేజ్ బ్యూరోలో వివరాల నమోదు చేయించుకుంటున్నారు. తీరా పెళ్లయ్యాక పిల్లలను కనే వయసు దాటిపోతుంది.

మహిళల్లో ఆధునిక జీవన విధానాలతో 40 ఏళ్లకే మెనోపాజ్ వస్తుంది. రక్త హీనత, ఐరన్ లోపం, విటమిన్ డీ లోపాలు ఏర్పడుతున్నాయి. దీంతో జంటలు ఐవీఎఫ్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

61 శాతం జంటల్లో హార్మోన్ సమస్యలు

పిల్లలు వద్దు.. ఆదాయమే ముద్దు అనే పాశ్చాత్య దేశాల కల్చర్ మన యువతను కమ్మేస్తోంది. ముందు జీవితాన్ని ఎంజాయ్ చేద్దాం అన్న ధోరణి పెరుగుతోంది. అనధికారిక లెక్కల ప్రకారం వివాహమైన నేటి తరం జంటల్లో 61 శాతం హార్మోన్ సమస్యలు ఉంటున్నాయి.

పెళ్లికాని ప్రసాదులే కాదు.. అమ్మాయిలు కూడా

పశ్చిమ గోదావరి జిల్లాలో 18 నుంచి 39 సంవత్సరాల వయసున్న యువత	6,88,555 మంది
18 నుంచి 19 ఏళ్లు ఉన్నవారు	32,277 మంది
20 నుంచి 29 ఏళ్లు ఉన్నవారు	2,57,495 మంది
30 నుంచి 39 ఏళ్లు ఉన్నవారు	3,98,783 మంది
యువకులు	3,42,643 మంది
యువతులు	3,45,912 మంది

వీరిలో సుమారు నాలుగు లక్షల మందికి ఇంకా వివాహాలు కాలేదని లెక్కలు చెబుతున్నాయి.

పెళ్లి ట్రెండ్ మారింది



జీవితంలో వివాహం ముఖ్య ఘట్టం. ఇప్పుడు ఉద్యోగ వ్యవస్థ వివాహ స్వరూపాన్ని మార్చేసింది. ఇగోలు పెరిగి వివాహ బంధం విచ్ఛిన్నమవుతుంది. వయసు రాగానే పెళ్లి చేసుకోవడం మేలు. అనురాగం, ఆప్యాయతల నడుమ ఈ పెళ్లిళ్లు సాగాలి.

– భోగిరెడ్డి ఆదిలక్ష్మి, స్పందన ఫౌండేషన్

లేటు వివాహాలు అనర్థదాయకం



పెళ్లి ఆలస్యంగా చేసుకోవడం అనర్థం. ఇన్‌ఫెర్టిలిటీ పెరుగుతుంది. స్పెర్మ్ వైటాలిటీ తగ్గుతుంది. బీపీ, మధుమేహం వంటివి వస్తున్నాయి. బర్త్ రేటు తగ్గుతుంది. పుట్టిన పిల్లల్లో క్రోమోజోముల అసమతుల్యంతో వైకల్యం రావచ్చు. సహజీవనం, ఇతర మార్గాలలో సంబంధాలు పెట్టుకోవడం వల్ల సుఖ వ్యాధులు, హెచ్ఐవీ రిస్క్ పెరుగుతుంది. జనరేషన్ గ్యాప్ ఏర్పడి ఇబ్బందులు తలెత్తుతాయి. 23 నుంచి 30 సంవత్సరాలలోపు పెళ్లిళ్లు చేసుకోవాలి.

– డాక్టర్ తాతారావు, గూడెం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా...

23న జనసేన శాసనసభా పక్ష సమావేశం

- గతంలో కూటమి పార్టీల శాసనసభాపక్ష సమావేశం నిర్వహణ
- ఈసారి జనసేన వేరుగా సమావేశం

సాక్షి, అమరావతి: అసెంబ్లీ సమావేశాలకు ముందు జనసేన పార్టీ శాసనసభా పక్ష సమావేశం నిర్వహించుకోవాలని నిర్ణయించింది. గతంలో కూటమి పార్టీలన్నీ కలిసి శాసనసభా పక్ష సమావేశం ఏర్పాటు చేసుకోగా, ఈసారి జనసేన వేరుగా భేటీ ఏర్పాటు చేస్తోంది. ఈ నెల 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగనుండగా, 23వ తేదీన పార్టీ శాసనసభా పక్ష సమావేశాన్ని నిర్వహించాలని అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ నిర్ణయించినట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. 23 సాయంత్రం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం జరుగుతుందని పేర్కొంది.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య

సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఫలితాలు సాధించేందుకు జిల్లా అధికారులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు సూచించారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలని, దీనికి అనుగుణంగా అంతా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సమగ్ర శిక్షా ఏపీసీల రాష్ట్ర సదస్సులో బుధవారం ఆయన అధికారులనుద్దేశించి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించి, పాఠశాలలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు సోషల్ ఆడిట్ ఎంతో కీలకమన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకు విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సోషల్ ఆడిట్ బృందాలు తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. విద్యాశాఖ మంత్రి వోఎస్డీ ఆకుల వెంకటరమణ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, భవిష్యత్‌లో ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

అత్యవసర శాఖగా పాఠశాల విద్య: ఏపీటీఎఫ్


సాక్షి, అమరావతి: పాఠశాల విద్యలో ఏ రోజు ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని, ఇది అత్యవసర శాఖగా మారిపోయిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, ఎస్.చిరంజీవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నట్టుండి మూడో శనివారం సగం రోజు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు పెట్టడం, సెలవులను వినియోగించుకోకూడదని షరతు విధించడం సబబు కాదన్నారు. రోజు మొత్తం పాఠశాలకు సెలవు ప్రకటించి కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: ఏపీ టీచర్స్ గిల్డ్

రాష్ట్ర ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న 3,010 మంది ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. టీచర్లకు ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, 2000 నుంచి ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తూ మరణించిన కుటుంబ సభ్యులు 150 మందికి కారుణ్య నియామకం చేపట్టాలని గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్‌కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఐదు లక్షల మంది రైతులకు విశిష్ట సంఖ్య జారీ

వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రైతులకు విశిష్ట సంఖ్య జారీ ప్రక్రియ (ఫార్మర్ రిజిస్ట్రీ) ముమ్మరంగా సాగుతోందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు తెలిపారు. కేవలం మూడు రోజుల్లోనే 5లక్షల మంది రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్యను జారీ చేసినట్లు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలన్నీ ఈ విశిష్ట సంఖ్య ఆధారంగానే రైతులకు వర్తింపచేస్తారని స్పష్టం చేశారు. సాగుదారులందరూ విధిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు.

లంకమల అరణ్యం.. వర్ధిల్లిన శైవం



కొండూరు బీటులో పదికిపైగా శివాలయాలు

- ఆలయాల పక్కనే వెలుగులోకి వచ్చిన గుహలు
- 4వ శతాబ్దిలో శైవం వర్ధిల్లిన ఆనవాళ్లు
- పక్కనే రాతిబండపై ఆయుధాల గుర్తులు
- ఇక్కడే శివుని పాదముద్రలు, బండపై శాసనాలు
- ఈ ప్రాంతమే కైలాసకోనగా ప్రాచుర్యం



ఆలయాల పక్కనే బండపై నాటి ఆయుధాల ఆకృతి

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లాలోని సిద్దవటం అటవీ ప్రాంతమైన లంకమల అభయారణ్యంలో 4వ శతాబ్ది నాటి మానవుల ఆనవాళ్లు వెలుగులోకి వచ్చాక.. ఈ ప్రాంతంలో ఇంకా ఎలాంటి విశేషాలు, చరిత్ర దాగున్నాయన్న ఉత్సుకత పెరుగుతోంది. దీనికి తగ్గట్టుగా రోజుకో కొత్త విషయం బయటికి వస్తోంది. కొత్తగా సిద్దవటం అటవీశాఖ క్షేత్రాధికారిణి బి.కళావతి.. వెలుగులోకి తెచ్చిన ఫొటోల ఆధారంగా మరిన్ని విషయాలు బాహ్య ప్రపంచంలోకి వచ్చాయి. సాక్షిలో 'ఆధ్యాత్మిక క్షేత్రం.. లంకమల' కథనం ద్వారా పలు ఆసక్తికర అంశాలను వెలుగులోకి తేవడం తెలిసిందే. ప్రస్తుతం ఆ కథనానికి మరింత బలం చేకూర్చే మరిన్ని ఆధారాలు లభ్యమయ్యాయి. ఒకే చోట గుహ, బండపై శాసనం, శిథిలమైన శివాలయాల ఆనవాళ్లు, శివుని పాద ముద్రలు, అక్కడే పైనుంచి కిందికి దూమికే జలపాతం.. ఇలా అన్నీ ఆధారాలు వెలుగులోకి వచ్చిన ఈ ప్రాంతానికి కైలాసకోనగా ప్రాచుర్యం ఉంది. అంటే శివుడు నివసించిన ప్రాంతమని అర్థం. కాబట్టి శైవం ఏ స్థాయిలో ఇక్కడ వర్ధిల్లిందో దీన్ని బట్టి స్పష్టంగా అర్థమవుతోంది. అందిన ఆధారాలను పురావస్తుశాఖ క్షుణ్ణంగాపరిశీలిస్తోంది.

బండలపై ఆధారాలు



శివాలయ శిథిల గోడ, పేర్చిన బండరాయి

ఈ ప్రాంతంలో శైవ క్షేత్రం వర్ధిల్లిందని.. ఆనాటి శైవులు బండలపై శాసనాలు, ఇతర గీతల ద్వారా వెల్లడవుతోంది. శాసనాలను బట్టి 4వ శతాబ్దినాటి శైవులు ఇక్కడ ఉన్నట్టు నిర్ధారిస్తున్నారు. అప్పట్లో ఎలాంటి ఆయుధాలు వినియోగించారో.. తెలిపేలా బండలపై వాటి ఆకృతి తెలిపేలా చెక్కారు. మరోచోట శాసనం, పక్కనే శివలింగ ఆకారం ఉన్నాయి. ఇక్కడి శిథిల ఆలయాల నిర్మాణం కోసం చతురస్రాకారంలో ఉండే బండలను వినియోగించారని, వాటిని బట్టి స్పష్టం అవుతోంది.

పై కైలాసం.. జారే జలపాతం



ఎగువ కైలాసకోన జలపాతం

శైవ క్షేత్రాలున్నట్టు గుర్తించిన ప్రాంతానికి సమీపంలోనే పై కైలాసకోన ఉంది. ఇది అద్భుతమైన జలపాతం. పై నుంచి జలపాతం కిందకు దూకే ప్రాంతం అత్యంత భయంకరంగా కనిపిస్తుంది. కొండనడుమ దూకే జలపాత ప్రాంతం ప్రకృతి సౌందర్యాన్ని తలపిస్తుంది. ఈ జలపాతంపై నుంచి కిందకు జారితే కైలాసానికి చేరినట్టే. అందుకనే దీన్ని పై కైలాసంగా ప్రాచుర్యంలో ఉంది. జలపాతం దిగువన గుహలు, ఆలయాలతో కూడిన ప్రదేశమే దిగువ కైలాసకోన.

అక్కడే గుహ.. ఆలయాలు



కొండూరు బీటులో గుహ

లంకమల మొత్తం 36 వేల హెక్టార్ల మేర విస్తరించి ఉండగా.. అందులో సిద్దవటం రేంజి పరిధిలో 26 వేల హెక్టార్ల అభయారణ్యం ఉంది. అడవిలోని కొండూరు బీటులో శైవ క్షేత్ర ఆనవాళ్లు విస్తృతంగా లభ్యమయ్యాయి. దిగువ కైలాసకోనగా పిలువబడే.. ఈ ప్రదేశంలో అర ఎకరం విస్తీర్ణంలో పదికిపైగా శివాలయాల శిథిలాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన పునాదుల బండరాళ్లు, వాటి నిర్మాణం కనిపిస్తున్నాయి. పడిపోయిన గోడలు, వాటి శిథిలాలు ఉన్నాయి. దీన్ని ఆధారంగా చేసుకుంటే వాటిని ఆలయాలుగా భావిస్తున్నారు. ఈ చోటనే గుహను కూడా గుర్తించారు. ఆలయాల వద్ద పూజల నిర్వహణ, గుహలో సిద్దులు, యోగులు తపస్సు చేసుకునే వారు. ఇక్కడే శివుడ్ని ఆరాధిస్తున్న వీరుడి విగ్రహం లభ్యమైంది. ఈ ప్రాంతం దిగువ కైలాసకోనగా ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉంది. ఈ అడవికి సమీపంలో సిద్దవటం గ్రామం ఉంది. అంటే సిద్దులకు ఈ ప్రాంతం నివాసమని భావిస్తున్నారు. దీనివల్లె సిద్దవటం అని పేరొచ్చిందని చెబుతారు.

చిత్తడి నేలలు.. పర్యావరణ నేస్తాలు

- తెలుగు రాష్ట్రాల్లోనే ఏకైక చిత్తడి నేలల ప్రాంతం కొల్లేరు



కొల్లేరులో సంప్రదాయ దోనెపై వేట



కొల్లేరులో చిత్తడి నేలల ప్రాంతం

కైకలూరు: ఉపరితలంపై ఏడాది పొడవునా ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండే భూములను చిత్తడి నేలలు అంటారు. ఇవి జీవరాశుల మనుగడకు అనువైనవి. ఇరాన్‌లోని రామ్‌సర్ నగరంలో 1971 ఫిబ్రవరి 2న నిర్వహించిన అంతర్జాతీయ చిత్తడి నేలల సదస్సులో ప్రపంచవ్యాప్తంగా వీటి ఆవశ్యతను గుర్తించారు. దేశవ్యాప్తంగా 23 రాష్ట్రల్లో 85 రామ్‌సర్ సైట్లలో 13,688.0903 హెక్టర్లలో చిత్తడి నేలలు ఉండగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 3,719.08 హెక్టర్లలో విస్తరించి ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే చిత్తడి నేలలగా రామ్‌సర్ గుర్తించిన ఏకైక కొల్లేరు సరస్సు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వ్యాపించి ఉంది.

కొల్లేరు నిలయం

కొల్లేరు ప్రాంతంలో 2,22,689 ఎకరాల విస్తీర్ణాన్ని 2002 ఆగస్టు 19న రామ్‌సర్ సైట్‌గా గుర్తించారు. చిత్తడి నేలల నిలయమైన కొల్లేరుకు ఆస్ట్రేలియా, నైజీరియా, ఈజిప్టు, ఇండోనేషియా వంటి దేశాల నుంచి వలస పక్షులు విడిదికి వస్తున్నాయి. ప్రపంచ పెలికాన్ పక్షుల్లో 40 శాతం శీతాకాలంలో కొల్లేరుకు రావడానికి చిత్తడి నేలలే కారణం. కొల్లేరులో దాదాపు 182 రకాల పక్షులు సంచరిస్తున్నాయి. కృష్ణా, గోదావరి, తుంగభద్ర, కావేరి, హిమాలయాలు వంటి ప్రాంతాల్లో సరస్సులు, మడ అడవులు, పరీవాహక ప్రాంతాలు చిత్తడి నేలల కోవలోకి వస్తాయి. ఈ ఏడాది 'భవిష్యత్తు కోసం చిత్తడి నేలలను రక్షించడం' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు చేపడు తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 56.25 హెక్టార్లు పైగా విస్తీర్ణంలో 1,943 చిత్తడి నేలలు 3,719.08 చరుపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి.

ప్రమాదంలో చిత్తడి నేలలు

ఇంటర్ గవర్నమెంటల్ సైన్స్–పాలసీ ప్లాట్‌ఫాం ఆన్ బయోడైవర్సిటీ అండ్ ఎకో సిస్టమ్ సర్వీసెస్ (ఐపీబీఈఎస్) గ్లోబల్ అంచనా ప్రకారం చిత్తడి నేలలు అడువుల కంటే మూడు రెట్లు వేగంగా కనుమరుగవుతున్నాయి. చిత్తడి నేలలు భూ ఉపరితలంపై 6 శాతం మాత్రమే ఉన్నా మొత్తం వృక్ష, జంతు జాతులలో 40 శాతం చిత్తడి నేలల్లోనే నివసిస్తున్నాయి. అడవుల నరికివేత, రసాయనాల వాడకం, ఆక్రమణలు వల్ల చిత్తడి నేలలు సహజత్వాన్ని కోల్పోతున్నాయి. కొల్లేరు సరస్సులో ఆక్రమణలను మూడు నెలల్లో తొలగించాలని సుప్రీంకోర్టు రాష్ట్రం ప్రభుత్వానికి ఆదేశించడానికి కొల్లేరు చిత్తడి నేలల ప్రాంతం కావడమే ప్రధాన కారణం.

పరిరక్షణ అందరి బాధ్యత



చిత్తడి నేలల ప్రాంతమైన కొల్లేరును పరిరక్షించుకోవడం అందరి బాధ్యత. కొల్లేరు ప్రాంతానికి ఈ ఏడాది ఎక్కువగా వలస పక్షులు వచ్చాయి.

– బి.విజయ, జిల్లా అటవీశాఖ అధికారి, ఏలూరు

చిత్తడి నేలలు.. ఉపయోగాలు



కొల్లేరులో పక్షులు

- వరదలను నియంత్రిస్తాయి.
- ఫిల్టర్ మాదిరిగా నీటిని శుద్ధి చేస్తాయి. అందుకే వీటిని ప్రకృతి మూత్ర పిండాలుగా వర్ణిస్తారు.
- మట్టిలోని ఉత్పాదక సారాన్ని పెంచుతాయి.
- సున్నితమైన ప్రకృతి వనరులతో పాటు, జీవరాశులన్నింటికీ అనువైన వాతావరణం.
- ఔషధ గుణాలున్న మొక్కల పెరుగుదలకు తోడ్పడతాయి.
- రసాయనిక, జెనెటిక్ పదార్థాలను ఇముడ్చుకుని, తిరిగి నేలను మార్పు చేస్తాయి.
- అత్యధిక జీవరాసులకు ప్రధాన ఆవాస కేంద్రంగా ఉంటాయి.
- ఎక్కువ కాలం నీటి నిల్వకు, భూమి లోపలి నీటి శాతాన్ని పెంచేందుకు దోహదపడతాయి.
- సున్నితమైన ప్రకృతి వనరులకు, పక్షులకు నిలయాలుగా ఉన్నాయి.
- చిత్తడి నేలల పరిరక్షణ అందరి బాధ్యత అని రామ్‌సర్ సదస్సు పిలుపునిచ్చింది.

తాళపత్ర గ్రంథ పరిష్కారానికి కేరాఫ్ చంద్రమౌళి

- రాష్ట్రంలో రెండో వ్యక్తిగా పేరు ప్రఖ్యాతులు
- పదిపైగా తాళపత్రాలకు శుద్ధ ప్రతుల తయారీ
- తాళపత్ర మన్నిక 300 సంవత్సరాలకు పైమాటే
- తాళపత్రాల సేకరణకు ప్రోత్సాహం ఇవ్వాలంటున్న చంద్రమౌళి



తాళ పత్రాలను పరిశీలిస్తున్న జ్యోతి చంద్రమౌళి

అద్దంకి: తాళ పత్రాల గ్రంథాలను పరిష్కరించడంలో బాపట్ల జిల్లా అద్దంకి పట్టణానికి చెందిన జ్యోతి చంద్రమౌళి కేరాఫ్‌గా నిలుస్తున్నారు. ఈయన తాళపత్ర గ్రంథాలను పరిష్కరించడంలో కృష్ణా జిల్లాకు చెందిన తంగిరాల సుబ్బారావు తరువాత రాష్ట్రంలోనే రెండో వ్యక్తిగా నిలిచాడు. ఈయన వృత్తి రీత్యా ఉపాధ్యాయుడిగా పనిచేసే సమయం నుంచి రిటైరైన తరువాత తాళపత్రాలను సేకరించి వాటిని శుభ్రం చేసి వాటికి పుస్తక రూపం ఇచ్చి భావితరాలకు అందేలా కృషి చేస్తున్నారు. ఆయన ఇప్పటికి పది తాళపత్రాల గ్రంథాలను పరిష్కరించి శుద్ధ ప్రతులను తయారు చేశారు. ఇప్పటికే ఒక గ్రంథం అచ్చయింది. మిగిలిన వాటికి పుస్తకం రూపం ఇవ్వడం ఖర్చుతో కూడుకున్న పని. ప్రభుత్వం ప్రోత్సాహమో, లేక ఏదైనా సంఘాల చేయూత ఉంటేనే అవి అచ్చు అవుతాయి.

ఇప్పటి వరకు పరిష్కరించిన తాళపత్ర గ్రంథాలు



ఒక ఆకుపై రాసిన అక్షరాలు

చంద్రమౌళి తన దగ్గరకు తెచ్చి ఇచ్చిన తాళపత్ర గ్రంథాల్లో ఇప్పటికి పోచయ్య బొంగరాలాట, కాటంరాజు కథ, వల్లురాజు కథ, ఆవుల మేపు, భట్టు రాయభారం, తరిగొండ వెంగమాంబ కథ, రాజయేగామృత సారం, గ్రామీణ వైద్యం అనే గ్రంథాలకు పుస్తకం రూపం ఇచ్చారు. పురాతన తాళపత్రాల గ్రంథాలను పరిష్కరించడం అంత తేలికైన పని కాదు. ఒక్కో ఆకు భద్రంగా బయటకు తీసి వాటికి రెండు రకాల రసాయనాలు పూస్తేనే అందులోని అక్షరాలు కనిపించి పరిష్కారానికి ఉపయోగిస్తాయి.

తాళపత్ర పూర్వ చరిత్ర..



తయారు చేసిన శుద్ధ ప్రతులు

జ్యోతి చంద్రమౌళి అందించిన వివరాల మేరకు ప్రస్తుతం, ఏదైనా రచన చేయాలన్నా ఉత్తరం రాయాలన్నా కాగితం అవసరం. అయితే అది ఇప్పటి మాట. ఒకప్పుడు కాగితాలు లేవు. అప్పుడు గ్రంథాలను రాయాలన్నా ఉత్తరాలు రాయాలన్నా తాళ (తాటి ఆకులు) పత్రాలను వాడేవారు. ప్రముఖంగా గ్రంథాలను రాయడానికి వీటిని ఎక్కువగా ఉపయేగించేవారు. అంతకు మునుపు తామ్ర పత్రాలు అంటే సన్నగా చేసిన రేకులపైన రాసేవారు. ఇవి 300 సంవత్సరాలకు పైగానే మన్నుతాయి.

తాళపత్రాల సేకరణకు ప్రోత్సహించాలి

తాళపత్ర గ్రంథాలు ఇప్పటికే వేటపాలెం, రాజమండ్రి, కడప వంటి గ్రంథాలయాల్లో ఉన్నాయి. అయితే ఇంకా చాలా గ్రంథాలు తరతరాల నుంచి ఇళ్లల్లో ఉన్నాయి. ఆయా గ్రంథాలను బయటకు తీసి వాటికి పుస్తక రూపం ఇస్తే ఆయా గ్రంథాలు వెలుగు చూస్తాయి.

– విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రచయిత, శాస్త్ర పరిశోధకుడు



శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 30 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,192 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 20,825 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.15 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

శాస్త్రోక్తం.. త్రిశూల స్నానం



శ్రీకాళహస్తి: పట్టణంలోని స్వర్ణముఖి నదిలో బుధవారం శాస్త్రోక్తంగా త్రిశూలస్నానం నిర్వహించారు. వ్యాసపౌర్ణిమను పురస్కరించుకుని మహాశివరాత్రికి ముందు త్రిశూల స్నానం జరిపించడం ఆనవాయితీ. అందులో భాగంగా జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరుడు, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, త్రిశూలానికి ఆలయ అలంకార మండపంలో విశేష పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా స్వర్ణముఖి నదీ తీరానికి తీసుకెళ్లారు.

ఘనంగా శ్రీగోవిందరాజస్వామి తెప్పోత్సవాలు




తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయ పుష్కరిణిలో ఏడు రోజుల పాటు జరిగిన స్వామివారి తెప్పోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు తెప్పలపై ఏడు చుట్లు విహరించి భక్తులను కటాక్షించారు.

గిజిగాని గూడు.. భలేగుంది చూడు

పిచ్చుకలు తమ పిల్లల్ని శత్రువుల బారినుంచి కాపాడుకునేందుకు.. చెరువులు, బావుల్లోకి వంగిన తుమ్మ, తాటి, ఈతచెట్లకు ఎక్కువగా గూళ్లను నిర్మించుకుంటాయి. గూళ్ల నిర్మాణంలో పిచ్చుకలు చూపించే నైపుణ్యం ఆశ్చర్యం కలిగిస్తుంది. గూళ్లు అల్లడం, ఆహారం సేకరించడం, పిల్లలను సంరక్షించడం, కాకులు, పాములు, గద్దలతో పోరాటం.. ఇవన్నీ గిజిగాని శక్తికి ప్రతిరూపాలే. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేట శివారు చెరువు, పొలాల్లో విద్యుత్ తీగలకు వేలాడుతున్న పిచ్చుకల గూళ్లు ముచ్చటగొల్పాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



విద్యుత్ తీగలకు వేలాడుతున్న పిచ్చుక గూళ్లు





‘లింక్డ్ ఇన్’ ఖాతా తెరిచిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ ప్రొఫెషనల్ నెట్ వర్కింగ్ ప్లాట్‌ఫామ్ ‘లింక్డ్ ఇన్’లో కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం ఖాతా తెరిచారు. తన తొలి లింక్డ్‌ఇన్ పోస్టులో.. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్లనున్న నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ (ఎన్‌సీఎంఎం)కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ‘ఇటీవల కేంద్ర కేబినెట్ ఆమోదించిన ఎన్‌సీఎంఎంలో భాగంగా నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉన్నాం’ అని తన తొలి పోస్టులో పేర్కొన్నారు. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌కు సంబంధించి ఏడు కీలకమైన అంశాలను ఈ సందర్భంగా పోస్టులో ప్రస్తావించారు.



కోటగుళ్లు

ఓవైపు ఆధ్యాత్మికం.. మరోవైపు పర్యాటకం

ఘన చరిత్రకు దర్పణం గణపవరం

పునఃవైభవం చాటుకోనున్న కోటగుళ్లు

అభివృద్ధికి ముందుకొస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



మత్తడి పోస్తున్న గణపసముద్రం చెరువు మత్తడి (ఫైల్)

గణపురం: ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలానికి ఘనచరిత్ర ఉంది. కాకతీయుల సామ్రాజ్యంలో గణపతి దేవుడు (క్రీస్తు శకం) 1213లో కోటగుళ్లను నిర్మించారు. పూర్తిగా మట్టి కోటల మధ్య నిర్మించడం వల్ల ఈ ఆలయానికి కోటగుళ్లుగా నామకరణం చేశారు. రామప్ప దేవాలయం నిర్మించిన కాకతీయ సైన్యాధ్యక్షుడు రేచర్ల రుద్రారెడ్డి మూడో కుమారుడు గణపురం సామంతుడైన గణపతిరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. కాకతీయులు శైవ మతాభిమానులైనప్పటికీ భేదాన్ని చూపకుండా నిర్మాణాలు చేపట్టారు. ఈ కోటగుళ్ల చుట్టూ శత్రు దుర్భేద్యమైన రాతి గోడలతో ప్రహరీ నిర్మించారు. ఈ గుళ్లలో గణపేశ్వరాలయం ప్రధానమైంది. దీర్ఘాకృతి గల శివలింగం నక్షత్రాకారం.. పానమట్టంపై ఉండటంతో ఆలయ గర్భగుడి ముఖద్వారంపై చండిక, త్రిముఖ బ్రహ్మ, పంచముఖ గరుత్మంతుడు, నందీశ్వరుడు, గిరిజా కల్యాణం, మహావిష్ణువు ఉట్టిపడేలా చిత్రీకరించారు. దీనికింద లక్ష్మీదేవి తామర పువ్వుపై కూర్చోగా రెండు వైపులా ఏనుగులు తొండాలతో సంయుక్తంగా కలశం పట్టుకున్న ఈ విగ్రహం కళా నైపుణ్యంతో కాంతులీనుతోంది. దీంతో పాటు నాట్య మండపం, 19 ఉప ఆలయాలు నిర్మించారు. క్రీ.శ 1323లో ప్రతాపరుద్రుడు మరణించిన తర్వాత ఈ కోటగుళ్ల సముదాయంపై అనేక దాడులు జరిగాయి. ఈక్రమంలోనే 16వ శతాబ్దంలో కులీకుతుబ్ ఉల్ మహ్మద్ బిన్ తుగ్లక్ అనే మహ్మదీయ రాజు కారణంగా ఆలయం ఘోరంగా ధ్వంసమైంది. అప్పటినుంచి ఆదరణకు నోచుకోని ఈ ఆలయాలను గ్రామస్తులు ముందుకు వచ్చి దాతల సహకారంతో 15 ఏళ్లుగా అభివృద్ధి వైపు నడిపిస్తున్నారు. దీంతో పర్యాటకుల సంఖ్య పెరగడంతో దీనిపై ప్రభుత్వాలు దృష్టి సారించాయి.

త్రిబుల్ టీ విధానం

కాకతీయులు ఎక్కడ పాలన చేసినా త్రిబుల్ టీ విధానాన్ని కొనసాగించేవారు. పరిపాలన కొనసాగిన ప్రతి చోట టెంపుల్, ట్యాంక్, టౌన్ విధానాన్ని అవలంబించేవారు. వారు నిర్మించిన ప్రతీ ఆలయం వద్ద చెరువులు నిర్మించి అక్కడి ప్రజలు సుభిక్షంగా ఉండాలని గ్రామాలను నిర్మించడానికి అనువైన స్థలాలను ఎంపిక చేసుకునే వారు. ఈక్రమంలో గణపతిరెడ్డి పేరిట పెట్టిన గ్రామమే అప్పటి గణపవరం కాలక్రమేణా గణపురంగా మారింది. ఇక్కడ అద్భుతమైన శిల్ప సంపదతో కూడిన కోటగుళ్లతో పాటు గణపసముద్రం చెరువును నిర్మించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అతిపెద్ద చెరువుల్లో ఒకటి గణపసముద్రం చెరువు. ఎక్కడా లేని విధంగా ఇక్కడి మత్తడిని 31 అడుగులతో నిర్మించారు. వర్షాకాలంలో ఈ చెరువు నీటిమట్టం పూర్తిగా నిండి మత్తడి పోస్తే జలపాతంలా కనిపిస్తుంది. పర్యాటకులను ఆహ్లాద పరుస్తుంది.

పునఃవైభవం

అద్భుత శిల్ప సంపదతో కోటగుళ్లు, ప్రకృతి అందాల మధ్య ఉన్న గణపసముద్రం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకేసారి ముందుకొచ్చాయి. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రులతో మాట్లాడి వారిని తీసుకొచ్చి కోటగుళ్లతో పాటు గణపసముద్రం చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అభివృద్ధి పనులు ప్రారంభం కాగానే.. కేంద్ర ప్రభుత్వం ‘సాస్కి’పథకంలో రామప్ప సరసన కోటగుళ్లను నిలుపుతూ.. రామప్ప, ఇంచర్ల, కోటగుళ్లు, గణప సముద్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.73.74 కోట్లను మంజూరు చేసింది. కోటగుళ్లకు వచ్చే పర్యాటకులకు ప్రత్యేక పార్కులు, గతంలో నిర్మించిన హరిత హోటల్ మరమ్మతులతో పాటు పిల్లలకు క్రీడా సామగ్రిని ఏర్పాటు చేయనున్నారు. గణపసముద్రం చెరువు కట్ట మీద పర్యాటకుల సౌలభ్యం కోసం గెస్ట్‌హౌజ్‌ల నిర్మాణం, చెరువులో బోటింగ్ ఏర్పాటు, చెరువుకట్టపై ట్యాంక్‌బండ్‌ను తలపించేలా సీసీ రోడ్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. మొత్తానికి గణపురం పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందనుంది.







గణపసముద్రం చెరువు కట్టపై జరుగుతున్న రోడ్డు పనులు



గణపసముద్రం చెరువు

నేరేళ్లలోనే నవోదయ కొనసాగించండి

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే లక్ష్మణ్ విజ్ఞప్తి





సాక్షి, న్యూఢిల్లీ: మంచిర్యాల జిల్లా ధర్మపురి మండలం నేరేళ్ల గ్రామానికి కేటాయించిన నవోదయ పాఠశాలను అక్కడే కొనసాగించాలని పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారిద్దరూ మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి.. నేరేళ్ల గ్రామస్తులకు నవోదయ విద్యాలయం అవసరాన్ని వివరించారు. అనంతరం పార్లమెంట్ ఆవరణలో వంశీకృష్ణ, లక్ష్మణ్‌లు విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర మంత్రితో భేటీ అయ్యామని తెలిపారు. ఇటీవల ధర్మపురి మండలం నేరేళ్ల గ్రామానికి కేంద్రం నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేసిందని తెలిపారు. అయితే.. దీన్ని వేరే ప్రాంతానికి తరలించే ఏర్పాట్లు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిన విషయాన్ని కేంద్ర మంత్రికి తెలిపామన్నారు. తమ విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వంశీకృష్ణ, లక్ష్మణ్‌లు తెలిపారు.

హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయండి

హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

పార్లమెంట్ ప్రశ్నోత్తరాలు

సికిల్ సెల్ వ్యాధి నివారణకు చర్యలు చేపట్టండి

ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ రఘురాంరెడ్డి డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని పలు జిల్లాల్లో తీవ్రమవుతున్న సికిల్ సెల్ వ్యాధి (ఎస్‌సీడీ) నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ రఘురాంరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఖమ్మం, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, వరంగల్ జిల్లాల్లోని ఆదివాసీ గూడేల్లో ఈ వ్యాధి ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. ఈ వ్యాధి నివారణ కోసం సూక్ష్మ పరిశీలన, ముందస్తు రోగ నిర్ధారణ, ఆరోగ్య సంరక్షణ చర్యలు తక్షణమే అవసరమన్నారు.

మెట్రిక్ టన్నుకు రూ.1,500 చెల్లిస్తున్నాం

బయోగ్యాస్ (పేడ, వ్యర్థాలు) ద్వారా గ్యాస్ ఉత్పత్తి అయిన తర్వాత మిగిలే వ్యర్థాలకు మెట్రిక్ టన్నుకు రూ.1,500 రైతులకు అందిస్తున్నామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. భవిష్యత్తులో తాము తీసుకుంటున్న చర్యల ద్వారా ఈ రంగంలో మరిన్ని మంచి ఫలితాలు సాధిస్తామని చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు.. గజేంద్రసింగ్ మౌఖికంగా సమాధానం ఇచ్చారు.

ఎన్ఐఆర్‌డీపీఆర్ భవితవ్యం అనిశ్చితిలో పడింది

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) భవితవ్యం అనిశ్చితిలో పడిందని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ శిక్షణా సంస్థ నిర్మాణానికి కేంద్రం ఆర్థిక సాయాన్ని అందించిందని.. ఆ తర్వాత అర్థంతరంగా నిధులను ఉపసంహరించిందని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు.

ఎన్టీపీసీ నిర్వాసితులను ఆదుకోవాలి

పెద్దపల్లి జిల్లా రామగుండంలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) విస్తరణలో భూములు కోల్పోతున్న వారిని ఆదుకోవాలని పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీ డిమాండ్ చేశారు. ఎన్‌టీపీసీ, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

సంత్ సేవాలాల్ జయంతిని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతిని ప్రతి ఏటా ఫిబ్రవరి 15న ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో అధికారికంగా నిర్వహిస్తున్నారని జీరో అవర్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలో ప్రస్తుతం తెలుగు, తమిళం, కన్నడ, హిందీ సహా మొత్తం 22 భాషలను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో పొందుపరిచారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. గోర్బి, రాజస్తానీ భాషలను 8వ షెడ్యూల్‌లో పొందుపరచాలన్న ప్రతిపాదనలు వచ్చాయని కాంగ్రెస్ ఎంపీ పోరిక బలరాం నాయక్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి బదులిచ్చారు. పెద్దపల్లిలో టెక్స్‌టైల్ ప్రాసెసింగ్, లాజిస్టిక్స్ పరిశ్రమల స్థాపన కోసం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటు ప్రతిపాదన తెలంగాణ ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వానికి అందలేదని కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమాధానమిచ్చారు.

పసుపు ఎగుమతిలో భారత్ అగ్రగామి

ప్రపంచంలో పసుపు ఉత్పత్తి, వినియోగదారు, ఎగుమతిదారుల్లో భారతదేశం అగ్రగామిగా ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. 2023–24లో భారతదేశం 226.58 మిలియన్ యూఎస్‌డీ విలువైన 1,62,018 టన్నుల పసుపును ఎగుమతి చేసిందన్నారు. 2024–25 (ఏప్రిల్–డిసెంబర్)లో ఈరోడ్, నిజామాబాద్‌లోని ప్రధాన మార్కెట్‌లలో పసుపు దేశీయ ధర వరుసగా రూ.136.19/కేజీ, రూ.121.34/కేజీగా ఉంది, ఇది అంతకు ముందు సంవత్సరం ఇదే కాలంలో వచ్చిన ధరతో పోలిస్తే అధికమని బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణలతో పాటు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

తెలంగాణ స్వామిత్వ పథకం అమలు చేయడంలేదు

తెలంగాణ ప్రభుత్వం ‘స్వామిత్వ’ పథకాన్ని అమలు చేయడం లేదని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్ స్పష్టం చేశారు. ఈ పథకంలో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద 2022 ఏప్రిల్ 19న కేవలం ఐదు గ్రామాల్లో మాత్రమే డ్రోన్ సర్వే కోసం సర్వే ఆఫ్ ఇండియాతో తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూ కుదుర్చుకుందని తెలిపారు. నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు.

పంట వ్యర్థాల ఫెర్టిలైజర్ ట్యాంక్!

ఖమ్మం జిల్లా ఆదర్శ రైతు రామారావు ఆవిష్కరణ

- కూరగాయల వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ
- 25 ఎకరాల్లో దిగుబడి పెంచేందుకు వినియోగం..



ఫెర్టిలైజర్ ట్యాంక్ నీటిని అందిస్తూ సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన మిర్చి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: పంట వ్యర్థాలతోనే శక్తిమంతమైన, సహజసిద్ధమైన ఎరువులు తయారుచేస్తున్నారు.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం కోయచెలకకు చెందిన ఆదర్శ రైతు చెరుకూరి రామారావు. రసాయన ఎరువులు వాడకుండా, సేంద్రియ ఎరువులతోనే కొన్నేళ్లుగా వ్యవసాయం చేస్తూ ప్రశంసలు అందుకుంటున్న ఆయన.. మరో ఆవిష్కరణ చేశారు. ఫర్టిలైజర్ ట్యాంక్ నిర్మించి, పంట వ్యర్థాలతో ఎరువులు తయారుచేసిన 25 ఎకరాల భూమిలో పంటలకు అందిస్తున్నాడు.

రూ.40 వేలతో ట్యాంక్ నిర్మాణం

పంటలకు యూరియా, డీఏపీ వాడితే.. వాటితో పాటు ఫార్ములా–4, ఫార్ములా–6, బోరాన్, మెగ్నీషియం వంటివి ప్రత్యేకంగా వాడాల్సి ఉంటుంది. అలా కాకుండా సొంతంగానే సేంద్రియ రసాయనం తయారు చేసేందుకు రామారావు నడుం బిగించాడు. ఇందుకు అవసరమైన ట్యాంక్ నిర్మాణం, మోటార్ల కోసం రూ.40 వేలు వెచ్చించాడు. వంట చేలోని వ్యర్థాలైన దెబ్బతిన్న పచ్చి కూరగాయలు, పండ్లు, గడ్డితో పాటు వానపాములను ఈ ట్యాంకులో వేస్తున్నాడు. మోటార్ ద్వారా వీటన్నింటిని కలగలుపుతుండడంతో త్వరగా కుళ్లిపోతున్నాయి. ఆపై నీటిని మోటారు ద్వారా ఫిల్టర్ చేసి వ్యవసాయ బావిలోకి పంపిస్తున్నారు. అక్కడి నుంచి డ్రిప్ ద్వారా 25 ఎకరాల భూమిలో పిచికారీ చేస్తుండటంతో పంటకు మంచి బలం వస్తోందని చెబుతున్నాడు.

ఆర్గానిక్ మిర్చికి మంచి ధర..

సీతాఫలం తోటలో రామారావు అంతర పంటగా మిర్చి సాగు చేశాడు. ఎకరం పావు విస్తీర్ణంలో సాగు చేస్తున్న ఈ పంటకు కేవలం ఫర్టిలైజర్ ట్యాంక్ నీటిని వినియోగిస్తున్నాడు. రసాయన ఎరువులు వాడితే 15 నుంచి 20 క్వింటాళ్ల మిర్చి దిగుబడి వస్తే.. ఇప్పుడు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందని తెలిపాడు. కానీ ధర మాత్రం కేజీ మిర్చికి రూ.550, క్వింటాల్‌కు రూ.55 వేలు పలుకుతుండడంతో లాభం బాగానే వస్తోందని తెలిపాడు. హైదరాబాద్‌కు చెందిన జేపీ ఆర్గానిక్స్, వారాహి ఫామ్స్ సంస్థలు తన పంటను కొనుగోలు చేస్తున్నాయని రామారావు వెల్లడించారు.



పంట వ్యర్థాల ఫెర్టిలైజర్ ట్యాంక్ వద్ద రైతు రామారావు



మూలాల్లోకి పోదాం..

వైదిక జీవన విధానంతో ప్రశాంత జీవనం గడపవచ్చని చెబుతూ ఆధునిక హంగులకు దూరంగా జీవిస్తుంటారు శ్రీకాకుళం జిల్లాలోని కూర్మ గ్రామవాసులు. వాహనాల వినియోగాన్ని వదిలి గుర్రపు బండిపై వారు శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా వీరిని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



ఆహ్లాదం.. ఆమార్గం

విశాఖ నుంచి భీమిలి వెళ్లే మార్గంలో రోడ్డు మధ్యన నాటిన పూలమొక్కలు విరబూశాయి. ఒక వైపు నీలిసాగరం, మరోవైపు పూల సోయగంతో ఆమార్గంలో వెళ్లేవారు అనిర్వచనీయమైన అనుభూతి పొందుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



వారోత్సవాలు వారికే..

ఒకవైపు పోలీసులు రహదారి భద్రతా వారోత్సవాల పేరుతో ప్లకార్డులతో అవగాహన కల్పిస్తుంటే మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా హెల్మెట్ లేకుండా వాహనదారులు వారి ముందునుంచే వెళ్లిపోతున్నారు. విశాఖపట్నంలో మంగళవారం ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా...

నులిపురుగుల మాత్రలు మింగిన చిన్నారి మృతి



చిన్నారి రేష్మిత

రంపచోడవరం: నులిపురుగుల నివారణ కోసం వేసే ఆల్బెండజోల్ మాత్రల కారణంగా అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం తాడేపల్లి గ్రామానికి చెందిన కత్తుల వెంకటరెడ్డి, సుబ్బలక్ష్మి దంపతుల కుమార్తె రేష్మిత (5) మృతి చెందింది. తాడేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారి భోజనం చేసిన వెంటనే ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. దీంతో ఒక్కసారిగా వాంతులు చేసుకుంది. వెంటనే రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు. చిన్నారి మృతికి సంబంధించి రంపచోడవరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.శేషిరెడ్డి మాట్లాడుతూ భోజనం చేసిన వెంటనే నులిపురుగుల మాత్రలు ఇవ్వడంతో ఒక్కసారిగా వికారం పుట్టి వాంతులు వచ్చి ఉంటాయన్నారు. వాంతులు చేసుకునే సమయంలో ఊపిరితిత్తుల్లోకి అన్నం మెతుకులు వెళ్లడంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు భావిస్తున్నామని చెప్పారు. నులిపురుగుల మాత్రలు వికటించడం వలన మృతి చెందలేదన్నారు. అయితే నులిపురుగుల మాత్రలు సరైన పద్ధతిలో వేయకపోవడం వలనే చిన్నారి మృతి చెందిందని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఇందుకు కారణమైన అంగన్‌వాడీ సూపర్‌వైజర్, ఆశా వర్కర్, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్, ఫార్మసిస్టులను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.

బాలికలకు 'స్వీయ రక్షణ'పై శిక్షణ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ యాజమాన్యంలోని అన్ని పాఠశాలల్లోను 6–12 తరగతుల విద్యార్థినులకు ‘రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్ష ప్రశిక్షణ్’ కార్యక్రమంలో భాగంగా సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆత్మరక్షణ శిక్షణ ఇచ్చే అర్హత గల ఏజెన్సీల ఎంపికకు నోటిఫికేషన్ జారీ చేయాలని జిల్లా విద్యా అధికారులు, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్లను ఆదేశించారు. ఏజెన్సీల ఎంపిక మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని, అందుకు విరుద్ధంగా ఎంపిక చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలకు స్వీయ–రక్షణ, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యమని, అందుకు అనుగుణంగా మార్షల్ ఆర్ట్స్‌లో అనుభవం ఉన్న ఏజెన్సీలను ఎంపిక చేయాలని సూచించారు.

మూడో దశ మెడికల్ పీజీ సీట్ల కేటాయింపు


సాక్షి, అమరావతి: 2024–25 విద్యా సంవత్సరానికి మెడికల్ పీజీ కోర్సుల్లో మూడో దశ కౌన్సెలింగ్‌లో భాగంగా ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం సీట్లను కేటాయించింది. సీట్లు పొందిన అభ్యర్థులు శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల్లోగా కళాశాలల్లో చేరాలని ఆదేశించింది. గత డిసెంబర్ 20వ తేదీ నుంచే తరగతులు ప్రారంభమైనట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

18 నుంచి పాఠశాలల్లో భాషోత్సవాలు

సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో లాంగ్వేజ్ ఫెస్టివల్స్ నిర్వహించాలని ఆదేశించింది. ఇందులో భాగంగా ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు కార్యక్రమాల నిర్వహణా మార్గదర్శకాలు జారీ చేసింది. 18న ఇంగ్లిష్, 19న సంస్కృతం, హిందీ, ఉర్దూ, 20న గిరిజన భాషలు, కన్నడ, తమిళం, ఒరియా, 21న తెలుగు భాషోత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చదవడం, రాయడం, కథలు చెప్పడం, చర్చలు, క్విజ్, రైమ్స్, గజల్స్ వంటి అంశాలపై పోటీలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, లాంగ్వేజ్ ఫెస్టివల్స్‌తో పాటు పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు.

మున్సిపల్‌శాఖ చీఫ్ విజిలెన్స్ అధికారిగా మురళీకృష్ణ

సాక్షి, అమరావతి: పురపాలక, పట్టణాభివృద్ధిశాఖలోని విజిలెన్స్ కమిషన్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి యు.మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.



గణాంకాలు ఇలా...

- చేతి మగ్గాలు : 28 వేలు
- పట్టుచీరల దుకాణాలు : 2వేలు
- మగ్గాలపై ఆధారపడ్డ కుటుంబాలు : 30 వేలు
- మగ్గాల ద్వారా లబ్ధి పొందుతున్న వారు : లక్ష మంది
- అనుబంధ రంగాల ద్వారా : మరో 20 వేల మందికి ఉపాధి
- రోజుకు పట్టుమార్కెట్ సగటు టర్నోవర్ : రూ.7 కోట్లు
- శుభకార్యాల సీజన్‌లో వారంలో పట్టుచీరల లావాదేవీలు : రూ.100 కోట్లు

పట్టు చీరల వనం.. ధర్మవరం

చేతి మగ్గాల పైనే అద్భుతమైన చీరలు

- శ్రీసత్యసాయి జిల్లాకు కీర్తి కిరీటం చేనేత
- 28 వేల మగ్గాలతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం
- వారంలో రూ.100 కోట్ల వరకు పట్టుచీరల వ్యాపారం
- ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాలకు పట్టుచీరల ఎగుమతులు
- ధర్మవరం పట్టుచీరకు భౌగోళిక గుర్తింపునిచ్చిన భారత ప్రభుత్వం

సాక్షి, పుట్టపర్తి

మగువలు మెచ్చే పట్టు చీరలు.. వివాహం కోసం ప్రత్యేకంగా చీరలు, ఫంక్షన్లలో స్పెషల్ లుక్కుతో ఆకట్టుకునే డిజైన్లు తయారీలో ధర్మవరం నేతన్నలు ఆరితేరిపోయారు. తరతరాలుగా మగ్గాల పైనే తమ నైపుణ్యాన్ని రంగరించి రకరకాల పట్టుచీరలు తయారు చేస్తున్నారు. సింగిల్ త్రెడ్, డబుల్ త్రెడ్, వెండి జరీ, బంగారు జరీ చీరలు, జాకాడీ డిజైన్లతో అత్యద్భుతంగా నేసి వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. ధర్మవరంలో తయారయ్యే పట్టుచీరలు హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, చెన్నైతో పాటు విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయి. రాష్ట్రంలో 28 వేల మగ్గాలు ఉన్న ఏకైక ప్రాంతంగా ధర్మవరం పట్టణం ప్రథమ స్థానంలో నిలుస్తోంది. ఇక్కడి పట్టు మార్కెట్‌లో సగటున వారానికి రూ.100 కోట్ల వరకు పట్టుచీరల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. ధర్మవరం పట్టణ విశిష్టతను గుర్తించి భారత ప్రభుత్వం ధర్మవరం పట్టుచీరకు భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఇండికేషన్)ను ఇవ్వడం నేతన్నల ప్రతిభకు గర్వ కారణంగా చెప్పవచ్చు. శ్రీసత్యసాయి జిల్లాలో ధర్మవరంతో పాటు కొత్తచెరువు, గోరంట్ల, బుక్కపట్నం, సోమందేపల్లి, పెనుకొండ, హిందూపురం ప్రాంతాల్లోనూ మగ్గాలు ఉన్నాయి. ధర్మవరంలో మగ్గాలతో పాటు 18 చేనేత అనుబంధ రంగాల ద్వారా సుమారు లక్ష మంది ఉపాధి పొందుతున్నారు.

ఫ్యాషన్ ప్రపంచానికి దీటుగా డిజైన్లు

మారుతున్న ఫ్యాషన్ ప్రపంచానికి దీటుగా ధర్మవరంలోని డిజైనర్లు ఎప్పటికప్పుడు కొత్తరకాల డిజైన్లు రూపొందిస్తున్నారు. ధర్మవరంలో పట్టుచీరల డిజైన్లు రూపొందించడంలో సుమారు వందమంది మంచి నైపుణ్యం సంపాదించారు. వివాహాలు, ఇతర శుభకార్యాల దగ్గర నుంచి సినీ మోడళ్లు, సెలబ్రిటీల వరకు వినూత్న డిజైన్‌లను తయారు చేస్తున్నారు. ఒక్కో పట్టు చీర రూ.5 వేల నుంచి రూ.10 లక్షల వరకు ధర ఉంటుంది. బంగారం తాపడంతో పట్టుచీరలు తయారు చేయడం ధర్మవరం నేతన్నల ప్రత్యేకం.





విదేశాలకు ఎగుమతులు

ధర్మవరంలో తయారైన పట్టుచీరలు ఇతర రాష్ట్రాలతో పాటు అమెరికా, సౌదీ అరేబియా, న్యూజిలాండ్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. రాష్ట్రంలో తయారైన పట్టు చీరలకు ధర్మవరం పట్టుమార్కెట్ ప్రధానం. ధర్మవరం పట్టణంలో సుమారు రెండు వేల పట్టుచీరల దుకాణాలు ఉన్నాయి. ఈ సిల్క్ షాపుల ద్వారా నేతన్నల వద్ద పట్టుచీరలను కొనుగోలు చేసి, ఆపై షోరూంలకు హోల్‌సేల్‌గా ఎగుమతి చేస్తారు.

వారానికి రూ.వంద కోట్ల వ్యాపారం

సగటున ధర్మవరం నేసేపేటలోని మార్కెట్‌లో వారానికి రూ.100కోట్ల వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతాయని అంచనా. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ధర్మవరం పట్టణాన్ని, చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని నేతన్నలు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆదరణ కరువైందని.. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏటా నేతన్న నేస్తం పథకం కింద ఏటా రూ.24వేల లబ్ధి చేకూరేదని వివరించారు.

ధర్మవరం పట్టుచీరకు భౌగోళిక గుర్తింపు

ధర్మవరం నేతన్న ప్రతిభను గుర్తించిన భారత ప్రభుత్వం గత 2014లో ధర్మవరం పట్టుచీరలు, పావుడాలకు భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఇండికేషన్) ఇచ్చింది. దీని ద్వారా ధర్మవరం పట్టుచీర డిజైన్‌లు ఎక్కడా తయారు చేయకూడదు. ఒక వేళ ఇతరప్రాంతాల్లో ధర్మవరం నేతన్నల డిజైన్‌లు నేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

విమానాశ్రయం వస్తే బాగుంటుంది



శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు తర్వాత ధర్మవరంలో చేనేత రంగం మరింత వృద్ధి చెందింది. అయితే పుట్టపర్తిలో విమానాశ్రయం ఆధునీకరించి.. ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తే.. వివిధ దేశాలకు పట్టుచీరల ఎగుమతులు సులభమవుతాయి. మన దేశ పట్టును ప్రపంచ స్థాయికి తీసుకెళ్లవచ్చు. ఫలితంగా వ్యాపారం మరింత ఊపందుకుంటుంది.
– రంగన శ్రీనివాసులు, పట్టుచీరల వ్యాపారి, ధర్మవరం

ఆధునిక ఫ్యాషన్‌కు అనుగుణంగా డిజైన్‌లు



ప్రస్తుత ఫ్యాషన్ పోటీ ప్రపంచంలో మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త డిజైన్‌లు ఎప్పటికప్పుడు రూపొందిస్తున్నాం. మేము తయారు చేసే చీరలు దేశంలోని ఇతర రాష్ట్రాలకే కాక, ఎక్కువగా అమెరికా, సౌదీ దేశాలకు పంపుతుంటాం. పట్టుచీరల్లో నేను తయారు చేసిన డిజైన్‌లకు రాష్ట్ర స్థాయిలో రెండు, జాతీయ స్థాయిలో ఒక అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది.
– నాగరాజు, క్లస్టర్ డిజైనర్, ధర్మవరం

ఆ గంట.. కీలకమంట!

- సైబర్ క్రైం జరిగినప్పుడు గోల్డెన్ అవర్ అత్యంత కీలకమంటున్న నిపుణులు
- ఆ సమయంలో ఫిర్యాదు చేస్తే త్వరగా రికవరీ జరిగే ఛాన్స్
- సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకూ వీలు
- ఆలస్యం చేస్తే ఇతర రాష్ట్రాలకు, క్రిప్టో కరెన్సీగా మారే అవకాశం

పట్నంబజారు: అత్యవసర పరిస్థితుల్లో ఎంతో అవసరమైన సమయంలో మనం వాడే పదం గోల్డెన్ అవర్. ఇప్పటివరకు రోడ్డు ప్రమాదాలు సంభవించేటప్పుడు మాత్రమే ఈ పదం విని ఉంటారు. ప్రమాదాలు సంభవించిన గంటలోపే క్షతగాత్రులను ఆస్పత్రికి చేర్చడం దీని ఉద్దేశం. ఇదే తరహాలో సైబర్ మోసాలకు గురయ్యే బాధితులు సైతం నేరం జరిగిన గంటలోగా ఫిర్యాదు చేయగలిగితే.. ఖాతాలో పోగొట్టుకున్న సొమ్మును తిరిగి రాబట్టుకునే వీలుంటుంది. బాధితులు చేయాల్సిందల్లా గోల్డెన్ అవర్లో సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయటమే. జిల్లాలో ఇప్పటివరకు వందల సంఖ్యలో సైబర్ నేరాలు నమోదు అయ్యాయని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. తాము మోసానికి గురయ్యామని ఎన్‌సీఆర్‌బీకి ఫిర్యాదు చేయటం ద్వారా, లేదా 1930 సైబర్ సెల్ నంబరు డయల్ చేసి ఫిర్యాదు ఇవ్వడం వలన ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయలు వెనక్కి తీసుకువచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

ఫిర్యాదు చేయాలిలా..



- మోసపోయామని తెలుసుకున్న వెంటనే బాధితులు 1930 నంబర్‌కు కాల్ చేయాలి.
- లేదంటే https:// cybercrime. gov. in అనే పోర్టల్‌పై క్లిక్ చేయాలి. హోం పేజీలోకి వెళ్లి ఫైల్ ఎ కంప్లైంట్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే అక్కడ కొన్ని నియమాలు, షరతులు చూపిస్తుంది. వాటిని చదివి యాక్సెప్ట్ చేసి రిపోర్ట్ అదర్ సైబర్ క్రైమ్ బటన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత సిటిజన్ లాగిన్ ఆప్షన్ సెలెక్ట్ చేసి పేరు, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ వంటి వివరాలు ఎంటర్ చేస్తే రిజిస్టర్ మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేసి క్యాప్చా కోడ్‌ను బాక్స్‌లో ఫిల్ చేసి సబ్మిట్ బటన్ నొక్కాలి. తర్వాత పేజీలోకి తీసుకెళ్తుంది. అసలు ప్రక్రియ మొదలయ్యేది ఇక్కడే.
- ఈ పేజీలో ఒక ఫామ్ కనిపిస్తుంది.. దానిలో జరిగిన సైబర్ మోసం గురించి క్లుప్తంగా రాయాలి. అక్కడ నాలుగు సెక్షన్లుగా విభజించి ఉంటుంది. సాధారణ సమాచారం (విక్టిమ్ ఇన్ఫర్మేషన్), సైబర్ నేరానికి సంబంధించి సమాచారం (సైబర్ క్రైమ్ ఇన్ఫర్మేషన్), ప్రివ్యూ అనే సెక్షన్‌లు ఉంటాయి. ప్రతి సెక్షన్‌లో అడిగిన వివరాలను సమర్పిస్తూ.. ప్రక్రియను పూర్తిచేయాలి. మూడు సెక్షన్లు పూర్తయ్యాక ప్రివ్యూను వెరిఫై చేయాలి. అన్ని వివరాలు సరిగా ఉన్నాయని భావిస్తే సబ్మిట్ బటన్ క్లిక్ చేయాలి. తర్వాత ఘటన ఎలా జరిగిందనేది వివరాలు నమోదుచేయాలి. నేరానికి సంబంధించిన స్క్రీన్ షాట్లు (అకౌంట్ ట్రాన్సాక్షన్ తదితర) ఫైల్స్ వంటి ఆధారాలు, సాక్ష్యాలు అందులో పొందుపర్చాలి. వివరాలు సేవ్ చేసి నేరగాళ్ల గురించి ఏదైనా సమాచారం తెలిస్తే ఫిల్ చేయాలి.
- అంతా వెరిఫై చేసుకున్నాక సబ్మిట్ బటన్ క్లిక్ చేస్తే కన్ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది. కంప్లైంట్ ఐడీతో పాటు ఇతర వివరాలతో కూడిన ఈ–మెయిల్ వస్తుంది. తర్వాత అధికారులు దర్యాప్తు ప్రారంభిస్తారు. ఫిర్యాదు చేయడం ఆలస్యమైతే దుండగుడు డబ్బును వేర్వేరు ఖాతాల్లో మళ్లించేస్తాడు. లేదంటే క్రిప్టో కరెన్సీగా మార్చుకునే ప్రమాదముంది. సైబర్ మోసానికి గురైతే 1930 నంబర్‌కు కాల్ చేయాలి.

వెంటనే ఫిర్యాదు చేయండి..



సైబర్ మోసానికి గురయ్యేవారు వెంటనే గుర్తించాలి. తక్షణం ఫిర్యాదు చేస్తే మన డబ్బులు వెనక్కి వచ్చే అవకాశాలెక్కువ. లేదంటే ఎక్కడ ఉంటారో.. వారి ఖాతాలు ఏ రాష్ట్రానికి చెందినవో.. ఇవన్నీ కనుక్కోవడం పెద్ద ప్రక్రియ అవుతుంది. డయల్ 1930కు గానీ, ఎన్‌సీఆర్‌బీ గానీ ఫిర్యాదు చేసి బ్యాంకు వాళ్లను, దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలి. తద్వారా బాధితుడికి న్యాయం చేసే అవకాశం ఉంటుంది. – ఎస్.సతీష్‌కుమార్, ఎస్పీ, గుంటూరు జిల్లా

విద్యుత్ షాక్‌తో తల్లి, కుమారుడు మృతి

- పంట పొలానికి నీరెట్టేందుకు వెళ్లి మృత్యువాత
- వైఎస్సార్ జిల్లాలో ఘటన



గురమ్మ (ఫైల్)



జయసుబ్బారెడ్డి (ఫైల్)

బి.కోడూరు: పొలంలోని పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన తల్లీ, కుమారుడు విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడిన విషాదఘటన వైఎస్సార్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బి.కోడూరు మండలంలోని గుంతపల్లె గ్రామానికి చెందిన కూరాకు గురమ్మ (60), ఆమె కుమారుడు కూరాకు జయసుబ్బారెడ్డి (48) సజ్జ పంటకు నీరందించేందుకు మంగళవారం పొలానికి వెళ్లారు. తల్లి గురమ్మ పొలానికి మడవ కడుతుండగా కుమారుడు జయసుబ్బారెడ్డి మోటారులో నీరు సరిగా రావడం లేదని, అక్కడ మోటారుకు సంబంధించిన పైపునకు అడ్డుగా ఉన్న చెత్త తొలగించేందుకు తెలుగుగంగ కాలువ నీటిలోకి దిగాడు. చెత్త తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలోకి విద్యుత్ సరఫరా కావడంతో జయసుబ్బారెడ్డి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. ఎంత సేపటికీ కుమారుడు రాకపోవడంతో గురమ్మ వెళ్లి చూడగా జయసుబ్బారెడ్డి కాలువలో పడి ఉన్నాడు. ఏమైందో ఏమోనని కుమారుడిని ముట్టుకోవడంతో ఆమె కూడా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. అటుగా వెళుతున్న తోటి రైతులు గమనించి విషయాన్ని బంధువులకు తెలియజేయగా వారు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. బద్వేలు రూరల్ సీఐ నాగభూషణ్, ఎస్ఐ కె.సి.రాజు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటికి తీయించారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న తల్లి, కుమారుడు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు జయసుబ్బారెడ్డికి భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు విషయం తెలుపగా స్పందించిన ఆయన విద్యుత్‌శాఖ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున రూ.10 లక్షలు పరిహారం చెక్కును కుటుంబసభ్యులకు అందజేశారు.

తులసిబాబు బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

14న నిర్ణయం వెలువరిస్తామన్న హైకోర్టు

సాక్షి, అమరావతి: అప్పటి ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు గుంటూరు నగరంపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో అరెస్టయిన తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అనుచరుడు కామేపల్లి తులసిబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న హైకోర్టు ఈ నెల 14న తీర్పు వెలువరిస్తామంది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. అంతకుముందు తులసిబాబు తరపున సీనియర్ న్యాయవాది కె.శ్రీనివాసమూర్తి వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో మొదటి, రెండో నిందితులుగా ఉన్న పోలీసు అధికారులకు ఇప్పటివరకు కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదని చెప్పారు. సాక్షులను ప్రభావితం చేసేంత శక్తి, సామర్థ్యాలు తులసిబాబుకు లేవన్నారు. ఏ షరతులు విధించినా కట్టుబడి ఉంటామని చెప్పారు. బెయిల్ మంజూరు చేయాలని కోరారు. పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. రఘురామకృష్ణరాజును హింసించిన వ్యవహారంలో తులసిబాబుకు పాత్ర ఉందన్నారు. ఈ విషయాన్ని ఆయన స్నేహితులే వాంగ్మూలంలో చెప్పారని తెలిపారు. తులసిబాబు 2020లో సీఐడీ లీగల్ అడ్వైజర్‌గా వ్యవహరించారని, ఆ సమయానికి అతడు న్యాయవాది కూడా కాదని చెప్పారు. 2021లో ఆయన న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారన్నారు. లీగల్ అడ్వైజర్‌గా ఆయనకు రూ.48 లక్షల ఫీజు కూడా చెల్లించారని తెలిపారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ పిటిషన్‌ను కొట్టేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ ఈ నెల 14న నిర్ణయం వెలువరిస్తానని చెప్పారు.

ఏపీ విద్యా వ్యవస్థ దేశానికే ఆదర్శం

పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్‌రామరాజు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థను దేశంలోనే ఓ మోడల్‌గా తీర్చిదిద్దుదామని పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్‌రామరాజు అన్నారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో ప్రారంభమైన జిల్లాల సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్లు (ఏపీసీ), సెక్టోరియల్ అధికారుల సదస్సులో ఆయన మాట్లాడారు. అధికారులు, సహోద్యోగులు ఏకతాటిపై పనిచేస్తే విద్యా వ్యవస్థను బలోపేతం చేయవచ్చన్నారు. టీచర్ల సీనియార్టీ జాబితా సిద్ధం చేసి మూడు విడతల్లో ప్రదర్శిస్తామని, అభ్యంతరాలు పరిష్కరించాక ఆన్‌లైన్‌లో పదోన్నతుల ప్రక్రియ చేపడతామని చెప్పారు. సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పునాది దశ నుంచే అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు విద్యాశాఖ, సమగ్ర శిక్షాలోని ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని చెప్పారు. ఏపీసీలు నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని సమగ్ర విద్య అందించడంతో పాటు, కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయాలని సూచించారు. సీమ్యాట్ డైరెక్టర్ వి.ఎన్.మస్తానయ్య, సమగ్ర శిక్షా ఏఎస్పీడీలు ప్రసన్నకుమార్, కె.రవీంద్రనాథ్‌రెడ్డి, కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి, శామో అడిషనల్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.





అరవై రోజుల అద్భుతం నవార!

నవార.. కేరళకు చెందిన ఓ అపురూపమైన పాత పంట.
2 వేల ఏళ్ల క్రితం నుంచే సాగులో ఉన్న
అద్భుతమైన ఔషధ విలువలున్న ధాన్యపు పంట.
ఆయుర్వేదంలోనూ ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్న
విశిష్ట వంగడం నవార.
ఆహారంగా, ఔషధంగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.
అందువల్లనే ఇది ఔషధ పంటగా
అంతర్జాతీయంగానూ ప్రాచుర్యం పొందింది.

60 రోజుల పంట

దక్షిణ భారత దేశంలో, ముఖ్యంగా కేరళ, పురాతన వ్యవసాయ వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుంది నవార. ఇది స్వల్పకాలిక పంట. విత్తిన 60 రోజుల్లోనే ధాన్యం చేతికొస్తుంది. అందుకే దీనికి 'షష్టిక శాలి' అనే పేరు వచ్చింది. నవార బియ్యం ఎరుపు + నలుపు రంగుల కలగలుపుతో విలక్షణంగా కనిపిస్తుంది. చర్మం, ఎముకలు, కండరాలు, జీర్ణకోశం ఆరోగ్యం కోసం ఉపయోగపడుతుందని కేరళలోని వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధకులు చెబుతున్నారు.

జిఐ గుర్తింపు

జన్యుపరంగా విశిష్ట గుణాలు కలిగి ఉన్నందున 2008లో నవార వంగడానికి కేంద్ర ప్రభుత్వం జాగ్రఫికల్ ఇండికేషన్ (జిఐ) గుర్తింపునిచ్చింది. ఈ గుర్తింపు పొందిన నవార వంగడాలు రెండు. నలుపు జీరతో ఉండే ఎర్ర బియ్యపు రకం ఒకటి. లేత బంగారు రంగు జీరతో ఉండే ఎర్ర బియ్యపు రకం రెండోది. కేరళలోని కరుకమనికళంలో గల నవార రైస్ ఫార్మర్స్ సొసైటీ ఈ రెండు వంగడాలకు జిఐ గుర్తింపును పొందింది. ఈ రెండు రకాల నవార బియ్యానికి సహజమైన తీపి రుచి ఉంటుంది. సులువుగా జీర్ణమవుతాయి. అందువల్ల అన్ని వయసుల వారూ తినటానికి అనువుగా ఉంటాయి. సాధారణంగా నవార బియ్యాన్ని పిండి పట్టించి పాలలో కలుపుకొని తాగుతారు. దీనికి ఆరోగ్య ప్రయోజనాలతో పాటు ఆధ్యాత్మిక ప్రాధాన్యం కూడా ఉంది. ఆలయ క్రతువుల్లోనూ వాడుతారు.

9.5% మాంసకృత్తులు..

నవార బియ్యం పోషకాల గని. 73% పిండి పదార్థం, 9.5% మాంసకృత్తులు, 2.5% కొవ్వు, 389 కేలరీల శక్తి ఉంటాయి. అంతేకాదు, చక్కని పీచు పదార్థానికి, యాంటీఆక్సిడెంట్లతో పాటు జింక్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మపోషకాలకు నిలయం. ఈ పోషకాలు కలిగి ఉన్నందునే ఆరోగ్యప్రదాయినిగా ప్రఖ్యాతిపొందింది.

ఆయుర్వేదంలో నవార

ఆయుర్వేద పంచకర్మ చికిత్సల్లో నవార బియ్యానికి అత్యంత అధిక ప్రాధాన్యం ఉంది. రక్తప్రసరణ, శ్వాసకోశ, జీర్ణవ్యవస్థలను మెరుగుపరచటంలో నవార పాత్ర ఎంతో ఉందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

కీళ్లనొప్పులు, కండరాల క్షీణత, కొన్ని రకాల చర్మ సమస్యలకు చేసే ఆయుర్వేద చికిత్సల్లో ఈ బియ్యాన్ని వాడుతున్నారు. నవార బియ్యంతో పాటు తౌడు, నూక, ఊక, గడ్డిని కూడా ఔషధ విలువలతో కూడిన ఆహారోత్పత్తుల తయారీలో పరిశ్రమదారులు ఉపయోగిస్తున్నారు. నవార తౌడు, ఊకలో పుష్కలంగా ఉండే డైటరీ ఫైబర్ ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

నవార సాగులో సవాళ్లు

నవార వంటి పాత పంటల సాగులో సంప్రదాయ సేంద్రియ వ్యవసాయ పద్ధతులనే కేరళలో రైతులు అనుసరిస్తున్నారు. ప్రకృతి వనరులతో కూడిన ఎరువులు, కషాయాలు వాడుతూ వ్యవసాయం వల్ల పర్యావరణానికి హాని కలగకుండా చూస్తున్నారు. పొలాల్లో పర్యావరణ సమతుల్యానికి మిత్ర పురుగుల పాత్ర కీలకం. వాటిని రక్షించుకోవటం కోసం కషాయాలను మాత్రమే వాడుతున్నారు. పచ్చిరొట్ట ఎరువులు, వర్మీ కంపోస్టు, పశువుల పేడ, పంచగవ్యలను రసాయనిక ఎరువులకు బదులు వాడుతున్నారు. బలమైన గాలులు, భారీ వర్షాలను నవార వరి పంట అంతగా తట్టుకోలేదు, పడిపోయే గుణం ఉంది. తీవ్రమైన మంచుతో కూడా ఇబ్బంది పడే సున్నితమైన పంట ఇది. చలిని తట్టుకోలేదు. కాండం అడుగునే వంగి పడిపోతుంది. కాబట్టి శీతాకాలంలో దీన్ని సాగు చేయకూడదు. ఈ కారణాల వల్ల నవార పంటకాలం 60 రోజులే అయినప్పటికీ ఏడాదికి కేవలం ఒకే పంట సాగు అవుతోంది. నవార వరి పంటను మనుషులతోనే కోయించాలి. కూలీల కొరతతో పాటు అధిక ఖర్చుతో కూడిన పని కావటం వల్ల రైతులకు ఇది కూడా పెద్ద సమస్యే అవుతోంది.

నిజంగా బంగారమే!

నవార ధాన్యం దిగుబడి కూడా ఎకరానికి 300 కిలోలు మాత్రమే. ఇతర వరి రకాలతో పోల్చితే చాలా తక్కువ. అయినా, దీనికి ఉన్న ప్రత్యేక ఔషధ గుణాల కోసం ఎక్కువ ధర పెట్టి ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. ధర అధికంగా ఉన్నప్పటికీ నవార బియ్యానికి డిమాండ్ పెరుగుతూనే ఉంది. రైతులకూ మంచి ఆదాయాన్ని సమకూర్చుతోంది. నవారకున్న అరుదైన ఔషధగుణాల వల్ల 'బంగారం' అని కూడా పేరొచ్చింది. నవార బియ్యాన్ని మీ కుటుంబం ఆహారంగా తీసుకుంటే ఎన్నెన్నో ఆరోగ్యప్రయోజనాలు చేకూరుతాయి. 2 వేల సంవత్సరాల ఘన చరిత్ర గల అద్భుత వంగడాన్ని పరిరక్షించుకున్నట్లు కూడా అవుతుంది.




షుగర్ నియంత్రణ... నవార బియ్యం గ్లైసెమిక్ ఇండెక్స్ తెల్ల బియ్యంతో పోల్చితే తక్కువగా ఉంటుంది. అంటే.. గ్లూకోజ్‌ను రక్తంలోకి తెల్ల బియ్యం మాదిరిగా ఒకేసారి కాకుండా నెమ్మది నెమ్మదిగా విడుదల చేస్తుంది. ఇన్సులిన్ స్థాయిని స్థిరంగా ఉంచుతుంది కాబట్టి షుగర్ వ్యాధిగ్రస్తులకు ఇది అనువైన మూలాహారం అయ్యింది. ఇందులోని పీచు వల్ల ఆరోగ్య రక్షణకు దోహదం చేస్తుంది.


ఎముక పుష్టి... కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్ వంటి సూక్ష్మ పోషకాలతో కూడి ఉంటుంది కాబట్టి నవార బియ్యం తిన్న వారికి ఎముక పుష్టి కలుగుతుంది. రెగ్యులర్‌గా తినే వారికి ఎముకలు గుల్లబారటం వంటి సమస్య రాదు. బ్లడ్ క్లాట్ కావటం, మజిల్ కంట్రాక్షన్ వంటి సమస్యలను అధిగమించడానికీ ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

చర్మ సౌందర్యం... యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల ఫ్రీ రాడికల్స్‌ను అరికట్టి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి నవార ఆహారం దోహదం చేస్తుంది. ముడతలను పోగొట్టడానికి, చర్మంలో మెరుపును పెంపొందించటానికి దోహదం చేస్తుంది. నవార బియ్యపు పిండిని పాలలో లేదా నీటిలో కలిపి ముఖవర్చస్సు మెరుగవడానికి, మచ్చలు పోవటానికి లేపనంగా వాడుతూ ఉంటారు. నవార బియ్యంలోని మెగ్నీషియం కండరాలను, నరాలను ఆరోగ్యవంతంగా ఉంచటానికి.. మొత్తంగా నాడీ వ్యవస్థను, కండరాల వ్యవస్థను ఆరోగ్యకరంగా ఉండటానికి ఉపయోడపడుతుంది.

గుండెకు మేలు... నవార బియ్యంలోని అధిక పీచు పదార్థం కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి, రక్తనాళాల్లో పూడికను నివారించడానికి తద్వారా గుండెపోటు ముప్పును తగ్గించడానికి ఉపయోగపడుతుంది. విటమిన్ సి ఉండటం వల్ల కణజాలానికి మరమ్మతు చేస్తే తెల్ల రక్త కణాల ఉత్పత్తికి దోహదపడటం ద్వారా నవార రోగనిరోధక శక్తిని ఇనుమడింపజేస్తుంది.



ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ... ఇందులోని అధిక పీచుపదార్థం మలబద్ధకాన్ని నివారిస్తుంది. పొట్టలోని సూక్ష్మజీవరాశిని పెంపొందించడం ద్వారా జీర్ణశక్తిని పెంపొందించి, పోషకాల మెరుగైన శోషణకు, మొత్తంగా జీర్ణ వ్యవస్థ మెరుగుదలకు దోహదం చేస్తుంది.



శిశు ఆహారం... కేరళలో నవార బియ్యాన్ని శిశువులకు ఆహారంగా పెడుతుంటారు. నవార పిండి, అరటి పండు ఒరుగులతో కలిపి తయారు చేసే 'అంగ్రి' అనే వంటకాన్ని పిల్లలకు తినిపించటం కేరళవాసులకు అనాదిగా అలవాటు. డబ్బాల్లో అమ్మే ప్రాసెస్డ్ ఆహారం కన్నా ఇది పిల్లలకు చాలా సహజమైన, బలవర్ధకమైన ఆహారం. పిల్లలు తగినంత బరువు పెరగడానికి దోహదపడుతుంది.

కేన్సర్ నిరోధకం... నవార బియ్యంలో ప్రోయాంథోశ్యానిడిన్స్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. డిఎన్ఎకి నష్టం కలగకుండా నివారించడటం, హానికారక ఫ్రీ రాడికల్స్‌ను నిర్వీర్యం చేయటం ద్వారా కేన్సర్ ముప్పును తగ్గించడానికి నవార బియ్యం ఉపకరిస్తాయని పరిశోధకులు చెబుతున్నారు.

రక్తహీనతకు చెక్... నవార బియ్యంలో పుష్కలంగా ఐరన్ ఉండటం వల్ల రక్తహీనతను నివారించగలదు. నిస్సత్తువ, శ్వాసలో ఇబ్బంది వంటి సమస్యలను రూపుమాపగలదు.

గర్భవతులకు ఈ బియ్యం ఉపయుక్తమైనవి. పీచు, ప్రొటీన్, కాల్షియం, ఐరన్ వంటి సూక్ష్మపోషకాలు గర్భవతుల ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయి. గర్భవతులు సాధారణంగా ఎదుర్కొనే మలబద్ధకం వంటి సమస్యలను పరిష్కరించటంతో పాటు గర్భస్థ శిశువు పెరుగుదలకు చాలా ఉపయోగకరం.





పాత పంట

నవార నారాయణన్!

కేరళ సంప్రదాయ ఆహారంలోనే కాదు ఆయుర్వేద వైద్యంలోనూ కీలక పాత్ర పోషిస్తున్న నవార సాగుకు పాల్ఘాట్ ప్రాంతంలో 2 వేల ఏళ్ల చరిత్ర ఉన్నా గత 50 ఏళ్లుగా దీనికి సాగు తగ్గిపోయి, అంతరించిపోయే దశకు చేరింది. అక్కడక్కడా రైతులు సాగు చేస్తున్నారు. అయితే, ఒకే ఒక్క కుటుంబం మాత్రం నవారను గత 115 ఏళ్లుగా విడవకుండా తమ 8 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో నిరంతరాయంగా సాగు చేస్తూనే ఉంది. అద్భుత వ్యవసాయ, సాంస్కృతిక వారసత్వ సంపద అయిన నవారను ఈ కుటుంబం కాపాడుకుంటోంది. ఈ కుటుంబానికి చెందిన మూడో తరం రైతు పి. నారాయణన్ ఉన్ని ఇప్పుడు దీన్ని సాగు చేస్తున్నారు.

నవార ఎకో ఫార్మ్ అని ఈయన క్షేత్రానికి పేరు పెట్టారు. 'నవార నారాయణన్'గా ఆయన పేరుగాంచారు. ఆయన కృషి దేశ విదేశాల్లో మారుమోగుతూ ఉంటుంది. పరిరక్షించటంతో పాటు నవార ఫార్మర్స్ సొసైటీ పేరిట నవారకు జిఐ గుర్తింపు తేవటంలోనూ నారాయణన్ విశేష కృషి చేశారు. నవార ఉత్పత్తులను ఆయన సేంద్రియంగా పండిస్తూ దేశ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. న్యూఢిల్లీలోని కేంద్ర వ్యవసాయ శాఖ పరిధిలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎఆర్ఐ)కి చెందిన ట్రస్ట్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ (టాస్) నవారపై ప్రత్యేక గ్రంథాన్ని ప్రచురించింది. నారాయణన్ ఏర్పాటు చేసిన సొసైటీ ఆధ్వర్యంలో 2011లో నవార ఉత్సవ్‌ను నిర్వహించారు.

నవార పునరుజ్జీవనానికి కృషి చేసిన నారాయణన్‌కు ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్ అథారిటీ (పిపివి అండ్ ఎఫ్ఆర్ఎ) ప్రతిష్టాత్మకమైన ప్లాంట్ జీనోమ్ సేవియర్ కమ్యూనిటీ రికగ్నిషన్ పురస్కారాన్ని ప్రదానం చేసి గౌరవించింది. ఎకరానికి 3 క్వింటాళ్ల నవార ధాన్యాన్ని ప్రకృతి సేద్య పద్ధతుల్లో పండిస్తున్నారు. మిల్లు పట్టిస్తే 180 కిలోల బియ్యం వస్తున్నాయి. బియ్యంతో పాటు అటుకులు, పిండిని తయారు చేసి విక్రయిస్తున్నారు. గత ఏడాది 'టాస్' ప్రచురించిన వివరాల ప్రకారం నారాయణన్ ఎకరానికి రూ. 1 లక్షకు పైగా ఆదాయం పొందుతున్నారు.

నిర్వహణ:
పంతంగి రాంబాబు,
సాగుబడి డెస్క్



ఇంటి పంట

ఎండాకులతో అమూల్యమైన సహజ ఎరువు!

ఇది ఆకులు రాలే కాలం. చెట్లు ఆకులు రాల్చే కాలం. ఏప్రిల్ వరకు మన చుట్టూతా ఉండే చెట్లు ఆకులను రాల్చుతూ ఉంటాయి. పొద్దున్న లేచేటప్పటికల్లా వాకిలి నిండా, ఇంటి ఆవరణలో, చెట్ల పక్కనున్న ఇంటి పైకప్పుల మీద, కాలనీల్లో రోడ్ల మీద, పార్కుల్లో.. ఎక్కడ చూసినా ఆకులే.. ఆకులు.. రాలిన ఆకులు!

ఈ ఆకులను చక్కని కంపోస్టు ఎరువుగా మార్చుకోవచ్చని తెలిసినా.. నిర్లక్ష్యం కొద్దీ ఆకులను కుప్ప జేసి నిప్పు పెట్టడమో లేదా చెత్తను మోసుకెళ్లే మున్సిపాలిటీ వాళ్ల నెత్తిన వెయ్యడమో చేస్తున్నాం.. అయితే, స్వల్ప ప్రయత్నంతోనే ఈ ఎండాకులను అమూల్యమైన సహజ ఎరువుగా మార్చుకోవచ్చని ఓ మహిళ ఎలుగెత్తి చాటుతున్నారు. మహారాష్ట్రలోని పుణే నగరవాసి అదితి దేవ్‌ధర్ 'బ్రౌన్‌లీఫ్' పేరిట ఏకంగా ఓ సామాజిక ఉద్యమాన్నే ప్రారంభించి ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్నారు. ఆమె స్ఫూర్తి కథనం..



పచ్చని చెట్లంటే మనందరికీ ఇష్టమే. అందుకే పొలాల గట్ల మీద, పడావు భూముల్లో, ఇంటి దగ్గర, ఊళ్లు / కాలనీల్లో రోడ్ల పక్కన, పార్కుల్లో.. ఇష్టపడి పచ్చని చెట్లను పెంచుకుంటూ ఉంటాం.

అయితే, ఆ చెట్లు రాల్చే ఆకుల్ని ఏం చేయాలి? ఊడ్చి మున్సిపాలిటీ వ్యాన్‌లో వేస్తున్నారు లేదా కుప్ప చేసి ఏకంగా నిప్పు పెడుతున్నారు. ఈ రెండూ మంచి పనులు కాదు. పనిగట్టుకొని మొక్కలు నాటి పచ్చని చెట్లని పెంచుతున్న వారు సైతం నాకెందుకులే అనో.. ఓ రకమైన నిరాసక్తతతోనో, నిర్లక్ష్యంతోనో చూస్తూ ఊరుకుంటున్నారు.

అయితే, అదితి దేవ్‌ధర్ ఊరుకోలేదు. తమ ఇంటి ఆవరణలో పెద్ద చెట్లు రాల్చే ఆకులు పోగుపడుతూ ఉంటే.. ఆ ఆకులను నిప్పు పెట్టి వాయుకాలుష్యాన్ని పెంచి ప్రజారోగ్యానికి ముప్పు తేవడానికి గానీ, మున్సిపాలిటీ వాళ్లకు ఇచ్చి డంపింగ్ యార్డులో చెత్త దిబ్బలను కొండలుగా పెంచడానికి గానీ ఆమె ఒప్పుకోలేదు. తానే చొరవతో ఎండాకుల సమస్యకు పరిష్కారం వెదికారు. బ్రౌన్‌లీఫ్ ఛాలెంజ్ తీసుకున్నారు. నలుగురినీ కూడగట్టారు. ఒక్క ఎండాకునూ తగులబెట్టనియ్య కూడదని ప్రతినబూనారు. నాలుగేళ్లుగా ఎండాకులను తగులబెట్టకుండా చూస్తున్నారు. ఎండాకులతో కంపోస్టు తయారు చేసుకునే పద్ధతులను ప్రచారం చేస్తున్నారు. ఆ కంపోస్టుతో చక్కని సేంద్రియ ఇంటిపంటలు పండించుకోవడానికి దోహదం చేస్తూ మరెందరిలోనో ప్రేరణ కలిగిస్తున్నారు.

ఎండాకులను వాడుకునే మూడు పద్ధతులు!

రాలిన ఎండాకులకు నిప్పు పెడుతున్నారా? వద్దు. ఎందుకంటే దీని వల్ల గాలి కలుషితమవుతుంది. చెట్లు రాల్చే ఎండాకులు భూమికి తిరిగి చెట్లు అందిస్తున్న పోషకాలు. ప్రకృతిలో, అడవిలో రాలిన ఆకులు దొంతర్లుగా పేరుకొని భూమికి ఆచ్ఛాదన కల్పిస్తున్నాయి. వర్షానికి తడిచిన ఆకులు, అలములు కుళ్లి భూమిని సారవంతం చేస్తున్నాయి.

అదితి బ్రౌన్‌లీఫ్.ఓఆర్‌జి పేరిట వెబ్‌సైట్‌ను రూపొందించారు. వాట్సప్ గ్రూప్ ప్రారంభించారు. ఫేస్‌బుక్ ఖాతా తెరిచారు. ఎండాకులను తగులబెట్టకుండా వాడుకునే మూడు పద్ధతులను ప్రచారం చేస్తున్నారు.



1. ఆచ్ఛాదన (మల్చింగ్) చెయ్యండి
ఎండాకులను మొక్కలు, చెట్ల దగ్గర నేలపై ఎండ పడకుండా మల్చింగ్ చేయాలి. ఎండ నేరుగా నేలకు తగలకుండా ఆకులతో ఆచ్ఛాదన కల్పిస్తే మట్టిలో ఉండే సూక్ష్మ జీవులు, వానపాములకు మేలు జరుగుతుంది. కాలక్రమంలో ఆకులు కుళ్లి భూమిని సారవంతం చేస్తాయి.

2. కంపోస్ట్ చెయ్యండి... ఎండాకులను కుళ్లబెట్టి కంపోస్టు తయారు చేయండి. కంపోస్టు చేయడానికి మూడు పద్ధతులు ఉన్నాయి. ఎ) ఇంటి ఆవరణలో ఒక మూలన గుంత తవ్వి ఆకులను అందులో వేయటం. బి) ఇనుప మెష్‌తో ట్రీగార్డు మాదిరిగా గంపను తయారు చేసి అందులో ఎండాకులు వేయడం. సి) ఎండాకులను కుప్పగా పోసి కూడా కంపోస్టు చెయ్యొచ్చు. ఈ మూడు పద్ధతుల్లో కూడా ఆకులను తేమగా ఉండేలా తరచూ నీరు పోస్తుండాలి. పేడ నీరు లేదా జీవామృతం లేదా వేస్ట్ డీ కంపోజర్ ద్రావణం లేదా లాక్టిక్ ఆసిడ్ బాక్టీరియా ద్రావణం లేదా పుల్లమజ్జిగ వంటి సేంద్రియ పదార్థాన్ని కుళ్లింపజేసే సూక్ష్మ జీవరాశి ఉండే కల్చర్‌ను కలపాలి(వీటి గురించి మున్ముందు వివరంగా తెలుసుకుందాం).

3. ఇతరులకివ్వండి... పట్టణాలు, నగరాలలో నివసించే వారు ఇంటి దగ్గర లేదా కాలనీ రోడ్లపై లేదా పార్కుల్లో చెట్లు రాల్చే ఆకులను కంపోస్టు చేసే ఉద్దేశం లేకపోతే వాటిని కంపోస్టు చేసుకోదలచిన వారికి అందించడం ఉత్తమం. పుణే వాసులు ఎండాకులను ఇచ్చి పుచ్చుకోవడానికి వీలుగా అదితి బ్రౌన్‌లీఫ్ పేరుతో వాట్సప్ గ్రూప్, ఫేస్‌బుక్ ఖాతాతోపాటు వివరంగా చర్చించేందుకు వెబ్‌సైట్‌ను సైతం 2016లో ప్రారంభించారు. తొలి ఏడాదే 500 బస్తాల ఎండాకులను ప్రజలు ఇతరులకు అందించారట. సోషల్ మీడియా ద్వారా సామాజికోద్యమం ప్రారంభించి ఉండకపోతే ఈ ఆకులన్నిటినీ తగులబెట్టి ఉండేవారని ఆమె సంతోషంగా చెబుతారు. అయితే, రెండో ఏడాదికి ఆకులను ఇతరులకిస్తాం అనే వారు లేకుండా పోయారట. అంటే అందరూ కంపోస్టు తయారు చేసుకోవడం, దానితో కుండీలలో సేంద్రియ ఇంటిపంటలు పండించడం ప్రారంభించారన్న మాట! http://brownleaf.org/

బిజినెస్ రీల్

సైయంట్ డీఎల్ఎంకు బోయింగ్ కాంట్రాక్టు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సైయంట్ డీఎల్ఎంకు తాజాగా బోయింగ్ గ్లోబల్ సర్వీసెస్ నుంచి ప్రెసిషన్ మెషినింగ్ కాంట్రాక్టు లభించింది. దీని కింద ప్రెసిషన్–మెషిన్డ్ పార్టులు, అసెంబ్లీలను ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని సంస్థ తెలిపింది. ఏరోస్పేస్ విభాగంలో అంతర్జాతీయ దిగ్గజంగా ఉన్న బోయింగ్‌తో భాగస్వామ్యంలో ఇది మరో కీలక మైలురాయని సైయంట్ డీఎల్ఎం సీఈవో ఆంథోనీ మోంటల్‌బానో తెలిపారు.

హైదరాబాద్ మార్కెట్లోకి ప్రియా లివింగ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సీనియర్ సిటిజన్ల నివాస సదుపాయాలను ఏర్పాటు చేసే ప్రియా లివింగ్ తాజాగా హైదరాబాద్‌లో తమ కొత్త కమ్యూనిటీని ప్రారంభించింది. తమ కమ్యూనిటీల్లో ముందస్తుగా భారీగా చెల్లించాల్సి వచ్చే సాంప్రదాయ సీనియర్ లివింగ్ మోడల్స్‌కి భిన్నంగా సరళతరమైన చెల్లింపుల విధానాన్ని అమలు చేస్తున్నట్లు సంస్థ తెలిపింది. దేశవ్యాప్తంగా అధునాతన సీనియర్ లివింగ్ కమ్యూనిటీలను ఏర్పాటు చేసేందుకు 100 మిలియన్ డాలర్లు వెచ్చించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు అరుణ్ పాల్ వివరించారు. 2026 ఆఖరు నాటికి ఏడు ప్రధాన నగరాలకు కార్యకలాపాలు విస్తరించనున్నట్లు చెప్పారు.

మార్చి 6 నుంచి ఇండియాఉడ్ ఎక్స్‌పో

న్యూఢిల్లీ: ఉడ్‌వర్కింగ్, ఫర్నిచర్ తయారీకి సంబంధించిన ఇండియాఉడ్ 2025 ఎగ్జిబిషన్ మార్చి 6న గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో మార్ట్ అండ్ సెంటర్‌లో ప్రారంభం కానుంది. మార్చి 9 వరకు సాగే ఈ ఎక్స్‌పోలో 30 పైగా దేశాలకు చెందిన 600 బ్రాండ్లు పాల్గొననున్నాయి. అధునాతన టెక్నాలజీలు, యంత్రపరికరాలు, వివిధ ఉత్పత్తులు మొదలైనవి ప్రదర్శించనున్నాయి. దేశీయంగా ఫర్నిచర్ మార్కెట్ 2025లో 25.75 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2030 నాటికి 37.18 బిలియన్ డాలర్లకు చేరనుందని న్యూర్న్‌బర్గ్‌మెస్సే ఇండియా ఎండీ సోనియా ప్రాషర్ తెలిపారు. పరిశ్రమలో ఉడెన్ ఫర్నిచర్ వాటా 62 శాతంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ టాప్ 5 ఫర్నిచర్ ఉత్పత్తి దేశాల్లో ఒకటిగా ఉందని, ఎగుమతులు ఏటా 20 శాతం వృద్ధి చెందుతున్నాయని వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-2-2025	
విశాఖ	465-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455-00
విజయవాడ	450-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440-00
వరంగల్	442-00
రిటైల్ ధర	5.00

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,321.00	1.32
GRASIM	2,492.00	0.76
TRENT	5,223.80	0.52
BHARTIARTL	1,695.90	0.17
BRITANNIA	4,914.00	0.09

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
EICHERMOT	4,977.95	-6.7
APOLLOHOSP	6,314.00	-6.61
SHRIRAMFIN	535.5	-4.51
COALINDIA	358	-3.37
BEL	264.45	-3.29

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,100
ఎన్ఎస్ఈ	87,197
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,60,594
ఎఫ్ఐఐ	- 4,486
డీఐఐ	+ 4,002

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	73.19	$	72.22
బ్రెంట్	76.86	$	75.87

ఇంధన రంగంలో ఇన్వెస్ట్ చేయండి

ఐఈడబ్ల్యూ సదస్సులో పెట్టుబడిదారులకు ప్రధాని ఆహ్వానం

న్యూఢిల్లీ: భారత ఇంధన రంగంలో గణనీయంగా వ్యాపార అవకాశాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. వచ్చే అయిదేళ్లలో భారీ స్థాయిలో పునరుత్పాదక ఇంధనానికి మారాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకున్న నేపథ్యంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ ఇన్వెస్టర్లను ఆయన ఆహ్వానించారు. ఇండియా ఎనర్జీ వీక్ 2025లో (ఐఈడబ్ల్యూ 25) వర్చువల్‌గా పాల్గొన్న సందర్భంగా ప్రధాని ఈ విషయాలు తెలిపారు. 2030 నాటికి వార్షికంగా 5 మిలియన్ టన్నుల హరిత హైడ్రోజన్, 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాలను సాధించాలన్న లక్ష్యాలు, చమురు .. గ్యాస్ నిక్షేపాలను వెలికితీసేందుకు బిడ్డింగ్ ప్రకటించడం మొదలైనవి దేశీయంగా ఇంధన రంగానికి దన్నుగా నిలుస్తాయని ఆయన చెప్పారు. వనరులను సమర్ధంగా వినియోగించుకోవడం, కొత్త ఆవిష్కరణలను రూపొందించేలా ప్రతిభావంతులను ప్రోత్సహించడంపై భారత్ మరింతగా దృష్టి పెడుతోందని తెలిపారు. ఆర్థికంగాను, రాజకీయంగానూ దేశం పటిష్టంగా ఉందని ప్రధాని వివరించారు. వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు రాబోయే రెండు దశాబ్దాలు చాలా కీలకమని, వచ్చే అయిదేళ్లలో దేశం అనేక మైలురాళ్లను అధిగమిస్తుందని ఆయన పేర్కొన్నారు. గత పదేళ్లలో 10వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థాయి నుంచి దేశం అయిదో స్థానానికి చేరిందని చెప్పారు.

ఈఈఎస్ఎల్ ఒప్పందాలు..

ఐఈడబ్ల్యూ సందర్భంగా ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) తమ 15వ ఫౌండేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ సంస్థలతో రూ. 500 కోట్ల విలువ చేసే అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇండొనేషియా–మలేషియా–థాయ్‌ల్యాండ్ గ్రోత్ ట్రయాంగిల్ జాయింట్ బిజినెస్ కౌన్సిల్ (ఐఎంటీ–జీటీ జేబీసీ), గ్రీన్ గ్రోత్ ఏషియా ఫౌండేషన్ (జీజీఏఎఫ్), ఐఐటీ హైదరాబాద్ వీటిలో ఉన్నాయి. విద్యుత్ ఆదా చేసే లైటింగ్, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రిక్ మొబిలిటీ, కూలింగ్ సాంకేతికతలు మొదలైన వాటి రూపకల్పనకు ఎంవోయూలు తోడ్పడనున్నాయి.



గణనీయంగా పెరిగిన ప్రత్యక్ష పన్ను వసూళ్లు

- 15 శాతం వృద్ధితో రూ.17.78 లక్షల కోట్లు
- ఫిబ్రవరి 10 నాటికి నమోదు



న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్నుల రూపంలో ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు (2024 ఏప్రిల్ 1 నుంచి 2025 ఫిబ్రవరి 10 నాటికి) రూ.17.78 లక్షల కోట్ల నికర పత్ర్యక్ష పన్ను వసూలైంది. అంతక్రితం ఆర్థిక సంత్సరం ఇదే కాలంలో ఆదాయంతో పోల్చి చూస్తే 14.69 శాతం వృద్ధి కనిపిస్తోంది. పత్ర్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) విడుదల చేసిన తాజా గణాంకాలను పరిశీలించినప్పుడు.. నాన్ కార్పొరేట్ పన్నుల ఆదాయం (వ్యక్తిగత ఆదాయపన్ను రూపంలో) ఫిబ్రవరి 10 నాటికి 21 శాతం ఎగసి రూ.9.48 లక్షల కోట్లకు చేరింది. ఇక కార్పొరేట్ పన్నుల ఆదాయం సైతం 6 శాతం అధికమై రూ.7.78 లక్షల కోట్లుగా నమోదైంది. సెక్యూరిటీల లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) ఇదే కాలంలో 65 శాతం పెరిగి రూ.49,201 కోట్లుగా ఉంది. పన్ను చెల్లింపుదారులకు ఆదాయపన్ను శాఖ ఈ కాలంలో మొత్తం రూ.4.10 లక్షల కోట్లను రిఫండ్ (తిరిగి చెల్లింపు) చేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూస్తే రిఫండ్‌లు 42 శాతం పెరిగాయి. ఇక ఫిబ్రవరి 10 నాటికి స్థూల ప్రత్యక్ష పన్నుల ఆదాయం 19 శాతం పెరిగి రూ.21.88 లక్షల కోట్లకు చేరింది. 2024–25 సంవత్సరంలో ఆదాయపన్ను వసూళ్లు రూ.12.57 లక్షల కోట్లుగా ఉండొచ్చని ప్రభుత్వం ఇటీవలి బడ్జెట్‌లో సవరించిన అంచనాలు పేర్కొనడం గమనార్హం.

డిజిటైజేషన్ అంటే నియంత్రణల ఎత్తివేత కాదు

- చైనా పెట్టుబడుల నిషేధంలో మార్పులేదు
- దేశీ వినియోగమే రక్ష
- సీఈఏ అనంత నాగేశ్వరన్



ముంబై: డిజిటైజేషన్ అంటే నియంత్రణల తొలగింపు అన్న తప్పుడు అభిప్రాయం అధికార యంత్రాంగంలో ఉందని కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ అన్నారు. ప్రత్యామ్నాయ పెట్టుబడుల (ఏఐ) పరిశ్రమ లాబీ గ్రూప్ ఐవీసీఏ ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా నాగేశ్వరన్ మాట్లాడారు. ''దేశవ్యాప్తంగా ప్రభుత్వ విభాగాల్లో ఒక తప్పుడు అభిప్రాయం నెలకొంది. వారు ఏదైనా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై ఉంచారంటే, దాన్ని నియంత్రణ తొలగింపుగా భావిస్తున్నారు. కానీ అది నియంత్రణల తొలగింపు కాదు. ఆఫ్‌లైన్ బదులు ఆన్‌లైన్‌లో ఉంచారంతే. అభివృద్ధి చెందాలనుకునే ఏ దేశమైనా చిన్న వ్యాపారాలపై దృష్టి సారించాలి. నియంత్రణల వంటి సవాళ్లను తొలగించాలి. దాంతో నిబంధనల అమలుపై వనరులు వృధా కాబోవు''అని స్పష్టం చేశారు.

ప్రపంచీకరణ స్థానంలో కొత్త నమూనా

రానున్న రోజుల్లో భారత్ దేశీ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడడం ద్వారానే మరింత వృద్ధి సాధించగలదన్నారు నాగేశ్వరన్. గ్లోబలైజేషన్ (ప్రపంచీకరణ) గతంలో మాదిరిగా ప్రయోజనాలను అందించలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. డీ గ్లోబలైజేషన్ (దేశాల మధ్య అనుసంధానం తగ్గిపోవడం) ధోరణి వంద సంవత్సరాలకు పైగా చూస్తున్నదేనంటూ.. ప్రస్తుత నమూనాలో పరిమితుల దృష్ట్యా కొత్త ధోరణి అవతరించొచ్చన్నారు.

రూపాయి ఏటా 3 శాతం క్షీణత

ద్రవ్యోల్బణాన్ని గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న 4–5 శాతం శ్రేణి నుంచి 3–4 శాతం శ్రేణికి పరిమితం చేస్తే రూపాయి విలువ క్షీణతను అడ్డుకోవచ్చన్న అభిప్రాయాన్ని అనంత నాగేశ్వరన్ వ్యక్తం చేశారు. దీర్ఘకాలంలో రూపాయి విలువ ఏటా 3 శాతం క్షీణించొచ్చని (డాలర్‌తో పోల్చితే) చెప్పారు. ఇంధన భద్రత విషయంలో భారత్ రాజీపడకూడదన్నారు.

చైనా పాలసీపై సమీక్ష లేదు..

చైనా పెట్టుబడులపై ప్రస్తుతం అమల్లో ఉన్న నిషేధాన్ని సమీప కాలంలో భారత్ సమీక్షించకపోవచ్చని నాగేశ్వరన్ అన్నారు. ఇరు దేశాలు పరస్పర ప్రయోజనాల ప్రాముఖ్యతను గుర్తించినట్టు చెప్పారు. వాణిజ్య అసమానతలపై రెండు దేశాలు సంప్రదింపులు నిర్వహిస్తున్నాయని, పలు అంశాలపై ఏకాభిప్రాయానికి వచ్చే అవకాశం ఉందన్నారు.

అదానీకి అమెరికాలో ఊరట?

విదేశీ అవినీతి విధానాల చట్టం అమలుకు ట్రంప్ విరామం



వాషింగ్టన్: దాదాపు అర శతాబ్దం నాటి విదేశీ అవినీతి విధానాల చట్టం (ఎఫ్‌సీపీఏ) అమలును తాత్కాలికంగా నిలిపివేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు ఇచ్చారు. 60 రోజుల పాటు చట్టాన్ని సమీక్షించాలని, ఈలోగా దాని కింద కొత్తగా విచారణలేవీ చేపట్టరాదని ఆయన సూచించారు. వ్యాపార అవసరాల కోసం కంపెనీలు విదేశాల్లోని అధికారులకు లంచాలిచ్చి అవినీతికి పాల్పడకుండా నిరోధించేందుకు ఈ చట్టం లక్ష్యం. పారిశ్రామిక దిగ్గజం గౌతం అదానీపై లంచాల ఆరోపణలను ఇదే చట్టం కింద విచారణ చేస్తున్న నేపథ్యంలో తాజా నిర్ణయంతో ఆయనకు కొంత ఊరట లభించగలదని పరిశ్రమవర్గాలు అభిప్రాయపడ్డాయి. భారత్‌లో సౌర విద్యుత్ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు అధికారులకు లంచాలిచ్చారని, అమెరికాలో నిధులను సమీకరించే క్రమంలో ఆ విషయాలను వెల్లడించలేదని అదానీ తదితరులపై గత ప్రభుత్వం అభియోగాలు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఎఫ్‌సీపీఏ ప్రకారం అమెరికన్ కంపెనీలైనా, ఇతర దేశాల కంపెనీలైనా వ్యాపార అవసరాల కోసం విదేశాల్లో అధికారులకు లంచాలివ్వడం చట్టవిరుద్ధం.

మిడ్‌వెస్ట్ ఐపీవోకు ఓకే

- సెబీ తాజాగా గ్రీన్‌సిగ్నల్
- రూ. 650 కోట్లపై కన్ను

న్యూఢిల్లీ: బ్లాక్ గలాక్సీ గ్రానైట్ తయారీ దిగ్గజం మిడ్‌వెస్ట్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఐపీవోలో భాగంగా రూ. 250 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 400 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఐపీవో ద్వారా రూ. 650 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. హైదరాబాద్ కంపెనీ 2024 అక్టోబర్‌లో సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. బ్లాక్ గలాక్సీ గ్రానైట్ తయారీ, ఎగుమతుల్లో మిడ్‌వెస్ట్ దేశీయంగా అతిపెద్ద కంపెనీలలో ఒకటిగా నిలుస్తోంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 127 కోట్లు సొంత అనుబంధ సంస్థ మిడ్‌వెస్ట్ నియోస్టోన్ పెట్టుబడి వ్యయాలకు, రూ. 26 కోట్లు ఎలక్ట్రిక్ డంప్ ట్రక్కుల కొనుగోలుకి వెచ్చించనుంది. మరో రూ. 54 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. గతేడాది(2023–24) మొత్తం ఆదాయం 17 శాతం ఎగసి రూ. 586 కోట్లకు చేరింది. నికర లాభం మరింత అధికంగా 84 శాతం జంప్‌చేసి రూ. 100 కోట్లను అధిగమించింది.

క్యూ3 ఫలితాలు

ఎంటార్ లాభం రూ. 16 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఎంటార్ టెక్నాలజీస్ లాభం రూ. 16 కోట్లుగా నమోదైంది. క్రితం క్యూ3లో ఇది రూ. 106 కోట్లు. మరోవైపు, సమీక్షాకాలంలో ఆదాయం రూ. 119 కోట్ల నుంచి రూ. 177 కోట్లకు ఎగిసింది.

క్యాప్‌స్టన్ సర్వీసెస్ ఆదాయం రూ. 182 కోట్లు

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో క్యాప్‌స్టన్ సర్వీసెస్ ఆదాయం రూ. 182 కోట్లకు చేరింది. క్రితం క్యూ3లో ఇది రూ. 137 కోట్లుగా నమోదైంది. సమీక్షాకాలంలో లాభం సుమారు రూ. 3 కోట్ల నుంచి రూ. 5 కోట్లకు పెరిగింది.

పతంజలి ఫుడ్స్ పటిష్ట పనితీరు

71 శాతం జంప్ చేసిన లాభం



న్యూఢిల్లీ: పతంజలి ఫుడ్స్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో పటిష్ట పనితీరు చూపించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే లాభం 71 శాతం ఎగసి రూ.371 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.216 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం సైతం ఇదే కాలంలో రూ.7,910 కోట్ల నుంచి రూ.9,103 కోట్లకు వృద్ధి చెందింది. వ్యయాలు ఈ కాలంలో రూ.7,651 కోట్ల నుంచి రూ.8,652 కోట్లకు పెరిగాయి. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో పతంజలి షేరు అర శాతం లాభపడి రూ.1,853 వద్ద ముగిసింది.

జీసెక్‌లలో స్టాక్ బ్రోకర్ల ట్రేడింగ్

సెబీ గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: స్టాక్ బ్రోకర్లు ప్రభుత్వ సెక్యూరిటీ(జీసెక్)లలో ట్రేడింగ్ చేసేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా వీలు కల్పించింది. ఆర్డర్ మ్యాచింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా రిజిస్టర్డ్ స్టాక్ బ్రోకర్లు ప్రభుత్వ సెక్యూరిటీలలో లావాదేవీలు చేపట్టేందుకు అనుమతించింది. అయితే ఇందుకు ప్రత్యేక బిజినెస్ యూనిట్(ఎస్‌బీయూ)కింద నమోదుకావలసి ఉంటుంది. ఆర్డర్ మ్యాచింగ్ నెగోషియేటెడ్ డీలింగ్ సిస్టమ్(ఎన్‌డీఎస్–ఓఎం) ద్వారా సెబీ వద్ద రిజిస్టరైన నాన్‌బ్యాంక్ బ్రోకర్లు జీసెక్‌లలో ట్రేడింగ్ చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు ఈ నెల 7న నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో సెబీ తాజా ఆదేశాలకు తెరతీసింది. కాగా.. సెక్యూరిటీస్ మార్కెట్ లావాదేవీలకు సంబంధంలేని ఎస్‌బీయూ ఏర్పాటు ద్వారా మాత్రమే ఎన్‌డీఎస్–ఓఎం ద్వారా జీసెక్‌లలో ట్రేడింగ్‌కు అనుమతిస్తున్నట్లు సర్క్యులర్‌లో సెబీ పేర్కొంది.

ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ ఆదాయం అప్

రూ. 111 కోట్లు



హైదరాబాద్: కూలింగ్ సొల్యూషన్స్ సంస్థ ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ మూడో త్రైమాసికంలో రూ. 111 కోట్ల ఆదాయంపై రూ. 3 కోట్ల లాభం ఆర్జించింది. క్రితం క్యూ3లో ఆదాయం రూ. 82 కోట్లు కాగా రూ. 2 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత పూర్తి ఆర్థిక సంవత్సరంలో రూ. 500 కోట్ల ఆదాయాన్ని టార్గెట్‌గా పెట్టుకున్నట్లు సంస్థ సీఎండీ చంద్రకాంత్ పటేల్ తెలిపారు.

పదేళ్లలో పది లక్షలకు స్టార్టప్‌లు

- అంకురాలకు ప్రభుత్వం దన్ను
- కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ: ఔత్సాహిక వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ తెలిపారు. ఈ నేపథ్యంలో వచ్చే పదేళ్లలో ప్రభుత్వ గుర్తింపు పొందిన అంకురాల సంఖ్య 10 లక్షలకు చేరగలదని భారత్–ఇజ్రాయెల్ బిజినెస్ ఫోరం సమావేశంలో పాల్గొన్న సందర్భంగా చెప్పారు. 140 కోట్ల జనాభా గల భారత మార్కెట్లో గణనీయంగా వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని ఇన్వెస్టర్లను ఆయన కోరారు. ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి నీర్ ఎం బర్కత్ సారథ్యంలో వ్యాపార దిగ్గజాల బృందం ఈ సమావేశంలో పాల్గొంది. ఆర్థిక, సాంకేతికాంశాల్లో పరస్పర సహకారం, పెట్టుబడుల అవకాశాలు మొదలైన వాటిపై ఇందులో చర్చించారు. 2016లో 450గా ఉన్న రిజిస్టర్డ్ స్టార్టప్‌ల సంఖ్య ప్రస్తుతం 1.57 లక్షలకు చేరింది. కొత్త ఆవిష్కరణలను, అంకురాలను ప్రోత్సహించేందుకు కేంద్రం 2016 జనవరిలో స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీని కింద గుర్తింపు పొందిన యూనిట్లకు పన్నులు, పన్నులయేతర ప్రోత్సాహకాలకు అర్హత లభిస్తుంది. అలాగే ఫ్లాగ్‌షిప్ పథకాలైన ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఫర్ స్టార్టప్స్ (ఎఫ్ఎఫ్ఎస్), స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్, క్రెడిట్ గ్యారంటీ స్కీము మొదలైన వాటి ద్వారా వివిధ రంగాలు, దశల్లో ఉన్న అర్హత కలిగిన స్టార్టప్‌లకు ఆర్థిక సహాయం కూడా లభిస్తోంది.

ఆఫీస్ మార్కెట్ రారాజు.. హైదరాబాద్

2030 నాటికి 200 మిలియన్ ఎస్ఎఫ్‌టీ

- దేశ ఆఫీస్ మార్కెట్లో 15 శాతం వాటా
- మెరుగైన వసతులు, నిపుణుల లభ్యత
- సీబీఆర్ఈ, హైసియా సంయుక్త నివేదిక



హైదరాబాద్: ఆఫీస్ మార్కెట్‌కు ఆకర్షణీయ కేంద్రంగా హైదరాబాద్ అవతరిస్తోంది. 134 మిలియన్ చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) ఆఫీస్ స్పేస్‌తో దేశ ఆఫీస్ స్పేస్ (కార్యాలయ వసతులు) మార్కెట్‌లో హైదరాబాద్ 15 శాతం వాటా కలిగి ఉండగా, 2030 నాటికి 200 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరుకుంటుందని సీబీఆర్ఈ దక్షిణాసియా, హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) సంయుక్త నివేదిక అంచనా వేసింది. అంతర్జాతీయ సంస్థల నుంచి ఆఫీస్ స్పేస్‌కు బలమైన డిమాండ్ నెలకొందని, 2014 నుంచి చూస్తే హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ పరిమాణం మూడొంతులు పెరిగినట్టు తెలిపింది. అంతర్జాతీయ వ్యాపార, టెక్నాలజీ కేంద్రంగా హైదరాబాద్ అవతరించడం డిమాండ్‌కు అనుగుణంగా మారే స్వభావాన్ని తెలియజేస్తున్నట్టు సీబీఆర్ఈ ఇండియా చైర్మన్, సీఈవో అన్షుమన్ మ్యాగిజన్ పేర్కొన్నారు. విస్తృతమైన మౌలిక వసతులు, నైపుణ్య మానవ వనరుల లభ్యతతో భారత దేశ రియల్ ఎస్టేట్‌కు కీలక వృద్ధి కేంద్రంగా మారినట్టు తెలిపింది. టెక్నాలజీ, బీఎఫ్ఎస్ఐ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్లకు (జీసీసీ) హైదరాబాద్ ముఖ్య ఎంపికగా ఉన్నట్టు వెల్లడించింది.

పర్యావరణ అనుకూల వసతులు..

గ్రీన్ సర్టిఫైడ్ (పర్యావరణ అనుకూల ధ్రువీకరణ పొందిన) ఆఫీస్ వసతుల పరంగా హైదరాబాద్ మార్కెట్ దేశంలో 18 శాతం వాటా కలిగి ఉన్నట్టు ఈ నివేదిక తెలిపింది.

డెవలపర్లు గ్రీన్ స్పేసెస్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారని, పర్యావరణ అనుకూల చర్యలు తీసుకుంటున్నారని వివరించింది. ఇందుకు సానుకూల ప్రభుత్వ విధానాలు ప్రోత్సాహమిస్తున్నట్టు పేర్కొంది. హైదరాబాద్ ఆఫీస్ లీజింగ్‌లో టెక్నాలజీ రంగం 31 శాతం వాటాతో అగ్రగామిగా ఉన్నట్టు తెలిపింది. జీసీసీలకు బెంగళూరు తర్వాత హైదరాబాద్ రెండో అతిపెద్ద కేంద్రంగా (లీజు పరంగా) ఉన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. టెక్నాలజీ, ఫార్మా, బయో టెక్నాలజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇలా వివిధ రంగాల్లో జీసీసీలను హైదరాబాద్ ఆకర్షిస్తున్నట్టు పేర్కొంది. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలైటిక్స్ వంటి అత్యాధునిక టెక్నాలజీల వినియోగం పెరిగే కొద్దీ హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్ వృద్ధి మరింత వేగాన్ని అందుకుంటుందని అంచనా వేసింది.

లీజింగ్‌లోనూ టాప్

ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో ఈ ఏడాది హైదరాబాద్, ఢిల్లీ ఎన్‌సీఆర్ అత్యధిక వృద్ధిని చూస్తాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ 'కొలియర్స్ ఇండియా' సంస్థ అంచనా వేసింది. ఈ రెండు చోట్లా 10–15 మిలియన్ ఎస్ఎఫ్‌టీ చొప్పున గ్రేడ్–ఏ ఆఫీస్ స్పేస్ లీజింగ్ కార్యకలాపాలు నమోదు కావచ్చని తెలిపింది. దేశవ్యాప్తంగా ఆరు ప్రముఖ నగరాల్లో ఈ ఏడాది ఆఫీస్ స్పేస్ లీజింగ్ బలంగా ఉంటుందని.. 65–70 మిలియన్ ఎస్ఎఫ్‌టీ మేర లీజింగ్ నమోదు కావొచ్చని అంచనా వేసింది. 2025 సంవత్సరంలో ఈ ఆరు నగరాల్లో ఆఫీస్ స్పేస్ మార్కెట్ ఎలా ఉండొచ్చన్న అంచనాలతో నివేదికను ఫిక్కీ 18వ రియల్ ఎస్టేట్ సదస్సు సందర్భంగా విడుదల చేసింది. ఈ ఆరు నగరాల్లో 2024లో స్థూల ఆఫీస్ లీజింగ్ 66.4 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉండగా.. ఈ ఏడాది 65–70 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంటుందని అంచనా వేసింది. జీసీసీల విస్తరణ, ఆశావహ వ్యాపార వాతావరణంతో లీజింగ్ పరిమాణం పెరగొచ్చని తెలిపింది.

బెంగళూరులో అధిక డిమాండ్

ఈ ఏడాది స్థూల ఆఫీస్ స్పేస్ డిమాండ్‌లో మూడింట ఒక వంతు బెంగళూరు నుంచే ఉంటుందని కొలియర్స్ ఇండియా ఆఫీస్ సర్వీసెస్ ఎండీ అర్పిత్ మెహరోత్రా తెలిపారు. జీసీసీలు, ఇంజనీరింగ్, తయారీ సంస్థలు, ఫ్లెక్స్ ఆఫీస్ స్పేస్ ఆపరేటర్ల నుంచి డిమాండ్ ఉంటుందన్నారు. ముంబై, చెన్నై పుణెలలో 5–10 మిలియన్ ఎస్ఎఫ్‌టీ చొప్పున డిమాండ్ ఉండొచ్చని చెప్పారు. టాప్ మెట్రో నగరాల్లో జీసీసీలు అతిపెద్ద ఆఫీస్ స్పేస్ వినియోగదారులుగా ఉన్నట్టు అనరాక్ గ్రూప్ కమర్షియల్ లీజింగ్ ఎండీ పీయూష్ జైన్ సైతం తెలిపారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్‌కు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, గైడెన్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన గ్రామాలను ఏమని పిలిచేవారు?

విజయనగర సామ్రాజ్యం



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

ఆర్థిక వ్యవస్థ

భూమి పన్ను, వివిధ వృత్తి పన్నులు, సామంతులు చెల్లించిన కప్పాలు, శత్రు రాజ్యాల నుంచి దోపిడీ చేసిన సొమ్ము, రాజ ప్రతినిధులు చెల్లించే రాజాభరణాలు, బహుమతులు, విజయనగర సామ్రాజ్యానికి ప్రధాన ఆదాయ వనరులు. భూమిని నాలుగు రకాలుగా విభజించారు. మాగాణి పొలాన్ని 'నీరాంబరం', మెట్ట పొలాన్ని 'కాడాంబరం'గా పేర్కొన్నారు. ఈ కాలంలో పన్నులు అధికంగా ఉండేవని న్యూనిజ్ పేర్కొన్నాడు.

పన్నుల స్వరూపం: పంట పొలం, సారం, దిగుబడుల ఆధారంగా పన్ను మదింపు చేసేవారు. సాధారణంగా ఫలసాయంలో ఆరో వంతును పన్నుగా వసూలు చేసేవారు. భూమిని 'కీసరపాటిగడ'తో కొలిచేవారు. ఆముక్తమాల్యద ప్రకారం రాజుకు లభించే ఆదాయాన్ని నాలుగు భాగాలుగా విభజించి ఖర్చు చేసేవారు. రాజు దానాలు, రాజు వ్యక్తిగత వ్యయం, గుర్రాల నిర్వహణ, దండయాత్రలు, దేశాభివృద్ధి, రక్షణకు ఆదాయాన్ని ఖర్చు చేసేవారు.

భూమి, వృత్తి, వివాహం, పారిశ్రామిక ఉత్పత్తులపై పన్నులుండేవి. ఒకే స్థలంలో అమ్మకానికి వచ్చే సరకులపై 'స్థలాదాయం' పన్ను, ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తీసుకుపోయే వస్తువులపై 'మార్గాదాయం' పన్ను, ఇతర రాజ్యాలకు ఎగుమతి చేసే వస్తువులపై 'మామూలాదాయం' పన్ను, నేత మగ్గాలపై 'మగ్గరి' పన్ను ఉండేది. దూదిని ఏకి దారం తీసేవాళ్లు 'పంజుణి సిద్ధాయం' అనే పన్ను చెల్లించేవారు. విజయనగర రాజ్యంలో కొన్ని సీమల్లో పెళ్లి సుంకాలను రద్దు చేసిన మొదటి రాజు తుళువ వీరనరసింహుడు. శ్రీకృష్ణదేవరాయలు సామ్రాజ్యమంతటా వివాహ సుంకాలను రద్దు చేశారు. ఇంటిపై 'ఇల్లం', పశువులు మేసే పచ్చిక బయళ్లపై 'పుల్లం', అంగళ్లపై 'మడిగె' లేదా 'అడికాసు' పన్ను, స్థలంపై 'మన', తృణధాన్యాలు, కూరగాయలపై 'మలబ్రమ', కుల తగువుల ద్వారా 'సమయసుంకం' అనే పన్నులు వసూలు చేసేవారు. శ్రీకృష్ణదేవరాయలు వేయించిన కొండవీడు శాసనంలో వివిధ వస్తువులపై విధించిన పన్నుల వివరాలు ఉన్నాయి. వేశ్యలపై పన్ను విధించి దాంతో రక్షక భటులకు జీతాలు చెల్లించేవారని డొమింగోపయస్ అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు. యాచక వృత్తి (బిచ్చగాళ్ల)పై పన్నును 'గణాచారి' పన్ను అని పిలిచేవారు. పుత్రులు లేని కుటుంబీకుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేది. కోటల నిర్వహణకు 'దుర్గనివర్తన', 'దుర్గదణ్ణాయి' అనే పన్నులుండేవి. ఈ పన్నుల వివరాలను రాసేవారిని 'రాయలేఖకులు'గా పిలిచేవారు. వారి సేవలకుగాను రాజులు తగిన హోదా, గౌరవాలు ప్రసాదించారు. భూములు సర్వే చేయడానికి 20 అడుగుల పొడవున్న మానదండాన్ని ఉపయోగించేవారు. వివిధ ఉత్సవాలు, దేవాలయ నిర్మాణాలు, పూజా క్రతువులకు దానాలు, బహుమతులు ఇవ్వడం, వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు అవసరమైన నీటి కాల్వలు, చెరువులు నిర్మించడం లాంటి మంచి పనులు చేసేవారు. సంగీత, సాహిత్య కృత్యాల్లో ప్రావీణ్యం ఉన్న వారిని సముచితంగా గౌరవించేవారు.

న్యాయవ్యవస్థ - శిక్షలు

చక్రవర్తే న్యాయ వ్యవస్థకు ఉన్నతాధికారి. అత్యున్నత న్యాయస్థానం రాజాస్థానం. న్యాయాధీశులను 'ప్రాడ్వివాకులు'గా పిలిచేవారు. సివిల్ నేరాలను ధనోద్భవ, క్రిమినల్ నేరాలను హింసోద్భవ అని పిలిచేవారు. కొన్ని నేరాలకు శిక్షలు కఠినంగా, క్రూరంగా ఉండేవని న్యూనిజ్ పేర్కొన్నాడు. చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడేవారి కాలు, చెయ్యి నరికేసేవారు. పెద్ద దొంగతనాలకు గొంతు కింద కర్రగుచ్చి వేలాడదీసేవారు. రాజద్రోహం చేసిన వారికి శూలాలతో పొత్తికడుపులో గుచ్చడం లాంటి శిక్షలుండేవి. బ్రాహ్మణులకు మరణశిక్ష అమల్లో లేదు. కానీ కనుగుడ్లు తీయడం, గాడిదలపై ఊరేగించడం లాంటి శిక్షలుండేవి. అట్టడుగు కులాలవారు నేరాలు చేస్తే శిరోముండనం చేసేవారు. అపరాధులను ఏనుగులతో తొక్కించేవారు. అల్ప నేరాలకు పాల్పడిన వారి వీపులపై బండరాళ్లు ఎత్తించేవారు. కింది తీర్పులపై రాజువద్ద పునర్విమర్శ ఉండేది. సత్యప్రమాణం చేయించి శాస్త్రాలు చూసి న్యాయం నిర్ణయించేవారు. గ్రామచావడి, దేవాలయ ప్రాంగణం, ఊరి మధ్య రచ్చబండల వద్ద తీర్పులు చెప్పేవారు.

సామాజిక పరిస్థితులు

అల్లసాని పెద్దన మనుచరిత్ర, విదేశీ యాత్రికుల యాత్రాకథనాలు నాటి సామాజిక పరిస్థితులను వివరిస్తున్నాయి. సమాజంలో వర్ణ వ్యవస్థ, దానికి అనుగుణంగా అనేక కులాలు, ఉపకులాలు ఏర్పడ్డాయి. బ్రాహ్మణాధిక్యత ఉండేది. యజ్ఞాలు, యాగాలు, దానాలు, క్రతువులు విరివిగా చేసేవారు. కవి పండిత సభలు జరిగేవి. యుద్ధాల్లో క్షత్రియులు, వాణిజ్యంలో వైశ్యులు పేరు పొందారు. శూద్రులను తక్కువ కులంగా భావించేవారు. శ్రమశక్తి అంతా వీరిదే. గ్రామాల్లో కుల ప్రాతిపదికన ప్రజలు వేర్వేరుగా నివసించేవారు. మాలలు, మాదిగలను గ్రామాలకు దూరంగా ఉంచేవారు. పాదరక్షలు, చాంతాళ్లు నేయడం, తోలుసంచులు తయారు చేయడం వీరి వృత్తి. విప్రవినోదులు వివిధ వేషాలతో ప్రజలను ఆహ్లాదపరిచేవారు. దేవదాసీలు, వేశ్యావ్యవస్థ, సతీ సహగమనం, ఆత్మార్పణలు, జంతుబలులు లాంటి దురాచారాలు ఉండేవని న్యూనిజ్ పేర్కొన్నాడు. రాజులు విలాసమైన జీవితం గడిపేవారు. రాజ ప్రసాదానికి ఆనుకొని 72 కార్యాలయాలు (నియోగాలు) ఉండేవి. యుక్తవయసులో ఉన్న స్త్రీలను రాజుకు రక్షక భటులుగా కూడా నియమించేవారు. కన్యలను ఇతర దేశాల నుంచి కూడా దిగుమతి చేసుకునేవారు. సమాజంలో భోగ స్త్రీలకు గౌరవం ఉండేది. వారు సంగీతం, నాట్యంలో నిష్ణాతులని పయస్ పేర్కొన్నాడు. వివాహాలు ఎనిమిది విధాలుగా జరిగేవి. కట్నాలు, కానుకలుండేవి. పురాణాలు, ఇతిహాసాలు యక్షగానాలు సామాన్య ప్రజల్లో ప్రాచుర్యం పొందాయి. శరన్నవరాత్రులు పదిరోజుల పాటు వైభవంగా జరిగేవి. తొలి విజయనగర రాజులు శైవభక్తులు. తర్వాత రాజులు వైష్ణవ మతాన్ని ఆదరించారు. సంస్కృత నాటకాలు, తెలుగు, కన్నడ యక్షగానాలు, బొమ్మలాటలు, కోడి, గొర్రెపోతు పందేలు నాటి ముఖ్యమైన వినోదాలు. విజయనగర రాజుల కులదైవం విరూపాక్షస్వామి. వీరి రాజ లాంఛనం వరాహం.

శ్రీకృష్ణదేవరాయలు విద్యాగోష్ఠులు జరిపే సభాభవనం పేరు 'భువన విజయం'. ఆయన నివసించే మందిరం 'మలయకూటం'. సాహిత్య సదస్సులో అష్టదిగ్గజాలు విద్వత్తు ప్రదర్శించేవారు. విజయనగరం అత్యంత జన సాంద్రత ఉన్న నగరం. వర్తక వ్యాపారాలకు ప్రధాన కేంద్రం. చైనా నుంచి పట్టు వస్త్రాలు దిగుమతి అయ్యేవని పోర్చుగీసు యాత్రికుడు బార్బోసా పేర్కొన్నాడు. కర్పూరం, చందనం, మిరియాలు, ఏలకులు లాంటి సుగంధ ద్రవ్యాలకు మలబారు తీరం ప్రసిద్ధి చెందింది. గోవా రేవు ద్వారా అరేబియా గుర్రాలు దిగుమతి అయ్యేవి. రాట్నాలపై నూలు వడికేవారు. సాలివారిలో సాలి, పద్మశాలి, పట్టుశాలి, ఆగశాలి లాంటి శాఖలుండేవి. అనంతపురంలోని 'వజ్రకరూర్' వజ్రాలకు ప్రసిద్ధి చెందింది. వస్త్రాలకు నీలి, మంజిష్ట, కరక్కాయి, ఇంగిలికం లాంటి రంగులు అద్దేవారు. కంసాలి, కమ్మరి, కుమ్మరి తదితరులు కులవృత్తులపై జీవించేవారు.

సంఘంలో వరహాలు, మాడలు, ఫణాలు, ప్రతాపులు (బంగారు నాణేలు), చిన్నము, తార్ లేదా తారం (వెండి నాణేలు), జితల్ (రాగి నాణేలు) రూపంలో డబ్బు చెలామణి అయ్యేది. ధనాన్ని భూమిలోపల బిందెలలో దాచి పెట్టేవారు. ధాన్యాన్ని సోల, తూము, మానికల్లో కొలిచేవారు. ఈ కాలంలో అందగత్తెల వ్యాపారం కూడా జరిగేది. వీరిని 'చంద్రవణామణులు' అని పిలిచేవారు. వీరిని విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవారు. ప్రజలకు జాతరలు, అలంకరణపై మోజు ఎక్కువ.

బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన గ్రామాలను 'బ్రహ్మదేవ గ్రామాలు'గా పిలిచేవారు. వీటిపై పన్ను మినహాయింపు ఉండేది. రాజోద్యోగులు, పండితులు, కవులు, శాస్త్రవేత్తలకు ఇచ్చిన గ్రామాలను 'ఉంబళి గ్రామాలు'గా పిలిచేవారు. నిత్య పూజా పునస్కారాలు, ఉత్సవాల నిర్వహణకు పూర్తిగా పన్నులు మినహాయించి ఇచ్చిన గ్రామాలను 'దేవాదాయ గ్రామాలు'గా గుర్తించేవారు. శైవ, వైష్ణవ మఠాధిపతులకు దానమిచ్చిన గ్రామాలను 'మఠాపుర గ్రామాలు' అని పిలిచేవారు. రాజగ్రామాలను 'భండారవాడ' గ్రామాలని పిలిచేవారు.

సాహిత్యం - కళలు

ఈ యుగంలో తెలుగు, కన్నడ, తమిళ, సంస్కృత భాషల్లో సాహిత్యం వికసించింది. కుమార కంపన భార్య గంగాదేవి సంస్కృతంలో 'మధురా విజయం' రచించింది. తిరుమలాంబిక 'వరదాంబిక పరిణయం', రామభద్రాంబిక 'రఘునాథాభ్యుదయం', రాజనాథ డిండిముడు 'సాళువాభ్యుదయం', రెండో దేవరాయలు బ్రహ్మసూత్రాలపై వ్యాఖ్యానం, శ్రీకృష్ణదేవరాయలు 'జాంబవతీ పరిణయం', 'ఉషా పరిణయం', 'మదాలస చరిత్ర', 'ఆముక్తమాల్యద' గ్రంథాలు రచించారు. విద్యారణ్యుడు 'సంగీతసారం', బండారు లక్ష్మీనారాయణ 'సంగీత సూర్యోదయం', నారాయణ తీర్థులు 'కృష్ణ లీలాతరంగిణి' రచించారు.

బహమనీ సుల్తానులు

ఢిల్లీ సుల్తాన్ మహ్మద్ బిన్ తుగ్లక్‌పై తిరుగుబాటు చేసి, దక్కన్‌లో బహమనీ అమీర్లు క్రీ.శ. 13వ శతాబ్దంలో స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పద్నాలుగు మంది బహమనీ సుల్తాన్లు సుమారు 175 ఏళ్లు దక్కన్‌ను పాలించారు. విజయనగర రాజులు వీరికి సమకాలీకులు. క్రీ.శ. 1347లో దౌలతాబాద్ కేంద్రంగా హసన్ గంగూ అనే అబుల్ ముజాఫర్ సుల్తాన్, అల్లా ఉద్దీన్ హసన్ మహ్మద్‌షా బహమనీ పేరుతో సింహాసనాన్ని అధిష్ఠించి బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడినే అల్లా ఉద్దీన్ బహమనీషా అని కూడా పిలుస్తారు. గుల్బర్గా ఇతడి రాజధాని. ఇతడు తన రాజ్యాన్ని బీరార్ నుంచి కృష్ణానది దక్షిణ ప్రాంతం వరకు, తూర్పు దిశలో వరంగల్, తెలంగాణా ప్రాంతాలు, పశ్చిమ తీరంలో గోవా, దభోల్ ఓడరేవు ప్రాంతాల వరకు విస్తరించాడు. ఇతడికి 'సికిందర్ ఇసానీ' అనే బిరుదు ఉంది. అంటే రెండో అలెగ్జాండర్ అని అర్థం. ఇతడు రాజధాని గుల్బర్గాను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాడు. రాజ్యాన్ని గుల్బర్గా, దౌలతాబాద్, బీదర్, బీరార్ అనే నాలుగు తరాఫ్‌లు(రాష్ట్రాలు)గా విభజించి తరాఫ్‌దార్ల (గవర్నర్ల)ను నియమించాడు. అల్లా ఉద్దీన్ బహమనీ షా మలేరియా జ్వరంతో 1358లో మరణించాడు. ఈ వివరాలు బుర్హన్ - ఎ - మసీర్ గ్రంథం ద్వారా తెలుస్తున్నాయి.

మహ్మద్‌షా (1358-1377)

ఇతడు అల్లా ఉద్దీన్ బహమనీషా పెద్ద కుమారుడు. దక్షిణ హిందూ పాలకులైన ముసునూరి నాయకులు, విజయనగర రాజులతో నిరంతరం యుద్ధాలు చేశాడు. విజయనగర సంగమ వంశరాజు మొదటి బుక్కరాయలతో ముద్గల్ కోట కోసం యుద్ధం చేశాడు. వరంగల్ కాకతీయ నాయకునిపై దాడి చేశాడు. మహ్మద్ షా తన రాజ్యంలో శాంతి భద్రతలు కాపాడాడు. ఎనిమిది మంది మంత్రులున్న సభ ద్వారా పరిపాలన నిర్వహించేవాడు. షేక్ ఉల్ మషాయి జైనుద్దీన్, ఐనుద్దీన్ లాంటి పండితులు ఉండటం వల్ల ఇతడి ఆస్థానం పండిత కేంద్రంగా ఉండేదని 'బహమనీస్ ఆఫ్ దక్కన్' గ్రంథంలో వివరించారు.

రెండో మహ్మద్‌షా (1377-97)

రెండో మహ్మద్‌షా శాంతి కాముకుడిగా పేరు పొందాడు. విద్యాగోష్ఠులు, విద్వాంసులతో ఎక్కువ కాలం గడిపేవాడు. ప్రసిద్ధ పారశీక కవి హఫీజ్‌ను తన ఆస్థానానికి ఆహ్వానించాడు. హఫీజ్‌ను ప్రజలు రెండో అరిస్టాటిల్ (గ్రీకు తత్వవేత్త)గా కీర్తించారు. ఇతడి కాలంలోనే రెండో హరిహరరాయలు అంతర్వేది ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు. అనేక మసీదులు, పేదల వసతి గృహాలు, పాఠశాలలను రెండో మహ్మద్‌షా నిర్మించాడు. గుల్బర్గా, బీదర్, ఎలిచ్‌పూర్, దౌలతాబాద్‌లో అనాథలకు ఉచిత పాఠశాలలు నిర్మించాడు. బహమనీ రాజ్యంలో 1387-97 ప్రాంతంలో తీవ్ర క్షామం సంభవించింది. పదివేల ఎద్దులను ఉపయోగించి, మాళ్వా, గుజరాత్ నుంచి ఆహార ధాన్యాలను తెప్పించి తక్కువ ధరలకు అమ్మించాడు. కానీ ఈ పథకాలన్నీ మహ్మదీయులకు మాత్రమే పరిమితమైనట్లు తెలుస్తోంది.

'హరిభజియించు హస్తములు హస్తములు'

అలంకారాలు

టెట్ / డీఎస్సీ పరీక్షల్లో అలంకారాలపై తప్పనిసరిగా ప్రశ్నలు వస్తాయి. అందువల్ల అభ్యర్థులు శబ్దాలంకారాలైన వృత్త్యనుప్రాసం, ఛేకానుప్రాసం, లాటానుప్రాసం, అంత్యాను ప్రాసం, యమకం, ముక్తపదగ్రస్తం లాంటి వాటి గురించి తెలుసుకోవాలి. అర్థాలంకా రాలైన ఉపమ, ఉత్ప్రేక్ష, రూపకం, అతిశయోక్తి, శ్లేష, దృష్టాంతం, అర్థాంతరన్యాసం, స్వభావోక్తి, సమాసోక్తి తదితరాలను చదవాలి.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

శబ్దాలంకారాలు

శబ్ద వైచిత్రీ రమణీయత వల్ల కావ్యానికి సౌందర్యాన్ని చేకూర్చేవి శబ్దాలంకారాలు. ఇవి శ్రవణ లాలిత్యంతో పాఠకులకు ఆహ్లాదం కలిగిస్తాయి.

1. **వృత్త్యనుప్రాసం:** ఒకే వర్ణం లేదా రెండు, మూడు వర్ణాలు పునరుక్తాలై ఆహ్లాదం కలిగిస్తే అది వృత్త్యనుప్రాసం.

ఉదా: చిట్ట పట్ట చినుకులు పట్ట పట్ట మని
పడుతున్న వేళ...

పై ఉదాహరణలో 'ట' కారం అనేకసార్లు ఆవృతమైంది. కాబట్టి ఇది వృత్త్యనుప్రాసం.

2. **ఛేకానుప్రాసం:** అర్థ భేదంతో రెండేసి హల్లు లను వ్యవధానం లేకుండా ప్రయోగిస్తే దాన్ని ఛేకానుప్రాసం అంటారు.

ఉదా: అనాథ నాథ! నీకు వంద వందనాలు

'నాథ, వంద' అనే హల్లుల జంటలను అర్థ భేదంతో ప్రయోగించారు. అందువల్ల ఇది ఛేకానుప్రాసం.

3. **లాటానుప్రాసం:** తాత్పర్య భేదంతో కూడిన రెండేసి హల్లులను వెంటవెంటనే ప్రయోగిస్తే దాన్ని లాటానుప్రాసం అంటారు.

ఉదా: కమలాక్షు నర్చించు కరములు కరములు పై ఉదాహరణలో 'కరములు' పదాన్ని తాత్పర్య భేదంతో ప్రయోగించారు. అందువల్ల ఇది లాటానుప్రాసం.

4. **అంత్యానుప్రాసం:** ఒక పదం లేదా పాదం లేదా వాక్యం చివరన ఒకే అక్షరం లేదా వర్ణాల సమూహం వస్తే దాన్ని 'అంత్యానుప్రాసం' అంటారు.

ఉదా: కొందరికి రెండు కాళ్లు
రిక్షావాళ్లకి మూడు కాళ్లు
ఉన్నవాళ్లకి నాలుగు కాళ్లు

ప్రతి పాదం చివరన 'కాళ్లు' పదం ఆవృతమైంది. కాబట్టి ఇది అంత్యానుప్రాసం.

5. **యమకం:** సమానమైన స్వర సహితాలైన వ్యంజనాలు అర్థభేదంతో అవ్యవహితంగా పునరుక్తాలైతే దాన్ని 'యమకం' అంటారు.

ఉదా: 'మన సుభద్ర మనసు భద్రమయ్యె'

సుభద్ర అనే పదం అర్థ భేదంతో వచ్చింది. కాబట్టి ఇది యమకం.

6. **ముక్తపదగ్రస్తం:** ఒకే పద్య పాదంలో లేదా వాక్యంలో చివరన వాడిన పదాన్ని రెండో పాదంలో మొదటిపదంగా ఉపయోగిస్తే దాన్ని 'ముక్తపదగ్రస్తం' అంటారు. ముక్తపదగ్రస్తం అంటే 'విడిచిన పదాన్ని గ్రహించడం' అని అర్థం.

ఉదా: మన వేటికి నూతనమా
తనమానిని ప్రేమఁదనకుఁ దక్కితిననుమా

మొదటి పాదంలో చివరి పదం 'తనమా' అనేది రెండో పాదంలో మొదటి పదంగా వచ్చింది. అందువల్ల ఇది ముక్తపదగ్రస్తం.

అర్థాలంకారాలు

అర్థ సౌందర్యంతో కావ్యశోభను ఇనుమ డించేవి అర్థాలంకారాలు. ఇవి అర్థ ప్రధాన మైనవి.

1. **ఉపమాలంకారం:** ఉపమాన ఉపమే యాలకు మనోహరమైన సాదృశ్యాన్ని వర్ణిస్తే అది ఉపమాలంకారం. ఇందులో ఉపమేయం (ప్రస్తుతం), ఉపమానం (అప్రస్తుతం), సమానధర్మం (ఉపమాన ఉపమేయాల్లో సమానంగా ఉండేది) ఉంటాయి. ఉపమావాచకం ఉపమేయ, ఉపమానాలకు, సమన్వయాన్ని సూచిస్తుంది. వలెన్, పోలెన్, ఎంతయున్, కైవడి, భంగి లాంటివి ఉపమావాచకాలు. పైన పేర్కొన్న అన్ని అంశాలుంటే దాన్ని 'పూర్ణోపమాలంకారం' అంటారు. ఏదైనా ఒక అంశం లోపిస్తే దాన్ని 'లుప్తోపమాలంకారం' అంటారు.

ఉదా: 'ఓ కృష్ణా! నీ కీర్తి ఆకాశగంగలో హంస వలె మునుగుతూ ఉంది'.

పై ఉదాహరణలో 'కీర్తి' ఉపమేయం, 'హంస' ఉపమానం, 'మునుగుతూ ఉండటం' సమానధర్మం, 'వలె' ఉపమావాచకం. అన్ని అంశాలు ఉన్నాయి కాబట్టి ఇది పూర్ణోపమాలంకారం.

2. **ఉత్ప్రేక్షాలంకారం:** జాతి, గుణ, ధర్మ సామ్యంతో ఉపమేయాన్ని ఉపమానంగా ఊహిస్తే అది ఉత్ప్రేక్షాలంకారం. తలంచె దన్, ఎంచెదన్, భావించెదన్, అనన్ మొదలైనవి ఉత్ప్రేక్ష వాచకాలు.

ఉదా: 'ఈ చీకటిని చక్రవాక విరహాగ్ని నుంచి పుట్టిన ధూమమో అని తలంతును'

ఉపమేయమైన 'చీకటి'ని ఉపమానమైన 'ధూమం'గా ఊహించడం వల్ల ఇది ఉత్ప్రేక్ష అలంకారం.

3. **రూపకాలంకారం:** ఉపమేయంలో ఉప మాన ధర్మాన్ని ఆరోపించి వర్ణించినా లేదా ఉపమేయ ఉపమానాలకు భేదం లేనట్లు వర్ణించి చెప్పినా అది రూపకాలంకారం.

ఉదా: 'లతాలలనలు రాజుపై కుసుమాక్షతలు చల్లిరి'. ఇందులో ఉపమేయమైన లత లలో ఉపమానమైన లలనల ధర్మాన్ని ఆరోపించారు. ఉపమేయమైన కుసు మాల్లో ఉపమానమైన అక్షతల ధర్మాన్ని ఆరోపించారు. అందువల్ల ఇది రూపక అలంకారం.

4. **అతిశయోక్తి అలంకారం:** లోకస్థితిని మించి అతిశయించి వర్ణిస్తే అది అతిశయోక్తి అలంకారం. ఇందులో గోరంతను కొండత చేసి వర్ణిస్తారు.

ఉదా: 'దేవాలయ గోపుర శిఖరాలు ఆకాశాన్ని తాకుతున్నాయి'. గోపుర శిఖరం మిక్కిలి ఎత్తైందనే విషయాన్ని అతిశయించి చెప్పడం వల్ల ఇది అతిశయోక్తి అలంకారం.

5. **అర్థాంతరన్యాసాలంకారం:** సామాన్యాన్ని విశేషంతో లేదా విశేషాన్ని సామాన్యంతో సమర్థించి చెబితే అది అర్థాంతర న్యాసాలంకారం.

ఉదా: 'హనుమంతుడు సముద్రాన్ని లంఘించాడు. మహాత్ములకు సాధ్యం కానిది లేదు గదా!'

ఇందులో హనుమంతుడు సముద్రాన్ని దాటడం విశేష విషయం. దీన్ని 'మహాత్ములకు సాధ్యం కానిది లేదు గదా!' అనే సామాన్య విషయంతో సమర్థించారు. కాబట్టి ఇది అర్థాంతరన్యాసాలంకారం.

6. **స్వభావోక్తి అలంకారం:** జాతి, గుణ క్రియాదుల స్వభావాలను ఉన్నవి ఉన్నట్లు సహజసిద్ధంగా, మనోహరంగా వర్ణించి చెబితే అది 'స్వభావోక్తి' అలంకారం.

ఉదా: 'ఆ ఉద్యానవనంలో లేళ్లు చెవులు రిక్కించి చంచల నేత్రాలతో.. అటూ, ఇటూ గంతులేస్తున్నాయి'. ఇందులో లేళ్ల స్థితిని ఉన్నది ఉన్నట్లు సహజంగా వర్ణించారు. అందువల్ల ఇది స్వభావోక్తి అలంకారం.

7. **దృష్టాంతాలంకారం:** ఉపమాన ఉపమేయాల్లో ఉన్న భిన్న ధర్మాలను 'బింబ ప్రతిబింబ భావం'తో వర్ణిస్తే అది దృష్టాంత అలంకారం

ఉదా: ఓ రాజా! నీవే కీర్తిమంతుడవు
చంద్రుడే కాంతిమంతుడు

ఇందులో కీర్తిమత్వ కాంతిమత్వాలు భిన్న ధర్మాలైనా వాటి బింబ ప్రతిబింబ భావాలు వర్ణించారు. కాబట్టి ఇది దృష్టాంతాలంకారం.

8. **శ్లేషాలంకారం:** ఒక వాక్యంలో అనేక అర్థాలు వచ్చేట్లు పదాలను కూర్చడాన్ని శ్లేషాలంకారం అంటారు.

ఉదా: 'రాజు కువలయానందకరుడు'. ఇందులో 'రాజు' శబ్దానికి పాలకుడు, చంద్రుడు అనే అర్థాలున్నాయి. కువలయం అంటే భూమి, కలువ పువ్వు అనే అర్థాలున్నాయి. 'రాజు భూప్రజలకు పాలనతో ఆనందం కలిగించేవాడు' అని ఒక అర్థం, చంద్రుడు కలువలను వికసింపజేసి ఆనందాన్ని కలిగిస్తాడని మరో అర్థం వచ్చినందు వల్ల ఇది శ్లేషాలంకారం.

9. **సమాసోక్తి అలంకారం:** ప్రస్తుత వర్ణనతో అప్రస్తుత విషయం స్ఫురిస్తే అది సమాసోక్తి అలంకారం.

ఉదా: 'చంద్రుడు రక్తుడై ఐంద్రీముఖాన్ని ముద్దాడుచున్నాడు'. ప్రస్తుత వర్ణన వల్ల పరాకాంతాచుంబనాభిలాషుడైన కాము కుడు స్ఫురిస్తున్నందు వల్ల ఇది సమాసోక్తి అలంకారం.

మాదిరి ప్రశ్నలు

1. 'కుముదినీ రాగరసబద్ధ గుళికయనగ చంద్రుడుదయించె కాంతిని స్తంద్రుడగుచు' వాక్యంలోని అలంకారం ఏది?
   1) ఉపమాలంకారం 2) ఉత్ప్రేక్ష అలంకారం
   3) రూపకాలంకారం 4) అతిశయోక్తి
2. 'ఆ తోరణం శత్రువులతో రణానికి కారణ మైంది' వాక్యంలోని అలంకారం ఏది?
   1) లాటానుప్రాసం 2) ఛేకానుప్రాసం
   3) యమకం 4) వృత్త్యనుప్రాసం
3. ఉపమాన ఉపమేయాలకు చక్కని సాదృశ్యాన్ని చెబితే అది ఏ అలంకారం?
   1) ఉపమా 2) ఉత్ప్రేక్ష
   3) స్వభావోక్తి 4) సమాసోక్తి
4. అర్థభేదం లేకుండా తాత్పర్య భేదంతో కూడిన రెండు హల్లుల జంటలు వెంట వెంటనే ప్రయోగిస్తే అది ఏ అలంకారం?
   1) వృత్త్యనుప్రాసం 2) ముక్తపదగ్రస్తం
   3) ఛేకానుప్రాసం 4) లాటానుప్రాసం
5. 'సుదతీ నూతనమదనా
   మదనా గతురంగపూర్ణ మణిమయసదనా!'
   లో ఉన్న అలంకారం ఏది?
   1) యమకం 2) ముక్తపదగ్రస్తం
   3) లాటానుప్రాసం 4) అంత్యానుప్రాసం
6. 'రంగధరాతిభంగ ఖగరాజతురంగ విపత్పరం పరోత్తుంగ' పద్య పాదంలో ఉన్న అలంకారం ఏది?
   1) ఛేకానుప్రాసం 2) వృత్త్యనుప్రాసం
   3) యమకం 4) అంత్యానుప్రాసం
7. 'చుక్కలు తలపూవులుగా
   అక్కజముగమేనుపెంచి యంబరవీథిన్'
   పద్య పాదాల్లో ఉన్న అలంకారం ఏది?
   1) స్వభావోక్తి 2) అర్థాంతరన్యాసం
   3) అతిశయోక్తి 4) ఉత్ప్రేక్ష
8. 'హరిభజియించు హస్తములు హస్తములు' వాక్యంలోని అలంకారం ఏది?
   1) ఛేకానుప్రాసం 2) లాటానుప్రాసం
   3) వృత్త్యనుప్రాసం 4) యమకం
9. 'మిమ్ము మాధవుడు రక్షించుగాక!' వాక్యం లో ఉన్న అలంకారం ఏది?
   1) అర్థాంతరన్యాసం 2) స్వభావోక్తి
   3) సమాసోక్తి 4) శ్లేష
10. ప్రస్తుత వర్ణనతో అప్రస్తుత విషయం స్ఫురిస్తే అది ఏ అలంకారం?
    1) సమాసోక్తి 2) అప్రస్తుత ప్రశంస
    3) రూపకం 4) ఉపమా
11. 'శివాజీ కల్యాణీదుర్గాన్ని జయించాడు
    వీరులకు సాధ్యంకానిది లేదు కదా!'
    వాక్యాల్లో ఉన్న అలంకారం ఏది?
    1) అతిశయోక్తి 2) అర్థాంతరన్యాసం
    3) సమాసోక్తి 4) స్వభావోక్తి
12. 'పగయ కలిగెనేని పాము న్న యింటిలో
    ఉన్నయట్లు కాక యూఱడిల్లి ఉండునెట్లు చిత్తము?' - పాదాల్లో ఉన్న అలంకారం?
    1) ఉత్ప్రేక్ష 2) రూపకం
    3) ఉపమా 4) అతిశయోక్తి
13. 'ఆమె కదనతో వడి వడి అడుగులతో గడప దాటింది' వాక్యంలో ఉన్న అలంకారం?
    1) వృత్త్యనుప్రాసం 2) ఛేకానుప్రాసం
    3) లాటానుప్రాసం 4) యమకం
14. 'మానవ జీవితం సుకుమారమైంది' వాక్యంలో ఉన్న అలంకారం ఏది?
    1) స్వభావోక్తి 2) శ్లేష
    3) సమాసోక్తి 4) ఉత్ప్రేక్ష
15. 'ఆ రాజు సాక్షాత్తు ఈశ్వరుడే' - ఈ వాక్యంలో ఉన్న అలంకారం ఏది?
    1) అనన్వయం 2) రూపకం
    3) ఉత్ప్రేక్ష 4) అతిశయోక్తి

సమాధానాలు

1) 2	2) 3	3) 1	4) 4
5) 2	6) 2	7) 3	8) 2
9) 4	10) 1	11) 2	12) 3
13) 1	14) 2	15) 2	

గూగుల్‌లో ‘గల్ఫ్ ఆఫ్ అమెరికా’

శాన్ ఫ్రాన్సిస్కో: అమెరికా ప్రభుత్వ ఆదేశాల మేరకు అమెరికా తీరప్రాంతమైన చరిత్రాత్మక ‘గల్ఫ్ ఆఫ్ మెక్సికో’ పేరును సెర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్.. ‘గల్ఫ్ ఆఫ్ అమెరికా’గా పేర్కొంది. అయితే



ఈ పేరు మార్పును కేవలం అమెరికా ఇంటర్నెట్ విని యోగదారులకు పరిమితం చేసింది. మెక్సికోలో ఇంట ర్నెట్ వినియోగదారులు ‘గల్ఫ్ ఆఫ్ మెక్సికో’ అని టైప్ చేస్తే అదే పాత పేరుతోనే సెర్చ్ రిజల్ట్ వస్తుంది. మిగతా ప్రపంచానికి గల్ఫ్ ఆఫ్ మెక్సికో(గల్ఫ్ ఆఫ్ అమెరికా) అని కనిపిస్తుంది. ఈ విషయాన్ని తమ ‘గూగుల్ మ్యాప్స్’ బ్లాగ్‌లో గూగుల్ పోస్ట్ చేసింది. ఇలా ఒకే ప్రాంతానికి మూడు పేర్లతో పిలవనున్నట్లు గూగుల్ తన వెబ్‌మ్యాపింగ్ ప్లాట్‌ఫామ్‌లో పేర్కొంది. అంటే ప్రపంచంలోని ఒకే భౌగోళిక ప్రాంత మ్యాప్ అమెరికాలో ఒక పేరుతో, మెక్సికోలో ఇంకో పేరుతో, మిగతా దేశాలకు రెండూ కలిపి కనిపిస్తుందన్నమాట. ‘‘అమెరికాలో జియోగ్రాఫిక్ నేమ్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఎన్ఐఎస్) అధికారికంగా ‘గల్ఫ్ ఆఫ్ మెక్సికో’ను ‘గల్ఫ్ ఆఫ్ అమెరికా’గా మార్చేసింది. మేము రెండు వారాల క్రితం ప్రకటించినట్లుగా, మేం అనుసరిస్తున్న విధానాలకు అనుగుణంగా ఈ మార్పులను చేశాం’’ అని బ్లాగ్‌లో గూగుల్ పేర్కొంది. ‘‘అమెరికాలో గూగుల్ మ్యాప్‌ను ఉపయోగించే వినియోగదారులకు ఆ భౌగోళిక ప్రాంతం ‘గల్ఫ్ ఆఫ్ అమెరికా’గా కనిపిస్తుంది. మెక్సికో ప్రజలకు ‘గల్ఫ్ ఆఫ్ మెక్సికో’గా కనిపిస్తుంది. ప్రపంచంలోని మిగతా దేశాల్లో యూజర్లకు గల్ఫ్ ఆఫ్ మెక్సికో(గల్ఫ్ ఆఫ్ అమెరికా) అని కనిపిస్తుంది.

‘గల్ఫ్ ఆఫ్ అమెరికా డే’

పేరు మార్పు కోసం కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చేసిన తరువాత ఫిబ్రవరి 9వ తేదీని ‘గల్ఫ్ ఆఫ్ అమెరికా దినోత్సవం’గా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. గల్ఫ్‌లో ఉన్న న్యూ ఓర్లీన్స్‌లోని సూపర్‌బౌల్‌కు వెళ్తూ ఫిబ్రవరి 10న డిక్లరేషన్‌పై ఆయన సంతకం చేశారు. ‘‘గల్ఫ్ ఆఫ్ అమెరికా పేరు మార్చిన తర్వాత ఈ రోజు నేను తొలిసారి సందర్శిస్తున్నాను’’ అని వైట్ హౌస్ వెబ్‌సైట్‌లో ప్రచురించిన డిక్లరేషన్‌లో ట్రంప్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 9న వేడుకలు జరుపుకోవాలని, పలు కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ప్రభుత్వ అధికారులకు, అమెరికా ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రమాణ స్వీకారం రోజే పేరు మార్పు

జనవరి 20న అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ‘గల్ఫ్ ఆఫ్ మెక్సికో’ పేరు మార్పుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఇంటీరియర్ డిపార్ట్‌మెంట్‌కు 30 రోజుల గడువు ఇస్తూ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకే ట్రంప్ ప్రభుత్వంలోని అంతర్గత విభాగం అధికారికంగా పేరు మార్పును అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. వెంటనే, యూఎస్ కోస్ట్‌గార్డ్ సైతం గల్ఫ్ ఆఫ్ అమెరికాను ఉపయోగించడం ప్రారంభించింది. అధ్యక్షుడి ఆదేశాల మేరకు గల్ఫ్ ఆఫ్ మెక్సికోను అధికారికంగా గల్ఫ్ ఆఫ్ అమెరికాగా, ఉత్తర అమెరికాలోని ఎత్తైన శిఖరం డెనాలీ పేరును దాని పూర్వపు పేరు ‘మౌంట్ మెక్ కిన్లీ’గా మారుస్తున్నట్లు అంతర్గత విభాగం తెలిపింది. 2015లో అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా అలాస్కా పర్వతాన్ని డెనాలీగా అధికారికంగా గుర్తించారు. ఈ పేరును శతాబ్దాలుగా అలాస్కా స్థానికులు ఉపయోగిస్తున్నారు. అయితే ట్రంప్ పేరు మార్పును అలాస్కాలోని స్థానిక సమూహాలు విమర్శిస్తున్నాయి.



బెంగళూరులో జరుగుతున్న ఏరో ఇండియా–2025 ప్రదర్శనలో సీఏటీఎస్ వారియర్ మోడల్ యుద్ధ విమానం



సూర్యకిరణ్ యుద్ధ విమానాల విన్యాసాలు

మల్టీ రోల్ బ్యారెల్



అత్యంత అధునాతనమైన ఐదో తరం స్టెల్త్ విమాన శ్రేణికి చెందిన మధ్యతరహా యుద్ధ విమానం (ఏఎంసీఏ)

డీప్‌సీక్ వినియోగంపై ప్రభుత్వ అడ్వైజరీ!

డేటా భద్రత ప్రశ్నార్థకంగా మారడంతో కేంద్రం కసరత్తు



న్యూఢిల్లీ: కృత్రిమ మేధ రంగంలో సంచలనం సృష్టించిన చైనాలోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్ ‘డీప్‌సీక్’తో భారతీయ కంప్యూటర్లలో డేటా గోప్యత ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళనలు రేకెత్తడంతో కేంద్రం అప్రమత్తమవుతోంది. డీప్‌సీక్ వంటి ఏఐ వినియోగంపై తగు సూచనలు, సలహాలు, హెచ్చరికలతో అధికారిక అడ్వైజరీని జారీ చేయడానికి కేంద్రం సిద్ధమవుతోంది. సైబర్ సెక్యూరిటీ ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో వినియోగదారులను హెచ్చరిస్తూ ఈ ఉత్తర్వులు తీసుకురానుంది. డీప్‌సీక్ తన ఏఐ చాట్‌బాట్ ఆర్1 ద్వారా సున్నితమైన యూజర్ డేటాను ఎలా యాక్సెస్ చేస్తోందనే దానిపై భారత సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ అయిన కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సీఈఆర్‌టీ–ఇన్) సమగ్రస్థాయిలో దర్యాప్తు చేస్తోంది. దర్యాప్తు పూర్తయ్యాక చర్యలు చేపడుతుంది. యూజర్ ప్రాంప్ట్స్, డివైజ్ ఇన్ఫర్మేషన్, యాప్ ఇంటరాక్షన్స్, కీ స్ట్రోక్‌లతో విస్తృత శ్రేణి డేటాను డీప్‌సీక్ సేకరిస్తోందని సీఈఆర్‌టీ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత గోప్యత, జాతీయ భద్రతా ప్రయోజనాలు రెండింటినీ దృష్టిలో పెట్టుకుని భద్రతా చర్యలను వేగవంతం చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు..

భారత్ మాత్రమే కాదు ఆస్ట్రేలియా, ఇటలీ, దక్షిణ కొరియాతో సహా అనేక దేశాలు గోప్యత, భద్రతా ప్రమాదాల దృష్ట్యా ప్రభుత్వ విభాగాలు, అధికారిక కంప్యూటర్ల, కీలక వ్యవస్థల్లో డీప్‌సీక్ టూల్స్ వినియోగంపై ఆయా దేశాల ప్రభుత్వాలు నిషేధం విధించాయి. విడుదల నాటినుంచే ప్రపంచవ్యాప్తంగా డీప్‌సీక్ సంచలనం సృష్టించడంతోపాటు కొత్త భయాందోళనలకు తెరలేపింది. అత్యద్భుతమైన పనితీరుతో ఏఐ మోడల్ మొదట ప్రశంసలు పొందినా.. దాని డేటా సేకరణ పద్ధతులతో పలు దేశాల ప్రభుత్వాలు ఆందోళనలో పడ్డాయి. ప్రైవసీ, మాల్‌వేర్ ప్రమాదాల కారణంగా డీప్‌సీక్‌ను ఆస్ట్రేలియా నిషేధించింది. తైవాన్ దీనిని దేశ భద్రతా ముప్పుగా పేర్కొంది. యూజర్ డేటాను ఉపయోగించడంలో పారదర్శకతను చూపకపోవడంతో దక్షిణ కొరియా దీనిని జాతీయ భద్రతా ప్రమాదంగా ప్రకటించింది. తమ పౌరుల డేటాను ప్రాసెస్ చేయకుండా ఇటలీ డీప్‌సీక్‌ను అడ్డుకుంటోంది. డీప్‌సీక్ వారి ఆర్1 మోడల్‌పై దర్యాప్తు ప్రారంభించింది. ఉచిత సేవలు అందించే డీప్‌సీక్ వంటి యాప్‌లు యూజర్ల డేటాను సేకరించి దానికి ముడిసరకుగా వినియోగిస్తున్నాయని సైబర్ సెక్యూరిటీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాశ్చాత్య టెక్ కంపెనీల మాదిరిగా కాకుండా డీప్‌సీక్ కేవలం చైనా ప్రభుత్వ చట్టాల ప్రకారం పనిచేస్తుంది.

ప్రామాణిక డేటాను మించి..

ప్రామాణిక డేటా సేకరణ పద్ధతులతోపాటు ఇతర మార్గాల్లోనూ వినియోగదారుల ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కార్యకలాపాలను డీప్‌సీక్ ట్రాక్ చేస్తోందని సీఈఆర్‌టీ పరిశోధనలో తేలింది. చాట్‌బాట్ ఆర్1 వినియోగించడం మొదలుపెట్టిన తరువాత.. చాట్ జీపీటీ లేదా గూగుల్‌కు చెందిన జెమినీ వంటి పోటీ యాప్‌లను యూజర్లు ఉపయోగించడం మానేశారా లేదా అనే విషయాన్ని కూడా ఈ యాప్ చెక్‌చేస్తోంది. తాము సేకరించిన సున్నితమైన డేటా తమ వద్ద భద్రంగా ఉంటుందని, చైనా ప్రభుత్వానికి చేరబోదు అనే సరైన వివరణ డీప్‌సీక్ ఇవ్వట్లేదు. దీంతో డీప్‌సీక్‌కు జవాబుదారీతనం లేదని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ యాప్‌తో వ్యక్తిగత డేటా చైనాకు చేరుతోంది. దీంతో డీప్‌సీక్ యూజర్ల నిఘా లేదా సైబర్ గూఢచర్యం వంటి దుర్వినియోగానికి గురయ్యే ప్రమాదం ఉంది. చాట్‌జీపీటీ, డీప్ సీక్ వంటి ఏఐ టూల్స్‌ను ప్రభుత్వ అధికారులు ఉపయోగించరాదని ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఐటీ మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.



మహా కుంభమేళా సందర్భంగా మంగళవారం ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమానికి పోటెత్తిన భక్త జనం

45 కోట్ల ‘మహా’ కుంభ్

- అంచనాలకు మించి భారీగా భక్తులు
- మాఘ పూర్ణిమ సందర్భంగా నేడు పోటెత్తనున్న జనం
- మేళా ప్రాంతంలో ఇప్పటికే నో వెహికిల్ జోన్‌గా ప్రకటన

సాక్షి, న్యూఢిల్లీ: ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకి భక్తులు ఊహించని స్థాయిలో పోటెత్తుతున్నారు. కుంభమేళా జరిగే 45 రోజుల్లో మొత్తంగా 45 కోట్ల మంది భక్తులు పవిత్ర గంగా నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారని ప్రభుత్వం అంచనా వేయగా, కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఆ సంఖ్య దాటిపోయింది. ఈ నెల 11 నాటికే కుంభమేళాకు వచ్చిన భక్తుల సంఖ్య 45 కోట్లకు చేరిందని, మహా కుంభమేళా చరిత్రలో అతిపెద్ద మతపరమైన సమావేశాలలో ఇది ఒకటిగా మారిందని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ఆధ్యాత్మిక ప్రాముఖ్యత, గొప్ప ఆచారాలు, అత్యాధునిక సాంకేతిక సమ్మిళితంగా, ఈ కుంభమేళా జన సమూహ నిర్వహణ, పారిశుధ్యం, డిజిటల్ సౌకర్యాలలో కొత్త ప్రమాణాలను నెలకొల్పిందని ప్రకటించింది.

నేడు నో వెహికిల్ జోన్‌గా మేళా ప్రాంతం..

కాగా బుధవారం మాఘ పూర్ణిమ సందర్భంగా కోట్ల మంది భక్తులు అమృత్ స్నానాలను ఆచరించే అవకాశం ఉందని యూపీ ప్రభుత్వం అంచనా వేస్తోంది. మాఘ పూర్ణిమ స్నానం, గురు బృహస్పతి పూజతో సంబంధం కలిగి ఉండటం, గంధర్వుడు స్వర్గం నుండి పవిత్ర సంగమానికి దిగుతాడనే నమ్మకానికి ప్రసిద్ధి చెందడంతో ఈ స్నానమాచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో మాఘ పూర్ణిమ స్నానం సమయంలో జనసమూహ నిర్వహణను నిర్ధారించడానికి , రాష్ట్ర ప్రభుత్వం నెల 11 ఉదయం 5 గంటల నుంచే మేళా ప్రాంతాన్ని ‘వాహనాలు నిషేధించబడిన ప్రాంతం’(నో వెహికిల్ జోన్)గా ప్రకటించింది. అవసరమైన, అత్యవసర సేవలను అందించే వాహనాలను మాత్రమే అనుమతిస్తుంది. మాఘ పూర్ణిమ తర్వాత ఈ నెల 26 శివరాత్రి రోజున అధిక సంఖ్యలో భక్తులు స్నానమాచరిస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

7 లక్షల మందికి పైగా వైద్య సేవలు..

ఇక మేళాకు వచ్చే భక్తులకు విస్తృతమైన ఆరోగ్య సంరక్షణ సేవల ద్వారా 7 లక్షలకు పైగా యాత్రికులు వైద్య సంరక్షణ పొందారని యూపీ ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో 23 అల్లోపతి ఆసుపత్రులలో 4.5 లక్షలకు పైగా వ్యక్తులకు చికిత్స అందించామని, 3.71 లక్షలకు పైగా పాథాలజీ పరీక్షలు చేయించుకున్నారని తెలిపింది.

మూడు రోజుల ఫ్రెంచ్ పర్యటనకు ప్రధాని నరేంద్ర మోదీ వెళ్లడంతో ఇప్పుడు అందరి దృష్టి పారిస్ వైపు మళ్లింది. ప్రధాని మోదీ ఫ్రాన్స్‌లో పర్యటించడం ఇది ఆరోసారి. అధ్యక్షుడు మాక్రాన్‌తో కీలక రక్షణ, అణు ఇంధన ఒప్పందాలపై సంతకాలు చేసి భారత్ –ఫ్రాన్స్ సంబంధాలను మరింత బలోపేతం చేయనున్నారు. ఇవన్నీ పక్కన పెడితే భారతీయ విద్యార్థులను ఆకర్షించడానికి అనుకూలమైన విద్యార్థి వీసా, వర్క్ పర్మిట్లను పారిస్ ప్రకటిస్తుందని నివేదికలు చెబుతున్నాయి. ఇంతకుముందు బిగ్ ఫోర్‌గా పేరుగాంచిన అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా దేశాలు భారతీయ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి తొలు నాలుగు గమ్యస్థానాలుగా ఉండేవి. ఇటీవలి కాలంలో ఈ ధోరణి మారింది. యూరప్ దేశాలు ముఖ్యంగా ఫ్రాన్స్ భారతీయ విద్యార్థులకు టాప్ చాయిస్‌గా మారింది. హెచ్‌ఈసీ పారిస్ బిజినెస్ స్కూల్, సోర్బోన్ విశ్వవిద్యాలయం, ఎకోల్ పాలిటెక్నిక్ వంటి 75 కి పైగా ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు, వ్యాపారం, కళలు, సాంకేతికత, శాస్త్రాలలో అగ్రశ్రేణి ప్రోగ్రామ్‌లను అందిస్తున్నాయి. దీంతో ఫ్రాన్స్‌లో ఉన్నత విద్య పట్ల భారతీయ విద్యార్థులకు మక్కువ ఎక్కువైంది. 2023–24 విద్యా సంవత్సరంలో 7,344 మంది భారతీయ విద్యార్థులు ఫ్రాన్స్‌లోని విద్యాసంస్థల్లో చేరారు. 2030 నాటికి ఈ సంఖ్య 200 శాతం పెరుగుతుందని అంచనా. 2024 జనవరిలో రెండు రోజులపాటు భారత్‌లో పర్యటించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ భారతీయ విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడారు. 2030 నాటికి భారత్ నుంచి 30,000 మంది విద్యార్థులను ఆహ్వానించడమే తమ దేశ లక్ష్యమని ఆనాడు మాక్రాన్ తన మనసులో మాట చెప్పారు. ఇటీవల వేలాది మంది భారతీయ విద్యార్థులతో అభిప్రాయాలతో రూపొందిన క్యూఎస్ నివేదిక ప్రకారం ఫ్రాన్స్ తమ ఇష్టమైన గమ్యస్థానమని 31 శాతం మంది భారతీయ విద్యార్థులు చెప్పడం విశేషం. భారతీయ విద్యార్థులలో దాదాపు 50 శాతం మంది ఫ్రాన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. 21 శాతం మంది అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులపై ఆసక్తి చూపుతున్నారు.

ఫ్రాన్స్ పిలుస్తోంది

ఉన్నత విద్యకు భారతీయ విద్యార్థుల టాప్ ఛాయిస్

అందుకనుగుణంగా వీసా ప్రక్రియను సరళతరం చేస్తున్న ఫ్రాన్స్



ఖర్చు తక్కువ..

భారతీయ విద్యార్థులను ఫ్రెంచ్ విశ్వవిద్యాలయాల వైపు నడిపించిన అంశాలు అనేకం ఉన్నాయి. ఫ్రెంచ్ ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో విద్యా ప్రమాణాలు ఉన్నతంగా ఉన్నాయి. బిజినెస్, డేటా అనలిటిక్స్, ఫ్యాషన్‌తోపాటు విస్తృతమైన కోర్సులను కూడా అందిస్తున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే ఫ్రాన్స్‌లో ఉన్నత విద్య ఖర్చు మిగతా బిగ్‌ఫోర్ దేశాలతో పోలిస్తే తక్కువ. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో తక్కువ ట్యూషన్ ఫీజులు ఉంటాయి. చార్పాక్, ఈఫిల్ ఎక్సలెన్స్ ప్రోగ్రామ్ వంటి అనేక ఆర్థిక సహాయ కార్యక్రమాలు కూడా ఇక్కడ చేపడతారు. భారత విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 15 కోట్ల రూపాయలకు పైగా ఉపకార వేతనాలను ఫ్రాన్స్ అందిస్తోంది. ఫ్రాన్స్‌లో జీవన వ్యయం కూడా తక్కువే. పారిస్‌లో నెలకు సగటున రూ.1.54 లక్షలు, లియోన్‌లో రూ.1.01 లక్షలు వంటి బడ్జెట్ ఫ్రెండ్లీ ఆప్షన్స్ ఉన్నాయి. ఇతర నగరాల్లో సగటు జీవన వ్యయం నెలకు లక్ష రూపాయల కన్నా తక్కువ. ఫ్రాన్స్‌లోని విశ్వవిద్యాలయాలు చాలా మంచి ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్‌లను అందిస్తున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఫ్రెంచ్ నేర్చుకుంటే..

ట్రంప్ రాకతో మారిన అమెరికా విధానాలు, నిజ్జర్ ఉదంతంతో భారత్–కెనడా మధ్య సత్సంబంధాలు సన్నగిల్లిన నేపథ్యంలో భారతీయ విద్యార్థులను ఆకర్షించేందుకు ఫ్రాన్స్ తన వీసా ప్రక్రియలను సరళతరం చేస్తోంది. ఎక్కువ మంది విద్యార్థులను ఆకట్టుకోవడానికి ఫ్రెంచ్‌తోపాటు ఇంగ్లిష్ భాషలోనూ కోర్సులను అందిస్తోంది. అంతర్జాతీయ తరగతుల ద్వారా ఫ్రెంచ్ బోధిస్తూ అది పూర్తి చేసిన వారికి అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌కు అనుమతిస్తోంది. దీనివల్ల విదేశీ విద్యార్థులకు ఫ్రెంచ్ భాషలో బోధించే 200కి పైగా విద్యా కార్యక్రమాల్లో అవకాశం లభిస్తుంది. అనేక ఫ్రెంచ్ విశ్వవిద్యాలయాలు డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లను అందిస్తున్నాయి. మాస్టర్స్ డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత ఉండి, ఫ్రాన్స్‌లో ఒక సెమిస్టర్ చదివిన భారతీయ విద్యార్థులు ఐదేళ్ల షార్ట్–స్టే స్కెంజెన్ వీసా పొందేందుకు అర్హులు అవుతారు. ఫ్రెంచ్ మాస్టర్స్ డిగ్రీతో పోస్ట్ గ్రాడ్యుయేట్లకు రెండేళ్ల పోస్ట్–స్టడీ వర్క్ వీసాను కూడా ఫ్రాన్స్ అందిస్తుంది. ఈ వీసాను మొత్తం రెండేళ్లపాటు జారీ చేస్తారు. దీంతో భారతీయ విద్యార్థులు ఫ్రాన్స్ వైపు మొగ్గు చూపుతున్నారు.

డెలివరీ బాయ్‌లుగా చదువుకున్న యువత

కేంద్రం విధానాల పుణ్యమే: అఖిలేశ్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రైతుల నిరసనలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని, ప్రభుత్వ విధానాల మూలంగానే చదువుకున్న యువత డెలివరీ బాయ్‌లుగా పనిచేయాల్సి వస్తోందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అన్నారు. మంగళవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చలో ఆయన పాల్గొన్నారు. వికసిత్ భారత్‌కు బడ్జెట్‌లో ఎలాంటి రోడ్‌మ్యాప్ లేదని విమర్శించారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీలు ఆర్థిక వృద్ధికి రెండు అతిపెద్ద నిరోధకాలుగా పరిణమించాయని అన్నారు. జీఎస్టీలో తరచూ మార్పుల వల్ల చిన్న వ్యాపారులు దానికి అలవాటుపడలేకపోతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ ఉపకరణాలను జీఎస్టీ నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. దేశ ఆర్థిక పురోభివృద్ధి సాధించాలంటే యువతకు వారి నైపుణ్యాలకు తగిన ఉద్యోగాలు లభించాలని అన్నారు. సరైన ఉద్యోగ అవకాశాలు లేక చదువుకున్న యువత డెలివరీ బాయ్‌లుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. యువతకు వారి నైపుణ్యాల మేరకు ఉద్యోగావకాశాలు లభించినపుడే ఆర్థిక వృద్ధి సాధ్యమన్నారు. నైపుణ్యాల నమోదు ప్రక్రియ సక్రమంగా జరగాలన్నారు.

కుంభామేళా నిర్వహణ సరిగా లేదని, డిజిటలైజేషన్ గురించి గొప్పలు చెప్పుకునే యూపీ సర్కారు తొక్కిసలాటలో ఎంతమంది మరణించారనే విషయంలో ఎందుకు సరైన గణాంకాలను ప్రకటించలేకపోతోందని ప్రశ్నించారు. డబుల్ ఇంజిన్ సర్కారు.. రెండింతలు తప్పులు చేస్తోందని మండిపడ్డారు. 300 కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ జామ్‌లో కుంభమేళాకు వెళుతున్న భక్తులు చిక్కుకుపోయారని, సరిహద్దులను మూసివేశారని అఖిలేశ్ అన్నారు. ట్రాఫిక్ నిర్వహణ చేతగాని ప్రభుత్వమేనా.. వికసిత్ భారత్ అంటే అని నిలదీశారు.

బ్రిటన్‌లో రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబులు

పిల్లల ఆట స్థలంలో స్వాధీనం చేసుకున్న పోలీసులు

మోర్పెత్ (బ్రిటన్): బ్రిటన్‌లోని పిల్లల ఆట స్థలంలో రెండో ప్రపంచ యుద్ధకాలం నాటి బాంబులను గుర్తించారు. నార్త్‌అంబర్లాండ్‌లోని ఊలర్ పట్టణంలో ఉన్న స్కాట్స్ ప్లే పార్క్‌లో పునర్నిర్మాణ పనులు చేపట్టగా ఈ పేలని బాంబులు బయటపడ్డాయి. బాంబులు కనిపించడంతో పనిలో పాల్గొన్న కార్మికులకు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాంబు డిస్పోజల్ నిపుణులు వచ్చి వాటిని తొలగించారు. మొదటి రోజు ఒక్కోటి ఐదు కేజీల బరువైన 65 ప్రాక్టీస్ బాంబులు , స్మోక్ కాట్రిడ్జ్‌లను వెలికి తీశారు. రెండో రోజు మరో 90 ప్రాక్టీస్ బాంబులను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆనాటి యుద్ధకాలంనటి బాంబులు, 174 యుద్ధ పరికరాలను బ్రిటన్ సైనిక దళాలు తొలగించిందని బ్రిటన్ రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో జల్లెడపట్టాలని పారిష్ కౌన్సిల్‌కు సూచించినట్లు వెల్లడించింది. అప్పటివరకు పార్క్‌ను మూసివేసింది. వాటిని ప్రాక్టీస్ బాంబులుగా పేర్కొన్నప్పటికీ, అవి ఇప్పటికీ క్రియాశీలకంగా ఉండటం విశేషం. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో హోంగార్డు వలంటీర్ సైనిక విభాగానికి ఇదే ప్రాంతంలో శిక్షణ ఇచ్చినట్లు తెలుస్తోంది. రెండో ప్రపంచయుద్ధం ముగిశాక పాత ఆయుధాలను ఇక్కడే పాతిపెట్టినట్లు కనిపిస్తోందని స్థానిక రాజకీయ నాయకుడు మార్క్ మాథర్ చెప్పారు.

ఏనుగు దాడిలో మరో వ్యక్తి మృతి

రెండు రోజుల్లో కేరళలో రెండో మరణం

వయనాడ్: కేరళలో ఏనుగు దాడిలో మరొకరు మృతి చెందారు. వయనాడ్ జిల్లా సుల్తాన్ బతేరిలోని నూల్పుజా ప్రాంతంలో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. మృతుడిని 45 ఏళ్ల గిరిజనుడు మనుగా గుర్తించారు. మంగళవారం ఉదయం మను మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. రెండు రోజుల్లో కేరళలో ఇలాంటి మరణాలు సంభవించడం ఇది రెండోసారి. ఇడుక్కి జిల్లాలో సోమవారం సాయంత్రం అడవి ఏనుగు దాడిలో ఓ మహిళ మృతి చెందింది. ఇటీవలి నెలల్లో రాష్ట్రంలో అడవి ఏనుగుల దాడి ఘటనలు పెరిగాయి. ఈ ప్రాంతంలో మనుషులు, అడవి జంతువుల మధ్య సంఘర్షణ తీవ్రమవుతోంది. జనవరి 19న వయనాడ్‌లో బైక్‌పై వెళ్తున్న ముగ్గురిపై అడవి ఏనుగు దాడి చేసింది. అయితే వారు తృటిలో తప్పించుకున్నారు. ఈ ఘటనను ఎదురుగా వస్తున్న కారులోని ప్రయాణికులు కెమెరాలో బంధించారు. జనవరి 14వ తేదీన త్రిసూర్ జిల్లాలో కారుపై ఏనుగు దాడి చేసింది. కారులో ప్రయాణిస్తున్న వారిని భయభ్రాంతులకు గురిచేసింది. గతేడాది డిసెంబర్‌లో ఎర్నాకుళం జిల్లాలో 40 ఏళ్ల వ్యక్తిని అడవి ఏనుగు తొక్కి చంపింది. ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఇటీవల ఓ మసీదు వేడుకలో ఏనుగు తన మావటిని తొక్కి చంపింది.

అమెరికా టారిఫ్ విధింపును తప్పుబట్టిన ఈయూ

అంతకు తగ్గట్లే టారిఫ్‌లు పెంచే యోచనలో యూరప్ కూటమి

బ్రస్సెల్స్: అమెరికాలోకి దిగుమతి అయ్యే ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై 25 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన మరుసటి రోజే 27దేశాల యూరప్ కూటమి ఘాటుగా స్పందించింది. అర్థరహిత టారిఫ్‌లతో దుందుడుకుగా వ్యవహరిస్తున్న అమెరికా ప్రభుత్వానికి తగు సమాధానం చెప్తామని యూరోపియన్ యూనియన్ అధ్యక్షురాలు ఉర్సులావాన్ డీర్ లియాన్ మంగళవారం ప్రకటించారు. ‘‘ట్రంప్ టారిఫ్ సవాలుకు దీటుగా బదులిస్తాం. అవి చెడ్డ పన్నులు. వ్యాపారస్తులకూ చెడ్డవే. వినియోగదారులకు గుదిబండలు. యూరోపియన్ యూనియన్‌కు భారంగా మారిన ఈ టారిఫ్‌లకు దీటైన సమాధానం చెప్తాం’’ అని ఉర్సులా ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇరువైపులా విపరిణామాలు

ఈయూ కూటమిలో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ అయిన జర్మనీ సైతం అమెరికా స్టీల్, అల్యూమినియంలపై టారిఫ్‌లు పెంచడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. దీనిపై జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ స్కోల్జ్ స్పందించారు. ‘‘అమెరికా మాకు మరో ప్రత్యామ్నాయం లేకుండా చేస్తే యురోపియన్ యూనియన్ మొత్తం ఏకతాటిమీదకొచ్చి ఐక్యంగా నిలబడుతుంది. అప్పుడు అంతిమంగా ఆర్థికయుద్ధం మొదలై ఇరువైపులా దాని విపరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది’’ అని ఒలాఫ్ వ్యాఖ్యానించారు. అయితే ఈయూ కూటమి ఏ స్థాయిలో టారిఫ్‌లు పెంచుతుందనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. అయితే ట్రంప్‌కు చెందిన రిపబ్లికన్ పార్టీ పాలిత రాష్ట్రాల నుంచి దిగుమతులపైనే ముఖ్యంగా టారిఫ్ పెంచాలని యోచిస్తున్నట్లు వాణిజ్యరంగ విశ్లేషకులు చెబుతున్నారు.

సాయుధ గ్రూప్ దాడిలో 55 మంది దుర్మరణం

గోమా(కాంగో): సాయుధ గ్రూప్‌ల మధ్య సంఘర్షణలకు వేదికగా నిలిచిన కాంగో దేశంలో మరోసారి అమాయక పౌరులు బలయ్యారు. పలు గ్రామాలు, వలసజీవుల శిబిరాలపై ఒక కర్కశ సాయుధ గ్రూప్ విచక్షణారహితంగా జరిపిన దాడిలో 55 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈశాన్య కాంగోలో ఈ దారుణ ఘటన జరిగిందని స్థానిక అధికారులు మంగళవారం వెల్లడించారు. ఇటూరీ ప్రావిన్స్‌లోని బహిమా బడ్జెరీ జిల్లాలోని డిజైబా గ్రూప్ అధీనంలోని గ్రామాలు, వలసజీవుల శిబిరాలపై సోమవారం రాత్రి ‘ది కోపరేటివ్ ఫర్ ది డెవలప్‌మెంట్ ఆఫ్ కాంగో’(కోడెకో) గ్రూప్ సభ్యులు దాడి చేసి ఇళ్లను తగలబెట్టారు. కత్తులతో దాడి చేసి తుపాకీ గుళ్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో ఇప్పటిదాకా 55 మృతదేహాలను గుర్తించాం. మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది’’ అని ఆ క్యాంప్ నాయకురాలు ఆంటోనెటీ ఎన్‌జాలే చెప్పారు.

అమెరికాలో పేపర్ స్ట్రా స్థానంలో మళ్లీ ప్లాస్టిక్ స్ట్రా

కార్యనిర్వాహక ఉత్తర్వుపై ట్రంప్ సంతకం

వాషింగ్టన్: డజన్ల కొద్దీ కార్యనిర్వాహక ఉత్తర్వులతో ప్రపంచ దేశాలను కలవరపాటుకు గురిచేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు ప్లాస్టిక్‌పై ప్రేమ ఒలకబోస్తున్నారు. కాగితపు స్ట్రాలు ఎందుకు పనికిరావని, దేశవ్యాప్తంగా మళ్లీ ప్లాస్టిక్ స్ట్రాలనే వాడాలని సూచించారు. ఈ మేరకు సోమవారం కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకంచేశారు. ‘‘ఇదొక సరదా సన్నివేశం. మనం మళ్లీ ప్లాస్టిక్ స్ట్రా కాలంలోకి వెళ్తున్నాం. ఇప్పుడు అందరూ ప్లాస్టిక్ స్ట్రాలనే వాడొచ్చు. అవి సముద్రంలో పడితే షార్క్‌లను ఏమీ చేయవుకదా. అయినా షార్క్‌లు సముద్రంలో తమకు నచ్చిన వాటిని నంజుకు తింటాయి’’ అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్లాస్టిక్‌భూతం పనిపట్టేందుకు నాటి బైడెన్ ప్రభుత్వం తీసుకొచ్చిన కాగిత ప్రోత్సాహక విధానాలను రద్దుచేస్తూ, ప్లాస్టిక్‌ను ప్రోత్సహిస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. ఈసారి, 2019 ఎన్నికల ప్రచార సమయంలోనూ ప్లాస్టిక్ స్ట్రాలకు ట్రంప్ మద్దతిచ్చారు. ఆ సమయంలో ట్రంప్ స్వయంగా పది ప్లాస్టిక్ స్ట్రాల ప్యాకెట్‌ను 15 డాలర్లకు అమ్మి వాటిని ప్రోత్సహించారు. అమెరికాలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే చర్యలో భాగంగా నాటి బైడెన్ సర్కార్ ప్లాస్టిక్ స్ట్రాల వాడకంపై ఆంక్షలు విధించింది. ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్ స్ట్రాలను వాడొద్దని సూచించింది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్‌కు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, గైడెన్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

సాక్షి ప్లస్
బుధవారం। 12-2-2025

ఖిల్జీ వంశంలో చివరి పాలకులు ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

రాజపుత్ర వంశాలు (క్రీ.శ. 760 - 1142)

రాజపుత్ర వంశానికి చెందిన రాజులు బెంగాల్, బిహార్ ప్రాంతాలను పాలించారు. వాస్తవానికి వీరు రాజపుత్రులు కారు. 'పాల' వంశస్థులు. ఈ వంశ స్థాపకుడు గోపాలుడు. వీరిలో 'దేవపాలుడు' గొప్పవాడు. ఇతడు తూర్పు ఈశాన్య దేశాలైన జావా, సుమత్రాతో సత్సంబంధాలు కొనసాగించాడు. ఈ వంశీయులు సుమారు 400 ఏళ్లు పాలించారు. వీరిలో చాలా మంది బౌద్ధమతాన్ని అనుసరించారు. ధర్మపాలుడు విక్రమశిల విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడు. ఉద్ధంతపురం, జగద్దల విశ్వవిద్యాలయాలను పాలరాజుల కాలంలోనే ఏర్పాటు చేశారు. వీరు అనేక విహారాలను పునర్నిర్మించారు.

గూర్జర ప్రతీహారులు - 'కనౌజ్' (క్రీ.శ. 800 -1036)

ఈ వంశస్థాపకుడు నాగభట్టు. మహేంద్రపాలుడు గొప్పవాడు. ఇతడి ఆస్థానంలో రాజశేఖరుడు అనే ప్రముఖ కవి ఉండేవాడు. మహేంద్రపాలుడు అరబ్ సైన్యాలపై విజయం సాధించాడు. అరబ్ బాటసారి సులేమాన్ మిహిరభోజుడి సామ్రాజ్యం గురించి వర్ణించాడు. మిహిరభోజుడి కుమారుడు మహేంద్రపాలుడు. ఇతడి తర్వాత ప్రతీహారుల సామ్రాజ్యం క్షీణించింది.

గహడ్వాల్ వంశం - కనౌజ్ (క్రీ.శ. 1080-1194)

ఈ వంశ స్థాపకుడు చంద్రదేవుడు (1085–1100). ఈ పాలకుల్లో గొప్పవాడు జయచంద్రుడు. మహమ్మద్ ఘోరీ 1193లో జయచంద్రుడిని ఓడించడంతో అవమానం భరించలేక అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. గహడ్వాలులు శతాబ్ద కాలం పాటు తురుష్క దండయాత్రల నుంచి మధ్యదేశాన్ని రక్షించారు.

చందేలులు - బుందేల్ ఖండ్ క్రీ.శ. 916-1203

చందేలుల రాజధాని ఖజురహో. ఈ వంశ మూలపురుషుడు జయశక్తి. క్రీ.శ. 950 ప్రాంతంలో యశోవర్మ స్వతంత్రంగా చందేల రాజ్యాన్ని స్థాపించాడు. చందేల రాజుల్లో విద్యాధరుడు ప్రసిద్ధుడు. మధ్యప్రదేశ్‌లోని 'ఖజురహో' దేవాలయాలను నిర్మించింది వీరే. అల్లావుద్దీన్ ఖిల్జీ 1309లో చందేలులను తుదముట్టించి బుందేల్‌ఖండ్‌ను ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపాడు.

కాలచూరులు (క్రీ.శ. 950 - 1195)

కాలచూరి వంశస్థుల రాజధాని త్రిపుర (మధ్యప్రదేశ్). ఈ వంశ స్థాపకుడు కోకల్లుడు (845 – 880). కాలచూరుల్లో గంగయదేవుడు ప్రసిద్ధుడు. ఇతడికి 'విక్రమాదిత్య', 'త్రికళింగాధిపతి' అనే బిరుదులు ఉన్నాయి. క్రీ.శ. 1212లో చందేల త్రైలోక్యమల్లుడు కాలచూరి చివరి పాలకుడైన విజయసింహుడిని ఓడించాడు.

చౌహానులు క్రీ.శ. 973-1192

వీరినే చహమాణులు అని కూడా అంటారు. ఈ వంశానికి మూలకర్త సింహరాజు. వీరి రాజధాని 'శాకంబరి'. అజయరాజు అజ్మీర్‌ను నిర్మించాడు. సోమదేవ మహాకవి విశాలదేవుడి ఆస్థానంలో ఉండేవాడు. ఇతడు 'లలిత విగ్రహరాజ' నాటకాన్ని రచించాడు. ఈ వంశస్థుల్లో మూడో పాలకుడైన పృథ్వీరాజు చాలా గొప్పవాడు. పృథ్వీరాజ్ చౌహాన్ 1191లో మహమ్మద్ ఘోరీని మొదటి 'తరైన్' యుద్ధంలో ఓడించి క్షమించి వదిలేశాడు. కానీ మహమ్మద్ ఘోరీ మళ్లీ దండెత్తి వచ్చి పృథ్వీరాజ్‌ను 1192లో రెండో తరైన్ యుద్ధంలో ఓడించాడు.

గుజరాత్ చాళుక్యులు (క్రీ.శ. 974-1238)

గుజరాత్ చాళుక్య వంశస్థుల రాజధాని 'అన్హిల్‌వాడ్' (గుజరాత్). వీరినే సోలంకీలు అంటారు. ఈ వంశస్థాపకుడు మూలరాజు. మొదటి భీమరాజు కాలంలో (1022–64) ఘజనీ మహమ్మద్ 1024లో సోమనాథ ఆలయాన్ని ధ్వంసం చేశాడు. భీమరాజు మనవడైన జయసింహుడి కాలంలో సోలంకీ రాజ్యం ఉచ్ఛస్థితిలో ఉంది. జైనకవి హేమచంద్రుడు ఇతడి మంత్రి. జయసింహుడి తర్వాత సామంతులైన వాఘేల వంశస్థులు సోలంకీలను జయించి రాజ్యాన్ని ఆక్రమించారు.

పరమారులు - మాల్వా, మధ్యప్రదేశ్ (క్రీ.శ. 974 - 1233)

పరమార వంశ స్థాపకుడు 'సియక'. వీరిలో ముంజరాజు గొప్పవాడు. ఇతడినే 'వాక్పతిరాజు'గా వ్యవహరిస్తారు. ఇతడి ఆస్థానంలో ధనంజయ, హలాయుధ, ధనిక, పద్మ గుప్త తదితర మహాకవులు ఉండేవారు. వాక్పతిరాజు 'ముంజేశ్వరం' తటాకాన్ని నిర్మించాడు. ఇతడి కుమారుడైన భోజరాజుకు ఈ వంశంలో మంచి పేరు ఉంది. భారతదేశ చరిత్రలో ఇతడికి ప్రత్యేక స్థానం ఉంది. భోజరాజుకు 'కవిరాజ మాళ్వా చక్రవర్తి' అనే బిరుదు ఉంది. ఇతడు థాన్ నగరాన్ని నిర్మించాడు.



సేన వంశస్థులు (క్రీ.శ. 1119 -1190)

వీరు బెంగాల్‌ను పాలించారు. సేన వంశీయుల్లో లక్ష్మణసేనుడు ప్రసిద్ధుడు. ఇతడు విజయయాత్రలు చేసి పూరీ, కాశీ, ప్రయాగలో విజయస్తంభాలు స్థాపించాడు. ఇతడు స్వయంగా కవి. ఇతడి ఆస్థానంలో పంచరత్నాలు అనే ప్రసిద్ధ కవులు ఉండేవారు. వీరిలో ధోయి, జయదేవుడు ముఖ్యమైనవారు. జయదేవుడి 'గీత గోవిందం' ప్రసిద్ధి చెందిన రచన.

కర్కోటక వంశం (క్రీ.శ. 630-955)

ఈ వంశం కశ్మీర్ ప్రాంతాన్ని పాలించింది. 'కర్కోటక వంశ' స్థాపకుడు దుర్లభవర్ధనుడు. కల్హణుడి 'రాజ తరంగిణి' వీరి చరిత్రకు ప్రధాన ఆధారం. ఈ వంశంలో ముక్తాపీడ లలితాదిత్య గొప్పరాజు. ఇతడు కశ్మీర్ రాజ్యాన్ని ఆసియాలోని పెద్ద రాజ్యాల్లో ఒకటిగా రూపొందించాడు. 'మార్తాండ', 'సూర్య' దేవాలయాలను నిర్మించాడు.

లోహారులు (క్రీ.శ. 939 -1339)

ఈ రాజ్యస్థాపకుడు పర్వగుప్తుడు. కశ్మీర్‌ను పరిపాలించిన లోహారులందరిలో 'రాణి దిద్దా'కు ప్రత్యేక స్థానం ఉంది. 1139లో షామీర్ (షామ్స్ ఉద్దీన్) అనే ముస్లిం వీరుడు 'శ్రీ సంస్థినా' బిరుదుతో కశ్మీర్‌ను ఆక్రమించాడు. లోహారుల కాలంలో సంస్కృతం రాజభాషగా ఉండేది. బ్రాహ్మణులకు రాజకీయంగా ప్రాబల్యం ఉండేది.

షాహీలు (క్రీ.శ. 883-1026)

షాహీలు కాబూల్, పంజాబ్ ప్రాంతాలను పాలించారు. వీరినే హిందూషాహీలుగా వ్యవహరిస్తారు. రాజ తరంగిణి, అల్‌బెరూనీ గ్రంథం వీరి చరిత్రకు ముఖ్యమైన ఆధారాలు. వీరి రాజధాని కాబూల్. అల్‌బెరూనీ ఈ వంశంలో మొదటివారిని హిందూ తురుష్కులుగా పేర్కొన్నాడు. కుషాన్ వంశంలో చివరి రాజు 'లగితూర్మాన్'ను అతడి మంత్రి కల్లర్ తొలగించి, హిందూషా వంశాన్ని స్థాపించాడు. షాహీ రాజ్యాన్ని ముస్లింలు ఆక్రమించారు. అరబ్బు యాత్రికుడైన అల్‌బెరూనీ భారతదేశంలో 'కితాబ్-ఉల్-హింద్' గ్రంథం రాశాడు.

అరబ్బుల దండయాత్రలు (క్రీ.శ. 712)

అరబ్బులు సింధూ ప్రాంతంపై దండయాత్ర చేశారు. భారతదేశంపై దండయాత్రల వల్ల అరబ్బులకు పరిమిత ఫలితాలు లభించాయి. ఎడారి వల్ల సింధూ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలపైకి దాడి చేయడానికి వీలు కలుగలేదు. అరబ్బుల పాలనలో సింధ్, గుజరాత్ రాష్ట్రాలు విదేశీ వాణిజ్యాన్ని విస్తృతంగా సాగించి ఐశ్వర్యవంతమయ్యాయి. అరబ్బుల ద్వారా ఐరోపా దేశాలకు భారతీయ సంస్కృతి వ్యాపించింది.

మహమ్మద్ ఘజనీ దండయాత్రలు (క్రీ.శ. 1000-27)

ఇతడు భారతదేశంపై 17 సార్లు దండెత్తాడు. ఘజనీ 1026లో సోమ్‌నాథ్ దేవాలయాన్ని ధ్వంసం చేశాడు. ఇది గుజరాత్‌లోని కథియవార్‌లో ఉంది. ఇతడు రాజపుత్ర రాజ్యాల సిరిసంపదలను కొల్లగొట్టాడు. వారి సైన్యాలు చాలా వరకు క్షీణించాయి. ఘజనీ మహమ్మద్ భారతదేశంలో ముస్లిం రాజ్యస్థాపనకు అనుకూల పరిస్థితులను కల్పించాడు.

మహమ్మద్ ఘోరీ దండయాత్రలు (క్రీ.శ. 1175-1206):

ఇతడిని భారతదేశంలో తురుష్క అఫ్గాన్ సామ్రాజ్య స్థాపకుడిగా పేర్కొంటారు. ఘోరీ మరణానంతరం అతడు జయించిన భూభాగాలన్నింటితో అతడి బానిస అయిన కుతుబుద్దీన్ ఐబక్ ఢిల్లీలో స్వతంత్ర ముస్లిం రాజ్యాన్ని స్థాపించాడు.

మహమ్మద్ ఘోరీ.. పృథ్వీరాజ్ చౌహాన్‌తో 1191లో మొదటి, 1192లో రెండో తరైన్ యుద్ధాలు చేశాడు. బిహార్, బెంగాల్‌ను జయించడంలో భక్తియార్ ఖిల్జీ (1197) అనే అఫ్గాన్ సాహసయోధుడు ఘోరీకి సహాయపడ్డాడు. ఘోరీని 1206లో పంజాబ్‌లోని భోఖర్లు అనే తెగకు చెందినవారు హత్య చేశారు.

ఢిల్లీ సుల్తాన్‌లు (క్రీ.శ. 1206-1210)

కుతుబుద్దీన్ ఐబక్ :

ఇతడు భారతదేశంలో తురుష్క - అఫ్గాన్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు ఇల్బారీ వంశానికి చెందిన తురుష్కుడు. ఇతడు 1206లో ఢిల్లీ సుల్తాన్‌గా ప్రకటించుకున్నా డు. ఢిల్లీకి మొదటి ముస్లిమ్ సుల్తాన్ ఇతడే. ఇతడిని బానిస వంశ స్థాపకుడిగా పేర్కొంటారు. 1210లో ఇతడు 'పోలో' ఆడుతూ గుర్రంపై నుంచి పడి మరణించాడు. ఐబక్ 'కుతుబ్ మినార్' నిర్మాణాన్ని ప్రారంభించగా, ఇల్‌టుట్ మిష్ పూర్తి చేశాడు. కుతుబుద్దీన్ ఐబక్‌కు 'లక్‌బక్ష్' అనే బిరుదు ఉంది.

ఇల్‌టుట్ మిష్ (క్రీ.శ. 1211-1236):

ఇల్‌టుట్‌మిష్ తురుష్కుల్లో ఇల్బారీ తెగకు చెందినవాడు. రాజ్య రక్షణ కోసం ఇతడు 40 మందితో బానిసల దళం (చిహాల్‌గనీ) ఏర్పాటు చేశాడు. ఇల్‌టుట్‌మిష్ మంగోలుల దాడుల నుంచి భారతదేశాన్ని కాపాడాడు. స్వతంత్రంగా అరబ్బీ నాణేలను ముద్రించడం ప్రారంభించాడు. వెండి టంకా, రాగి జిటాల్ ఇతడి కాలం నుంచే వాడుకలోకి వచ్చాయి. తురుష్క సామ్రాజ్యాన్ని స్థిరపరిచాడు. కుతుబ్‌మినార్ నిర్మాణాన్ని పూర్తి చేయించాడు.

సుల్తాన్ రజియా (క్రీ.శ. 1236-1240):

ఈమె ఇల్‌టుట్ మిష్ కుమార్తె. యాకుబ్‌ఖాన్ అనే అబిసీనియన్‌ను వివాహం చేసుకున్నారు. ఈమె మధ్యయుగానికి చెందిన మొదటి, చివరి సుల్తానా (రాణి). ఇల్‌టుట్ మిష్ తన కుమారులు అసమర్థులవ్వడం వల్ల కూతురైన రజియాను వారసురాలిగా ప్రకటించాడు. ఈమె మంచి పాలనాదక్షురాలు. ఈమె కాలంలో చిహాల్‌గనీలు బలవంతులై ఆమెను ఎదిరించారు. వీరిని అడ్డుకునే ప్రయత్నంలో రజియా ప్రాణాలను కోల్పోయారు.

సుల్తాన్ నసీరుద్దీన్ మహమ్మద్ (క్రీ.శ. 1246 - 1265):

ఇతడు ఇల్‌టుట్ మిష్ కుమారుడు. అసమర్థుడు. భోగలాలసుడు. అమీర్‌ల చేతిలో కీలు బొమ్మగా మారాడు.

సుల్తాన్ ఘియాసుద్దీన్ బాల్బన్ (క్రీ.శ.1265 -1285):

ఇతడు సుల్తాన్ నసీరుద్దీన్‌కు 1246–65 మధ్య ప్రధానమంత్రిగా సర్వాధికారాలు చెలాయించాడు. ఇతడి మరణానంతరం సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. 40 మంది బానిసల దళాన్ని రద్దు చేశాడు. శత్రువుల రహస్యాలు తెలుసుకునేందుకు గూఢచార దళాన్ని ఏర్పాటు చేశాడు. సాష్టాంగపడి సుల్తాన్ పాదాలను లేదా సింహాసనాన్ని ముద్దు పెట్టుకోవడం లాంటి పారశీక రాచ మర్యాదలను బాల్బన్ ప్రవేశపెట్టాడు. సర్దార్లను అణచివేయడానికి మద్యపానం, జూదం, అతిగా మాట్లాడటం లాంటివాటిని నిషేధించాడు.

ఖిల్జీ వంశం (క్రీ.శ. 1290-1320)

ఇది ఢిల్లీని పాలించిన రెండో తురుష్క వంశం. వీరి పాలనా కాలం క్రీ.శ. 1290–1320.

జలాలుద్దీన్ (క్రీ.శ. 1290-1296):

ఇతడు బాల్బన్ కొలువులో చేరిన ఖిల్జీ వంశానికి చెందిన తురుష్క తెగకు చెందిన వ్యక్తి. 1290లో బానిస వంశ చివరి పాలకుడైన కైకోబాద్‌ను వధించి ఢిల్లీ సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. ఇతడి అన్న కొడుకు అల్లా ఉద్దీన్ ఖిల్జీ. జలాలుద్దీన్ తన కూతురిని అల్లా ఉద్దీన్‌కు ఇచ్చి వివాహం చేశాడు. ఇతడి కాలంలో ఇస్లామ్ మతాన్ని స్వీకరించిన మంగోలులు నయాముస్లింలుగా చెలామణి అయ్యారు. వీరు ప్రభుత్వానికి బెడదగా తయారయ్యారు.

అల్లాఉద్దీన్ ఖిల్జీ (క్రీ.శ. 1296-1316):

ఇతడు 1299లో గుజరాత్‌ను జయించాడు. కాకతీయ, యాదవ, హోయసాల, పాండ్య రాజ్యాలపై అల్లా ఉద్దీన్ సేనాని మాలిక్‌కపూర్ దండెత్తి జయించాడు. 1312లో మాలిక్‌కపూర్ దేవగిరి రాజైన శకదేవుడిని వధించి ఆ రాజ్యాన్ని ఢిల్లీ రాజ్యంలో కలిపాడు. 1303లో మంగోలుల దాడుల నుంచి రక్షించుకోవడానికి దుర్గాలను నిర్మించాడు.

అల్లాఉద్దీన్ ఖిల్జీకి 'సికిందర్' అనే బిరుదు ఉంది. ఇతడు జాగీర్లను రద్దు చేశాడు. ఇతడి కాలంలో సైన్యం పోషణ బాధ్యత ప్రభుత్వ పరిధిలోనే ఉండేది. గుర్రాలపై ముద్రలు వేసే పద్ధతి ప్రవేశపెట్టాడు. జీతాలను నగదు రూపంలో చెల్లించేవాడు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు వ్యాపారులు సరకులు అమ్మాలని శాసించాడు. ఇతడు 'సిరి', 'అలైదర్వాజా' కట్టడాలను నిర్మించాడు. అమీర్‌ఖుస్రూ అనే పర్షియన్ కవిని పోషించాడు. అల్లాఉద్దీన్ 'నయాముస్లిం'లను అణచివేశాడు. అలైదర్వాజా తురుష్క వాస్తు రీతికి ప్రతీక.

అల్లాఉద్దీన్ షియాబుద్దీన్ ఉమర్, కుతుబుద్దీన్ ముబారక్ ఖిల్జీ వంశం చివరి పాలకులు. నసీరుద్దీన్ ఖుస్రూతో ఖిల్జీ వంశ పాలన పూర్తిగా అంతమైంది.

భూకంపాల రాకను మొదటగా గుర్తించే జీవి?

టెట్/డీఎస్సీ - ప్రత్యేకం
ఫిజికల్ సైన్స్

ధ్వని

ప్రకంపన స్థితిలో ఉన్న వస్తువు నుంచి వెలువడే శబ్దాన్ని 'ధ్వని' అంటారు. ధ్వని గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'అకౌస్టిక్స్' అంటారు.

ధ్వని ప్రసారానికి..

1) కంపించే గుణం ఉన్న కణాలు
2) స్థితిస్థాపకత, జడత్వ స్వభావం ఉన్న యానకం అవసరం.

ధ్వని ప్రసారం జరిగే పదార్థాలు: ఇనుము, రాగి, అల్యూమినియం, ఉక్కు మొదలైనవి.

ధ్వని ప్రసారం జరగని పదార్థాలు: రబ్బర్, పొట్టు, దూది, దుస్తులు మొదలైనవి.

యానకం: శక్తి స్వరూపం ప్రయాణించడానికి వీలైన భౌతిక అంశాన్ని యానకం అంటారు.

- రాబర్ట్ బాయిల్ శూన్యంలో ధ్వని ప్రయాణించదని గంటజాడీ ప్రయోగం ద్వారా వివరించాడు. ఇతడిని రసాయన శాస్త్ర పితామహుడిగా పేర్కొంటారు.
- చంద్రుడిపై వాతావరణం లేనందువల్ల అక్కడ ధ్వని వేగం శూన్యం.
- చంద్రుడి శాస్త్రీయనామం సెలిని. చంద్రుడి గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని సెలినాలజి అంటారు.

పౌనపున్యం: ఒక సెకన్ కాలంలో చేసే కంపనాల సంఖ్యను 'పౌనపున్యం' అంటారు.

పౌనపున్యం = $\frac{1}{T}$

ప్రమాణాలు: sec^{-1}, cycle/sec, Hz.

- పౌనపున్యం ఆధారంగా ధ్వనులు 3 రకాలు. అవి: 1) పరశ్రావ్యాలు, 2) శ్రవ్య అవధి ధ్వనులు, 3) అతిధ్వనులు

పరశ్రావ్యాలు: 20 Hz కంటే తక్కువ పౌనపున్యం ఉన్న ధ్వనులను పరశ్రావ్యాలు అంటారు. ఈ ధ్వనులను వినగలిగే జీవులు పాము, తిమింగలం.

- ఖడ్గమృగాలు 5 Hz పౌనపున్యం ఉన్న ధ్వనులను విడుదల చేస్తూ భావ వ్యక్తీకరణ చేసుకుంటాయి.
- భూకంపాల రాకను మొదటగా పసిగట్టే జీవి పాము.
- భూకంపాలను అంచనా వేసే పరికరాలు - భూకంపలేఖిని, భూకంపదర్శిని.
- భూకంపలేఖినిని ఉపయోగించి సెస్మిక్ తరంగాలను కొలుస్తారు.

సెస్మిక్ తరంగాలు: భూ అంతర్భాగంలోని కదలికలు భూ ఉపరితలంపై తరంగాలను విడుదల చేస్తాయి. వీటినే సెస్మిక్ తరంగాలు అంటారు.

- భూకంప తీవ్రతను కొలిచే పరికరాలు - రిక్టర్ స్కేలు, భ్రామక పరిమాణ స్కేలు.
- భూకంపాలు సంభవించే ప్రాంతాల్లో మట్టి, కలప వినియోగించి నిర్మాణాలు చేయాలి.
- తెలంగాణ రాష్ట్రంలో భూకంపం సంభవించే ప్రమాదం ఉన్న ప్రాంతం – హైదరాబాద్.

శ్రవ్య అవధి: 20 Hz – 20,000 Hz (20 KHz) పౌనపున్యం ఉన్న ధ్వనులను శ్రవ్య అవధి (లేదా) శ్రవ్యాలు అంటారు. మానవుడు వినగలిగే ధ్వనులు ఇవే.

- చిన్నపిల్లలు వినగలిగే శ్రవ్య అవధి – 30,000 Hz.
- వృద్ధులు వినగలిగే ధ్వని అవధి 10 KHz - 12 KHz.
- చెవి వెలుపలి భాగమైన 'పిన్నా' ధ్వని కంపనాలను గ్రహిస్తుంది. ఈ కంపనాలు చెవిలోపలి కర్ణభేరికి తాకి కంపింపజేసినప్పుడు మనం ధ్వనిని వినగలుగుతాం.
- మానవ శరీరంలో అతిచిన్న ఎముక 'స్టెపిస్', అతిపెద్ద ఎముక ఫీమర్ (తొడ ఎముక).

అతిధ్వనులు: 20,000 Hz కంటే ఎక్కువ పౌనపున్యం ఉన్న ధ్వనులను 'అతిధ్వనులు' అంటారు. ఈ ధ్వనులను వినగలిగే జీవులు - కుక్క, గబ్బిలం, ఏనుగు.

- కుక్క వినగలిగే ధ్వని పౌనపున్య అవధి – 50,000 Hz (50 KHz).
- గబ్బిలం వినగలిగే ధ్వని పౌనపున్య అవధి 1,00,000 Hz.



- ఏనుగులు, తిమింగలాలు 20 Hz కంటే తక్కువ పౌనపున్యం ఉన్న ధ్వనులు చేస్తూ సహచర జీవులు చనిపోయినప్పుడు బాధపడతాయి.
- మానవుడి కంటే కుక్క గ్రహణ శక్తి 40 రెట్లు అధికంగా ఉంటుంది. అందువల్ల నేర పరిశోధనలో దీన్ని ఉపయోగిస్తారు.
- గబ్బిలాలు అతిధ్వనులను ఉత్పత్తి చేయడం ద్వారా ప్రయాణిస్తాయి.
- శూన్య ప్రదేశంలో, విశ్వాంతరాళంలో, వాతావరణ రహిత ప్రాంతంలో 'ధ్వని వేగం' శూన్యం.
- భూకంప తీవ్రతను కొలిచే పరికరాలు-రిక్టర్ స్కేలు, భ్రామక పరిమాణ స్కేలు.

అతిధ్వనుల అనువర్తనాలు

1. పాలు, నీటిలోని బ్యాక్టీరియాను నశింపజేయడానికి ఉపయోగిస్తారు. పాలను 62°C నుంచి 67°C వరకు వేడిచేసి బ్యాక్టీరియాను నశింపజేస్తారు.
   → పాల స్వచ్ఛతను కొలవడానికి ఉపయోగించే పరికరం 'లాక్టోమీటర్'.
   → పాలలో రైబోఫ్లోవిన్ ఉండటం వల్ల పసుపు వర్ణంలో కనిపిస్తాయి.
2. సముద్రాల లోతును కొలవడానికి ఉపయోగించే సోనార్ పరికరం అతిధ్వనుల ఆధారంగా పనిచేస్తుంది. సోనార్‌ను కనుగొన్న శాస్త్రవేత్త - నిక్సన్.
   SONAR → Sound Navigation and Ranging
3. సోల్డరింగ్ (Pb + Sn), వెల్డింగ్‌లలో; చేపలను ఆకర్షించడానికి, దోమలను పారదోలడానికి అతిధ్వనులను వాడతారు.
4. స్కానింగ్ ప్రక్రియలోనూ అతిధ్వనులను ఉపయోగిస్తారు. శరీర భాగాలను స్కానింగ్ చేయడాన్ని 'సోనోగ్రఫీ' అంటారు.
5. విరిగిన దంతాలను తొలగించడం, కీళ్ల నొప్పుల నివారణ, కిడ్నీల్లోని రాళ్లను కరిగించడంలోనూ వీటిని వినియోగిస్తారు.
   కిడ్నీల్లోని రాళ్ల రసాయన నామాలు..
   1. కాల్షియం ఆగ్జాలేట్ స్ఫటికాలు
   2. కాల్షియం ఫాస్ఫేట్ స్ఫటికాలు
6. వస్తువులను కావాల్సిన ఆకారాల్లో కోయడం, రంధ్రాలు చేయడంలో అతిధ్వనులు ఉపయోగిస్తారు.
7. వస్తువులను శుభ్రపరచడానికి, కంటిలోని శుక్లాలను తొలగించడానికి వీటిని వినియోగిస్తారు.

తరంగాలు-రకాలు

ప్రసార స్వభావం ఆధారంగా తరంగాలు రెండు రకాలు.

1. **యాంత్రిక తరంగాలు:** యానక ప్రమేయం ఆధారంగా ప్రయాణించే తరంగాలను 'యాంత్రిక తరంగాలు' అంటారు.
   ఉదా: ధ్వని తరంగాలు.
2. **విద్యుత్ అయస్కాంత తరంగాలు:** యానక ప్రమేయం లేకుండానే ప్రయాణించే తరంగాలను 'విద్యుత్ అయస్కాంత తరంగాలు' అంటారు.
   ఉదా: కాంతి తరంగాలు, రేడియో తరంగాలు, మైక్రో తరంగాలు.

యాంత్రిక తరంగాలు ప్రధానంగా రెండు రకాలు.

1. **పురోగామి తరంగాలు:** అలజడి ప్రారంభమైన బిందువు నుంచి తరంగాలు ముందు దిశల్లో చలిస్తూ మళ్లీ వెనక్కి రాని తరంగాలను 'పురోగామి తరంగాలు' అంటారు.
   ఉదా: ఒక తాడు చివరను పట్టుకొని లాగి వదిలినప్పుడు ఏర్పడే తరంగాలు, నిశ్చల స్థితిలో ఉన్న నీటిలో రాయిని వేసినప్పుడు ప్రయాణించే తరంగాలు.

పురోగామి తరంగాలు రెండు రకాలు. అవి:

ఎ) **అనుదైర్ఘ్య తరంగాలు:** యానకంలోని కణాలు తరంగ ప్రసార దిశకు సమాంతరంగా కంపిస్తూ ఉంటే వాటిని 'అనుదైర్ఘ్య తరంగాలు' అంటారు.
ఉదా: వాయు పదార్థాల్లో ధ్వని తరంగాలు, స్ప్రింగ్‌లో ఏర్పడే తరంగాలు.
వీటిలో i) సంపీడనం,
ii) విరళీకరణం ఉంటాయి.

- కణాల సాంద్రత గరిష్ఠంగా ఉండే బిందువును 'సంపీడనం' అంటారు. రెండు వరుస సంపీడనాల మధ్య దూరం λ.
- కణాల సాంద్రత కనిష్ఠంగా ఉండే బిందువును 'విరళీకరణం' అంటారు. రెండు వరుస విరళీకరణాల మధ్య దూరం λ.

బి) **తిర్యక్ తరంగాలు:** యానకంలోని కణాలు తరంగ ప్రసార దిశకు లంబంగా కంపిస్తూ ఉంటే వాటిని 'తిర్యక్ తరంగాలు' అంటారు.
ఉదా: కాంతి తరంగాలు, ద్రవ పదార్థాల్లో ఏర్పడే తరంగాలు.
తిర్యక్ తరంగాల్లో శృంగాలు, ద్రోణులు ఏర్పడతాయి.

- తరంగ ప్రసార దిశకు పైభాగాన ఏర్పడే బిందువును 'శృంగం' అంటారు. రెండు వరుస శృంగాల మధ్యదూరం λ.
- తరంగ ప్రసార దిశకు దిగువన ఏర్పడే బిందువును 'ద్రోణి' అంటారు. రెండు వరుస ద్రోణుల మధ్యదూరం λ.

2. **స్థిర తరంగాలు:** రెండు స్థిర బిందువుల మధ్య బంధించిన తరంగాలను స్థిరతరంగాలు అంటారు.

ఉదా: మూసి ఉన్న గొట్టాల్లో ఏర్పడే తరంగాలు.

స్థిర తరంగాల లక్షణాలు:
i) ఒకే కంపన పరిమితి,
ii) ఒకే తరంగదైర్ఘ్యం,
iii) ఒకే పౌనపున్యం కలిగి ఉంటాయి.

- స్థిర తరంగాల్లో అస్పందన, ప్రస్పందన స్థానాలు ఉంటాయి.
- అత్యల్ప స్థానభ్రంశం ఉన్న బిందువును 'అస్పందన స్థానం', గరిష్ఠ స్థానభ్రంశం ఉన్న బిందువును 'ప్రస్పందన స్థానం' అంటారు.
- రెండు వరస అస్పందన లేదా ప్రస్పందన బిందువుల మధ్య దూరం = $\frac{\lambda}{2}$.
- అస్పందన, ప్రస్పందన బిందువుల మధ్య దూరం = $\frac{\lambda}{4}$.

మాదిరి ప్రశ్నలు

1. అకౌస్టిక్స్ అనేది దేనికి సంబంధించిన అధ్యయనం?
   ఎ) ఉష్ణం
   బి) అంతరిక్ష ప్రయాణం
   సి) ధ్వని డి) కాంతి
2. కిందివాటిలో ధ్వని అతి నెమ్మదిగా దేనిలో ప్రయాణిస్తుంది?
   ఎ) గాలి బి) గాజు
   సి) నీరు డి) చెక్క
3. రెండు క్రమానుసార బిందువుల మధ్యదూరం ఒకే దిశలో ఉంటే అది దేన్ని సూచిస్తుంది?
   ఎ) తరంగదైర్ఘ్యం బి) కంపన పరిమితి
   సి) కాంతి తీవ్రత డి) పౌనపున్యం
4. ధ్వని దేని ద్వారా ప్రయాణించదు?
   ఎ) శూన్యం బి) ఉదజని
   సి) నీరు డి) ఉక్కు
5. సముద్రం లోతును కొలిచే పరికరం ఏది?
   ఎ) రాడార్ బి) సోనార్
   సి) లేజర్ డి) పైవేవీకావు
6. మహాసముద్రాల లోతులు కొలవడానికి వేటిని ఉపయోగిస్తారు?
   ఎ) ఆల్ట్రాసోనిక్ కిరణాలు
   బి) పరశ్రావ్యాలు
   సి) ఆల్ట్రాసోనిక్ ధ్వనులు
   డి) హైడ్రో కెమెరా
7. కిందివాటిలో దేనిలో ధ్వని వేగంగా ప్రయాణిస్తుంది?
   ఎ) గాలి బి) నీరు
   సి) ఉక్కు డి) శూన్యం
8. చంద్రునిపై ధ్వని లేకపోవడానికి కారణం?
   ఎ) వాతావరణం లేకపోవడం
   బి) కాంతి లేకపోవడం
   సి) స్వయం ప్రకాశం కానందువల్ల
   డి) పైవన్నీ
9. నీటి ఉపరితలంపై ఏర్పడే అలలు ఏ రకమైనవి?
   ఎ) తిర్యక్ తరంగాలు
   బి) దైర్ఘ్య తరంగాలు
   సి) స్థిర తరంగాలు
   డి) పురోగామి తరంగాలు
10. గబ్బిలాలు రాత్రివేళలో వేటి సహాయంతో సంచరిస్తాయి?
   ఎ) పరారుణ కిరణాలు
   బి) అతిధ్వని తరంగాలు
   సి) అతినీలలోహిత కిరణాలు
   డి) పైవేవీకావు
11. భూకంప తీవ్రతను కొలిచే సాధనాన్ని ఏమంటారు?
   ఎ) టోక్యోమీటరు
   బి) స్టీరియోస్కోప్
   సి) ఎపిటియోస్కోప్
   డి) సిస్మోగ్రాఫ్
12. ధ్వని కిరణాలు వేటికి ఉదాహరణ?
   ఎ) అనుదైర్ఘ్య తరంగాలు
   బి) తిర్యక్ తరంగాలు
   సి) విద్యుత్ తరంగాలు
   డి) స్థిర తరంగాలు
13. ధ్వనివేగం ఏ పదార్థాల్లో అధికం?
   ఎ) ద్రవ బి) ఘన
   సి) వాయు డి) పైవన్నీ

సమాధానాలు

1) సి; 2) డి; 3) ఎ; 4) ఎ; 5) బి; 6) సి; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) బి; 11) డి; 12) ఎ; 13) బి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
బుధవారం । 12-2-2025

హుద్‌హుద్ తుపాను ఏ రకమైన విపత్తు?

పర్యావరణ సమస్యలు

విపత్తు

భారీ ప్రాణ, ఆస్తి, పర్యావరణ నష్టాన్ని కలిగించే ఆకస్మిక ప్రమాదమే విపత్తు. వీటి ద్వారా భారీ స్థాయిలో నష్టం సంభవిస్తుంది. విపత్తు రకం, తీవ్రత, సంభవించే ప్రాంతంపై నష్ట తీవ్రత ఆధారపడి ఉంటుంది. తరచు సంభవించే విపత్తుల వల్ల ఒక దేశ ఆర్థిక, సామాజిక, ఆరోగ్య స్థితిగతులు పూర్తిగా అస్తవ్యస్తమవుతాయి. శీతోష్ణస్థితి మార్పు ప్రభావంతో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వరదలు, తుపాన్లు, కరవు లాంటి విపత్తుల తీవ్రత పెరిగింది.

పోటీ పరీక్షల్లో.. విపత్తు, విపత్తు రకాలు, తాజా సంఘటనలు

(ఉదా: మక్కా తొక్కిసలాట, నేపాల్ భూకంపం), వాటి గల కారణాలు, నిర్వహణ వ్యవస్థలు, ఒప్పందాలు, సమావేశాలపై ఎక్కువగా ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది.

విపత్తులు ప్రధానంగా రెండు రకాలు..

1. సహజ(Natural)
2. మానవ జనిత(Anthropogenic)

వీటిని భారీ, స్వల్ప అనే రెండు రకాలుగా విభజిస్తారు.

సహజ భారీ విపత్తులు: వరద, తుపాను, కరవు, భుకంపం, సునామీ, అగ్నిపర్వతాల విస్ఫోటం.

సహజ స్వల్ప విపత్తులు: అత్యల్ప శీతాకాల ఉష్ణోగ్రతలు, అధిక వేసవి ఉష్ణోగ్రతలు, కొండ చరియలు, మంచు చరియలు విరిగిపడటం.

మానవ జనిత భారీ విపత్తులు: యుద్ధాలు, భారీ అగ్ని ప్రమాదాలు, వ్యాధుల ప్రబలత, శీతోష్ణస్థితి మార్పు ప్రభావాలు.

మానవ జనిత స్వల్ప విపత్తులు: రోడ్డు, రైళ్ల, విమాన ప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు, ఆహార విషపూరితం కావడం, తొక్కిసలాట, పర్యావరణ కాలుష్యం.

విపత్తు నిర్వహణ చక్రం

ఒక సమగ్ర విపత్తు నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు ద్వారా మాత్రమే విపత్తుల ద్వారా జరిగే నష్టాన్ని తగ్గించడం వీలవుతుంది. సాధారణంగా విపత్తు నిర్వహణలో మూడు అంశాలు ఉంటాయి.

1. విపత్తు పూర్వ నిర్వహణ
(Pre - Disaster Management)
2. విపత్తు స్పందన(Disaster Response)
3. విపత్తు అనంతర నిర్వహణ
(Post - Disaster Management)

విపత్తు పూర్వ నిర్వహణ

ఇందులో నిర్మూలన, సంసిద్ధత ముఖ్య అంశాలు.

నిర్మూలన: విపత్తు సంభవించే ప్రాంతాన్ని ముందుగానే గుర్తించి, భవిష్యత్తులో విపత్తు రాకుండా చేపట్టే చర్యలను నిర్మూలనగా పిలుస్తారు. సక్రమైన నిర్మూలన చర్యల ద్వారా విపత్తు సంభవించే పరిస్థితులను పూర్తిగా అరికట్టడానికి వీలవుతుంది. నిర్మూలన చర్యల ద్వారా విపత్తు నష్టం తగ్గుతుంది.

ఉదా: రుతుపవనాలకు ముందు నదులు, కాలువలు, రిజర్వాయర్లలో పూడికతీత కార్యక్రమాలు నిర్వహించడం. రైల్వేట్రాక్‌ల తనిఖీ. కొండ చరియలు విరిగిపడే ప్రాంతాల్లో అటవీకరణను ప్రోత్సహించడం.

సంసిద్ధత: విపత్తు పూర్వ నిర్వహణలో ఇది చాలా కీలకం. ఇందులో భాగంగా విపత్తు సంభవించే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో అనేక నివారణ చర్యలను తీసుకోవాలి.

ఉదా:

- వరద సంభవించే ప్రమాదమున్న ప్రాంతాల్లో వేగవంతమైన హెచ్చరిక జారీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి.
- విపత్తు ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టే అంచనా వ్యవస్థలను ఆధునిక సాంకేతికత సహాయంతో ఏర్పాటు చేయాలి.
- సంసిద్ధతలో ప్రభుత్వరంగ సంస్థలు, ఎన్జీవోలు, సాంకేతిక బృందాలు, స్వయం సహాయక బృందాలు పాల్గొనాలి.

విపత్తు స్పందన

విపత్తు సంభవించిన సమయంలో నిర్వహించే కార్యక్రమాలన్నింటినీ 'స్పందన' అంటారు. విపత్తు సమయంలో నష్టాన్ని నివారించడానికి 'ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్'(ఈఆర్ఎస్) ఏర్పాటు తప్పనిసరి. స్వల్ప వ్యవధిలో ప్రజలందరికీ హెచ్చరికలు జారీ చేసే వ్యవస్థ, సత్వర ఆరోగ్య సేవలు, ప్రమాదంలో చిక్కుకున్న వారిని గుర్తించి, రక్షించే (సెర్చ్ అండ్ రెస్క్యూ) సేవలన్నీ ఈఆర్ఎస్ లో భాగంగా ఉంటాయి.

విపత్తు అనంతర నిర్వహణ

విపత్తు సంభవించిన తర్వాత నిర్వహించే స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యలన్నింటినీ కలిపి 'విపత్తు అనంతర నిర్వహణ' అంటారు. అత్యవసర సేవల పునరుద్ధరణ, దెబ్బతిన్న కమ్యూనికేషన్స్ వ్యవస్థల పునర్వ్యవస్థీకరణ, పునరావాస సేవల కల్పన, ఆరోగ్య సేవలు మొదలైనవి విపత్తు అనంతర నిర్వహణలో ముఖ్య అంశాలు. విపత్తు రకం, తీవ్రతను బట్టి పునరావాసం, పునరుద్ధరణ సమయం ఉంటుంది. ఈ చర్యలు కొన్ని వారాలు లేదా నెలలపాటు కొనసాగుతాయి.

భారత్‌లో విపత్తు నిర్వహణ వ్యవస్థ

భారతదేశంలో 2005కు ముందు ఒక సమగ్ర విపత్తు నిర్వహణ వ్యవస్థ అంటూ ఏదీలేదు. 1994లో జపాన్‌లోని యొకొహోమ నగరంలో ఐక్యరాజ్యసమితి నిర్వహించిన సదస్సులో తొలిసారిగా 'విపత్తు సంసిద్ధత'ను చర్చించారు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతోన్న పేద దేశాల్లో విపత్తు నిర్వహణ చాలా పేలవంగా ఉందని ఈ సదస్సులో గుర్తించారు. కాబట్టి ప్రతి సభ్యదేశం తమ పౌరుల రక్షణ కోసం విపత్తు నివారణ, నిర్మూలన, సంసిద్ధత చర్యలను నిర్వహించాలి. దీంతో విపత్తు ద్వారా సంభవించే నష్టాన్ని తగ్గించాలని నిర్ణయించారు. దీని కోసం అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ స్థాయిలో సహకరించుకోవాలని సూచించారు. ఇదే సదస్సులో 1991-2000 దశకాన్ని 'ఇంటర్నేషనల్ డికేడ్ ఫర్ నేచురల్ డిజాస్టర్ రిడక్షన్'గా గుర్తించారు. యొకొహోమ సదస్సు స్ఫూర్తితో 1999లో భారత్ ఒక 'హై పవర్డ్ కమిటీ'(హెచ్‌పీసీ)ని ఏర్పాటు చేసింది. 2001 జనవరిలో గుజరాత్‌లో సంభవించిన భూకంపం తర్వాత జాతీయ విపత్తు నిర్వహణ ప్రణాళిక ఏర్పాటుకు, నిర్మూలన చర్యలను సూచించడానికి ఒక జాతీయ కమిటీ ఏర్పాటు చేశారు. 10వ పంచవర్ష ప్రణాళికలో తొలిసారిగా విపత్తు నిర్వహణ అంశాన్ని చేర్చారు. 2005 డిసెంబర్ 23న భారత ప్రభుత్వం 'జాతీయ విపత్తు నిర్వహణ చట్టా'న్ని తీసుకొచ్చింది. ఈ చట్టంలో భాగంగా దేశంలో విపత్తుల నిర్వహణకు మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేశారు. జాతీయ స్థాయిలో విపత్తు నిర్వహణ విధానాలను రూపొందించి, మార్గదర్శకాలను విడుదల చేసే లక్ష్యంతో 'జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ' (ఎన్‌డీఎంఏ) ఏర్పాటైంది. ప్రధాని ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి యంత్రాంగం ఎన్‌డీఎంఏ విధులను నిర్వహిస్తుంది. రాష్ట్ర స్థాయిలో విపత్తు నిర్వహణకు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ(ఎస్‌డీఎంఏ) ఏర్పాటైంది. అదేవిధంగా జిల్లా స్థాయిలో విపత్తు నిర్వహణకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా విపత్తు నిర్వహణ సంస్థ (డీడీఎంఏ) కృషి చేస్తుంది.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

డిజాస్టర్ మేనేజ్‌మెంట్

విపత్తు నిర్వహణపై పూర్తి స్థాయిలో పరిశోధనలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఎన్ఐడీఎం)ను న్యూఢిల్లీలో ఏర్పాటు చేశారు. యొకొహోమ సదస్సు అనంతరం 1995లో నేషనల్ సెంటర్ ఫర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఎన్‌సీడీఎం)ను ఏర్పాటు చేశారు. దీన్నే 2003 అక్టోబర్ 16న ఎన్ఐడీఎంగా అభివృద్ధి చేశారు.

ఎన్ఐడీఎం ప్రధాన విధులు

- విపత్తు నిర్వహణలో వివిధ శిక్షణ కార్యక్రమాలను రూపొందించడం, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించడం.
- విపత్తు నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాల్లో మానవ వనరులను అభివృద్ధి చేసే ప్రణాళికలను రూపొందించి అమలు చేయడం.
- జాతీయ స్థాయి విపత్తు ప్రణాళికలను రూపొందించడం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలివ్వడం.
- విపత్తు నిర్వహణలో శిక్షణతోపాటు ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సులను రూపొందించి నిర్వహించడం. దేశంలో, దేశం వెలుపల విపత్తు నిర్వహణపై సెమినార్‌లను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహను కల్పించడం.
- పాఠశాల, కళాశాల స్థాయిల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సాంకేతిక నిపుణులకు విపత్తు నిర్మూలన, సంసిద్ధతలపై అవగాహన కల్పించడం.

జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్)

విపత్తు సంభవించిన సమయంలో తక్షణ సహాయ కార్యక్రమాలను అందించి, ప్రమాదంలో చిక్కుకున్న వారిని వేగవంతంగా రక్షించే ఉద్దేశంలో జాతీయ విపత్తు నిర్వహణలో భాగంగా 2006లో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్‌డీఆర్ఎఫ్) ఏర్పాటైంది. ఇందులో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్), ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ)లకు చెందిన 8 బెటాలియన్లు ఉన్నాయి. పై వాటికి అదనంగా సశస్త్ర సీమాబల్‌కు చెందిన రెండు బెటాలియన్లు ఉన్నాయి. ఒక్కో బెటాలియన్‌లో 1149 సిబ్బంది ఉంటారు.

మాదిరి ప్రశ్నలు

1. 1994 లో వరల్డ్ కాన్ఫరెన్స్ ఆన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సదస్సు జరిగిన యొకొహోమ నగరం ఏ దేశంలో ఉంది?
ఎ) చైనా బి) తైవాన్
సి) జపాన్ డి) దక్షిణ కొరియా
2. దేశంలో ఏటా వరదకు గురయ్యే ప్రమాదమున్న ప్రాంతం?
ఎ) 80 మిలియన్ హెక్టార్లు
బి) 45 మిలియన్ హెక్టార్లు
సి) 100 మిలియన్ హెక్టార్లు
డి) 150 మిలియన్ హెక్టార్లు
3. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ ఏ నగరంలో ఉంది?
ఎ) చెన్నై బి) హైదరాబాద్
సి) బెంగళూరు డి) విశాఖపట్నం
4. హుద్‌హుద్ తుపాను ఏ రకమైన విపత్తు?
ఎ) పెను తుపాను
బి) తీవ్ర పెను తుపాను
సి) సూపర్ సైక్లోన్
డి) అల్పపీడనం
5. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సిస్టం(ఐఎన్‌సీవోఐఎస్) ఏ నగరంలో ఉంది?
ఎ) హైదరాబాద్ బి) చెన్నై
సి) గోవా డి) ముంబై
6. విపత్తు నిర్వహణలో ఏయే అంశాలు ఉంటాయి?
ఎ) నివారణ బి) సంసిద్ధత
సి) నిర్మూలన డి) పైవన్నీ
7. 1999లో ఏ రాష్ట్ర తీరంలో ప్రమాదకర భారీ సూపర్ సైక్లోన్ సంభవించింది?
ఎ) ఒడిశా బి) ఆంధ్రప్రదేశ్
సి) తమిళనాడు డి) మహారాష్ట్ర
8. ఇంటర్నేషనల్ సునామీ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఎక్కడ ఉంది?
ఎ) హొనోలులు బి) గోవా
సి) జకార్తా డి) మాల్దీవులు
9. సైక్లోన్ అనేది ఏ భాష నుంచి వచ్చింది?
ఎ) గ్రీకు బి) లాటిన్
సి) జపనీస్ డి) ఫ్రెంచ్
10. హిందు మహాసముద్రంలో తుపానుకు తొలి సారిగా ఎప్పుడు నామకరణం చేశారు?
ఎ) 2001 బి) 2002
సి) 2003 డి) 2004
11. కుండ్స్ అనే భూగర్భ ట్యాంకులను ఏ రాష్ట్రంలో నిర్మిస్తున్నారు?
ఎ) మేఘాలయ బి) మధ్యప్రదేశ్
సి) రాజస్థాన్ డి) తెలంగాణ
12. ఏ దేశంలోని తియాంజిన్ అనే ప్రాంతం లో 2015 ఆగస్టు 12న సయనైడ్ లీకేజి ఘటన జరిగింది?
ఎ) జపాన్ బి) చైనా
సి) దక్షిణ కొరియా
డి) ఉత్తర కొరియా
13. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో సర్టిఫికెట్ కోర్సును అందించేది?
ఎ) ఇగ్నో
బి) బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ
సి) నలందా ఓపెన్ యూనివర్సిటీ
డి) వర్ధమాన్ మహావీర్ యూనివర్సిటీ
14. గుజరాత్ తీరంలో సునామీ సంభవించిన సంవత్సరం?
ఎ) 1945 బి) 1962
సి) 2004 డి) 2006
15. గతంలో మక్కాలో జరిగిన విపత్తు ఏ రకమైంది?
ఎ) బాంబు పేలుడు
బి) తొక్కిసలాట
సి) భూకంపం
డి) వరదలు

సమాధానాలు

1) సి	2) బి	3) ఎ	4) బి
5) ఎ	6) డి	7) ఎ	8) ఎ
9) ఎ	10) డి	11) సి	12) బి
13) ఎ	14) ఎ	15) బి	

When the needle enters the red zone..



BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. No.1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. She didn't (1)/ even take the trouble (2)/ to find out how to (3)/ spelling my name. (4)/ No error (5)
2. The escaped prisoners (1)/ were eventually trapped (2)/ in an underground garage (3)/ as recaptured. (4)/ No error (5)
3. He was (1)/ weakly, (2)/ cowardly and (3)/ treacherous. (4)/ No error (5)
4. The director transposes (1)/ Shakespeare's play (2)/ to 16th century Venice (3)/ to present day England. (4)/ No error (5)
5. We need to (1)/ ensure a smooth transition (2)/ between the old system (3)/ and new. (4)/ No error (5)
6. I think you'll have to (1)/ tweak these figures (2)/ a little before you shown (3)/ them to the boss. (4)/ No error (5)
7. These days it seemed (1)/ we must all submit (2)/ to the tyranny (3)/ of the motor car. (4)/ No error (5)
8. The political situation remains (1)/ highly unstable in many remote areas (2)/ even though the curfew (3)/ is lifted. (4)/ No error (5)
9. If society (1)/ is to exist as a unity, (2)/ its members may have (3)/ shared values. (4)/ No error (5)
10. The universal geriatric problems (1)/ projected in the movie (2)/ catched the attention of (3)/ the people across the world. (4)/ No error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The ceremony was transmitted ____ by satellite to ____ 50 countries.
1) open; above 2) online; around
3) streaming; almost
4) live; over
5) latest; approximately
12. The police reforms will ensure greater ____ and ____.
1) law; care 2) security; safe
3) transparency; accountability
4) trepidation; tumult
5) flexibility; reach
13. She had set a ____ for him and he had walked straight into it.
1) goal 2) objective
3) vision
4) mission 5) trap
14. A restaurant has to ____ the tricky path between maintaining ____ and keeping prices down.
1) treat; quantity
2) meet; demand
3) tread; quality
4) expect; stock
5) maintain; inventory
15. The aircraft is designed to ____ turbulent conditions.
1) withstand 2) resist
3) change 4) modify
5) oversea

Directions (Q. No. 16 - 20): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? Mark (5) No correction required as your answer, if there is no error.

16. The city's crime rate is a serious turn down to potential investors.
1) Turn on 2) turn in
3) turn off 4) turn up
5) no correction required
17. The rise in violent crime will may go unchecked.
1) must go 2) would go
3) must not go 4) shall go
5) No correction required
18. Planes passed overhead with unceasing regularity.
1) over sky 2) over and above
3) outcast 4) over flown
5) No correction required
19. My son's 13 but he's younger for his age.
1) youngest 2) youth
3) older 4) young
5) No correction required
20. When the needle enters the red zone the engine is indicator hot.
1) too 2) much
3) becomes 4) left
5) No correction required

Directions (Q. No. 21-25): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

For decades, Chinese economic policymakers have drawn praise for keeping their economy growing strongly through **turbulence**, such as the Asian financial crisis of 1997-1998 and the worldwide financial tumult of 2008. But investors have begun to lose faith in Beijing's economic management. As China's economy slowed, the government decided to **deploy** the stock market to ease the pain. State-run media talked up stocks, and individual investors responded by buying shares and igniting a 150 per cent run-up in the Shanghai Composite stock index in the year through June. The hope was that Chinese companies could issue shares into a rising market and use the proceeds to **shrink** debts. But the stock bubble burst June 12. Shanghai stocks plummeted 37 per cent. The government sought futilely to intervene, suspending trading in hundreds of companies and banning big investors from selling stakes for six months. The intervention undermined Beijing's pledge to give market forces a bigger say in the economy and left policymakers looking clumsy and ineffectual.

On August 12, China surprised investors by marking down the value of its currency, the yuan. The government said it was responding to market forces: Investors had signaled that the yuan was overvalued. But skeptics worried that the devaluation was a desperate move to jolt the economy - a sign that the economy was weaker than thought. The move followed a report that exports had plunged in July. A cheaper yuan gives Chinese companies a price advantage in foreign markets. Since the devaluation, China has intervened to keep the yuan from falling too fast, confusing markets and renewing doubts about Beijing's commitment to market forces.

Chinese economic statistics have long been viewed as **dubious**. Premier Li Keqiang once acknowledged that the statistics on economic output were "man-made" and worthless. China watchers tended to shrug off the uncertainty as long as it was clear that the economy was **booming**. But now there's concern about what's really happening. Economists are looking at alternative measures of economic performance, such as electricity consumption. The London firm Consensus Economics asked several economists for forecasts based on the unconventional measures. These forecasters saw the Chinese economy growing just 5.3 per cent in the year up to the fourth quarter of 2015. Conventional forecasts have the economy growing closer to 7 per cent.

21. The Chinese economic policy makers have drawn praise during
1) The government's intervention which suspended trading
2) Selling of stock prices and upkeeping the market value
3) Undermining the value of the stock and trading stopped by the government
4) Tough times like Asian financial crisis and the worldwide financial tumult
5) individual investors responded by buying shares and igniting a 150 per cent run-up
22. What led the investors to lose faith in the Beijing's economy?
1) Praise for keeping their economy growing strongly through turbulence
2) State-run media boosted the sales by investing in more stocks
3) The government suspending trading in hundreds of companies and banned big investors from selling stakes for six months
4) Chinese companies issued shares into a rising market
5) individual investors bought shares and reinvested
23. The effect of government's intervention
1) Damaged the promise to give the market forces a bigger say in the economy
2) policy makers looked cooperative and favourable
3) effective measures to curb the slowdown boosted confidence
4) stock brokers had visualized a steady decline
5) there is an uprise in the sale of stocks
24. Devaluation of the currency
1) Was to respond to the stock and inventory
2) was in response to market forces
3) was a desperate move to jolt the economy
4) Was to respond positively to international market
5) To bring back the faith in the international trade
25. The result of devaluation of Yuan as stated in the passage is
1) exports had plunged after the move of devaluation
2) in confusing markets and renewing doubts about Beijing's commitment
3) to surprise investors by marking down the value of its currency
4) to go for alternative measures of economic performance
5) to burst the bubble of uncertainity prevalent in the minds of the investors

Directions (Q. No. 26-28): Choose the word which is MOST SIMILAR in meaning to the word given from the five options.

26. **Shrink**
1) Shrivel 2) Contract
3) Microscope 4) Minimize
5) Nurture
27. **Dubious**
1) Hesitant 2) Whisper
3) Summarize 4) Certain
5) Unsure

Directions (Q. No. 31-33): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. Both humans and animals learn to live and live to learn.
B. According to scientific research animals not only learn from their own mistakes, but they can learn by observing their peers messing up.
C. Making mistakes is a fundamental part of every cognitive process, whether solving a math problem, making important decisions, or trying to convey meaning in a foreign language.
D. In the animal world, avoiding blunders may dramatically improve one's chances of survival.
E. Human beings, however have a unique skill: the ability to process and mistakes.
F. Making mistakes and learning from them is not simply a human skill.

28. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F
29. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E
30. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

Answers

1) 4	2) 4	3) 2	4) 3	5) 4
6) 3	7) 1	8)5	9) 3	10) 3
11) 4	12) 3	13) 5	14) 3	15) 1
16) 3	17) 3	18) 5	19) 4	20) 1
21) 4	22) 3	23) 1	24) 2	25) 1
26) 5	27) 4	28) 1	29) 2	30) 4.